

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 345

శుక్రవారం 7-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మహిళా దినోత్సవం- పుష్ప విలాసం

అనేక దేశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళలకు ఇచ్చే పువ్వులు ప్రాంతాలను బట్టి మారుతూ ఉంటాయి. ఈ పువ్వులలో ఎక్కువ ప్రాచుర్యం పొందింది... యెల్లో మిమోసా. మహిళలకు యెల్లో మిమోసా పువ్వులను బహుమతిగా ఇచ్చే సంప్రదాయం ఇటలీలో ఉంది. సున్నితత్వాన్ని, బలాన్ని సూచించే యెల్లో మిమోసాను ఇటాలియన్ ఫెమినిస్ట్‌లు మహిళా హక్కుల ఉద్యమానికి చిహ్నంగా ఎంచుకున్నారు. మార్చి ప్రారంభంలో మిమోసా వికసిస్తుంది కాబట్టి వారు ఈ పువ్వును ఎంచుకున్నారు.

• ఫ్యాషన్

సక్సెస్ 'కీ' పవర్ డ్రెస్సింగ్

పవర్ డ్రెస్సింగ్ అనేది ఫ్యాషన్ ఎంపికలను అధిగమిస్తుంది. ఇది స్వీయ అవగాహన, వృత్తిపరంగా తమను తాము చూపాలనుకునే విధానాన్ని ప్రభావితం చేస్తుంది. సరైన దుస్తులు మానసిక కవచంగా పనిచేస్తాయి. మహిళలు కార్పొరేట్ రంగంలోకి ప్రవేశించడం, వృత్తినైపుణ్యాలను ప్రదర్శించడం, గౌరవాన్ని పొందడం లక్ష్యంగా పవర్ డ్రెస్సింగ్ ఉద్భవించింది.



1920లలో జాకెట్, స్కర్ట్‌తో మహిళల పవర్ డ్రెస్సింగ్ వెలుగులోకి వచ్చింది. ఇది మహిళల దుస్తులు ధరించే విధానంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. సౌకర్యం విషయంలో రాజీపడకుండా ఆధునికంగా కనిపించడానికి వీలు కల్పించింది. పనిలో లింగసమానత్వాన్ని ప్రోత్సహించడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగు. 'విజయం కోసం డ్రెస్సింగ్' అనడానికి నిదర్శనంగా ఇంటర్నేషనల్ ఉమెన్ డ్రెస్సింగ్ బ్రాండ్ 'క్వా' ఒక ఆన్‌లైన్ పోల్ నిర్వహించింది. ఇందులో 100 మంది మహిళల్లో 99 మంది పవర్ డ్రెస్సింగ్ వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు.

వృత్తికి తగిన డ్రెస్సింగ్

ఉపాధ్యాయులు, వైద్యులు, రాజకీయ నాయకులు, ఐఎఎస్ అధికారులు, ఆర్కిటెక్ట్‌లు, కార్పొరేట్ లీడర్లు, వ్యాపార మహిళలు, ఆర్థిక నిపుణులు వంటి విభిన్న స్థాయిలలో పనిచేసే మహిళలకు పనిజీవితంలో సౌకర్యాన్ని, నమ్మకాన్ని ఇచ్చే వర్క్‌వేర్ అవసరం. ఒక కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ శక్తిని వెలికితీసేందుకు ప్యాంటుతో పాటు డిజైనర్ బ్లేజర్‌ను ధరిస్తారు. ఒక రాజకీయ వ్యక్తి పరిపూర్ణతకు అనుగుణంగా చీర లేదా కుర్తాను ధరించవచ్చు. టీచర్ లేదా డాక్టర్ తమ వృత్తినైపుణ్యానికి రాజీ పడకుండా తమ పనిని నిర్వహించడానికి సౌకర్యవంతమైన కుర్తా లేదా ఇండో-వెస్ట్రన్‌ను ఎంచుకోవచ్చు. విధి నిర్వహణలోని మహిళలు భారతీయ ప్రింట్‌లను ఆధునిక కట్‌లతో కలిపే దుస్తులను ధరించడానికి ఇష్టపడతారు. ఈ కాంబినేషన్ కూడా ప్రత్యేకంగా ఉంటుంది.

పవర్ డ్రెస్సింగ్‌కి ప్రేరణ కోసం...

• వృత్తికి అనుగుణమైన దుస్తులు ధరించాలి. అప్పుడు పనితీరులో కూడా మెరుగుదల ఉంటుంది • పర్యావరణ స్పృహతో కూడిన ఫ్యాషన్‌ని అనుసరించడం మేలు. కాలర్ బ్లౌజ్‌లు, ఫంక్షనల్ పాకెట్స్, తక్కువ జ్యువెలరీ... వీటిలో ప్రధానమైనవి • డ్రెస్ నాణ్యత, ఫిటింగ్ మీరు హుందాగా, శక్తిమంతంగా ఉన్నారని తెలియజేస్తుంది • ఎవరికి వారు ఓన్ స్టైల్‌ను అభివృద్ధి చేసుకోవాలి. తమ డ్రెస్సింగ్ ద్వారా తమని తాము వ్యక్తీకరించుకోవడమూ అవసరమే. రంగులతో ప్రయోగాలు, ఫిట్‌గా ఉండే దుస్తుల ద్వారా మీరేమిటనేది చాటవచ్చు • ప్యాంట్ సూట్స్, కో-ఆర్డ్ సెట్స్, మిడీస్, జాకెట్స్.. ఇలా ఏ డ్రెస్ ఎంపిక అయినా ఇస్త్రీ చేసిన దుస్తులను ధరించండి. లేత రంగులు, తక్కువ ఆభరణాలతో సింపుల్‌గా ఉండేలా చూసుకోండి.

సందర్భానికి తగిన ఎంపికలు

భారతీయ వనిత హుందాతనానికి, మనదైన సంస్కృతికి, చక్కదనానికీ బహుముఖాల డ్రెస్సింగ్ శైలులను ఎంచుకుంటోంది. సందర్భానికి తగిన ఎంపిక ఇప్పుడు సాధారణంగా ఉంటోంది..

డ్రేపింగ్ శైలులతో ఎవర్‌గ్రీన్‌గా నిలుస్తూ మహిళను పవర్ ఫుల్‌గా చూపుతోంది చీర. మన దేశీయ చేనేతలైన కంచి, బనారసి, చందేరీ, పోచంపల్లి, నారాయణపేట్, ధర్మవరం, ... ఇలా మనదేశంలో ఒక్కో ప్రాంత ప్రత్యేకతను, భారతీయ సంస్కృతిని ప్రపంచానికి ఘనంగా చూపుతున్నాయి. ఈ చేనేతల కట్టుతో మన మహిళలు తమ హుందాతనాన్ని ప్రపంచానికి చాటుతున్నారు.

సల్వార్ కమీజ్

భారతీయ మహిళల ఫార్మల్ దుస్తులలో మరొక ప్రధానమైనది సల్వార్ కమీజ్. సౌకర్యం, శైలి రెండింటినీ ఈ డ్రెస్ అందిస్తుంది. అధికారిక కార్యక్రమాలు, పార్టీలకు అనుకూలంగా ఉంటుంది. క్లిష్టమైన ఎంబ్రాయిడరీ అలంకరణతో వెలిగే అనార్కలీ సూట్లు గొప్పగా వెలుగుతుంటే, మరోవైపు స్ట్రెయిట్‌కట్ సూట్స్ ప్రొఫెషనల్ లుక్‌ని అందిస్తున్నాయి. ఆఫీస్‌వేర్‌గానూ, సంప్రదాయం, ఆధునిక మినిమలిజం మధ్య సమతుల్యతను అందిస్తున్నాయి.

ఇండో- వెస్ట్రన్ ఫ్యూజన్

భారతీయ దుస్తులలో అంశాలను పాశ్చాత్య సిల్హౌట్‌లతో మిళితం చేయడం దీని ప్రత్యేకత. ఆధునిక అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేకమైన, స్టైలిష్ దుస్తులను సృష్టిస్తాయి. కుర్తా, పలాజో సెట్ అందుకు ఒక ఉదాహరణ. సాంస్కృతిక కార్యక్రమాలకు ఉల్లాసభరితంగానూ, అనువైనదిగానూ నిలిచింది ధోతీ ప్యాంట్‌ను కుర్తాతో జత చేయడం.



వెస్ట్రన్ గౌన్లు

పాశ్చాత్య శైలి దుస్తులలో ప్రధానంగా చెప్పుకునేవి గౌన్లు. అధికారిక కార్యక్రమాలలో గణనీయమైన ప్రజాదరణ పొందాయి. ఎ-లైన్ గౌన్లు, ఫ్యూజన్ టచ్ కోసం భారతీయ మోటిఫ్స్, ఎంబ్రాయిడరీతో ఇవి పార్టీలు, అధికారక విందులు, సమావేశాలలో ఈవెనింగ్ గౌన్లు అద్భుతమైన ఎంపికను అందిస్తున్నాయి. సిల్క్, శాటిన్ లేదా వెల్వెట్ ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేసిన గౌన్లపై బీడ్‌వర్క్, సీక్వెన్లు కలిగి మహిళ చక్కదనానికి, ఆధునికతకు అద్దం పడుతూ రిచ్ లుక్‌ను ఇస్తున్నాయి.

ఫార్మల్ వేర్

మన దేశం ఉష్ణమండలం అవడం వల్ల సౌకర్యం కోసం ఖాదీ, కోటా డోరియా వంటి కాటన్స్‌ను ఎంచుకుంటున్నారు. వీటిమీద ఎంబ్రాయిడరీలు, టై అండ్ డైలు, పెయింటింగ్‌లా ఉన్నవాటితో తమని తాము కొత్తగా ఆవిష్కరించుకుంటున్నారు.

ఇతర అలంకారాలకూ...

మ్యాచింగ్, ఎంబ్రాయిడరీ, సందర్భానికి తగిన విధంగా దుస్తుల ఎంపిక ఎలా ఉంటుందో, అలాగే ఫుట్‌వేర్ ఎంపిక కూడా ముఖ్యమైన జాబితాలో ఉంది. బంగారు, వజ్రాలు, కుందన్, పోల్కీ... ఆభరణాలు సంప్రదాయ దుస్తులకు, ఆక్సిడైజ్డ్ ఆధునిక దుస్తులకు ఎంపికగా మారాయి. ఇండో-వెస్ట్రన్ శైలులు ఆభరణాల జాబితాలోనూ ప్రథమంగా ఉంటోంది.

రీసైక్లింగ్ బెస్ట్ ఛాయిస్





• హేమంత్ సిరి, ఫ్యాషన్ డిజైనర్

టెక్స్‌టైల్ ఇండస్ట్రీలో సస్టెయినబుల్, ఇండియన్ ఆర్ట్, ఇండియన్ టెక్స్‌టైల్, కెమికల్ ఫ్రీగా ఉండే హ్యాండ్లూమ్స్‌ని మహిళలు ఇష్టపడుతున్నారు. పవర్ లూమ్స్, సింథటిక్స్‌ని దూరం పెడుతున్నారు. అంతర్జాతీయంగానూ ఎక్స్‌పరిమెంటల్ ఫ్యాషన్‌లోనూ రీ సైక్లింగ్ మీద దృష్టి ఎక్కువ ఉంటుంది. పాత కాలం నాటి బామ్మల పట్టుచీరలను కూడా తిరిగి ఉపయోగిస్తున్నారు. కట్ సిల్హౌట్స్, ఎంబ్రాయిడరీలో థ్రెడ్ వర్క్... వంటి పాత కాలం స్టైల్స్ ఎంచుకుంటున్నారు. ఉదాహరణకు.. పాత బనారసి, పాత కంచి శారీస్‌ను తీసుకొని ప్యాచ్‌వర్క్‌తో మరో కొత్త డిజైనర్ శారీని తయారుచేస్తున్నారు. ఇండో-వెస్ట్రన్స్ విషయంలో చూస్తే రీ సైక్లింగ్‌కి బాగా డిమాండ్ ఉంది. ఉన్న వాటినే రీ క్రియేట్ చేస్తున్నారు. అమ్మమ్మ, అమ్మల చీరలను ఇన్నోవేషన్‌గా రీ సైక్లింగ్ చేయించుకొని తమ పెళ్లిళ్లకు ధరిస్తున్నారు. ఒక డ్రెస్‌ను పది మోడల్ డ్రెస్సులుగా ధరిస్తున్నారు. ప్రకృతి పట్ల బాధ్యతగా ఉండేది మహిళలే కాబట్టి. ఈ అవగాహన మహిళల నుండి వచ్చిందే. నార్త్ ఇండియన్స్ కూడా పాత చీరలు, వస్త్రాలతో ప్యాచ్‌వర్క్ చేసి బ్యాగ్స్, ఫుట్‌వేర్, క్విల్ట్‌లను సృష్టిస్తున్నారు. ఇది ఇంకా విస్తృతం అవుతుంది. మా దగ్గర పాతికమంది మహిళలు మేం ఉపయోగించగా మిగిలిన వేస్ట్ ఫ్యాబ్రిక్స్‌తో టాజిల్స్, రిబ్బన్స్, పౌచ్‌లు, జ్యువెలరీ, బ్యాంగిల్స్ తయారు చేసి అమ్ముతున్నారు. ఇవి ఇండోవెస్ట్రన్ ఔట్‌ఫిట్స్‌కు స్టైలిష్ లుక్‌నిస్తాయి. యువతరం, మహిళల ఆలోచనలకు తగినట్టుగా కెమికల్ ఫ్రీగా ఫ్యాషన్ ఇండస్ట్రీ తయారు కావడం ముదావహం.

'పవర్ డ్రెస్'ను చూపినవారిలో...





• హోమై వ్యారవల్లా

• భారతదేశపు మొట్టమొదటి మహిళా ఫొటోజర్నలిస్ట్ హోమై వ్యారవల్లా. బ్రిటిష్ కాలం నుండి కొత్తగా స్వతంత్ర దేశంగా మారడాన్ని డాక్యుమెంట్ చేయడంలో ప్రసిద్ధి చెందారు. గుజరాత్ రాష్ట్రంలో పుట్టిన ఆమె పార్సీ సమాజానికి చెందింది. తన వృత్తికి తగినట్టుగా హై రౌండ్ నెక్ బ్లౌజ్, లేతరంగు కాటన్ చీరలను ధరించేవారు. గౌన్లు, పలాజో ప్యాంట్లు ధరించి ఆమె తనదైన స్టైల్ స్టేట్‌మెంట్‌ను సృష్టించారు • నేతలలో తలమానికమైన ఇందిరాగాంధీ నేత చీరల కట్టు ఇప్పటికీ ఆమె ఆహార్యాన్ని కళ్లకు కడుతుంది. పాలిటిక్స్‌లో తన చీరకట్టు, హెయిర్ స్టైల్‌తో పవర్‌ఫుల్ ఐకాన్‌గా నిలిచారు. ఒక నిర్దిష్ట సందేశాన్ని ఇవ్వడానికి డ్రెస్సింగ్‌ని ఒక శక్తిమంతమైన మాధ్యమంగా ఉపయోగించారు. ఆమె చూపిన మార్గంలో చాలామంది మహిళా రాజకీయ వేత్తలు నేత చీరలను ధరించడం చూస్తున్నాం • సినీతారలు సందడి చేసే ఈవెంట్లను చూస్తే తమదైన స్టైలింగ్ డ్రెస్సులతో ఆకట్టుకునే తారలు ఎందరో. వారిలో ఎవర్‌గ్రీన్‌గా నిలిచే బాలీవుడ్ నటి రేఖతోపాటు దీపికా పదుకొనే, ప్రియాంకా చోప్రా, కరీనా, సోనమ్ .. వంటి తారలు ఏ ఈవెంట్‌లోనైనా తమ స్టైల్‌స్టేట్‌మెంట్‌ను చూపుతుంటారు. ఇటీవల నీతాఅంబానీ ప్రాచీన కళకు, రిచ్ లుక్‌కి ఐకాన్‌గా మారడం గమనిస్తున్నాం.

• బ్యూటీ కాంటెస్ట్

హద్దులు చెరిపేసి... నిరూపిస్తున్నారు



ఇరవై ఏళ్లుగా 35 దేశాల్లో జరిగిన బ్యూటీ అండ్ ఫ్యాషన్ ఈవెంట్లకు హోస్ట్‌గా, జడ్జ్‌గా, గ్రూమర్‌గా ఉన్నాను. ఒకప్పుడు పదిమంది అమ్మాయిలు ఫ్యాషన్ షోలో పాల్గొనడానికి వస్తే చాలు అనుకునేవాళ్లం. కానీ, నేడు అమ్మాయిలే కాదు, అమ్మలు అయ్యాక తమని తాము నిరూపించుకోవడానికి వచ్చే మహిళల శాతం 50 నుంచి 60 శాతానికి పెరిగింది. ప్రతి ఒక్కరికీ కల ఉంటుంది. దానిని నెరవేర్చుకునే క్రమంలో మహిళలకు సరైన ప్లాట్‌ఫారమ్ దొరక్కపోవడం, ప్రొఫెషనల్ గా లేకపోవడం, తర్వాత చేద్దాం అనుకోవడం, కుటుంబ బాధ్యతలు అడ్డుగా ఉండటం .. వీటన్నింటి వల్ల టైమ్ దాటిపోతుంటుంది. కానీ, ఏదో ఒక సమయంలో రియలైజ్ అయి, ఆలస్యంగా అయినా తమని తాము ప్రూవ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అందుకే ఇప్పుడు 'మిసెస్ బ్యూటీ' పోటీలలో పాల్గొనే గృహిణుల సంఖ్య పెరిగింది. 'నేను స్టేజీ మీద వాక్ చేయాలి, మంచి గ్లామరస్ డ్రెస్సులు వేసుకోవాలి, కాన్ఫిడెంట్‌గా సమాధానాలు చెప్పగలగాలి...' ఇలా ఆలోచిస్తున్నారు. గత తరం వరకు సమాజంలో ఒక ఫ్యాషన్ స్టిగ్మా ఉండేది. దాని నుంచి బయటకు వచ్చేస్తున్నారు. మహిళా దినోత్సవం ఉద్దేశం కూడా అదే. అందుకు తగినట్టుగానే ఇప్పుడు చాలా వేదికలు ముందుకు వచ్చాయి. మిసెస్ కేటగిరీలోకి వచ్చే మహిళల మైండ్ సెట్, ఔట్ లుక్ పూర్తిగా మారింది. ఇప్పుడు కావాల్సింది టాలెంట్, కాన్ఫిడెన్స్. మహిళ జీవితమే ఒక ఛాలెంజ్. అందుకే, ఫ్యాషన్ ఇండస్ట్రీలో మహిళలు సవాళ్లను చాలా సులవుగా అధిగమిస్తున్నారు. ఒక కాలేజీ అమ్మాయి మిస్ కాలేజీ తర్వాత మిస్ ఇండియా ఆ తర్వాత మిస్ యూనివర్స్ గురించి ఆలోచిస్తున్నట్టే, గృహిణులుగా ఉన్నవారు కూడా అలాగే క్లారిటీగా ఆలోచిస్తున్నారు. గ్లామర్ రంగంలో గతంలో అమ్మాయిల గురించి ఉన్న నెగిటివిటీ స్థానంలో పాజిటివిటీ చేరింది. ఇది చాలా మంచి మార్పు. జూన్‌లో మిసెస్ అండ్ మిస్టర్ గ్రాండ్- సి వరల్డ్‌ని హోస్ట్ చేస్తున్నాను. దీనికి గృహిణులుగా ఫ్యాషన్ షోలలో పాల్గొనేవారికి శిక్షణ ఇస్తున్నాను.

- వాలెంటీనా మిశ్రా,
క్రియేటివ్ డైరెక్టర్, మిసెస్ అండ్ మిస్టర్ గ్రాండ్- సి వరల్డ్ హోస్ట్

మేము సైతం



• నూషిన్ అల్ ఖదీర్



• కోనేరు హంపి



• జ్యోతి సురేఖ

ఒకప్పుడు క్రీడల్లో మహిళల ప్రాతినిధ్యం నామమాత్రం. ఇప్పుడు సీన్ మారింది. ప్రాతినిధ్యం స్థాయి నుంచి ఎదిగి ఏకంగా దేశానికి పతకాలు అందించే స్థాయికి మన మహిళా క్రీడాకారిణులు చేరుకున్నారు. వయసుతో సంబంధం లేకుండా... ఒక వైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే... మరోవైపు ప్రతికూలతలనూ అధిగమిస్తూ అత్యున్నత శిఖరానికి చేరుకుంటున్నారు. నిరంతర శ్రమ, సడలని విశ్వాసం, సాధించాలనే సంకల్పం ఉంటే తమకు తిరుగులేదని నిరూపిస్తున్నారు. తమ ప్రతిభాపాటవాల ద్వారా భావితరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు... వారిలో కొందరి గురించి....

నూషిన్ అల్ ఖదీర్...

మంచి ప్లేయర్ మంచి కోచ్ కూడా కాగలరని నిరూపించారు నూషిన్ అల్ ఖదీర్. 44 ఏళ్ల నూషిన్ గత నెలలో మలేసియాలో జరిగిన అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరించారు. 2023లోనూ తొలిసారి జరిగిన అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌లో నూషిన్ శిక్షణలోనే టీమిండియా జగజ్జేతగా అవతరించింది. కర్ణాటకలోని గుల్బర్గాలో జన్మించి, ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన నూషిన్ 2002 నుంచి 2012 వరకు భారత సీనియర్ మహిళల క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 5 టెస్టులు, 78 వన్డేలు, రెండు టి20 మ్యాచ్‌ల్లో భారత్ తరఫున బరిలోకి దిగింది. 2005లో ఆటకు వీడ్కోలు చెప్పాక నూషిన్ కోచింగ్ వైపు వచ్చింది. నూషిన్ శిక్షణలో భారత టీనేజ్ క్రికెటర్లు వరుసగా రెండు టి20 ప్రపంచకప్‌లలో విజేతగా నిలిచి ఔరా అనిపించారు.

కోనేరు హంపి...

రెండున్నర దశాబ్దాలుగా భారత మహిళల చెస్‌కు ముఖచిత్రంగా వెలుగుతూ ఎన్నో గొప్ప విజయాలు సాధించింది విజయవాడకు చెందిన 37 ఏళ్ల హంపి. రెండుసార్లు ప్రపంచ మహిళల ర్యాపిడ్ చెస్ చాంపియన్‌గా నిలిచి ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. 2019లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించింది. మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్‌లలో పతకాలు గెలవడం అలవాటు చేసుకున్న హంపి 2024 డిసెంబర్‌లో కజకిస్తాన్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. ఓఎన్‌జీసీలో చీఫ్ మేనేజర్ అయిన హంపి క్లాసిక్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ సాధించడమే లక్ష్యం అంటోంది.

జ్యోతి సురేఖ

భారత మహిళల ఆర్చరీ కాంపౌండ్ విభాగంలో తిరుగులేని ప్లేయర్ వెన్నం జ్యోతి సురేఖ. విజయవాడకు చెందిన 28 ఏళ్ల జ్యోతి సురేఖ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌లో ఉంది. 14 ఏళ్లుగా అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న జ్యోతి సురేఖ 2023 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణ పతకాలు సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జ్యోతి సురేఖ ఆసియా క్రీడలు, ప్రపంచ చాంపియన్‌షిప్, ప్రపంచకప్ టోర్నీలలో కలిపి 50 పతకాలు సాధించింది.



జ్యోతి యర్రాజీ

పాఠశాలలో వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు ఇచ్చిన సలహాతో అథ్లెటిక్స్‌లో అడుగు పెట్టి.. అచిరకాలంలోనే అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంది వైజాగ్‌కు చెందిన జ్యోతి యర్రాజీ. 100 మీటర్లు, 60 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డులు లిఖించుకున్న జ్యోతి యర్రాజీ 2024 పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో భారత్ తరఫున పోటీపడ్డ తొలి మహిళా అథ్లెట్‌గా జ్యోతి గుర్తింపు పొందింది. అదే ఏడాది జరిగిన ఆసియా క్రీడల్లో ఆమెకు కాంస్య పతకం లభించింది. దక్షిణ మధ్య రైల్వేలో జూనియర్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న జ్యోతి వరుసగా మూడు సార్లు జాతీయ క్రీడల్లో 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకాలు సాధించింది. 2024 సంవత్సరానికి కేంద్రం నుంచి జ్యోతికి 'అర్జున అవార్డు' లభించింది.



ఆకుల శ్రీజ

టేబుల్ టెన్నిస్‌లో భారత నంబర్‌వన్ ర్యాంకర్ ఆకుల శ్రీజ 2024 పారిస్ ఒలింపిక్స్ లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. గత ఏడాది కజకిస్తాన్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో టీమ్ విభాగంలో కాంస్య పతకం నెగ్గిన 26 ఏళ్ల శ్రీజ... వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) సర్క్యూట్‌లో కంటెండర్ స్థాయి టోర్నీలో టైటిల్ నెగ్గిన తొలి భారతీయ ప్లేయర్‌గా గుర్తింపు పొందింది. గత ఏడాది జూన్‌లో నైజీరియాలో జరిగిన లాగోస్ ఓపెన్ కంటెండర్ టోర్నీలో ఆమె విజేతగా నిలిచింది. గతేడాది జరిగిన ప్రపంచ టీమ్ చాంపియన్‌షిప్ లీగ్ మ్యాచ్‌లో చైనాకు చెందిన ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ యిడిపై సంచలన విజయం సాధించింది. 2022లో కేంద్ర ప్రభుత్వం నుంచి 'అర్జున అవార్డు' అందుకుంది.



గుగులోత్ సౌమ్య...

జట్టు క్రీడ ఫుట్‌బాల్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలంటే విశేష ప్రతిభ ఉండాల్సిందే. ఆ నైపుణ్యాన్ని సొంతం చేసుకొని భారత సీనియర్ మహిళల ఫుట్‌బాల్ జట్టులో ఫార్వర్డ్‌గా రాణిస్తోంది గుగులోత్ సౌమ్య. నిజామాబాద్ జిల్లాకు చెందిన 23 ఏళ్ల సౌమ్య అండర్-14, అండర్-16, అండర్-19 విభాగాల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ప్రస్తుతం దేశవాళీ మహిళల ఫుట్‌బాల్ లీగ్‌లో విఖ్యాత ఈస్ట్ బెంగాల్ క్లబ్ జట్టుకు ఆడుతున్న సౌమ్య ఇటీవలే షార్జాలో జరిగిన పింక్ లేడీస్ కప్ నాలుగు దేశాల అంతర్జాతీయ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది.

- కరణం నారాయణ, సాక్షి స్పోర్ట్స్ డెస్క్

Inspiration

అమ్మే నా గురువు

- మధుప్రియ, గాయని



గళంతో మధువులొలికిస్తుంది! ఆ స్వర ప్రయాణం ఆమె మాటల్లోనే...

'**నే**నసలు సంగీతం నేర్చుకోలేదు. అమ్మ, నాన్న, తాతయ్య పాడతారు. ఆ కళ వాళ్ల దగ్గర నుంచే వచ్చింది. నా గురువు మా అమ్మే! నాకు ఆరేళ్లున్నప్పటి నుంచే పాడటం స్టార్ట్ చేశా. స్కూల్లో, ఫంక్షన్స్‌లో పాడేదాన్ని. ఆ తర్వాత మెల్లమెల్లగా జానపదాలు, తెలంగాణ ఉద్యమగీతాలు పాడటం మొదలుపెట్టా. తెలంగాణ మూవ్‌మెంట్ టైమ్‌లో గద్దర్ తాతతో కలిసి పాడటం అదృష్టంగా ఫీలవుతాను. నా పాటల ప్రయాణంలో సూపర్ సింగర్‌లో పాల్గొనడం చెప్పుకోదగ్గ మలుపు.


వాళ్ల బాధ చూసి రాసిన పాట...

నాకు గుర్తింపునిచ్చిన పాట 'ఆడపిల్లనమ్మా..' పాటే! మేం ముగ్గురం అక్కచెల్లెళ్లం. 'ముగ్గురూ ఆడపిల్లలే' అని అమ్మానాన్న బాధపడటం చూసి నా చిన్నప్పుడే రాసుకున్న పాట అది. నా స్టోరీ. ఒకరకంగా ప్రతి ఆడపిల్ల కథ. అందుకే ఎంతోమంది అమ్మాయిలు ఆ పాటతో కనెక్ట్ అయ్యారు. అందుకే అదంత పాపులర్ అయింది. అదొక్కటే కాదు నేను రాసి, పాడిన పాటలన్నీ ఆడపిల్లల గురించే ఉంటాయి. 'అమ్మా నీ మనసు గొప్పదిలే..' అంటూ అమ్మ మీదా ఎన్నో పాటలు పాడాను. ఎన్నో అవార్డ్స్ కూడా తీసుకున్నాను. ఈ మదర్స్ డేకి 'ఆడపిల్లనమ్మా..' వీడియో ఆల్బమ్‌ను తీసుకొస్తున్నాను. తెలంగాణ ఉద్యమం, తెలంగాణ సంస్కృతి, దేశభక్తి, జానపదాలు.. ఏవైనా నూటికి తొంభై తొమ్మిది శాతం మెసేజ్ ఓరియెంటెడ్ పాటలే పాడుతూంటాను. వాటితో నాకెన్ని డబ్బులొస్తున్నాయి అనేకంటే నా పాటలు ఎంతమందికి చైతన్యాన్నిస్తున్నాయనేదే చూస్తాను.

అభిమానాన్ని పొందాలి...

ఇరవై ఒక్క సంవత్సరాలుగా ఇండస్ట్రీలో ఉన్నాను. తెలంగాణ ఉద్యమం నుంచి ఇప్పటి గోదారి గట్టు పాట వరకు చాలానే ఫేస్ చేశాను. ఎంతవరకు నిలబడ్డాను అనేదే పరిగణనలోకి తీసుకుంటాను. నా గురించి ఎవరన్నా తప్పుగా మాట్లాడినా, ఇబ్బంది పెట్టినా.. పట్టించుకోను. మహా అయితే రెండు నిమిషాలు బాధపడతానేమో అంతే! తర్వాత నా పనిలో పడిపోతాను. నేర్చుకోవాల్సిన విషయాల మీద దృష్టిపెడతాను. ఎలాంటి పరిస్థితులెదురైనా నవ్వుతూ ఎదుర్కొంటాను. అదే నా స్ట్రెంగ్త్. ఇంకా చాలా పాటలు రాయాలి.. పాడాలి.. జనాల అభిమానాన్ని పొందాలి.. అదే నా లక్ష్యం'' అంటూ ముగించింది మధుప్రియ.

- శిరీష చల్లపల్లి


'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 345

శుక్రవారం 7-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




ఓటీటీ.. బంపర్ హిట్

12.5 కోట్లకు చేరిన యూజర్లు... 2024లో రూ.35,600 కోట్ల ఆదాయం -15లో



ఉక్రెయిన్ భద్రత కోసం... అవసరమైతే అణ్వాయుధాలు!

- వివరాలు 6లో



జైశంకర్‌పై దాడికి యత్నం

విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ లండన్ పర్యటనలో ఖలిస్తాన్ తీవ్రవాదులు ఆయనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు.

- వివరాలు 6లో▶



గంగా మాత ఆశీస్సులతో సేవ

గంగా మాత ఆశీస్సులే తనను కాశీకి తీసుకెళ్లాయని, దేశ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాయని ప్రధాని మోదీ అన్నారు.

- వివరాలు 6లో▶



'గుడ్లు' తేలేస్తున్న అమెరికా

అగ్ర రాజ్యం అమెరికా కొద్ది నెలలుగా తీవ్ర గుడ్ల కొరతతో సతమతమవుతోంది. తెరిపిన పడే సూచనలు కన్పించడం లేదు.

- వివరాలు 6లో▶



మాట వినకుంటే మరణ శాసనమే

గాజాలో మిగిలిన ఇజ్రాయెల్ బందీలందరినీ విడుదల చేయాలని, మాటవినకపోతే మరణ శాసనం తప్పదని ట్రంప్ హెచ్చరించారు.

- వివరాలు 6లో▶

బీసీలకు 42% కోటా

ముసాయిదా బిల్లుకు రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రి పొన్నం

- ఎస్సీ కులాల వర్గీకరణ బిల్లుకు కూడా గ్రీన్‌సిగ్నల్
- కోర్ అర్బన్ ఏరియాగా ఓఆర్ఆర్ లోపలి ప్రాంతం
- అక్కడి నుంచి ట్రిపుల్ ఆర్‌కి 2 కి.మీ. వరకు ఫ్యూచర్ సిటీ ఏరియా
- మిగిలిన ప్రాంతం అంతా గ్రామీణ తెలంగాణ
- 56 గ్రామాలతో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ ఏరియా ఏర్పాటు
- ఒకే గొడుగు కిందకు ఎస్‌హెచ్‌జీలు..సెర్ప్, మెప్మా విలీనం
- టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి బోర్డు
- తెలంగాణ పర్యాటక పాలసీ-2025కు ఆమోదం
- 10,954 రెవెన్యూ గ్రామాలకు మళ్లీ గ్రామ పరిపాలన అధికారులు
- కేబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ కులాల వర్గీకరణ ముసాయిదా బిల్లును రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. స్థానిక సంస్థల్లో, విద్యారంగంలో, ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే మరో ముసాయిదా బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుదీర్ఘంగా సమావేశమైన రాష్ట్ర కేబినెట్ ఈ మేరకు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమావేశానంతరం రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివరాలు విలేకరులకు వెల్లడించారు.

చిక్కులు తలెత్తకుండా ఎస్సీ వర్గీకరణ బిల్లు

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీల వర్గీకరణ చేపట్టడానికి ఏర్పాటు చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ గత నెల 3న సమర్పించిన తొలి విడత సిఫారసులపై వివిధ వర్గాల నుంచి 71 విజ్ఞప్తులు వచ్చాయని పొంగులేటి తెలిపారు. ఈ విజ్ఞప్తులను పరిష్కరించిన అనంతరం తాజాగా కమిషన్ సమర్పించిన నివేదికను బిల్లు రూపంలో శాసనసభలో ప్రవేశపెట్టాలని మంత్రివర్గం నిర్ణయించిందని చెప్పారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా బిల్లును రూపొందించామన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు కొత్త బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో.. 37 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు 2017లో సభలో మిగతా 5వ పేజీలో ▶

12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలను ఈ నెల 12 నుంచి 27 వరకు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. 12న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. మరుసటి రోజు ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ 2025-26ను సభలో ప్రవేశపెట్టనుంది.

'పాలమూరు' అంచనాల పెంపు

- రూ.416 కోట్ల నుంచి రూ.780 కోట్లకు పెరిగిన ప్యాకేజీ-3 అంచనాలు
- ఆమోదించిన మంత్రివర్గం

5లో

రూ.1,500 కోట్ల పెనాల్టీ వసూలు చేయాల్సిందే

'మార్గదర్శి' రూ.2,600 కోట్లకుపైగా అక్రమ డిపాజిట్ల వసూళ్లపై 'ఐటీ' జరిమానా



- 16 ఏళ్లుగా పెండింగ్‌లోనే రూ.1,500 కోట్ల పెనాల్టీ..
- రామోజీ మరణించినందున గతంలో విధించిన 'స్టే' తొలగిపోయినట్లే
- ఆదాయపన్ను శాఖకు మాజీ ఎంపీ ఉండవల్లి లేఖ
- సెక్షన్ 45 ఎస్ నుంచి తమకు మినహాయింపు ఉందన్న రామోజీ వాదనను కొట్టి పారేసిన ఆర్బీఐ
- డిపాజిట్ల సేకరణ ముమ్మాటికీ చట్ట విరుద్ధమే
- హెచ్‌యూఎఫ్ కర్త మరణించినా విచారణ ఎదుర్కోవాల్సిందే
- మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ప్రొసీడింగ్స్‌ను కొనసాగించాల్సిందేనని కౌంటర్‌లో నివేదన

13లో


పునాదిని మించిన గుంత లోతు

పెను ప్రమాదంలో శ్రీశైలం జలాశయం

తక్షణమే అధ్యయనాలు, మరమ్మతులు చేపట్టాలన్న ఎన్డీఎస్‌ఏ కమిటీ

- డ్యామ్ దిగువన 120 మీటర్ల లోతైన గుంత ఉన్నట్లు తేల్చిన సర్వే... ఇది డ్యామ్ పునాదుల కింది వరకు విస్తరించిందనే అనుమానాలు
- పునాదుల కింద రాతిఫలకాల మధ్య పెళుసుతో కూడిన అతుకులు
- డ్యామ్ భద్రతకు ఇది అత్యంత ప్రమాదకరమన్న నిపుణులు

2లో



శ్రీశైలం డ్యామ్ ప్లంజ్‌పూల్

న్యూస్‌రీల్

ఇక బ్యాంకులాగా 'ఈపీఎఫ్ఓ 3.0' సేవలు



ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) చందాదారులకు అందిస్తున్న సేవలను మరింత సులభతరం చేసేందుకు ఈపీఎఫ్ఓ 3.0 వెర్షన్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. హైదరాబాద్‌లోని బేగంపేటలో కొత్తగా నిర్మించిన ఈపీఎఫ్ఓ తెలంగాణ జోనల్ కార్యాలయంతోపాటు బంజారాహిల్స్ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు.

- వివరాలు 3లో▶

ఫీజుల కోసం ఫలితాల నిలిపివేత!



వివిధ రకాల ఫీజు బకాయిలు చెల్లించలేదని కాకతీయ విశ్వవిద్యాలయం 112 ప్రైవేటు కాలేజీలకు చెందిన విద్యార్థుల పరీక్ష ఫలితాలను నిలిపివేసింది. మొత్తం బకాయిలు చెల్లించే వరకూ వెల్లడించబోమని తేల్చి చెప్పింది. దీంతో యూనివర్సిటీ పరిధిలో ఉన్న ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన 80 వేల మంది విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.

- వివరాలు 3లో▶



ఎమ్మెల్సీ అభ్యర్థులను ఢిల్లీలో తేలుద్దాం

రేపు హస్తినకు సీఎం రేవంత్

12లో

కాంగ్రెస్‌లో కులాల 'లెక్కలు'

- సామాజికవర్గాల వారీగా కూడికలు.. తీసివేతలతో కసరత్తు... బీసీలకు రెండు కేబినెట్ బెర్తులు కావాలంటున్న టీపీసీసీ చీఫ్
- రెడ్లకూ రెండు మంత్రి పదవులు అవసరమంటున్న మరో ముఖ్యనేత
- మాల, మాదిగ వర్గాలను నొప్పించకుండా పదవుల కూర్పు... అన్ని పదవులూ భర్తీ చేసే యోచనలో ఏఐసీసీ

12లో



'ఘర్'కు సూర్య గ్రహణం

- పీఎం సూర్యఘర్‌కు ఆదరణ అంతంతే...
- 3 కేడబ్ల్యూహెచ్‌కు కేంద్రం సబ్సిడీ రూ.78 వేలు
- 3 కేడబ్ల్యూహెచ్ ఏర్పాటుకు అయ్యే గరిష్ట వ్యయం రూ.2.10 లక్షలు
- దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో సబ్సిడీ డబ్బు ఖాతాల్లో జమ
- అయినా ముందుకురాని వినియోగదారులు

2లో

ఇంటూ బయట



రోడ్ల కాంట్రాక్టులన్నీ బంధువులకే ఇచ్చార్సార్!

క్లుప్తంగా...

ఇసుక సమస్యకు టోల్‌ఫ్రీ నంబర్

155242కు ఫిర్యాదు చేయండి.. తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ సూచన

సాక్షి, హైదరాబాద్: ఇసుక సమస్యలుంటే.. 155242 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ సూచించింది. ఇసుక లోడింగ్, రవాణాకు సంబంధించి రాష్ట్రంలో ఎలాంటి సమస్యలున్నా.. ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే.. వివరాలు, ఫిర్యాదీ సమాచారాన్ని రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది. సమస్యకు అంతర్గత విశిష్ట ట్రాకింగ్ నంబర్‌ను కేటాయించి.. సంబంధిత అధికారి పర్యవేక్షిస్తారని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లడించారు. 24 గంటలు, 365 రోజులు ఈ టోల్‌ఫ్రీ నంబర్ పనిచేస్తుందని పేర్కొన్నారు. ఒకవేళ ఈ సమస్య మరో శాఖకు సంబంధించింది అయితే.. వారికి సమాచారాన్ని పంపించి పరిష్కరించనున్నట్లు వెల్లడించారు.

'విదేశీ విద్య'కు నిధులివ్వండి

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బడా కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులపై ఉన్న శ్రద్ధ పేద విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపులపై లేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు అగ్రవర్ణ పేదలకు విదేశాల్లో ఉన్నత చదువు కోసం కేసీఆర్ ప్రారంభించిన 'విదేశీ విద్యా పథకం'ను కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తోందన్నారు. నిధుల విడుదల్లో తాత్సారం కారణంగా పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ మేరకు గురువారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. 'గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో విదేశీ విద్యానిధి పథకం నిధుల విడుదలలో జాప్యంపై ప్రశ్నించాను. బకాయిల విడుదలకు మార్చి వరకు గడువు ఉందని మంత్రి సీతక్క చెప్పి నెలలు గడుస్తున్నా ఫలితం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం కింద ఒక్క విద్యార్థిని కూడా ఎంపిక చేయలేదు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయడంతో పాటు అర్హులైన విద్యార్థుల ఎంపికను చేపట్టాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

సర్పంచ్‌ల సంఘం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ డిమాండ్ చేసింది. గడువు ముగిసినా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో.. ప్రతినెలా కేంద్రం నుంచి రావాల్సిన రూ.1.30 కోట్లు నిలిచిపోతున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ విడుదల చేయలేదని తెలిపింది. గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు అందడం లేదని పేర్కొంది. సచివాలయం సమీపంలో గురువారం జరిగిన సంఘ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించినట్టు జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

రూ.70 వేలిస్తేనే 'క్లియరెన్స్'.. లంచం ఇస్తేనే వేతనం..

ఏసీబీ వలలో మున్సిపల్ కమిషనర్, ట్రాన్స్‌కో ఏడీ



ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



ట్రాన్స్‌కో ఏడీ శ్యామ్‌ప్రసాద్

ధర్మపురి/చౌటుప్పల్: లంచం తీసుకుంటూ ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ట్రాన్స్‌కో ఏడీ (ఆపరేషన్) గాజుల శ్యామ్‌ప్రసాద్ ఏసీబీకి పట్టుబడ్డారు. వివరాలివి. జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో ఎన్విరాన్మెంట్ స్టడీస్ విభాగంలో పైడిపల్లి మహేశ్ ఓ ఏజెన్సీ ద్వారా ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన వేతనాన్ని రూ.23 వేల నుంచి రూ.35 వేలకు పెంచుతూ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ లంచం ఇస్తేనే సర్వీసు క్రమబద్ధీకరించి, వేతనం చెల్లిస్తానని కమిషనర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు మహేశ్ ఏసీబీని ఆశ్రయించాడు. గురువారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో మహేశ్ రూ.20 వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు కమిషనర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమణామూర్తి తెలిపారు.

ట్రాన్స్‌కో ఏడీకి ఏసీబీ షాక్

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆక్రిట్ ఫార్మా పరిశ్రమ పాత విద్యుత్ బకాయిలకు క్లియరెన్స్ ఇవ్వడంతో పాటు నెట్ మీటర్‌ను పునరుద్ధరణకు ట్రాన్స్‌కో ఏడీ (ఆపరేషన్) గాజుల శ్యామ్‌ప్రసాద్ రూ.70 వేలు లంచం డిమాండ్ చేశారు. పరిశ్రమ నిర్వాహకుడి నుంచి సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు.. ఏడీ చాంబర్ వద్ద మాటేసి రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. హైదరాబాద్ కొత్తపేటలోని శ్యామ్‌ప్రసాద్ ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

'ఘర్'కు సూర్య గ్రహణం

పీఎం సూర్యఘర్‌కు ఆదరణ అంతంతే...
3 కేడబ్ల్యూహెచ్‌కు కేంద్రం సబ్సిడీ రూ.78 వేలు
3 కేడబ్ల్యూహెచ్ ఏర్పాటుకు అయ్యే గరిష్ట వ్యయం రూ.2.10 లక్షలు
దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో సబ్సిడీ డబ్బు ఖాతాల్లో జమ

అయినా ముందుకురాని వినియోగదారులు



సాక్షి, హైదరాబాద్: ఇంటిపై సౌర విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం 33 శాతం సబ్సిడీ ఇస్తున్నా..రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. పీఎం సూర్యఘర్ పథకం కింద 3 కిలోవాట్స్ (కేడబ్ల్యూహెచ్) కోసం కేంద్రం రూ.78 వేల సబ్సిడీ ఇస్తోంది. మొదటి రెండు కిలోవాట్స్‌కు రూ.60 వేలు, మూడో కిలోవాట్‌కు రూ.18 వేల సబ్సిడీ ఉంటుంది. అపార్ట్‌మెంట్‌లపై కూడా సౌర విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తోంది. గరిష్ఠంగా 500 కిలోవాట్స్ వరకు అనుమతి ఉంది. అయితే ప్రతీ కిలోవాట్‌కు రూ.18 వేల సబ్సిడీని కేంద్రం అందిస్తుంది. అయితే మొత్తాన్ని అపార్ట్‌మెంట్‌లోని వ్యక్తులందరూ వినియోగించుకునేలా (ఉదాహరణకు లిఫ్ట్, నీటి అవసరాలు, మెట్లు, కామన్ స్పేస్‌లో లైటింగ్) వెసులుబాటు కల్పించారు. రాష్ట్రంలో దాదాపు 1.16 కోట్ల కుటుంబాలు ఉన్నట్టు ఇటీవల నిర్వహించిన సమగ్ర కులగణన సర్వేలో తేలింది. విద్యుత్ వినియోగం పెరుగుతున్న తరుణంలో విద్యుత్ అందుబాటులో లేకుంటే కోతలు విధించాల్సిన పరిస్థితులు ఈ వేసవిలో తలెత్తే అవకాశముంది.

దరఖాస్తు ఇలా...

మిద్దెలపై సౌర విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలనే ఆసక్తి ఉన్నవారు నేరుగా జాతీయ రెన్యూవబుల్ ఎనర్జీ సైట్‌లోకి వెళ్లి నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకున్న వెంటనే సంబంధిత డిస్కమ్ నుంచి అధికారులు వచ్చి..మీ గృహాన్ని సందర్శిస్తారు. ఎన్ని కిలోవాట్స్ సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉంది? ప్రస్తుత విద్యుత్ వినియోగం ఎంత? తదితర వివరాలు తెలుసుకొని సాధ్యాసాధ్యాలపై ఓ నివేదిక ఇస్తారు. ఆ తర్వాత సైట్‌లోనే మీరు సౌర ఫలకలు ఏర్పాటు చేసే వెండర్స్ జాబితాను ఎంపిక చేసుకోవచ్చు. అనంతరం డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు నెట్ మీటరింగ్‌ను ఏర్పాటు చేస్తాయి. సౌరవిద్యుత్ ఉత్పత్తి యూనిట్లు, మీ వినియోగం ఆధారంగా డిస్కమ్‌లు మీ విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు చేస్తుంది. మీ సోలార్ యూనిట్ ఉత్పత్తి చేసే విద్యుత్ కంటే తక్కువగా వినియోగించుకుంటే, మిగిలిన యూనిట్లను డిస్కమ్ వినియోగించుకుంటుంది. అలా ప్రతీ ఆరునెలలకోమారు మీరు ఏర్పాటు చేసుకున్న యూనిట్ నుంచి ఉత్పత్తి మిగిలిందా? లేక తగ్గుదల ఉందా అన్న అంశాన్ని పరిశీలించి విద్యుత్ బిల్లుల్లో సంబంధిత డిస్కమ్ సర్దుబాటు చేస్తుంది.

రాష్ట్రంలో ప్రస్తుతం రూఫ్‌టాప్ సోలార్ ఇలా (ఫిబ్రవరి 18వ తేదీ వరకు)

నివాస భవనాలు	మెగావాట్లలో	నివాసేతర భవనాలు	మెగావాట్లలో
టీజీఎస్‌పీడీసీఎల్ (డిస్కమ్)			
23,022	160	3,031	63
టీజీఎన్‌పీడీసీఎల్ (డిస్కమ్)			
5,262	21	2,108	47

వినియోగం నెలకు 150కు పైగా ఉంటే..


మీ ఇంట్లో విద్యుత్ వినియోగం ప్రతీ నెలా 150 యూనిట్ల కంటే అధికంగా ఉంటే 3 కిలోవాట్స్ సోలార్ విద్యుత్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందుకోసం అన్ని కలుపుకొని దాదాపు రూ. 2.10 లక్షల వరకు వ్యయం అవుతుంది. సోలార్ పవర్ కోసం మీరు చేసే వ్యయం...నాలుగైదేళ్లలో తిరిగి వచ్చేస్తుంది. ఒకసారి ఈ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే 25 సంవత్సరాల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

- సంపత్‌కుమార్, రెడ్కో అధికారి

పునాదిని మించిన గుంత లోతు

పెను ప్రమాదంలో శ్రీశైలం జలాశయం

- తక్షణమే అధ్యయనాలు, మరమ్మతులు చేపట్టాలన్న ఎన్డీఎస్‌ఏ కమిటీ
- గుంతతో ఇప్పటికే షీర్‌జోన్ ప్రభావితమై ఉండవచ్చు
- డ్యామ్ భద్రతకు ఇది అత్యంత ప్రమాదకరమన్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్: 'ఉభయ తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు శ్రీశైలం భద్రత పెను ప్రమాదంలో ఉంది. డ్యామ్ పునాదుల కింద భూగర్భంలోని భారీ రాతిఫలకాల మధ్య పెళుసుతో కూడిన బలహీన అతుకులున్నట్టు జియలాజికల్ సమాచారం స్పష్టం చేస్తోంది. నిలువుగా రెండు భారీ జాయింట్లు, వాటికి అనుబంధ జాయింట్లూ ఉన్నట్టు తెలుపుతోంది. అనుబంధ జాయింట్ల మధ్య దూరం పెరిగితే డ్యామ్ పునాదులు రక్షణను కోల్పోయి జారిపోయే ప్రమాదం ఉంది. ఇది డ్యామ్ భద్రతకు అత్యంత ప్రమాదకరం. డ్యామ్ దిగువన ఏర్పడిన భారీ గుంత (ప్లంజ్‌పూల్) 120 మీటర్ల లోతైనదని 2018 జూలైలో నిర్వహించిన బాతిమెట్రిక్ సర్వేలో తేలింది. గుంత లోతు డ్యామ్ పునాదుల లోతుకు మించిపోయినట్టు తెలుస్తోంది. గుంత.. డ్యామ్ పునాదుల వరకు విస్తరించి రాతిఫలకాల మధ్య పెళుసుతో ఉన్న జాయింట్ల (షీర్ జోన్)ను ప్రభావితం చేసి ఉండవచ్చు. డ్యామ్ జారిపోకుండా రక్షణ కల్పించే పునాదుల మందం గణనీయంగా తగ్గిపోయి ఉండవచ్చు..' అని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ)కి చెందిన నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. జలాశయం భద్రత దృష్ట్యా తక్షణమే పలు అధ్యయనాలు, మరమ్మతులు చేపట్టాలని సిఫారసు చేసింది.

2009 వరదలతో పెరిగిన ముప్పు

ఎన్డీఎస్‌ఏ సభ్యులు (విపత్తుల నిర్వహణ) వివేక్ త్రిపాఠి నేతృత్వంలో డిప్యూటీ డైరెక్టర్ అమిత్ మిట్టల్, కన్సల్టెంట్ కమలేశ్ జైన్‌తో సంస్థ ఈ కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కృష్ణాబోర్డు, సెంట్రల్ సాయిల్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), ఏపీ, తెలంగాణ నీటిపారుదల శాఖల నిపుణులు కూడా కమిటీలో ఉన్నారు. ఈ కమిటీ గత ఏడాది శ్రీశైలం జలాశయాన్ని సందర్శించింది. అనంతరం తన నివేదికను సమర్పించింది. తాజాగా వెలుగు చూసిన నివేదిక వివరాలిలా ఉన్నాయి.

78 గంటల భీకర వరదతో తీవ్ర నష్టం

శ్రీశైలం జలాశయం నిర్మాణం 1963లో ప్రారంభమై 1984లో పూర్తైంది. 1975–76లో జలాశయం దిగువన బకెట్ ఏరియా కోతకు గురైనట్టు గుర్తించి, నిపుణుల కమిటీ సూచన మేరకు రక్షణగా ఆప్రాన్ ఏర్పాటు చేసినా ఫలితం కనిపించలేదు. మళ్లీ కమిటీ సూచన మేరకు 1984–85లో కాంక్రీట్‌తో నిండిన స్టీల్ సిలిండర్లను ఆప్రాన్‌కు రక్షణకు పాతిపెట్టగా, అవీ కోతకు గురయ్యాయి. శ్రీశైలం జలాశయాన్ని గరిష్ఠంగా 19 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా నిర్మించగా, 2009 అక్టోబర్‌లో ఏకంగా 25.5 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తింది. గరిష్ఠ నీటిమట్టం 271.8 మీటర్లు కాగా, వరదల సమయంలో 273.25 మీటర్లకు పెరిగిపోవడంతో జలాశయం పొంగిపొర్లింది. 78 గంటల పాటు భీకర వరద కొనసాగడంతో జలాశయానికి తీవ్ర నష్టం వాటిల్లింది.

ప్లంజ్‌పూల్‌పై కమిటీ సిఫారసులు

- శ్రీశైలం జలాశయం దిగువన డైక్/కాఫర్ డ్యామ్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. దీంతో దిగువ భాగంలో నీటి నిల్వల స్థాయి పెరిగి గుంత మరింతగా కోతకు గురికాకుండా ఉంటుంది.
- గుంత కారణంగా జలాశయం పునాదుల కింద రాతిపొరల్లో వచ్చిన మార్పులను అధ్యయనం చేయడానికి ఆధునిక పద్ధతుల్లో సిమ్యులేషన్ అధ్యయనాలు చేయాలి. వేర్వేరు వరద తీవ్రతలను ప్రామాణికంగా తీసుకుని జలాశయానికి ఉండే ముప్పును, స్థిరత్వాన్ని, జారిపోయే ప్రమాదాన్ని అంచనా వేయాలి.
- జలాశయం దిగువన దెబ్బతిన్న కాంక్రీట్‌తో నిండిన స్టీల్ సిలిండర్లను పునరుద్ధరించాలి.
- ప్లంజ్‌పూల్‌కి రెండువైపులా స్థిరత్వం కోసం రాతిఫలకాలకు బోల్టులు అమర్చి కాంక్రీట్‌తో రీఎన్‌ఫోర్స్ చేయాలి.
- దిగువన గుంత పరిమాణం మరింత పెరగకుండా జలాశయం గేట్ల నిర్వహణలో మార్పులు చేయాలి.
- జలాశయం పునాదుల వరకు గుంత విస్తరించిందా? లేదా? అనే అంశాన్ని డ్రిల్లింగ్ ద్వారా నిర్ధారించాలి.
- జలాశయం ఎగువన ఎడమగట్టుకు రక్షణగా నిర్మించిన గోడకు మరమ్మతులు జరపాలి. పియర్, స్పిల్‌వే ఎగువ భాగానికి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ మరమ్మతులు చేపట్టాలి.

ఇతర సిఫారసులు

- జలాశయం 17/18 బ్లాకులకు రెండుచోట్ల అడ్డంగా వచ్చిన పగుళ్లకు మరమ్మతులు చేయాలి. భవిష్యత్తులో మళ్లీ ఏర్పడకుండా నివారించేందుకు వీలుగా పగుళ్లకు కారణాలను శోధించాలి.
- డ్యామ్ దిగువన 4, 9, 10 నంబర్ల గేట్ల వద్ద ఏర్పడిన గుంతల లోతును అధ్యయనం చేసి, దాని ఆధారంగా మరమ్మతులను నిర్వహించాలి.
- 16, 17వ బ్లాకుల వద్ద ఏర్పాటు చేసిన రివర్ స్లూయిస్‌ల నుంచి లీకేజీని అరికట్టడానికి అత్యంత ప్రాధాన్యతతో మరమ్మతులు చేయాలి.
- డ్యామ్ ఫౌండేషన్ గ్యాలరీలో ఆందోళనకర రీతిలో పెద్దమొత్తంలో సీపేజీ జరుగుతోంది. సీపేజీ అధికంగా ఉన్న బ్లాకులకు కర్టెన్ గ్రౌటింగ్ నిర్వహించాలి.
- భూకంపాల ముప్పుపై ఎప్పుడో జలాశయం నిర్మాణ సమయంలో అధ్యయనాలు చేశారు. ఇప్పుడు అత్యాధునిక సమాచారం లభ్యతగా ఉన్న నేపథ్యంలో మళ్లీ కొత్తగా అధ్యయనం జరపాలి.
- జలాశయానికి ప్రమాదం జరిగితే దిగువ ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించేందుకు వీలుగా అత్యవసర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలి.

'శ్రీశైలం'ను ఏం చేయాలనుకుంటున్నారు?

ఏపీ ప్రభుత్వంపై ఎన్డీఎస్‌ఏ తీవ్ర అసంతృప్తి

- డ్యామ్ ప్రమాదంలో ఉందని ముందే హెచ్చరించినా ఎందుకు మరమ్మతులు చేపట్టలేదు?
- మే లోగా మరమ్మతులు పూర్తి చేయాలంటూ గడువు విధించిన సంస్థ చైర్మన్

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం జలాశయం భద్రత ప్రమాదంలో ఉందని హెచ్చరిస్తూ తాము నియమించిన నిపుణుల కమిటీ ముందే నివేదిక ఇచ్చినా.. ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఏపీ ప్రభుత్వంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జలాశయానికి 143 అడుగుల దిగువన ఏర్పడిన భారీ గుంతకు (ప్లంజ్‌పూల్) తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని సిఫారసు చేసినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించింది. జలాశయాన్ని ఏం చేయాలనుకుంటున్నారు? అంటూ నిలదీసింది. నిపుణుల కమిటీ సిఫారసుల ఆధారంగా వచ్చే మే లోగా మరమ్మతులకు చర్యలు తీసుకోవాలంటూ డెడ్‌లైన్ విధించింది. శ్రీశైలం జలాశయం భద్రతపై ఎన్డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్, నిపుణుల కమిటీ చైర్మన్ వివేక్ త్రిపాఠి గురువారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్, స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ సీఈ ప్రమీల, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, కర్నూలు సీఈ కబీర్ ఖాన్, శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ మోహన్ పాల్గొన్నారు. నిపుణుల కమిటీ నివేదికపై అధ్యయనం జరిపి సిఫారసులు చేసే బాధ్యతను సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్)కు అప్పగించినట్టు ఏపీ ఈఎన్‌సీ బదులివ్వగా..ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారా? అని ఎన్డీఎస్‌ఏ చైర్మన్ ప్రశ్నించారు. ఒప్పందం కాలేదని తెలపడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం జలాశయాల భద్రత వాటి యజమానులదే (ఓనర్లు)నని తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ గుర్తు చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ ఏపీ పరిధిలోనే ఉన్నందున ఆ రాష్ట్ర అధికారే ఓనర్ అని అన్నారు. సాగర్ పర్యవేక్షణ తమ రాష్ట్ర పరిధిలో ఉన్నందున ఆ ప్రాజెక్టుకు తమ అధికారి ఓనర్ అని చెప్పారు. దీనిపై ఏపీ ఈఎన్‌సీ వెంకటేశ్వర రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించాల్సి ఉన్నందున దీనిని తాము అంగీకరించబోమన్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణను చూస్తున్న ఏపీకి చెందిన చీఫ్ ఇంజనీరే ఓనర్ అవుతారని ఎన్డీఎస్‌ఏ చైర్మన్ స్పష్టం చేశారు. అలాగే సాగర్‌ను పర్యవేక్షిస్తున్న నల్లగొండ సీఈ ఆ ప్రాజెక్టుకు ఓనర్ అవుతారని వివరించారు. కాబట్టి ఈ రెండు ప్రాజెక్టుల భద్రతకు వీరే బాధ్యులని తేల్చి చెప్పారు. బాధ్యతలను విస్మరిస్తే పర్యవసానాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కాగా ముంబయి సముద్రతీరం కోతకు గురికాకుండా ఏర్పాటు చేసిన కాంక్రీట్ టెట్రా ప్యాడ్లను శ్రీశైలం ప్రాజెక్టు దిగువన ఏర్పడిన భారీ గుంత వద్ద ఏర్పాటు చేయాలని తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ సూచించారు. శ్రీశైలం జలాశయానికి అనుకోని ప్రమాదం జరిగితే దిగువ ప్రాంతాల ప్రజలను రక్షించడానికి అవసరమైన అత్యవసర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు.

ఏపీ, తెలంగాణకు నష్టం వాటిల్లదు

- గోదావరి–కావేరి అనుసంధానానికి సాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకోవడంపై ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టీకరణ
- సిమ్యులేషన్ స్టడీస్‌లో తేలిందంటూ రెండు రాష్ట్రాలకు లేఖ
- నేటి నుంచి ప్రాజెక్టు అలైన్‌మెంట్‌పై అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరీ నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా నాగార్జునసాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకున్నా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటి హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్లదని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) స్పష్టం చేసింది. ఇచ్చంపల్లి నుంచి 148 టీఎంసీల గోదావరి జలాలను నాగార్జునసాగర్ జలాశయంలోకి ఎత్తిపోసి.. అక్కడి నుంచి సోమశిల, కండలేరుకు తరలించి.. అక్కడి నుంచి కావేరి గ్రాండ్ ఆనకట్టకు తీసుకెళ్లాలని అనుసంధానం ప్రాజెక్టు కింద ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. అయితే నాగార్జునసాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకోవాలనే ప్రతిపాదనలపై గతంలో ఏపీ, తెలంగాణలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. కృష్ణా జలాల్లో తమ హక్కులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల అనుమానాలను నివృత్తి చేసేందుకు గాను ఎన్‌డబ్ల్యూడీఏ సిమ్యులేషన్ స్టడీస్ నిర్వహించింది. దాని ఫలితాలను రెండు రాష్ట్రాలకు తెలియజేసింది. సాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకున్నా రెండు రాష్ట్రాలకు జరిగే నష్టమేమీ లేదని తేలిందని పేర్కొంటూ ఇరు రాష్ట్రాలకు లేఖ రాసింది. 148 టీఎంసీల్లో 43 టీఎంసీలను తెలంగాణకు కేటాయించగా, మరో 5 టీఎంసీలు ఆవిరి నష్టాలు ఉండనున్నట్టు అంచనా వేసింది. మిగిలిన 100 టీఎంసీలను సాగర్‌కు తరలించి అక్కడి నుంచి సోమశిల ప్రాజెక్టుకి పంపిస్తామని ప్రతిపాదించింది. కాగా తమ రాష్ట్రానికి కేటాయించిన 43 టీఎంసీల జలాల వినియోగం విషయంలో తమకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని తెలంగాణ కోరింది. తమకు అవసరమున్న చోట ఆ నీళ్లను వాడుకుంటామని తెలిపింది. మరోవైపు గోదావరి–కావేరి అనుసంధానం ప్రాజెక్టు అలైన్‌మెంట్‌పై శుక్రవారం నుంచి ఎన్‌డబ్ల్యూడీఏ అధికారులు అధ్యయనం చేపట్టనున్నారు.

12న భాగస్వామ్య పక్షాలతో ఢిల్లీలో భేటీ

గోదావరి–కావేరీ అనుసంధానం ప్రాజెక్టుకు ఎన్‌డబ్ల్యూడీఏ.. భాగస్వామ్య రాష్ట్రాల సమ్మతిని తీసుకోనుంది. ఈ నెల 12న ఉదయం 11.30 గంటలకు ఢిల్లీలో 6వ సంప్రదింపుల సమావేశం నిర్వహించనున్నట్టు సంస్థ తెలిపింది.

పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి
- తుక్కుగూడలో లెన్స్‌కార్ట్ కళ్లద్దాల పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.1,500 కోట్లతో నిర్మాణం..



లెన్స్‌కార్ట్ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు. చిత్రంలో పట్నం

తుక్కుగూడ/సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ప్రముఖ కళ్లద్దాల ఉత్పత్తుల సంస్థ లెన్స్‌కార్ట్ రంగారెడ్డి జిల్లాలోని రావిర్యాలలో రూ. 1,500 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రపంచంలోనే అతిపెద్ద బ్రాండెడ్ కళ్లద్దాల తయారీ పరిశ్రమకు గురువారం ఆయన శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రపంచంలోని బ్రాండెడ్ కళ్లద్దాల తయారీ కంపెనీల్లో ఒకటైన లెన్స్‌కార్ట్.. 52 ఎకరాల విస్తీర్ణంలో ఫ్యాక్టరీని నిర్మిస్తోందని చెప్పారు. రెండేళ్లలో పరిశ్రమ నిర్మాణ పనులు పూర్తవుతాయని వివరించారు. ఈ పరిశ్రమలో సుమారు 1,600 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్న ఆయన.. ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు. పరిశ్రమల ఏర్పాటు కారణంగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారంలో భాగంగా అన్ని హంగులతో కూడిన వెంచర్ వేసి ప్లాట్లు అందిస్తామని తెలిపారు. కాగా, రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో రూ. 12 కోట్లతో నిర్మించనున్న డీసీపీ కార్యాలయానికి సైతం మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు.

మంత్రి శ్రీధర్‌బాబుతో ఎన్ఎక్స్‌పీ సెమీకండక్టర్స్ ప్రతినిధుల భేటీ

భారత్‌లో సెమీ కండక్టర్ల పరిశ్రమ మార్కెట్ విలువ 2030 నాటికి 10 వేల కోట్ల డాలర్లకు చేరుకుంటుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలకు అనేక అనుకూలతలు ఉన్నాయన్నారు. నెదర్లాండ్స్‌కు చెందిన సెమీకండక్టర్ల తయారీ సంస్థ 'ఎన్ఎక్స్‌పీ సెమీకండక్టర్స్' ప్రతినిధులు గురువారం మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఏఐ సిటీలో భాగం కావాలని సంస్థ ప్రతినిధులను శ్రీధర్‌బాబు కోరారు.

ఫైవ్ స్టార్ హోటల్‌ను మరిపించేలా స్టేట్ గెస్ట్‌హౌస్

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
ప్రభుత్వ అతిథుల కోసం వినియోగంలోకి స్టేట్ గెస్ట్‌హౌస్



భవనం ప్రారంభోత్సవంలో మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం తదితరులు

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎక్కడా లేనివిధంగా స్టేట్ గెస్ట్‌హౌస్‌ను సకల సౌకర్యాలతో తీర్చిదిద్దామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఫైవ్‌స్టార్ హోటల్‌ను మరిపించేలా అన్ని సదుపాయాలు కల్పించామని, కేంద్ర ప్రభుత్వ అధికారులు, వేరే రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చే ప్రముఖులకు ఆతిథ్యం ఇవ్వడం కోసం స్టేట్ గెస్ట్‌హౌస్‌ని వినియోగంలోకి తెచ్చామని ఆయన చెప్పారు. గురువారం బేగంపేటలోని ప్రజాభవన్ ఆవరణలో స్టేట్ గెస్ట్‌హౌస్‌ను మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, గత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం క్యాంపు ఆఫీసుగా వినియోగించిన భవనాన్ని ఆధునీకరించి స్టేట్ గెస్ట్‌హౌస్‌గా మార్చామన్నారు. వేరే రాష్ట్రాల నుంచి వచ్చే ప్రభుత్వ అతిథులకు హోటళ్లలో బస ఏర్పాటుచేసి ప్రజాధనాన్ని వృథా చేయకుండా స్టేట్ గెస్ట్‌హౌస్‌ను వినియోగిస్తామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రానికి వచ్చే అతిథులకు ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస ఏర్పాటు చేసి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసిందని ఆరోపించారు.

ఎస్ఎల్‌బీసీ ఘటనకు కేబినెట్‌దే బాధ్యత

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపించాలి



సాక్షి, హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగం పైకప్పు కూలిన ఘటనకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గం బాధ్యత వహించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సొరంగంలో ప్రమాదం జరుగుతుందని నివేదికలు ఉన్నా, ప్రభుత్వం వాటిని దాచిపెట్టి కార్మికులతో పనిచేయించిందన్నారు. ఎస్ఎల్‌బీసీ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపించాలని గురువారం ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'సీఎంతోపాటు కొందరు మంత్రుల కమీషన్ల కక్కుర్తి వల్లే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగింది. పనులు జరిగే ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా ప్రకటించిన రెండు నివేదికలు ప్రభుత్వం వద్ద ఉన్నా.. పనులు కొనసాగించి ఎనిమిది కుటుంబాల్లో ఎడతెగని శోకం మిగిల్చారు' అని విమర్శించారు.

మా వల్లే 'టాస్క్'కు గుర్తింపు: 'బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన కృషి వల్లే తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)కు నీతి ఆయోగ్ ప్రశంసలు దక్కాయి. టాస్క్ ద్వారా తెలంగాణ యువత, విద్యార్థులకు అనేక ప్రయోజనాలు కలిగాయి. గడిచిన పదేళ్లలో 761 కాలేజీల్లోని 9.84 లక్షల విద్యార్థులు, 18,650 మంది అధ్యాపకులకు శిక్షణ లభించింది. విద్యార్థులు, యువతకు ఉపాధి అవకాశాలు దక్కాయి' అని కేటీఆర్ పేర్కొన్నారు.



'ఇక్రిశాట్' డీజీగా హిమాన్షుపాఠక్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మెట్టపంటల వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్) కొత్త డైరెక్టర్ జనరల్‌గా డాక్టర్ హిమాంశు పాఠక్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఇక్రిశాట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనను అధికారికంగా స్వాగతించారు. భారత్, విదేశాల్లోని ఇక్రిశాట్ భాగస్వాములు ప్రత్యక్షంగా, వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమాంశు పాఠక్ మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, జనాభా పెరుగుదల, అభివృద్ధి నిధుల మారుతున్న స్వరూపం వంటి అంశాలను ఎదుర్కొంటూ, వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఇక్రిశాట్ కీలక భూమిక పోషించనుందని పేర్కొన్నారు. ఈ కీలక సమయంలో, ఇక్రిశాట్‌ను నడిపించే అవకాశాన్ని పొందడం భాగ్యంగా భావిస్తున్నానని పాఠక్ చెప్పారు. ఇంటీరియమ్ డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరించిన స్టాన్‌ఫర్డ్ బ్లేడ్‌కు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఫీజుల కోసం


ఫలితాల నిలిపివేత

లబోదిబోమంటున్న 80 వేల మంది డిగ్రీ విద్యార్థులు




సాక్షి, హైదరాబాద్: వివిధ రకాల ఫీజు బకాయిలు చెల్లించలేదని కాకతీయ విశ్వవిద్యాలయం 112 ప్రైవేటు కాలేజీలకు చెందిన విద్యార్థుల పరీక్ష ఫలితాలను నిలిపివేసింది. మొత్తం బకాయిలు చెల్లించే వరకూ వెల్లడించబోమని తేల్చి చెప్పింది. దీంతో యూనివర్సిటీ పరిధిలో ఉన్న ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన 80 వేల మంది విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలోని మిగతా వర్సిటీలు కూడా కాకతీయ బాట పట్టేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, ద్వితీయ, మూడో ఏడాది విద్యార్థులకు వివిధ సెమిస్టర్ పరీక్షలు జరిగాయి. వర్సిటీ పరిధిలోని 390 కాలేజీల విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. ఈ నెల 4వ తేదీన ఫలితాలు ప్రకటించారు. కానీ ఫీజు బకాయిలు ఉన్న 112 కాలేజీల ఫలితాలు మాత్రం నిలిపివేశారు.

జిల్లాల వారీగా ఫలితాలు విడుదల కాని కాలేజీలు, విద్యార్థుల సంఖ్య



చెల్లించాల్సిన మొత్తం (రూ.కోట్లలో)



ప్రభుత్వం 2019 నుంచి చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

ఏంటీ ఫీజులు?

ప్రైవేటు డిగ్రీ కాలేజీలు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్, విద్యార్థుల గుర్తింపు, విద్యార్థుల సంక్షేమ నిధి, ఇంటర్ టోర్నమెంట్, అనుబంధ గుర్తింపు ఫీజులను ఏటా యూనివర్సిటీలకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం కోర్సును బట్టి రూ.1,000 నుంచి రూ.5 వేల వరకూ ఉంటుంది. అన్ని యూనివర్సిటీల పరిధిలో దాదాపు రూ.100 కోట్ల ఫీజు బకాయిలుండగా.. కాకతీయ పరిధిలోనే 112 కాలేజీలు రూ.2.5 కోట్లు చెల్లించాల్సి ఉంది.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు!

రాష్ట్రంలో కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సక్రమంగా అమలు కావడం లేదు. బోధన రుసుములు, ఉపకార వేతనాల కింద ప్రభుత్వం 2023–24 విద్యా సంవత్సరం వరకే రూ.5,195 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరాన్ని కలిపితే ఈ మొత్తం దాదాపు రూ.8 వేల కోట్లకు చేరుతుంది. కొన్నేళ్లుగా రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో ప్రైవేటు కాలేజీలకు నిధుల కొరత ఏర్పడింది. అధ్యాపకులకే వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని యాజమాన్యాలు చెబుతున్నాయి. దీంతో గత పరీక్షల సమయంలో కాలేజీలు ఆందోళనకు కూడా దిగాయి. అప్పుడు నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ ఇప్పటివరకు ఆచరణకు నోచుకోలేదు. సాధారణంగా వర్సిటీలకు చెల్లించాల్సిన ఫీజులను కాలేజీలు విద్యార్థుల నుంచి ముందే వసూలు చేస్తాయి. రీయింబర్స్‌మెంట్ వచ్చినప్పుడు విద్యార్థులకు తిరిగి చెల్లిస్తాయి. అయితే విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ కాలేజీలు యూనివర్సిటీలకు చెల్లించడం లేదని అధికారులు అంటున్నారు. కాలేజీలు ఎక్కువ ఉండటం, పోటీ పెరగడంతో ఫీజులు ఒత్తిడి చేసి వసూలు చేసే పరిస్థితి లేదని మరోవైపు యాజమాన్యాలు అంటున్నాయి. ఏది ఏమైనా ఫలితాల నిలిపివేతతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.

రీయింబర్స్‌మెంట్ రావడం లేదు



మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదు. ప్రతి కాలేజీ ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. ప్రభుత్వానికి ఈ విషయం చెప్పాం. అయినా ఫలితం లేదు. వర్సిటీని కూడా కొంత సమయం అడిగాం. పట్టించుకోకుండా ఫలితాలు నిలిపి వేయడం సరికాదు. తక్షణమే ప్రకటించాలి.

– జి.శ్రీధర్‌రావు
(ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్)

సమయం ఇచ్చినా చెల్లించలేదు



వర్సిటీకి చెల్లించాల్సిన దాదాపు రూ.2.5 కోట్ల బకాయిలు చెల్లించమని కాలేజీలను కోరాం. వారితో చర్చలు జరిపాం. కొంత సమయం కూడా ఇచ్చాం. అయినా చెల్లించలేదు. ఫీజులు చెల్లించకపోతే యూనివర్సిటీ నడిచేదెలా? అందుకే ఫలితాలు నిలిపివేశాం.

– ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి
(కాకతీయ యూనివర్సిటీ వీసీ)

మాకెందుకీ శిక్ష?



కష్టపడి చదివి పరీక్షలు రాశాం. కాలేజీలకు, వర్సిటీకి ఉన్న లావాదేవీలు వాళ్ళు చూసుకోవాలి. మేమేం తప్పు చేశాం. మాకు ఎందుకీ శిక్ష?

– బి.సరిత
(బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థిని, ఖమ్మం)

పాండిచ్చేరి సెంట్రల్ వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ పి.ప్రకాశ్‌బాబు

- ఇఫ్లూ నూతన వీసీగా ప్రొ. నాగరాజు
- ఆదేశాలు జారీచేసిన రాష్ట్రపతి ముర్ము



పి.ప్రకాశ్‌బాబు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ పి.ప్రకాశ్‌బాబు పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు విజిటర్ హోదాలో భారత రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఆయనను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయిదేళ్ల కాలానికి ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ఆదేశాలలో పేర్కొన్నారు. హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో ఆయన సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. ఆయన న్యూరోసైన్సెస్, న్యూరోడెజెనరేటివ్ వ్యాధులలో నిష్ణాతులుగా గుర్తింపు పొందారు. కాగా, ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కడపలోని యోగి వేమన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబును నియమించిన విషయం తెలిసిందే. తాజాగా భారత రాష్ట్రపతి పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వీసీగా నియమించడం విశేషం.

ఇఫ్లూ నూతన వీసీగా ప్రొ.నాగరాజు

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారన్ లాంగ్వేజెస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ) నూతన వైస్ చాన్స్‌లర్ (వీసీ)గా ప్రొ.నాగలపల్లి నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది కాలంగా ఇఫ్లూ ఇన్‌చార్జి వీసీ పాలనలో కొనసాగుతున్న విషయం విదితమే. కర్ణాటకలోని గుల్బర్గా సెంట్రల్ యూనివర్సిటీలో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నాగరాజు ప్రస్తుతం ఒడిశాలోని గంగాధర్ మేహర్ యూనివర్సిటీ వీసీగా కొనసాగుతున్నారు. ప్రొ.నాగరాజు నేడు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

'ఏఐ సిటీ'కి రోడ్ మ్యాప్

- అంతర్జాతీయ కృత్రిమ మేధకు హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం
- స్టార్టప్‌లు, విద్యాసంస్థలతో ప్రభుత్వం వర్క్‌షాప్‌లు

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) ఆవిష్కరణల్లో తెలంగాణను అంతర్జాతీయ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో 'ఏఐ సిటీ' ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీలో భాగంగా రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో 200 ఎకరాల విస్తీర్ణంలో 'ఏఐ సిటీ' ఏర్పాటు కోసం అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడంలో రాష్ట్ర ఐటీ విభాగానికి చెందిన అనుబంధ సంస్థలు నిమగ్నమయ్యాయి. ఏఐ సిటీ రూపురేఖలు, విధివిధానాలు ఎలా ఉండాలనే విషయమై చర్చించేందుకు సంబంధిత రంగానికి చెందిన సంస్థలతో 'టీ–వర్క్స్' ఆవరణలో వర్క్‌షాప్‌లు జరుగుతున్నాయి. రెండు రోజుల కిందట సైతం ఓ వర్క్‌షాప్ జరిగింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వర్క్‌షాప్‌లో టీజీఐఐసీ, తెలంగాణ ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ (రిచ్) తదితర సంస్థలు పాల్గొన్నాయి. రాష్ట్రంలోని ఏఐ స్టార్టప్‌లు, కార్పొరేట్, విద్యాసంస్థలకు చెందిన నిపుణులు ఇందులో పాల్గొన్నారు. ఏఐ సిటీలో కల్పించాల్సిన అత్యాధునిక మౌలికవసతులు, సాంకేతికత పరిశోధనశాలలు, స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ సెంటర్లు, సహ భాగస్వామ్యంతో ఏర్పాటయ్యే ఆఫీసులకు సంబంధించి కీలక సూచనలు చేశారు. వాటిని క్రోడీకరించి 'ఏఐ సిటీ'లో భాగస్వాములయ్యే పెట్టుబడిదారులు, ప్రభుత్వ సంస్థలు, ఇతర వ్యవస్థలకు లబ్ధి చేకూరేలా అనుసరించాల్సిన విధానాలను ప్రభుత్వం రూపొందించనుంది.

జూన్ 8, 9 తేదీల్లో ఐసెట్

- ఈ నెల 10వ తేదీ నుంచి మే 3 వరకు దరఖాస్తులు
- నోటిఫికేషన్ విడుదల చేసిన ఎంజీ వర్సిటీ

నల్లగొండ టూటౌన్: తెలంగాణ ఐసెట్–2025 నోటిఫికేషన్‌ను మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) అధికారులు గురువారం విడుదల చేశారు. ఐసెట్ చైర్మన్‌గా ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కన్వీనర్‌గా రిజిస్ట్రార్ అల్వాల రవి వ్యవహరించనున్నారు. 2025–26 సంవత్సరంలో ఎంబీఏ, ఎంసీఏలో ప్రవేశాల కోసం జూన్ 8, 9వ తేదీల్లో నిర్వహించనున్న ఐసెట్ పరీక్షకు ఈ నెల 10 నుంచి మే 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా 16 ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో ఐసెట్ నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు పరీక్ష ఫీజు రూ.550, ఇతర అభ్యర్థులకు రూ.750గా నిర్ణయించారు. రూ.50 అపరాధ రుసుంతో మే 17 వరకు, రూ.500 అపరాధ రుసుంతో మే 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో పొరపాట్ల సవరణకు మే 16 నుంచి 20వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఐసెట్ పరీక్ష నాలుగు విడతలుగా నిర్వహిస్తారు. రోజుకు రెండు పూటలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష ప్రాథమిక కీ జూన్ 21న విడుదల చేయనున్నారు. అభ్యంతరాలు తెలిపేందుకు జూన్ 22 నుంచి 26 వరకు అభ్యర్థులకు అవకాశం ఉంటుంది. జూలై 7వ తేదీన తుది కీ, పరీక్ష ఫలితాలను విడుదల చేయనున్నారు. అభ్యర్థులు మోడల్ పేపర్, ఆన్‌లైన్ దరఖాస్తులు, ఇతర పూర్తి వివరాల కోసం htt pr@//icet.trche.ac.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

బ్యాంకులాగా 'ఈపీఎఫ్‌ఓ 3.0' సేవలు

- త్వరలో ఏటీఎంల నుంచి పీఎఫ్ విత్‌డ్రా సహా సరికొత్త సర్వీసులు అందిస్తాం
- ఈపీఎఫ్‌ఓ జోనల్, రీజనల్ కార్యాలయాల ప్రారంభోత్సవంలో కేంద్ర కార్మిక మంత్రి మన్‌సుక్ మాండవీయ



ఈపీఎఫ్‌ఓ కార్యాలయాలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రులు మాండవీయ, కిషన్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ రఘునందన్‌రావు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) చందాదారులకు అందిస్తున్న సేవలను మరింత సులభతరం చేసేందుకు ఈపీఎఫ్‌ఓ 3.0 వెర్షన్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. గతంలో ఈపీఎఫ్‌ఓ ద్వారా సేవలు పొందేందుకు చందాదారులు ఇబ్బందులు ఎదుర్కొనేవారని.. తమ ఖాతాలో వివరాల సవరణ కోసం పీఎఫ్ కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలాంటి అవసరమే లేకుండా నేరుగా ఆన్‌లైన్‌లో వివరాల సవరణకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం సరికొత్త డిజిటల్ ప్లాట్‌ఫాం ఈపీఎఫ్‌ఓ 3.0 ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని బేగంపేటలో కొత్తగా నిర్మించిన ఈపీఎఫ్‌ఓ తెలంగాణ జోనల్ కార్యాలయంతోపాటు బంజారాహిల్స్ ప్రాంతీయ కార్యాలయాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

8.25 శాతం వడ్డీ ఏ బ్యాంకూ ఇవ్వట్లేదు..

ఈపీఎఫ్‌ఓ 3.0 డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా సేవల సులభతరంతోపాటు చందాదారుల కోసం మరిన్ని సంస్కరణలు తీసుకొస్తామని మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ప్రస్తుతం ఈపీఎఫ్‌ఓ ఒక సంస్థగా ఉందని.. భవిష్యత్తులో అది కార్మికుల బ్యాంకుగా మారబోతోందన్నారు. ఈ సంస్థలో ప్రస్తుతం రూ. 25 లక్షల కోట్ల మేర నిల్వలున్నాయని చెప్పారు. కార్మికులు దాచుకుంటున్న నిధిపై 8.25 శాతం వడ్డీ చెల్లిస్తున్నామని, దేశంలో ఇంత వడ్డీ ఏ బ్యాంకూ ఇవ్వటం లేదని మంత్రి గుర్తుచేశారు. చందాదారులు క్లెయిమ్స్‌ను ఆటోజనరేషన్ పద్ధతిలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. భవిష్యత్తులో చందాదారులు ఈపీఎఫ్‌ఓలో దాచుకున్న సొమ్మును ఏటీఎం కార్డుల ద్వారా ఉపసంహరించుకొనే వ్యవస్థను తీసుకొస్తామని మంత్రి వివరించారు. మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో మరిన్ని ఈఎస్‌ఐ ఆసుపత్రులు, ఈపీఎఫ్‌ఓ కార్యాలయాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రామగుండం లాంటి చోట్ల స్థలాలు కేటాయిస్తే పనులు మొదలుపెడతామన్నారు. ఈ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ రమేశ్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొననున్నారు.

రెవెన్యూ వ్యవస్థ పటిష్టానికి చర్యలు హర్షణీయం

కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతించిన డిప్యూటీ కలెక్టర్స్, తహసీల్దార్ల సంఘాలు

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖ బలోపేతం కోసం గ్రామానికి ఒక క్షేత్రస్థాయి అధికారిని నియమించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై రెవెన్యూ ఉద్యోగులు, అధికారులు, డిప్యూటీ కలెక్టర్ల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. కొత్తగా ఏర్పడిన డివిజన్లు, మండలాలకు సైతం కొత్త పోస్టుల మంజూరు, సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపటాన్ని స్వాగతించాయి. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ (డీసీఏ) నేతలు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ.. తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ అసోసియేషన్ నేతలు కె. చంద్రమోహన్, డి.శ్రీనివాస్‌రెడ్డి.. తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) నేతలు ఎస్.రాములు, రమేష్ పాక.. తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) నేతలు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం గురువారం వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 10,950 గ్రామాలకు క్షేత్రస్థాయి అధికారుల నియామకంతోపాటు కొత్త డివిజన్లు, మండలాలకు 217 పోస్టులు, 33 సెలెక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయంతో క్షేత్రస్థాయిలో రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని పేర్కొన్నారు.

పరీక్ష గదిలో పాము

- బెంబేలెత్తిన విద్యార్థులు
- కొట్టి చంపిన సిబ్బంది



తాండూరు టౌన్: అసలే పరీక్షల ఒత్తిడి.. ఆ భయంతోనే గదిలో ప్రవేశించిన విద్యార్థులకు పాము కనిపించేసరికి బెంబేలెత్తి పరుగులు తీశారు. వికారాబాద్ జిల్లా తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏ సెంటర్ మొదటి అంతస్తులోని మూడో నంబర్ గదిలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తొలి పరీక్ష గురువారం కాసేపట్లో ప్రారంభమవుతుందనగా.. విద్యార్థులు ఒక్కొక్కరుగా పరీక్ష గదిలోకి వెళ్తున్నారు. మూడో నంబర్ గదిలోకి వెళ్లిన విద్యార్థులకు.. ఓ మూల పాము కనిపించడంతో కేకలు వేస్తూ బయటకు పరుగెత్తారు. సిబ్బంది వచ్చి పామును కర్రతో కొట్టి చంపేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం యథావిధిగా పరీక్ష కొనసాగింది. పరీక్ష గదిలోకి పూర్తి స్థాయిలో విద్యార్థులు చేరకముందే పాము కనిపించడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

నీళ్లివ్వరు.. తీసుకుపోనివ్వరు

- కొన్ని ఇంటర్ పరీక్ష సెంటర్లలో గొంతెండిన విద్యార్థులు
- ఇంటర్‌బోర్డ్‌తో వివాదం నేపథ్యంలో కాలేజీల సహాయ నిరాకరణ

సాక్షి, హైదరాబాద్/కడెం: ప్రైవేటు కాలేజీలు, ఇంటర్‌బోర్డ్ మధ్య నెలకొన్న వివాదం ఇంటర్ పరీక్షలపై ప్రభావం చూపుతోంది. మౌలిక వసతుల కల్పనలో కొన్ని ప్రైవేటు కాలేజీల సహాయ నిరాకరణ కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండో రోజు గురువారం పరీక్షల సందర్భంగా కొన్ని ప్రైవేటు కాలేజీల్లో సమస్యలను పరిష్కరించాలని ఇన్విజిలేటర్లు కోరినా యాజమాన్యాలు పట్టించుకోలేదని తెలిసింది.

సెంటర్లలోని కొన్ని సమస్యలు

- హైదరాబాద్‌లోని తార్నాక, నిజాంపేట, కూకట్‌పల్లి, బోయిన్‌పల్లి, హబ్సి గూడ, ఎస్ఆర్ నగర్‌లోని పలు ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థులు తాగునీటి సమస్య ఎదుర్కొన్నారు. విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి వాటర్ బాటిల్స్ తీసుకుపోనివ్వటం లేదు. సెంటర్‌లో తాగునీరు అందుబాటులో ఉంచటం లేదు. దీంతో విద్యార్థులు దాహంతోనే పరీక్షలు రాశారు.
- ఖమ్మంలోని కారేపల్లి, కొణిజర్ల, బోనకల్లు, ముదిగొండలోని పలు కేంద్రాల్లో పరీక్ష హాల్‌లో గోడ గడియారాలు అమర్చలేదు. విద్యార్థులు వాచీలు తీసుకెళ్లేందుకు కూడా అనుమతించకపోవడంతో సమయం తెలుసుకోవడం కష్టమైందని విద్యార్థులు చెప్పారు.
- కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లో ఇన్విజిలేటర్లు సమయ పాలనపై పెద్దగా దృష్టి పెట్టలేదు. ప్రతీ అరగంటకు ఒకసారి టైం ఎంతైందనేది ఇన్విజిలేటర్ విద్యార్థులకు చెప్పాలని ఇంటర్ బోర్డ్ సూచించినా పాటించలేదని సమాచారం.

2.39 శాతం మంది గైర్హాజరు

గురువారం జరిగిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ద్వితీయ భాష పరీక్షకు 4,40,513 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 4,52,028 మంది పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 10,823 (2.39 శాతం) మంది హాజరు కాలేదని పరీక్ష విభాగం ముఖ్య అధికారి జయప్రదాబాయ్ తెలిపారు. జగిత్యాలలో ముగ్గురు, నిజామాబాద్‌లో ఒక విద్యార్థి కాపీ కొడుతూ పట్టుబడినట్టు చెప్పారు. కాగా, నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ సెకండియర్ ప్రశ్నపత్రం లీకేజీ ప్రచారం కలకలం రేపింది. సిబ్బంది టాయిలెట్ రూంకు వెళ్లి ప్రశ్న పత్రం సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి బయటకు పంపినట్లు ప్రచారం జరిగింది. దీంతో ఏఎస్పీ రాజేశ్‌మీనా విచారణ జరిపి పేపర్ లీక్ కాలేదని తేల్చారు.

> ఎవరైతే తమ నమాజ్‌లో వినమ్రతను పాటిస్తారో,
> ఎవరైతే వ్యర్థమైన మాటల నుండి దూరంగా ఉంటారో,
> ఎవరైతే విధిదానం (జకాత్) సక్రమంగా చెల్లిస్తారో... వారు సాఫల్యం పొందుతారు.
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 7 మార్చి 2025

ఈ అనిశ్చితి పోయేదెలా?

జనవరి 20న గద్దెనెక్కినప్పటినుంచీ అధిక టారిఫ్‌లపై హెచ్చరిస్తూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... చివరికి అందుకు తుది గడువు ఖరారు చేశారు. తమ ఉత్పత్తులపై అధిక టారిఫ్‌లు వసూలు చేస్తున్న దేశాలన్నీ వచ్చే నెల 2 నుంచి తమ దెబ్బ కాచుకోవాలని హెచ్చరిక జారీచేశారు. దాదాపు వంద నిమిషాలపాటు అమెరికన్ కాంగ్రెస్‌నుద్దేశించి బుధవారం ఆయన చేసిన ప్రసంగం నిండా ఇలాంటి హెచ్చరికలున్నాయి. ఇప్పటికే చాలా సాధించినట్టు స్వోత్కర్షలున్నాయి. అమెరికా ప్రజల పాలిట తాను ఆపద్బాంధవుడినన్న భ్రమ కూడా ఆయనకు పుష్కలంగా ఉంది. 'నేను విధించబోయే సుంకాలు కేవలం ప్రజానీకం ఉద్యోగాలు కాపాడటానికి మాత్రమే కాదు... ఈ చర్య మన దేశ ఆత్మను కాపాడటానికి కూడా' అని ఆయన చెప్పుకొచ్చారు. సహజంగానే ప్రపంచమంతా ఏప్రిల్ గురించి బెంగపడుతోంది. ముంచుకొచ్చే ద్రవ్యపరమైన అసమతౌల్యతను అధిగమించడమెలాగో తెలియక అయోమయంలో కూరుకుపోతోంది. ఇప్పటికే ట్రంప్ చైనాపై అదనంగా 10 శాతం, మెక్సికో, కెనడాలపై మరో 25 శాతం సుంకాలు ప్రకటించటం వల్ల ఈ ఉపద్రవం ఖాయమని అన్ని దేశాలూ ఆందోళనతో ఉన్నాయి. సుంకాలను ట్రంప్ 'సర్వరోగ నివారిణి'గా భావిస్తున్నారు. మెక్సికో మాదకద్రవ్య ముఠాల నుంచి పెద్ద యెత్తున వచ్చిపడే ఫెంటానిల్ అమెరికాకు పెద్ద సమస్యగా మారింది. అక్రమ వలసలు దీనికి అదనం. వలసలను అరికట్టి, మాదకద్రవ్య ముఠా నాయకుల్ని పట్టి అప్పగించకపోతే 25 శాతం సుంకాలు తప్పవని గత నెల 4న ట్రంప్ హెచ్చరించటంతో కెనడా, మెక్సికోలు ఒక నెల వ్యవధి కోరాయి. మెక్సికో అధ్యక్షురాలు షీన్‌బామ్ వెనువెంటనే అమెరికా–మెక్సికో సరిహద్దుల్లోకి అదనంగా 10,000 మంది సైనికులను తరలించి తనిఖీలు పెంచి వలసలను నియంత్రించారు. దేశంలో ఫెంటానిల్ నిల్వలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేయటంతోపాటు భారీయెత్తున అరెస్టులు చేయించారు. 29 మంది డ్రగ్స్ ముఠా నాయకుల్ని అమెరికాకు అప్పగించారు. కెనడా అధ్యక్షుడు ట్రూడో ఫెంటానిల్ సరిహద్దులు దాటకుండా తనిఖీ వ్యవస్థను ముమ్మరం చేశారు. అయినా ట్రంప్ మనసు మారలేదు. ఆ రెండు దేశాలపై 25 శాతం అదనపు సుంకాలుంటాయని తన ప్రసంగంలో ప్రకటించారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో పార్టీ ఓటమి ఖాయమన్న అంచనాలుండటంతో దీన్ని తనకు అనుకూలంగా మలుచుకోవటానికి ట్రూడో సిద్ధపడ్డారు. అందుకే 'సై అంటే సై' అంటున్నారు. అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించ బోతున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే 2,100 కోట్ల డాలర్ల విలువైన సరుకుపై సుంకాలు వడ్డించారు. వివాదం సద్దుమణగకపోతే మరో 8,700 కోట్ల డాలర్ల సరుకుపై ఇది తప్పదని హెచ్చరించారు. షీన్‌బామ్ ఈమధ్యే అధికారంలోకొచ్చారు గనుక ఆమెకు కావలసినంత వ్యవధి వుంది. అందుకే ఎంతో సంయమనం పాటిస్తున్నారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్ని తలకిందులు చేసే ఈ మాదిరి బ్లాక్‌మెయిలింగ్ కొత్తగా ట్రంప్‌కు పుట్టిన బుద్ధికాదు. అమెరికాలో ఎవరున్నా ఇలాంటి బెదిరింపులతోనే ప్రపంచ దేశాలను దారికి తెచ్చుకున్నారు. 1986–89 మధ్య సుంకాలు, వాణిజ్యాలపై సాధారణ ఒడంబడిక (గాట్)కు సంబంధించిన ఉరుగ్వే రౌండ్ చర్చల్లోనైనా, ఆ తర్వాత ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)పై జరిగిన దోహా రౌండ్ చర్చల్లోనైనా అమెరికా వ్యూహం ఇదే. బ్రెజిల్ నుంచి వచ్చిన 4 కోట్ల డాలర్ల దిగుమతులపై వంద శాతం సుంకాలు విధించింది. మన నుంచి వెళ్లిన వస్త్ర దిగుమతులపైనా ఇలాంటి చర్యే తీసుకోబోతున్నట్టు హెచ్చరించింది. దాంతో మేధా సంపత్తి హక్కుల(ఐపీఆర్)పై అమెరికా తీసుకొచ్చిన అన్యాయమైన నిబంధనలకు తలొగ్గక తప్పలేదు. ఆఫ్రికా దేశాలనూ ఇలాగే దారికి తెచ్చుకుంది. అమెరికా అతి పెద్ద మార్కెట్ కావటం వల్ల అత్యధిక దేశాలు దానికెళ్లే ఎగుమతులపై ఆధారపడి వుంటాయి. మన దేశం నుంచి అమెరికాకు వెళ్లే ఎగుమతులు 18 శాతమైతే థాయ్‌లాండ్ నుంచి 17 శాతం, దక్షిణ కొరియానుంచి 16 శాతం ఎగుమతులుంటాయి. అమెరికాకు మెక్సికో ఎగుమతులు ఏకంగా 78 శాతం.

తమ సంపద పెంచుకోవటానికి సంపన్న రాజ్యాలు నిరంతరం ప్రయత్నిస్తుంటాయి. భారత్‌తో సహా అనేక దేశాలు సుదీర్ఘకాలం పరాయి పాలనలో మగ్గిపోవటానికి ఏకైక కారణం ఇదే. ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు లభ్యతకూ, తయారైన సరుకు అమ్ముకోవటానికీ సరిహద్దులు దాటి వెళ్తూ సమయానుకూలంగా విధానాలు మార్చుకోవడం సంపన్న రాజ్యాల నైజం. గతంలో తన మార్కెట్‌ను విస్తరించుకోవటానికి డబ్ల్యూటీవో తీసుకొచ్చిన అమెరికాయే ఇప్పుడు వేరే మార్గానికి మళ్లింది. అయితే ట్రంప్ చర్యల వల్ల అమెరికాలో ద్రవ్యోల్బణం అధికమవుతుంది. సగటు పౌరుల జీవన వ్యయం పెరిగి పోతుంది. వ్యాపారం దెబ్బతిని నిరుద్యోగం ప్రబలుతుంది. ఆర్థిక వ్యవస్థ మందగిస్తుంది. తరతమ స్థాయిల్లో అన్ని దేశాలూ ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొనక తప్పదు. 80 ఏళ్లుగా ప్రపంచ మార్కెట్లను శాసిస్తూ అతిగా సంపద పోగేసిన దేశమే 'నన్ను అందరూ దోచుకుతింటున్నార'ంటూ పెడబొబ్బలు పెట్టడం ఒక వైచిత్రి. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని బృందం అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం ఎదురుచూస్తోంది. ఇప్పుడు ఒక్కొక్క దేశం అమెరికాపై ప్రతీకార సుంకాలకు రెడీ అవుతోంది. మున్ముందు కొత్త మార్కెట్ల వెదుకులాట కూడా మొదలవుతుంది. ఇలాకాక దేశాలన్నీ సమష్టిగా వ్యవహరిస్తేనే ఏదో మేర ప్రయోజనం ఉంటుంది. అమెరికాపై ఒత్తిడి పెరిగి సహేతుకమైన పరిష్కారం వీలవుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
ఫాల్గుణ మాసం, **తిథి:** శు.అష్టమి ప.1.40 వరకు, తదుపరి నవమి,
నక్షత్రం: మృగశిర రా.3.30 వరకు, తదుపరి ఆరుద్ర,
వర్జ్యం: ఉ.9.55 నుండి 11.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.38 నుండి 9.25 వరకు, తదుపరి ప.12.33 నుండి 1.20 వరకు,
అమృత ఘడియలు: రా.7.04 నుండి 8.35 వరకు.

సూర్యోదయం : 6.19
సూర్యాస్తమయం: 6.03
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఇది మహిళా యుగం

నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతూ...

సందర్భం



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

'మహిళల శక్తి సామర్థ్యాలు సమాజానికి సంపూర్ణంగా ఉపయోగపడితేనే అభివృద్ధి సాధ్యం' అనే భావనను చాలామంది ప్రముఖులు వ్యక్తీకరిస్తుంటారు. ఈ అభిప్రాయం మంచి ఉద్దేశంతో చేసిందే కావచ్చు గానీ... మహిళల శక్తి సామర్థ్యాలు సంపూర్ణంగా సమాజానికి ఉపయోగపడటం లేదనే అర్థం స్ఫురిస్తుంది. అనాదిగా మహిళలు తమ సంపూర్ణ శక్తి సామర్థ్యాలను తమ కుటుంబానికి, తద్వారా సమాజానికి అందిస్తూనే ఉన్నారు. కాకపోతే, వారు చేసే సేవలను కొలిచే కొలమానం ఉండదు. వారి సేవలు అనేక రూపాల్లో కారు చౌకగా దోపిడీకి గురవుతున్నాయి. ఉదాహరణకు చట్టాలు ఉన్నప్పటికీ వ్యవసాయ రంగంలో పురుష కూలీకి లభించే వేతనం మహిళా కూలీకి దక్కదు.

మహిళల శక్తి సామర్థ్యాలను అన్ని రంగాలలో సమాన ప్రాతినిధ్యంలో ఉపయోగించుకోగలిగితేనే సమాజం మరింత అభివృద్ధి చెందగలుగుతుందన్నది ఓ కఠోర వాస్తవం. తదనుగుణమైన కార్యాచరణకు పూనుకోవాల్సింది ప్రభుత్వాలే. 2047 నాటికి 'వికసిత్ భారత్' కావాలని కలవరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం నెరవేరడం అన్ని రంగాలలో మహిళలను వినియోగించుకోవడం మీదనే ఆధారపడి ఉంది.

భారతదేశంలో, ఆ మాటకొస్తే ప్రపంచంలోని అనేక దేశాలలో శతాబ్దాలపాటు కొనసాగిన సాంఘిక దురాచారాలు, కట్టుబాట్లు మహిళల మనో వికాసాన్ని, ఆరోగ్యాన్ని, అభివృద్ధిని దెబ్బ తీశాయి. రాజ్యాంగంలోని 14, 15 అధికరణలు పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించినప్పటికీ ఆచరణలో ఆమడ దూరంలోనే ఉన్నాయి. సామాజిక, రాజకీయ కారణాల వల్ల కొన్ని చట్టాల్ని అమలు చేయలేక ప్రభుత్వాలు నిస్సహాయంగా ఉండి పోతున్నాయి.



రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అయితే, సానుకూల పరిస్థితులు క్రమేపీ నెలకొంటున్నాయి. ప్రపంచీకరణ మొదలై ప్రైవేటు రంగం ఆధిపత్యం, టెక్నాలజీ వినియోగం పెరిగిన నేపథ్యంలో పలు రంగాల్లో మహిళలు అగ్రభాగాన రాణిస్తున్నారు. ఉదాహరణకు చంద్రయాన్–3 ప్రాజెక్టులో వంద మందికిపైగా మహిళా శాస్త్రవేత్తలు పని చేశారు. 2018లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మహిళా శాస్త్రవేత్తల పథకం మంచి ఫలితాలు అందిస్తోంది. దాదాపు 2,000 మంది మహిళా శాస్త్రవేత్తలు చేసే పరిశోధనలకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందజేస్తోంది. శాస్త్ర సాంకేతిక రంగాలలో మహిళల భాగస్వామ్యం పెంచడానికి కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం (డీఎస్‌టీ) చేస్తున్న కృషి కారణంగా, 2000– 01లో జరిగిన పరిశోధనలలో 13 శాతంగా ఉన్న మహిళల వాటా, ప్రస్తుతం 30 శాతం దాటింది.

> బ్రిటన్‌కు చెందిన 'వరల్డ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ ఎకనమిక్స్ రీసెర్చ్'... మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గాలలో ఆర్థికాభివృద్ధి ఎక్కువగా ఉందనీ, అక్కడి ప్రజలు సైతం తమ ప్రజాప్రతినిధి పనితీరు పట్ల ఎక్కువ సంతృప్తికరంగా ఉన్నారనీ వెల్లడించింది.

దాంతోపాటు, మహిళల ఆరోగ్యం, భద్రతలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న నేరాలు ఏటా 8% మేర పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మహిళల భద్రత విషయంలో అత్యంత ప్రమాదకర దేశాల జాబితాలో భారతదేశం 5వ స్థానంలో నిలవడం సిగ్గుచేటు. మన దేశంలో పర్యటించే విదేశీ మహిళా టూరిస్టులకు ఆ యా దేశాలు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. ఇది దేశ పర్యాటక రంగం అభివృద్ధికి అవరోధం.

రాజకీయ భాగస్వామ్యం పెరగాలి!

మహిళల శక్తి సామర్థ్యాలు మిగతా రంగాలలో కంటే రాజకీయ రంగంలో అతి తక్కువ స్థాయిలో వినియోగం అవుతున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల తర్వాత ఢిల్లీకి ముఖ్యమంత్రిగా రేఖాగుప్తాను ఎంపిక చేసిన బీజేపీ... మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నట్టు ప్రకటించుకొంది. అందుకు వారిని అభినందించాల్సిందే! కానీ, ఇది ఒక పార్శ్వం మాత్రమే. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి ఎంపికైన మహిళలు కేవలం ఐదుగురే. లోక్‌సభలో సైతం మహిళల ప్రాతినిధ్యం గరిష్ఠంగా 15 శాతం మించడం లేదు. 17వ లోక్‌సభలో మహిళా సభ్యుల శాతం 14.4 శాతం కాగా, ప్రస్తుత 18వ లోక్‌సభలో అది 13.6 శాతానికి తగ్గడం గమనార్హం!

లోక్‌సభ, శాసనసభలలో 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు రిజర్వ్ చేయడానికి ఉద్దేశించిన బిల్లు 1996లో హెచ్.డి.దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ప్రవేశ పెట్టినపుడు ఈ రచయిత కేంద్రమంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో కలిసిరాని రాజకీయ పార్టీల వైఖరి కారణంగా ఈ బిల్లు పలు పర్యాయాలు వాయిదాలు పడుతూ ఎట్టకేలకు 27 సంవత్సరాల తర్వాత మోదీ చొరవతో 2023లో పార్లమెంట్ ఆమోదం పొంది చట్టంగా రూపొందింది. అయితే జనగణన, డీలిమిటేషన్ వంటి ప్రక్రియలను దాటాలి కనుక 2029 నుంచి మాత్రమే ఈ చట్టం అమలులోకి రాగలదు. కానీ చట్టం అమలయ్యే వరకు వేచి చూడకుండా, పార్టీల పరంగా 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు ఇవ్వొచ్చు కదా? అని ప్రశ్నించుకొంటే అందుకు జవాబు దొరకదు.

అనేక దేశాలలో మహిళలకు లభించిన హక్కులు, స్వేచ్ఛ, ఇతర సామాజికపరమైన భద్రతలన్నీ ఉద్యమాలు, పోరాటాల కారణంగానే లభించాయి. మహిళల భాగస్వామ్యం పెరిగితే దేశ రాజకీయాల స్వరూపం మారుతుంది. బ్రిటన్‌కు చెందిన 'వరల్డ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ ఎకనమిక్స్ రీసెర్చ్'... మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గాలలో ఆర్థికాభివృద్ధి ఎక్కువగా ఉందనీ, అక్కడి ప్రజలు సైతం తమ ప్రజాప్రతినిధి పనితీరు పట్ల ఎక్కువ సంతృప్తికరంగా ఉన్నారనీ వెల్లడించింది. 'ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం' అంటూ మాటల్లో మాత్రమే మహిళలను అందలం ఎక్కించడం కాకుండా, రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో వారికి సముచిత ప్రాతినిధ్యం అందించాలి. అప్పుడే సమాజం అభివృద్ధి పథంలో వడిగా ముందుకు సాగుతుంది.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి

పితృస్వామ్యాన్ని అధిగమిస్తూ...

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

అనాదిగా స్త్రీ ఒక ప్రకృతి శక్తిగా, ఉత్పత్తి పరికరాల సృష్టికర్తగా, చరిత్ర నిర్దేశకురాలుగా ఉంది. పితృస్వామ్య ఆధిపత్యం వచ్చేవరకూ ఆమెది విజయ గమనమే. మానవజాతి శైశవ దశలో తన సంతానాన్ని కాపాడుకోవటానికి కాయలు, దుంపలు, పళ్ల లాంటి ఆహార సేకరణలో తల్లే ప్రధాన పాత్ర వహించింది. ఇప్పటికీ ఆహార సేకరణ దశలో ఉన్న జాతుల్లో మాతృస్వామ్యం అమలులో ఉంది. నిప్పు ఉపయోగాన్ని తెలుసుకున్న కాలంలో, జలచరాలైన చేపలు, పీతలు, నత్తలు తినే కాలంలో, నదీ తీర నాగరికతలను రూపొందించే కాలంలో స్త్రీ శ్రమయే కీలకం. వేటాడి తెచ్చిన మాంసాన్ని వండవలసిన అవసరాన్ని కూడా స్త్రీయే ముందుగా గమనించి ఉంటుంది. శరీరాన్ని కప్పుకోవాలనే ఆలోచన, కట్టుకోవటానికి చెట్టు బెరడును ఉపయోగించాలనే ఆలోచన స్త్రీకే వచ్చి ఉంటుంది. కుండను చేయడం ద్వారా నీటిని, ధాన్యాన్ని నిలవచేయడం, నేలలో విత్తునాటడం ద్వారా ఆహార సృష్టి... ఇలా నూత్న జీవన వ్యవస్థలను ఆమె సృష్టిస్తూ వెళ్ళింది.

సింధు నాగరికతలో స్నాన వాటికలు ప్రసిద్ధంగా విలసిల్లాయి. వీటి ప్రభావం తరువాత ఆర్యుల సంస్కృతి మీదా కనిపిస్తుంది. ఆ తరువాత దేవాలయాలకు అనుబంధంగా ఉమ్మడి స్నాన ఘట్టాలు రూపొందాయి. వీటి వద్ద అప్సరసలు లేదా జల దేవతలు ఉంటారని ఆనాడు నమ్మేవారు. ఈ స్నాన ఘట్టాల నిర్మాణంలో స్త్రీ ప్రాధాన్యత, స్త్రీ ఉమ్మడి తత్వానికి సంబంధించిన సంస్కృతి దృగ్గోచరమవుతుంది. మాతృభావన వీరి మత పరిణామ క్రమంలో ఆనాటికే రూపుదిద్దుకొని వున్నదని చెప్పటానికి మొహంజెదారో, హరప్పాలలో దొరికిన ఫలకాలు బలమైన ఋజువు అని పురావస్తు శాస్త్రజ్ఞుడు సర్ జాన్ మార్షల్ పేర్కొన్నారు. ప్రాచీన భారతీయులు స్త్రీ మూర్తిని (ప్రకృతి మాతగా) ఆరాధించినట్టు సింధూ లోయలో దొరికిన విగ్రహాలను బట్టి తెలుస్తుంది. ఇటువంటి ప్రతిమలే మెసపటోమియా, పశ్చిమాసియా, ఆసియా మైనర్‌లోనూ లభించాయి. స్త్రీమూర్తి ఆరాధన సింధూ లోయ నుంచి నైలునది వరకు వ్యాపించి వున్నట్లు భావించవచ్చు.

కానీ ఆ తరువాత అనేక పరిణామాలు భారతదేశంలో చోటు చేసుకుంటూ వచ్చాయి. ముఖ్యంగా మనుస్మృతి భావజాలం వల్ల స్త్రీ అణచివేత బహుముఖంగా ప్రారంభమైంది. ధర్మ సూత్రాలు స్త్రీ వ్యక్తిత్వానికి సంకెళ్ళు వేశాయి. స్త్రీ విద్య నిరోధానికి గురైంది. మనుస్మృతి క్రీ.పూ. రెండవ శతాబ్దిలో రాయబడి ఉంటుందని అంబేడ్కర్ అన్నారు. బౌద్ధయుగం అంతరించి హిందూ రాజ్యాలు ఆవిర్భవించే క్రమంలో పుష్యమిత్ర దీన్ని బ్రాహ్మణ రాజ్య నిర్మాణానికి సాధనంగా వాడుకున్నారు. వర్ణవ్యవస్థ పునరుద్ధరణ, స్త్రీ అణచివేత ఇందులో ప్రధానమైన అంశాలుగా ముందుకు వచ్చాయి.

> మానవజాతి శైశవ దశలో తల్లే ప్రధాన పాత్ర వహించింది. ఇప్పటికీ ఆహార సేకరణ దశలో ఉన్న జాతుల్లో మాతృస్వామ్యం అమలులో ఉంది. కుండను చేయడం ద్వారా నీటిని నిలవచేసి, నేలలో విత్తు నాటడం ద్వారా ఆహార సృష్టి చేసి నూత్న జీవన వ్యవస్థలను ఆమె సృష్టిస్తూ వెళ్ళింది.

కొనసాగాల్సిన పోరాటం

వీటన్నింటిని ఎదుర్కొంటూ స్త్రీ యుగయుగాల ప్రస్థానం కొనసాగిస్తూ వచ్చింది. అనేక అవాంతరాలను అధిగమించి జీవన గమనంలో కొత్త పుంతలు తొక్కింది. ఆమెను అణగదొక్కడం పురుషుని వల్ల కాదు అని తెలుసుకోవడానికి చాలాకాలం పట్టింది. ఎందుకంటే ఆమె విద్యుల్లత. ఆమె ప్రకాశానికి తట్టుకోలేక పురుషుడు ఆమెకు సంకెళ్ళు బిగించాడు. ఆమె ఆ సంకెళ్ళను పటాపంచలు చేసి ముందుకు వెళుతోంది. స్త్రీకి శరీర సౌందర్యమే కాదు, మనో సౌందర్యమూ ఉంది. ఆమె మనస్సు వెన్నకంటే మెత్తనిది. ఆమె హృదయవాది. ఆమె హృదయము లోతైనది. సూర్యగోళాలను, చంద్ర గోళాలను మనము పరిశీలించవచ్చు కాని స్త్రీ అంతరంగాన్ని అందుకోగలిగిన శక్తి ఇంకా పురుషుడికి రాలేదు. ఆ విషయంలో పురుషుడు అబలుడు. ఆమె అమ్మే కాదు, గొప్ప నాయకురాలు. భారత రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము త్రివిధ దళాల సైనిక వందనాన్ని స్వీకరించారు. భారతదేశ కళాత్మక దృష్టి ఎంత గొప్పదో ద్రౌపదీ ముర్ము ఒక గిరిజన స్త్రీగా అత్యున్నత సింహాసనాన్ని అధిష్ఠించి నిరూపించారు.

'ఆడపిల్ల గడప దాటకూడదు' అనే భావాలు పాతవైనాయి. ఆడపిల్లలు దేశాంతరాలకు వెళ్ళి చదువుకొంటున్నారు. పిల్లల్ని పెంచే విధానంలో చాలా మార్పులు వచ్చాయి. ఈనాడు స్త్రీలలో వస్తున్న గుణాత్మకమైన మార్పు 'నేను సంపాదిస్తూ బతకా'లనే అంశం. కేవలం గృహిణిగా ఇంట్లోనేఏ ఉండటానికి స్త్రీ ఈనాడు ఇష్టపడటం లేదు. ఈ మార్పులన్నీ రావడానికి ఎన్నో ఉద్యమాలు జరిగాయి. మహారాష్ట్రలో సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ ఉద్యమాలు; బ్రహ్మసమాజం, ఆర్య సమాజాలు చేసిన పోరాటాలు, తమిళనాడులో పెరియార్ రామస్వామి నాయకర్ చేసిన పోరాటం, కేరళలో నారా యణ గురు చేసిన విద్యా పోరాటం... ఇవన్నీ స్త్రీల అభ్యున్నతికి మార్గం వేశాయి.

అయినప్పటికీ స్త్రీలు పితృస్వామ్య ఆధిపత్యానికి ఎదురీదుతూనే ఉన్నారు. వారిని వస్తు వ్యామోహితులుగా మార్చాలనీ, సోషల్ మీడియాకు ఎడిక్ట్ చేయాలనీ ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి. గృహహింస పెరుగుతోంది. బాల్య వివాహాలు ఆగడం లేదు. కొడుకుతో సమానంగా కూతురికి ఆస్తి ఇవ్వడం ఆచరణలో అమలు కావడం లేదు. రాజకీయాల్లో స్త్రీలను అవమానించే ధోరణులు పెరుగుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో పాలకవర్గాలు, పితృస్వామ్య ఆధిపత్యాలను కొనసాగిస్తున్నాయి. వీటన్నింటిని స్త్రీలు ఎదుర్కొనే క్రమంలో ఇంకా పోరాటాన్ని చేయాల్సి ఉంది. ఇది మహిళా సాధికారతా యుగం. ఈ యుగ స్ఫూర్తిలో భాగంగా మనమూ నడుద్దాం. తల్లిని, చెల్లిని, సహచరిణిని, తోటి స్త్రీని గౌరవిద్దాం. వారి చైతన్యానికి తోడు నిలబడదాం. అదే నిజమైన రాజ్యాంగ స్ఫూర్తి.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

ఇన్ బాక్స్

విప్లవ ప్రేమికురాలు

ఉమ్మడి గుంటూరు జిల్లా క్రైస్తవ మతానికీ, కమ్యూనిస్టు ఉద్యమానికీ పేరు. దళితులు ఈ రెండింటిలో రాష్ట్రంలో ఎక్కడా లేనంత పెద్ద సంఖ్యలో చేరడం చరిత్ర. ఒకనాటి తెనాలి తాలూకా, ఇప్పటి కొల్లిపర మండలంలోని దావులూరు ఒక పచ్చటి పల్లెటూరు. కమ్యూనిస్టు ఉద్యమం, క్రైస్తవ మిషనరీలు ఇచ్చిన తోడ్పాటుతో ఆ ఊరిలో ఆడ పిల్లలు, మగ పిల్లలు బాగా చదువులపై శ్రద్ధ పెట్టేవారు. 'పాలేరు', 'భూమికోసం' వంటి నాటికలు, బుర్రకథలు వారిలో ఉత్సాహాన్ని ప్రోదిచేసేవి. వేము సువార్తమ్మ, నాలాది దయమ్మ, గుమ్మడి సత్యవేదం వంటి వారు మోటూరి ఉదయం వంటి నాయకురాళ్ళ దగ్గర బుర్రకథ నేర్చుకున్నారు. తర్వాత బుర్రకథ పితామహుడిగా పేరు గాంచిన షేక్ నాజర్‌తో కలిసి పనిచేశారు.



వేము సువార్తమ్మ

దావులూరు కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో వేము కుటుంబానికి ఓ ప్రత్యేకత ఉంది. ఈ కుటుంబంలో సుమారు మూడు తరాలవారు ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసి తమ ఆస్తిపాస్తులను ఉద్యమం కోసం త్యాగం చేశారు. 1934లో పుట్టిన సువార్తమ్మ కమ్యూనిస్టు పార్టీ నాయకులైన అంబటి రాజారావు, దీనమ్మల కుమార్తె. వేము రామసుబ్బయ్యకు మేనత్త కూతురు. వారిది ఆ రోజుల్లోనే కమ్యూనిస్టు పార్టీ పద్ధతి ప్రకారం జరిగిన దండల పెళ్లి. ఆమె పదో తరగతి వరకు చదివింది. తర్వాత హిందీ 'భాషా ప్రవీణ' పూర్తి చేసింది. సువార్తమ్మ, రామసుబ్బయ్య అనేక నిర్బంధాలను ఎదుర్కొని రాజమండ్రి, కడలూరు, సేలంలలో జైలు శిక్ష అనుభవించారు. వారికి ఏడుగురు పిల్లలు. వారిలో ఇద్దరు చిన్న వయసులోనే పోషణ కరవై చనిపోగా ముగ్గురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు మిగిలారు. దళిత ఉద్యమంలో పాల్గొంటూ చిన్న కొడుకు శాంతి చనిపోయాడు. భర్త పార్టీ కోసం పొలం ఇవ్వడం, ఉద్యోగం చెయ్యకుండా, ఇల్లు పట్టకుండా, పిల్లల్ని పట్టించుకోకుండా పార్టీ పనులపై తిరుగుతున్నా ఆమెకు ఎప్పుడూ కోపం రాలేదు. ఆయన నిబద్ధతను గౌరవించింది. ఉద్యమం విజయవంతమైతే పేదలు, పీడితుల జీవితాలలో వెలుగు వస్తుందని నమ్మిన గొప్ప ప్రజాస్వామికవాది. సువార్తమ్మ దృష్టిలో విప్లవం, ప్రేమ వేరు కాదు. ఈ నెల ఒకటవ తేదీన మృతి చెందిన వేము సువార్తమ్మ గారికి జోహార్లు!

– ప్రొ॥ చల్లపల్లి స్వరూపరాణి; ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు

ఆకాశంలో సగమైనా... వివక్షేనా?

కశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా... అత్యాచారాలకు గురైన శవాలు. మనువాదం, ఫాసిజం, పితృస్వామ్యం దేశంలో నలుదిశలా ఊరేగుతున్నాయి.'

'ముళ్ళపొదల్లో ఓ ఆడ శిశువు... చెత్త కుండీలో మరో ఆడ శిశువు... ఇద్దరూ అప్పుడే భూమి మీద పడిన పసికూనలు.' ఇలాంటి వార్తలు నిత్యం వస్తుంటాయి. ఎన్నో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు వస్తున్నాయి, పోతున్నాయి. కానీ మహిళల సామాజిక స్థితిగతుల్లో మార్పు రావటం లేదు. ఈ పరిస్థితుల్లో ఈ ఆజాదీ ఎవరిది అన్న ప్రశ్న వస్తుంది. రోజురోజుకూ స్త్రీలపై హింస, వివక్ష రకరకాల రూపంలో పెరిగిపోతూ ఉంది.



ఇలా ఎందుకు జరుగుతోంది? ముందు తరాల వారికి హింస లేని సమాజాన్ని అందించ లేమా? ఆకాశంలో సగమైన స్త్రీలు శ్రమ, ఉత్పత్తిలో సగానికి తక్కువ ఏమీ కాదు. కానీ తాను పూర్తిగా పరాధీనగా జీవిస్తోంది భారత స్త్రీ.

స్త్రీలు ఎప్పుడూ మగవాడి కనుసన్నుల్లో జీవించాలి. చిన్నప్పుడు తండ్రి, పెళ్లి తర్వాత భర్త, ముసలితనంలో కొడుకుల అధీనంలో జీవించాలి. ఇలా స్త్రీలను బందీని చేయటం ఈ సమాజం మొదటి నేరం. ఇక 'కార్యేషు దాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాత, శయనేషు రంభ' అంటూ స్త్రీలను పురుషునికి సొంత ఆస్తిగా మలి చారు. ఇలా భూస్వామ్య, పితృ స్వామిక సంస్కృతిని వ్యవస్థీకృతం చేశారు. ఈ పరిస్థితి మారాలి.

రాజ్యాంగంలోని 14, 15, 16 తదితర అధికరణాలు లింగ వివక్షకు వ్యతిరేకంగా రూపొందించబడ్డాయి. అలాగే అనేక చట్టాలు చేయబడ్డాయి. కానీ అమలుకు నోచుకోని కారణంగా స్త్రీలపై కుటుంబ, లైంగిక హింస రోజు రోజుకు పెరిగిపోతూ ఉంది. స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, స్వావలంబన లేకపోవడం (ఆర్థిక పరాధీనత) అసమానత, వివక్షలకు మూలం. దీనికి కారణం భూస్వామిక పితృస్వామ్యమే. ఇక పెట్టుబడిదారీ సంస్కృతి మహిళల శరీరాన్ని వ్యాపార వస్తువుగా మార్చివేసింది. 1961లో వరకట్న నిషేధ చట్టం చేసినప్పటికీ, వరకట్నం గౌరవంగా అమలు చేయబడుతోంది. ఆడ శిశువులను గర్భంలోనే చంపుతున్నారు. ఫలితంగా దేశంలో స్త్రీల జనాభా తగ్గిపోతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే తరం మూల్యం చెల్లించక తప్పదు.

1991 నుంచి దేశంలో ప్రపంచీకరణ దశ మొదలై పాశ్చాత్య విష సంస్కృతి పెచ్చరిల్లి స్త్రీ శరీరం సరుకుగా, అంగడి బొమ్మగా, విలాస వస్తువుగా మార్చబడింది. ఫలితంగా స్త్రీలపై లైంగిక హింస పెరిగిపోయింది. ఈ విష సంస్కృతి కారణంగా మన దేశంలో ప్రతి గంటకు ఐదుగురిపై అత్యాచారాలు జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.

మహిళల సమస్యలు చర్చించుకొని, పరిష్కరించుకోవడానికి చట్టసభలలో కనీసం స్త్రీలకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఏనాడూ పార్లమెంట్లో మహిళా ప్రతినిధులు 15 శాతానికి మించి లేరు. సామాజిక పరిణామంలో మొదట స్త్రీలకు మంచి గౌరవం ఉండేది. మాతృస్వామ్య వ్యవస్థే ఇందుకు ఉదాహరణ. ఆ తర్వాత వ్యక్తిగత ఆస్తి, వర్గ సమాజం ఏర్పడ్డాక స్త్రీలకు ఆస్తి హక్కు లేకుండా పోయింది. దీంతో స్త్రీలకు విలువ పోయి, వంటింటి కుందేలు అయిపోయింది. స్త్రీల దోపిడీకి, వివక్షకు మూలం పెట్టుబడిదారీ మార్కెట్ ఉత్పత్తి విధానం. తీవ్ర ఆర్థిక అసమానతలతో కూడిన ఈ విధానం నశించాలి. సోషలిజం రావాలి. ఇదే స్త్రీల విముక్తికీ, అన్ని సామాజిక సమస్యల పరిష్కారానికీ మార్గం.

– ఎల్. గజేంద్రమ్మ, ఉపాధ్యాయురాలు । 97054 93054

హోమ్ మేకర్‌కు వేతనమేదీ?

ప్రపంచంలో కోట్లాది మంది గృహిణులకు వేతనం ఎందుకు ఉండకూడదు అనే విషయం ప్రస్తుతం చర్చనీయాంశం అయింది. చైనాలోని బీజింగ్‌లో ఒక విడాకుల కేసులో కోర్టు గత ఏడాది ఇచ్చిన తీర్పు ఈ చర్చకు దారితీసింది. అయితే ఇంటిపనులు, పిల్లల పెంపకం – సంరక్షణ లాంటివి చూసే గృహిణులకు జీతాలు ఎవరు ఇవ్వాలి అనేదే సమస్య! పురుషుల కన్నా 3 నుంచి 4 గంటలు ఎక్కువ పనిచేస్తారు గృహిణులు. వంట చేయడం, ఇంటిని, వంట సామగ్రిని శుభ్రం చేయడం, పిల్లలు, భర్త, ఇతర కుటుంబ సభ్యుల బట్టలు ఉతకడం వంటి పనులే కాక... తల్లి, భార్య, సోదరి పాత్రల్లో ఎన్నో బాధ్యతలు నిర్వహిస్తుంది. అందుకే ఆమెకు జీతం ఇవ్వాలనే డిమాండ్ ఊపందుకుంటోంది.



తమిళనాడులో గృహిణికి వేతనం అంశం సినీనటుడు కమల హాసన్ తన పార్టీ మేనిఫెస్టోలో పెట్టారు. ఇది కూడా గత ఏడాది పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. బీజింగ్ కోర్టు తన తీర్పులో 5 సంవత్సరాలు భర్తతో ఉండి ఇంటి పనులు చూసుకున్నది కాబట్టి, తన కెరీర్‌ను కోల్పోయింది కాబట్టి, రూ. 5 లక్షల పైచిలుకు పరిహారం జీతం కింద ఇవ్వాలని పేర్కొంది. ఈ తీర్పును ప్రపంచం మొత్తంలో 60 కోట్లకు పైగా జనం సోషల్ మీడియాలో చూశారు. గ్రామీణ మహిళ ప్రతి రోజు 14 గంటలు పనిలో ఉంటుంది. గ్రామీణ పురుషులతో పోలిస్తే 2.5 గంటలు ఇది ఎక్కువ అని పరిశోధకులు అంటున్నారు. ఉద్యోగం చేసే పురుషుల కన్నా మహిళల పని నాలుగింతలు ఎక్కువ. ఇంత చేస్తున్నా గుర్తింపు, ఆదాయం లేకపోగా వేధింపులు, అత్యాచారాలు, హత్యాచారాలు. క్రిమినల్ జస్టిస్ వైఫల్యం వల్ల దేశంలో ఆడబిడ్డలపై గృహహింస పెరుగుతోంది. హోమ్ మేకర్లకు జీతం వస్తే... పురుషుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చే అవకాశం ఉంటుంది. గృహిణికి కుటుంబంపై ఆధారపడకుండా ఆర్థిక స్వేచ్ఛ లభిస్తుంది. రక్షణకు... ఒక గ్యారంటీ, నమ్మకం ఏర్పడుతుంది. కుటుంబంలో గౌరవం దక్కుతుంది.

– ఎమ్.డి. మునీర్, సీనియర్ జర్నలిస్ట్

అప్పుల బాధతో రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

- భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం


పోశెట్టి

నేరడిగొండ: పత్తి, సోయా పంటల్లో ఆశించిన దిగుబడి రాక.. అప్పులు తీర్చే దారి లేక.. రైతు దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. ఘటనలో భర్త మృతిచెందగా.. భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం వడూర్ గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఇదావు పోశెట్టి, భార్య ఇందిర వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఉన్న 4 ఎకరాలతోపాటు మరో 14 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, సోయా పంటలు సాగు చేయగా.. ఆశించిన దిగుబడి రాలేదు. రూ.20 లక్షల వరకు అప్పులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పులు తీర్చే మార్గంలేక బుధవారం పురుగుల మందు తాగారు. బంధువులు ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. పోశెట్టి(60) చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి చనిపోయాడు. ఇందిర పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

ప్రాణాలు తీసిన ఇసుర్రాయి వివాదం


యశోద

గోదావరిఖని (రామగుండం): ఇసుర్రాయి వివాదం ప్రాణాలు తీసింది. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ భూమేశ్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని రమేశ్‌నగర్‌కు చెందిన పల్లెర్ల యశోద (65) అదే కాలనీకి చెందిన మాశెట్టి కళావతి ఇంట్లో శుభకార్యం కోసం ఇసుర్రాయి ఇచ్చింది. తీసుకుని ఐదునెలలు గడిచినా తిరిగి ఇవ్వకపోవడంతో గురువారం ఉదయం వెళ్లి తమ ఇసుర్రాయి ఇవ్వాలని కోరింది. ఈ క్రమంలో రెండు కుటుంబాల మధ్య మాటామాట పెరిగి యశోదను మాశెట్టి కళావతి, ఆమె కోడలు రమ్యశ్రీ కలిసి నానా బూతులు తిట్టి నెట్టివేశారు. కిందపడిపోయిన యశోద ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లింది. తనను అందరి ముందు తిట్టడంతో పాటు నెట్టివే యడం అవమానంగా భావించింది. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోలింగ్ డ్యూటీలో మహిళా పోలీసులు

నిర్మల్ పోలీసులకు తొలిసారి కొత్త విధులు	మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ జానకీషర్మిల వినూత్న ఆలోచన	ఎస్పీని ప్రశంసించిన డీజీపీ

నిర్మల్: కాసింత అవకాశం, కాస్త ప్రోత్సాహం ఇవ్వాలే కానీ.. ఏదైనా చేసేయగలం అని నిరూపించారు నిర్మల్ జిల్లా మహిళా పోలీసులు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీషర్మిల ఓ వినూత్న ఆలోచన చేశారు. జిల్లాలో మహిళా కానిస్టేబుళ్లకు తొలిసారి కొత్త బాధ్యతలు అప్పగించారు. ఇక నుంచి వారానికో సారి పెట్రోలింగ్, గస్తీ, డయల్ 100.. తదితర విధుల్లో వారు ప్రత్యక్షంగా పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా గురువారం జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో మహిళా కానిస్టేబుళ్లకు పెట్రోలింగ్ బాధ్యతలను అప్పగించారు. ఈ బాధ్యతలను వారు విజయవంతంగా పూర్తి చేశారు. భైంసా రూరల్ మండలంలో స్వప్న, రజిత అనే మహిళా కానిస్టేబుళ్లు.. కొందరు పేకాటరాయుళ్లను పట్టుకుని, రూ.3,500 స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు కానిస్టేబుళ్లు రోజువారీ తనిఖీలు, రోడ్డుభద్రత విధుల్లో పాల్గొన్నారు. ఇలాంటి విధుల్లో భాగం కావడంపై వారంతా హర్షం వ్యక్తంచేశారు.

అభినందించిన డీజీపీ..

మహిళా దినోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లా పోలీసులు మహిళల్లో నూతనోత్తేజాన్ని నింపారంటూ డీజీపీ జితేందర్ అభినందించారు. వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారంటూ ఎస్పీ జానకీషర్మిలను ప్రశంసించారు. ఈమేరకు డీజీపీ ఎక్స్ ఖాతాలో నిర్మల్ మహిళా కానిస్టేబుళ్ల విధుల్లో ఉన్న ఫొటోలను షేర్ చేశారు.


పెట్రోలింగ్ డ్యూటీకి వెళ్తున్న మహిళా కానిస్టేబుళ్లు


భైంసా మండలంలో పేకాటరాయుళ్లను పట్టుకున్న మహిళా కానిస్టేబుళ్లు

ఆపరేషన్ 'కడావర్ డాగ్స్'

కార్మికుల జాడ పసిగట్టేందుకు ఎస్‌ఎల్‌బీసీ సొరంగం వద్దకు తెప్పించిన అధికారులు

- నేటి ఉదయం నుంచి సొరంగంలోని ప్రమాదస్థలంలో డాగ్స్‌తో అన్వేషణ

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది కార్మికుల జాడ రెండు వారాలైనా లభించకపోవడంతో రెస్క్యూ ఆపరేషన్‌లో సాయం చేసేందుకు కేరళ పోలీసు శాఖకు చెందిన కడావర్ డాగ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దించింది. కేరళలోని త్రిసూర్ నుంచి రెండు కడావర్ జాగిలాలతోపాటు వాటి శిక్షకులను గురువారం సాయంత్రానికి దోమలపెంటకు రప్పించింది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఎంఏ), కేంద్ర హోంశాఖ కార్యదర్శి కల్నల్ కీర్తిప్రకాశ్ సింగ్ ఆధ్వర్యంలో రెండు సైనిక హెలికాప్టర్లలో ఆ శునకాలు, శిక్షకులు వచ్చారు. ముందుగా ప్రమాదస్థలం వద్ద పరిస్థితులను పరిశీలించేందుకు కల్నల్ కీర్తి ప్రకాశ్‌సింగ్‌తోపాటు కేరళ పోలీసు అధికారి ప్రభాత్ నేతృత్వంలో కడావర్ డాగ్స్ రెస్క్యూ బృందం సొరంగంలోకి వెళ్లింది. శుక్రవారం ఉదయం 7 గంటలకు రెండు కడావర్ డాగ్స్‌తో కలసి సొరంగంలోని ప్రమాదస్థలం వద్ద కార్మికుల జాడ కోసం సహాయ బృందం గాలించనుంది. గతేడాది కేరళలోని మున్నార్ సమీపంలో పెట్టిముడి వద్ద కొండచరియలు విరిగి మట్టిలో కూరుకుపోయిన నలుగురిని కడావర్ డాగ్స్ గుర్తించగలిగాయి. మట్టిలో 10–15 అడుగుల లోతులో కూరుకుపోయిన మానవ అవశేషాలను ఈ శునకాలు పసిగడతాయి.

కొనసాగుతున్న టీబీఎం భాగాల తొలగింపు..

సొరంగం లోపల 13.650 కి.మీ. పాయింట్ వద్ద టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) భాగాలు చెల్లాచెదురై టన్నెల్ మార్గానికి అడ్డుగా ఉండటం తెలిసిందే. దీంతో ఆయా భాగాలను ప్లాస్మా, గ్యాస్ కట్టర్లతో కట్ చేసి లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నారు. ప్రమాద స్థలం నుంచి సుమారు 150 మీటర్ల వరకు టీబీఎం భాగాలు ఉండగా వాటి మధ్యలోనే కార్మికులు చిక్కుకొని ఉండొచ్చని భావిస్తున్నారు. అక్కడి టీబీఎం భాగాలను కట్ చేస్తూ, మట్టిని తొలగిస్తూ కార్మికుల కోసం అన్వేషిస్తున్నారు. కన్వేయర్ బెల్టును ప్రమాదస్థలం వరకు కొనసాగించేందుకు పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే సింగరేణి రెస్క్యూ టీం ఆధ్వర్యంలో ఫౌండేషన్, జాయింట్ మెషీన్, కమిషన్ పనులు పూర్తవగా ఎలక్ట్రికల్ పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయానికి కన్వేయర్ బెల్టు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తుందని చెబుతున్నారు.

నేడు రంగంలోకి టన్నెల్ ప్రత్యేక నిపుణులు..

సొరంగంలో ప్రమాద స్థలంలో చిక్కుకున్న కార్మికుల వెలికితీత కోసం కొనసాగుతున్న సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ఐఐటీ చెన్నైకి చెందిన టన్నెల్ నిపుణులు శుక్రవారం దోమలపెంటకు రానున్నారు. ఇప్పటికే ఎన్వీ రోబోటిక్స్‌కు చెందిన నిపుణులు ప్రమాదస్థలానికి పరిశీలించారు. ప్రత్యేక పరికరాలు లేదా ఏఐ రోబోల ద్వారా కార్మికుల వెలికితీత సాధ్యమవుతుందన్న అంశాన్ని పరిశీలిస్తున్నారు. మరోవైపు ఎన్జీఆర్ఐ, నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీకి చెందిన నిపుణులు అమ్రాబాద్ రేంజ్ పరిధిలోని సొరంగం పైభాగంలో భూమి పరిస్థితులపై సర్వే పనులను కొనసాగిస్తున్నారు.


కడావర్ డాగ్‌ను తీసుకువస్తున్న కేరళ పోలీసు

13 రోజులుగా శిథిలాల కిందే..

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం కుంగిన ప్రమాదంలో 8 మంది కార్మికులు, ఇంజనీర్లు గత 13 రోజులుగా శిథిలాల కిందే చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో 12 ఏజెన్సీలు, సంస్థలు సహాయక బృందాలు అవిశ్రాంతంగా శ్రమిస్తూనే ఉన్నాయి. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతం కావడంతో ఎలాంటి ఆడిట్, ఎస్కేప్ టన్నెళ్లు లేకుండానే 14 కి.మీ. వరకు ఏకధాటిగా టీబీఎం ద్వారా సొరంగం తవ్వకాలు చేపట్టడం వల్ల ప్రమాదస్థలంలో రెస్క్యూ బృందాలకు క్లిష్ట పరిస్థితులు ఎదురవుతున్నాయి. టన్నులకొద్దీ పేరుకుపోయిన మట్టి, శిథిలాలను బయటకు తరలించేందుకు రోజుల సమయం పడుతోంది. దీంతో ఈ తరహా సహాయక చర్యల్లో పాలుపంచుకున్న అనుభవమున్న అంతర్జాతీయ సంస్థలను సంప్రదించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు తమ వారి ఆచూకీ నేటికీ లభించకపోవడంతో బాధిత కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంది. వారి పరిస్థితి ఎలా ఉందోనంటూ ఆందోళన చెందుతున్నారు. సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులను ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నారు.

బీసీలకు 42% కోటా

▶ మొదటి పేజీ తరువాయి

ప్రవేశపెట్టిన బిల్లును వెనక్కి తీసుకోవాలని నిర్ణయించినట్టు పొన్నం ప్రభాకర్ వివరించారు.

ఇక 3 సెక్టార్లుగా రాష్ట్రం!

'రాష్ట్రాన్ని మూడు సెక్టార్లుగా విభజించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ ఏరియాగా, అక్కడి నుంచి ట్రిపుల్ ఆర్ రోడ్డుకు ఆవల 2 కి.మీల బఫర్ జోన్ వరకు ఫ్యూచర్ సిటీగా, మిగిలిన ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా విభజించాలని నిర్ణయించాం. రూరల్ తెలంగాణ పరిధిలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు రావు. 7 మండలాల్లోని 56 గ్రామాలతో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ ఏరియా (ఎఫ్‌సీడీఏ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. నాగార్జునసాగర్, శ్రీశైలం హైవేల మధ్య ఉన్న 30 కి.మీల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నాం. హెచ్‌ఎండీఏ పరిధిలోని 36 గ్రామాలను ఎఫ్‌సీడీఏకి బదిలీ చేశాం. ఫ్యూచర్ సిటీ కోసం 90 పోస్టులను ఆమోదించాం.

హెచ్‌ఎండీఏ పరిధి విస్తరణ

హెచ్‌ఎండీఏ పరిధిని రీజినల్ రింగ్ రోడ్డుకు 2 కి.మీల బఫర్ జోన్ వరకు పొడిగించాం. 11 జిల్లాల్లోని 104 మండలాలు, 1,355 గ్రామాలకు హెచ్‌ఎండీఏ పరిధి విస్తరించింది. కొత్తగా 332 రెవెన్యూ గ్రామాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తాయి..' అని పొంగులేటి తెలిపారు.

సెర్ప్, మెప్మా విలీనం

'కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి మిషన్ కింద రూపొందించిన పాలసీ–2025ని కేబినెట్ ఆమోదించింది. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు మహిళల ఆర్థికాభివృద్ధికి అందించిన సహకారాన్ని మళ్లీ కొత్త పాలసీతో పునరుద్ధరిస్తాం. మహిళా స్వయం సహాయక సంఘాలు ఒకే గొడుగు కింద ఉండాలనే ఉద్దేశంతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లను ఒకే సంస్థగా విలీనం చేయాలని నిర్ణయించాం. ఇందిరా మహిళా శక్తి సంఘాల మహిళల రిటైర్మెంట్ వయస్సును 60 నుంచి 65 ఏళ్లకు పొడిగించడంతో పాటు సభ్యులుగా చేరేందుకు కనీస వయస్సును 18 నుంచి 15 ఏళ్లకు కుదించాం..' అని మంత్రి చెప్పారు.

27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

'తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు తరహాలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బోర్డు ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇందుకోసం తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రెలిజియస్ ఇనిస్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ యాక్ట్ 1987ను సవరించాలని నిర్ణయించాం. తెలంగాణ పర్యాటక పాలసీ–2025ని మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్ర వ్యాప్తంగా 27 ప్రత్యేక పర్యాటక కేంద్రాల అభివృద్ధికి నిర్ణయం తీసుకున్నాం. పర్యాటక విధానంతో వచ్చే 5 ఏళ్లలో రూ.15వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా నిర్ణయాలు తీసుకున్నాం..' అని పొంగులేటి తెలిపారు.

మేలో హైదరాబాద్‌లో మిస్‌వరల్డ్ పోటీలు

'మేలో జరగనున్న మిస్ వరల్డ్– 2025 పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. 140 దేశాల నుంచి హాజరుకానున్న అతిథులకు ఎక్కడా లోటు జరక్కుండా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించాం..' అని చెప్పారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి 5.15 ఎకరాలు

రాష్ట్రంలో 10,954 రెవెన్యూ గ్రామాలకు గ్రామ పాలన అధికారుల(జీపీఓ)ను నియమించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వం వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేయడంతో పాటు వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను ఇతర ప్రభుత్వ శాఖల్లో విలీనం చేసింది. తాజాగా మళ్లీ వారిలో యోగ్యులను జీపీఓలుగా తీసుకోవాలని నిర్ణయించినట్టు పొంగులేటి వెల్లడించారు. శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండ సమీపంలో కేంద్రం ఆధ్వర్యంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి 5.15 ఎకరాల కేటాయింపునకు మంత్రివర్గం అనుమతినిచ్చింది.

పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన దీప్తి జీవాంజీకి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త మండలాలకు 361 పోస్టులను మంత్రివర్గం మంజూరుచేసింది. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ పరిధిలో 330 రెగ్యులర్, 165 అవుట్ సోర్సింగ్ పోస్టులు కలిపి మొత్తం 495 పోస్టులను ఆమోదించింది.

దక్షిణాదికి అన్యాయంపై త్వరలో అఖిలపక్ష భేటీ

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసి ఉత్తరాది రాష్ట్రాలకు ప్రయోజనం కల్పించడానికి కేంద్రం దురుద్దేశంతో వ్యవహరిస్తోందనే అంశంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించినట్టు పొంగులేటి తెలిపారు. కేంద్రంతో కొట్లాడి ఉత్తరాది రాష్ట్రాలకు సమానంగా దక్షిణాది రాష్ట్రాలకు సీట్లను తెచ్చుకోవడానికి త్వరలో హైదరాబాద్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేత కె.జానారెడ్డి ఆధ్వర్యంలో త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరిగేలా పోరాడాలని నిర్ణయించామన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌ల లోపాయికారీ ఒప్పందం

- అందుకే 'పట్టభద్రుల' అభ్యర్థి ఓటమి
- మంత్రులతో సీఎం రేవంత్ సమీక్ష



ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఓటమిపై రాష్ట్ర మంత్రులు సమీక్ష జరిపారు. గురువారం కేబినెట్ భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మంత్రులతో సమావేశమయ్యారు. ఎన్నికలు జరిగిన తీరు, ఫలితాలు తదితర అంశాలపై చర్చ జరిగినట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల తరహాలోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ, బీఆర్‌ఎస్‌లు లోపాయికారీ ఒప్పందంతో వెళ్లినందునే కాంగ్రెస్ అభ్యర్థి ఓటమిపాలయ్యాడనే అభిప్రాయం వ్యక్తమైనట్టు సమాచారం. దీనితో పాటు ఎన్నికలు ఎదుర్కొన్న తీరులో ఎక్కడైనా లోపాలుంటే భవిష్యత్తులో సవరించుకోవాల్సి ఉంటుందని కొందరు సూచించినట్టు తెలిసింది. మరోవైపు లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై కూడా మంత్రులతో రేవంత్‌రెడ్డి చర్చించారు.

'పాలమూరు' అంచనాల పెంపు

- రూ.416 కోట్ల నుంచి రూ.780 కోట్లకు పెరిగిన ప్యాకేజీ–3 అంచనాలు
- ఆమోదించిన మంత్రివర్గం
- రూ.148 కోట్లతో ఘన్‌పూర్ ప్రధాన కాల్వ లైనింగ్‌కు ఓకే
- గంధమల్ల రిజర్వాయర్ సామర్థ్యం 1.41 టీఎంసీలకు కుదింపు



సాక్షి, హైదరాబాద్: పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్యాకేజీ–3 కింద నార్లాపూర్ రిజర్వాయర్, ఏదుల రిజర్వాయర్ మధ్య 8.32 కి.మీ.ల ఓపెన్ కాల్వ నిర్మాణం పనుల అంచనాల పెంపు ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. అంచనాలను రూ.416.1 కోట్ల నుంచి రూ.780.63 కోట్లకు సవరించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆర్‌ఎస్ ఘన్‌పూర్ రిజర్వాయర్ ప్రధాన కాల్వను 12.65–31.2 కి.మీ.ల మధ్య రూ.148.76 కోట్ల అంచనాలతో లైనింగ్ చేసేందుకు గతంలో తీసుకున్న నిర్ణయాన్ని మంత్రివర్గం ఆమోదించింది. రూ.153 కోట్లతో రొల్లవాగు చెరువు సామర్థ్యం పెంపు పనులకు కూడా ఓకే చెప్పింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన గంధమల్ల రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.41 టీఎంసీలకు తగ్గిస్తూ, ఆ మేరకు రూ.574.56 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతిచ్చింది. గతంలో ఈ పనులను రూ.860.25 కోట్లతో చేపట్టేందుకు పరిపాలనపర అనుమతులివ్వగా, రిజర్వాయర్ సామర్థ్యం పెంపును వ్యతిరేకిస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. దీంతో ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకుంది. తొలుత ఈ రిజర్వాయర్‌ను 9.8 టీఎంసీల సామర్థ్యంతో ప్రతిపాదించగా, ఆ తర్వాత 4.8 టీఎంసీలకు, తాజాగా 1.41 టీఎంసీలకు తగ్గించారు.

సీతారామపై మంత్రుల మధ్య సంవాదం !

సీతారామ ఎత్తిపోతల పథకం–సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు అంచనాలు సవరించే అంశంపై ఇద్దరు మంత్రుల మధ్య సంవాదం జరిగినట్టు తెలిసింది. ప్రాజెక్టు అంచనాలను రూ.13,057 కోట్ల నుంచి రూ.19,324 కోట్లకు పెంచాలనే ప్రతిపాదనలపై వాడీవేడి చర్చ జరిగింది. దీంతో ఈ ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించకుండా, రాష్ట్ర ఆర్థిక శాఖ పరిశీలనకు పంపాలని నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి రాష్ట్రంలో దీనిని రాజీవ్‌సాగర్/ఇందిరాసాగర్ ప్రాజెక్టుగా ప్రతిపాదించగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుగా రీ ఇంజనీరింగ్ చేసిందంటూ ఓ మంత్రి తప్పుబట్టినట్టు తెలిసింది. 67.5 టీఎంసీల గోదావరి జలాలను తరలించి ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 4.15 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 3.89 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం చేపట్టిన ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే రూ.10 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిన నేపథ్యంలో మళ్లీ పాత పథకాల ప్రస్తావన అనవసరమని మరో మంత్రి బదులిచ్చినట్టు సమాచారం. ఈ ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘంలోని టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ నుంచి అనుమతుల కోసం చేస్తున్న ప్రయత్నాలు చివరి దశలో ఉన్నాయని, మళ్లీ పాత ప్రాజెక్టులను తెరపైకి తెచ్చి సమస్యను జటిలం చేయవద్దంటూ అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. రూ.7,926.14 కోట్ల అంచనాలతో సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి 2016 ఫిబ్రవరి 18న గత ప్రభుత్వం పరిపాలనపర అనుమతులు జారీ చేయగా, 2018లో అంచనాలను రూ.13,057 కోట్లకు పెంచింది.

ఉక్రెయిన్ భద్రత కోసం.. అవసరమైతే

అణ్వాయుధాలు!

- ఈయూ శిఖరాగ్రంలో ఫ్రాన్స్ ప్రతిపాదన
- అత్యంత ప్రమాదకర చర్య కాగలదు: రష్యా

బ్రస్సెల్స్: ఉక్రెయిన్ భద్రత కోసం రష్యాను బెదిరించేందుకు అవసరమైతే తన అణ్వాయుధాలను నిరోధంగా వాడేందుకు సిద్ధమంటూ ఫ్రాన్స్ వివాదాస్పద ప్రతిపాదన చేసింది. గురువారం బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో యూరోపియన్ యూనియన్ దేశాల తాజా శిఖరాగ్ర సమావేశం ఇందుకు వేదికైంది. రష్యా బారినుంచి యూరప్‌కు రక్షణ కల్పించేందుకు ఫ్రాన్స్ అణుపాటవాన్ని ఆయుధంగా ఉపయోగించేందుకు సిద్ధమని అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ సందర్భంగా ప్రకటించారు. సభ్య దేశాల నుంచి ఇందుకు భారీ స్పందన లభించింది. పోలండ్‌తో పాటు లిథువేనియా, లాత్వియా వంటి పలు బాల్టిక్ దేశాలు ఈ ప్రతిపాదనను గట్టిగా సమర్థించాయి. యూరోపియన్ యూనియన్‌లో అణ్వాయుధ పాటమున్న దేశం ఫ్రాన్స్ ఒక్కటే కావడం విశేషం. ఫ్రాన్స్‌కున్న ఈ సానుకూలతను యూరప్ భద్రత కోసం ఉపయోగించేందుకు సిద్ధమని బుధవారం జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కూడా మాక్రాన్ ప్రకటించారు. దీనిపై లోతుగా చర్చ జరగాలని ఈయూ భేటీలో ఆయన పునరుద్ఘాటించారు. దీనిపై రష్యా తీవ్రంగా స్పందించింది. మాక్రాన్ ప్రతిపాదన అత్యంత ప్రమాదకరమైనదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ అన్నారు. ''శాంతి యత్నాలకు బదులు యుద్ధానికే ఫ్రాన్స్ మొగ్గుతోంది. ఉక్రెయిన్‌తో మా యుద్ధం కొనసాగాలనే ఆశిస్తోంది. మాక్రాన్ వివాదాస్పద వ్యాఖ్యలే ఇందుకు రుజువు'' అని ఆయన ఆరోపించారు.


జెలెన్‌స్కీతో మాక్రాన్

తీవ్రంగా మల్లగుల్లాలు

ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి తెరదించే మార్గాలపై ఈయూ శిఖరాగ్రంలో పలు సభ్య దేశాలు మల్లగుల్లాలు పడ్డాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా భేటీలో ప్రత్యేకంగా పాలుపంచుకున్నారు. ఈయూ దేశాధినేతల నుంచి ఆయనకు ఘనస్వాగతం లభించింది. ఆయనతో వారు ఆత్మీయంగా సంభాషించారు. ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తున్న ఈయూ నేతలకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధానికి ఎలాగైనా ముగింపు పలకాలని భావిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అందుకోసం ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని పూర్తిగా నిలిపివేస్తూ ఇప్పటికే నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఈ పరిణామాలు ఈయూ దేశాలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ పరిణామాలపై నేతలు విస్తృతంగా చర్చించారు. ఉక్రెయిన్‌కు బాసటగా నిలుస్తూనే సొంత భద్రతపైనా దృష్టి పెట్టాలని నిర్ణయించారు. రష్యా నుంచి తమకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తమైంది. రక్షణ రంగంపై అధికంగా నిధులు వెచ్చించడానికి వీలుగా నిబంధనలు సడలించుకోవాలని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయెన్ ఈయూ దేశాలకు సూచించారు. నానాటికీ మారిపోతున్న ప్రపంచ పరిణామాల నేపథ్యంలో అత్యాధునిక ఆయుధాలు సమకూర్చుకోవడానికి 162 మిలియన్ డాలర్ల(రూ.14 లక్షల కోట్లు) రుణాలు తీసుకోవాల్సి ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఆ మేరకు రక్షణ రంగంపై మరింతగా నిధులు వెచ్చించడానికి వీలుగా అప్పులు తీసుకొనేందుకు నిబంధనలు సడలించబోతున్నట్లు జర్మనీ కాబోయే చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్ ప్రకటించారు.

గుడ్లు తేలేస్తున్న అమెరికా

తీవ్ర కొరతతో సతమతం

- బర్డ్‌ఫ్లూయే ప్రధాన కారణం
- ఆల్‌టైం గరిష్టానికి ధరలు
- ఒక్క గుడ్డు ఏకంగా రూ.36
- మరో 40 శాతం పెరిగే చాన్స్
- ఒక్కరికి గరిష్టంగా రెండు గుడ్లే
- పలు సూపర్‌మార్కెట్ల ఆంక్షలు
- తుర్కియే వైపు అమెరికా చూపు
- ఈ ఏడు 42 కోట్ల గుడ్ల దిగుమతి



కనీవినీ ఎరగని కొరత. ఆకాశాన్నంటిన ధరలు. అంతంత పెట్టయినా కొందామంటే వాటిపైనా ఆంక్షలు. మొత్తమ్మీద అగ్ర రాజ్యం అక్షరాలా 'గుడ్లు' తేలేస్తోంది. తీవ్ర గుడ్ల కొరతతో అమెరికా కొద్ది నెలలుగా సతమతమవుతోంది. రోజులు గడుస్తున్న కొద్దీ సమస్య మరింత తీవ్రతరమవుతోందే తప్ప తెరిపిన పడే సూచనలే కన్పించడం లేదు...! దాంతో అమెరికన్లలో అత్యధికులకు ఉదయం పూట అల్పాహారమైన గుడ్లు ఒక్కసారిగా విలాస వస్తువుగా మారిపోయిన దుస్థితి!

ఎందుకీ సమస్య?

అమెరికాలో కొద్ది నెలల క్రితం మొదలైన గుడ్ల కొరత నానాటికీ పెరిగిపోతోంది. బర్డ్‌ఫ్లూగా పిలిచే హెచ్‌5ఎన్‌1 తీవ్రతే ఇందుకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. తొలుత కెనడాలో తలెత్తిన ఈ మహమ్మారి 2022లో అమెరికాలో ప్రవేశించింది. చూస్తుండగానే 50 రాష్ట్రాలకు విస్తరించింది. దీని వ్యాప్తిని అడ్డుకునేందుకు ఈ మూడేళ్లలో ఏకంగా 16 కోట్ల గుడ్లు పెట్టే కోళ్లను చంపేయాల్సి వచ్చింది. 2024లోనే 3 కోట్ల కోళ్లను చంపేశారు. వీటిలో 1.7 కోట్ల కోళ్లను కేవలం గత నవంబర్, డిసెంబర్ మాసాల్లోనే అంతమొందించారు. అలా 2025 జనవరి నాటికి అమెరికాలో గుడ్లు పెట్టే కోళ్ల సంఖ్య 30 కోట్లకు పరిమితమైంది. ఐదేళ్ల క్రితంతో పోలిస్తే ఇది ఏకంగా 11 శాతం తగ్గుదల! అలా మొదలైన గుడ్ల కొరత కొద్ది నెలలుగా తీవ్ర రూపు దాల్చింది. కొద్ది రోజులుగా డజను గుడ్లు ఏకంగా 5 డాలర్లకు చేరినట్టు బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ వెల్లడించింది. అంటే 435 రూపాయలు. ఒక్క గుడ్డు రూ.36 అన్నమాట. ఇది అమెరికా చరిత్రలోనే ఆల్‌టైం గరిష్టం! అంతేకాదు, షికాగో, న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో వంటి పలు పెద్ద నగరాల్లోనైతే డజను గుడ్ల ధర ఏకంగా 8 నుంచి 10 డాలర్ల దాకా ఎగబాకింది!! దాంతో గుడ్ల కొనుగోలుపై పరిమితి విధిస్తూ రెండు నెలల క్రితం తీసుకున్న నిర్ణయాన్ని పలు సూపర్ మార్కెట్లు ఇప్పటికీ కొనసాగిస్తున్నాయి. కొన్నిచోట్ల అయితే ఒక్కో కస్టమర్‌కు గరిష్టంగా 2 గుడ్లే అమ్ముతున్నాయి! డెన్నీస్, వాఫుల్ హౌస్ వంటి రెస్టారెంట్ చెయిన్లు ఒక్కో గుడ్డుపై 50 సెంట్ల సర్‌చార్జీ కూడా వడ్డిస్తున్నాయి!

ధరలు మరింత పైపైకే?

సమీప భవిష్యత్తులో కూడా గుడ్ల ధరలు తగ్గే పరిస్థితి కన్పించకపోవడం అమెరికన్లను మరింత కలవరపెడుతోంది. కోళ్ల కొరతను అధిగమించడానికే కనీసం మరికొద్ది నెలలు పట్టవచ్చని చెబుతున్నారు. అప్పటిదాకా పరిస్థితి ఇంతేనని సమాచారం. గత జనవరిలోనే గుడ్ల ధరలు ఏకంగా 15 శాతం ఎగబాకాయి. గతేడాదితో పోలిస్తే ఇప్పటికే సగానికి సగం పెరిగిపోయాయి. ఇది ఇక్కడితో ఆగదని, ఈ ఏడాది గుడ్ల ధరలు కనీసం 40 శాతానికి పైగా పెరగవచ్చని అమెరికా వ్యవసాయ శాఖ అంచనా వేసింది! ట్రంప్ సర్కారు కూడా పరోక్షంగా అదే చెప్పింది. ''ఏడాదిన్నరలోగా డజను గుడ్ల ధర ఎప్పట్లా 2 డాలర్ల లోపుకు దిగొచ్చేలా చర్యలు తీసుకుంటాం'' అని వ్యవసాయ మంత్రి బ్రూక్ రోలిన్స్ చెప్పుకొచ్చారు! దాంతో గుడ్ల కొరతను అధిగమించేందుకు తుర్కియే వైపు చూస్తోంది. గతంలో కెనడా, నెదర్లాండ్స్, బ్రిటన్, చైనా నుంచీ అమెరికా గుడ్లను దిగుమతి చేసుకున్నా కొన్నేళ్లుగా ఒక్క తుర్కియేకే పరిమితమైంది. ఆ దేశం నుంచి ఈ ఏడాది కనీసం 42 కోట్ల గుడ్లను దిగుమతి చేసుకోవాలని భావిస్తోంది. అయినా పెద్దగా ఒరిగేదేమీ ఉండబోదని పరిశీలకులు పెదవి విరుస్తున్నారు. ఫ్లూ సమస్య ఇలాగే కొనసాగితే దాని తాలూకు లోటును, ఉత్పత్తి నష్టాలను భర్తీ చేసుకోవడానికే ఈ దిగుమతులు చాలవని చెబుతున్నారు.

ఇవీ లెక్కలు..

- అమెరికాలో ఏటా సగటున 9,000 కోట్లకు పైగా గుడ్లు ఉత్పత్తవుతాయి.
- ఫ్లూ కారణంగా మూడేళ్లలో 14 కోట్ల కోళ్లను చంపేయాల్సి వచ్చింది.
- 2021లో 1.6 డాలర్లున్న డజను గుడ్ల ధర ఇప్పుడు 5 డాలర్లను దాటేసింది.
- 2024లో తుర్కియే నుంచి 7 కోట్ల గుడ్లు దిగుమతి చేసుకున్నారు.
- ఈసారి ఏకంగా 42 కోట్ల గుడ్లు దిగుమతి చేసుకోనున్నారు. ఇది దేశ చరిత్రలోనే అత్యధికం!
- అయినా డిమాండ్‌ను తట్టుకోవడానికి ఇది ఏమాత్రమూ చాలదంటున్నారు.

ట్రంప్ బిలియన్ డాలర్ ప్లాన్



గుడ్ల కొరతను అధిగమించి వాటి ధరలను నేలకు దించేందుకు బిలియన్ డాలర్ల ప్రణాళికను అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదిస్తున్నారు. అందులో ఏమున్నాయంటే...

- బర్డ్‌ఫ్లూ వ్యాప్తిని అడ్డుకునేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు.
- బర్డ్‌ఫ్లూ చికిత్స, వ్యాక్సిన్ల అభివృద్ధి తదితరాలకు 10 కోట్ల డాలర్లు
- పౌల్ట్రీఫారాల యజమానులకు ఆర్థిక సాయానికి 40 కోట్ల డాలర్లు
- దిగుమతుల ద్వారా ప్రస్తుత డిమాండ్‌ను తట్టుకుని కొరతను అధిగమించడం

బైడెన్ సర్కారు ఏం చేసింది?

ఫ్లూపై పోరుకు బైడెన్ ప్రభుత్వం మూడేళ్లలో 150 కోట్ల డాలర్లు వెచ్చించింది. ఫ్లూ బారిన పడ్డ కోళ్లను అంతమొందిస్తూ వచ్చింది. ఈ వైరస్ మనుషులకు పాకకుండా చూసేందుకు 60 కోట్ల డాలర్లు కేటాయించింది. వ్యాక్సిన్ల వృద్ధి తదితరాలపై దృష్టి పెట్టింది. ఎంత చేసినా గుడ్ల కొరత నానాటికీ పెరుగుతూనే వచ్చింది. బైడెన్ ప్రభుత్వ అర్థంలేని చర్యల వల్లే సమస్య విషమించిందని ట్రంప్ ఆరోపిస్తున్నారు. ఆయన చర్యలతో పరిస్థితి ఎంతో కొంత అదుపులోకి రాగలదని పౌల్ట్రీ పరిశ్రమ వర్గాలు ఆశాభావంతో ఉండటం విశేషం.

– సాక్షి, నేషనల్ డెస్క్

మిగిలిన బందీలను విడుదల చేయకపోతే...

మీకు మరణ శాసనమే

- హమాస్‌కు ట్రంప్ 'తుది హెచ్చరిక'
- తేలిగ్గా కొట్టిపారేసిన ఉగ్ర సంస్థ

వాషింగ్టన్: ''గాజాలో మిగిలిపోయిన ఇజ్రాయెల్ బందీలందరినీ తక్షణం విడుదల చేయండి. హమాస్ మిలిటెంట్లకు ఇదే చివరి హెచ్చరిక!'' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. ఈ రోజు, కాదంటే రేపు బందీలను విడిచిపెట్టాల్సిందేనంటూ అల్టిమేటమిచ్చారు. మిలిటెంట్ల అకృత్యాల వల్ల మరణించిన బందీల మృతదేహాలను ఇజ్రాయెల్‌కు తక్షణమే అప్పగించాలని అన్నారు. మాట వినకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని, మరణశాసనం తప్పదని హమాస్‌కు స్పష్టంచేశారు. బుద్ధిహీనులు మాత్రమే మృతదేహాలను భద్రపర్చుకుంటారని, హమాస్ మిలిటెంట్లు సైతం అదే తరహా మనుషులుగా కనిపిస్తున్నారని చెప్పారు. గాజా నుంచి విముక్తి పొందిన ఎనిమిది మంది బందీలతో బుధవారం వైట్‌హౌస్‌లో ట్రంప్ సమావేశమయ్యారు. వారి అనుభవాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మాజీ బందీల విషాద గాథలు విని చలించిపోయారు. తమ విడుదలకు సహకరించినందుకు వారు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం హమాస్‌కు హెచ్చరికలు జారీ చేస్తూ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టు చేశారు. మిలిటెంట్ల చెరలో చిక్కుకొని కష్టాలు పడుతున్న బందీలకు త్వరగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా, హమాస్‌తో ప్రత్యక్షంగా చర్చలు జరపడానికి ట్రంప్ ఒక ప్రతినిధిని ఇటీవలే గాజాకు పంపించడం గమనార్హం. ఈ విషయాన్ని వైట్‌హౌస్ ధ్రువీకరించింది. 1997లో హమాస్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థగా అమెరికా అధికారికంగా గుర్తించింది. అప్పటినుంచి ఇరుపక్షాల మధ్య ప్రత్యక్షంగా ఎలాంటి చర్చలు జరగలేదు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తర్వాత అమెరికా కొంత దిగొచ్చింది. హమాస్‌తో చర్చలకు ట్రంప్ పచ్చజెండా ఊపారు. దీంతో ఖతార్ రాజధాని దోహాలో అమెరికా, హమాస్ ప్రతినిధుల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. చర్చల్లో పురోగతిపై స్పందించేందుకు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లెవిట్ నిరాకరించారు. ఇప్పుడే ఏమీ చెప్పలేనని అన్నారు.




బందీల విడుదల ఇప్పుడే కాదు: హమాస్

కైరో: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలను హమాస్ మిలిటెంట్ గ్రూప్ తేలిగ్గా కొట్టిపారేసింది. గాజాలో శాశ్వత కాల్పుల విరమణను కోరుకుంటున్నామని, అందుకోసం ఒప్పందం కుదిరిన తర్వాతే మిగిలిన బందీలను విడుదల చేస్తామని గురువారం ప్రకటించింది. జనవరిలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచేందుకు ట్రంప్‌తోపాటు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ కుట్రలు సాగిస్తున్నారని ఆరోపించింది. ఈ ఒప్పందంలో భాగంగా రెండో దశ చర్చలు ఫిబ్రవరి మొదట్లో ప్రారంభం కాగా, అవి ఆశించినంతగా ముందుకు సాగడం లేదు. ఇరుపక్షాలు తమ డిమాండ్లపై పట్టువీడడం లేదు. బందీలంతా విడుదల కావాలంటే అందుకు సులభమైన మార్గం చర్చలు ఫలప్రదం కావడమేనని హమాస్ అధికార ప్రతినిధి అబ్దెల్–లతీఫ్ అల్–ఖనౌవా చెప్పారు. శాశ్వత కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించాలని, గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వెనక్కి వెళ్లిపోవాలని హమాస్ డిమాండ్ చేస్తోంది. అందుకు ఇజ్రాయెల్ అంగీకరించడం లేదు. గాజాలో హమాస్ చెరలో ఇంకా 24 మంది బందీలు ఉన్నట్లు తెలుస్తోంది.

గంగా మాత ఆశీస్సులతో దేశ సేవ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి

ఉత్తరాఖండ్‌లో పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచన



హర్సిల్/న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఇక్కడ ఏదో ఒక సీజన్‌కు పరిమితం కాకుండా ఏడాది పొడవునా పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచు కొండలు, ప్రకృతి రమణీయతతో కూడిన సుందరమైన రాష్ట్రం ఉత్తరాఖండ్‌లో ఆఫ్–సీజన్ అనేదే ఉండకూడదని పేర్కొన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసుకుంటే స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ గురువారం ఉత్తరాఖండ్‌లో పర్యటించారు. ఉత్తరకాశీ జిల్లాలోని ముఖ్వా గ్రామంలో గంగా మాత ఆలయాన్ని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. తనను గంగా మాత దత్తత తీసుకున్నట్లు భావిస్తున్నానని, ఆ తల్లి ఆశీస్సులే తనను కాశీ(వారణాసి)కి తీసుకెళ్లాయని, దేశ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాయని వ్యాఖ్యానించారు. అనంతరం హర్సిల్ గ్రామంలో బహిరంగ సభలో నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఉత్తరాఖండ్‌లో శీతాకాలంలో పర్యటిస్తే చక్కటి అనుభూతి లభిస్తుందని అన్నారు. దేశమంతా పొగమంచుతో కప్పబడి ఉన్న సమయంలో ఉత్తరాఖండ్ మాత్రం సూర్యకాంతిలో స్నానమాడుతూ కనిపిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 12 నెలల టూరిజం విజన్‌ను ప్రధానమంత్రి ప్రశంసించారు. పర్యాటకులను ఆకర్షించడానికి బహుముఖ చర్యలు అవసరమని పేర్కొన్నారు. వేసవి కాలంలో పర్యాటకులతో కళకళలాడే ఉత్తరాఖండ్ చలికాలంలో మాత్రం ఖాళీగా దర్శనిస్తోందని, ఈ పరిస్థితి మారాలని స్పష్టంచేశారు. అన్ని సీజన్లలో పర్యాటకులు భారీగా తరలివచ్చేలా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు. వింటర్ టూరిజం మనం లక్ష్యం కావాలని అన్నారు. చలికాలంలోనే అసలైన ఉత్తరాఖండ్‌ను అనుభూతి చెందవచ్చని పర్యాటకులకు సూచించారు. గిరిజన గ్రామమైన జడూంగ్ నుంచి హర్సిల్ విలేజ్ వరకూ ట్రెక్, బైక్ జర్నీని ప్రధాని మోదీ జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో రెండు కీలకమైన రోప్‌వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు గుర్తుచేశారు. రోప్‌వే ప్రాజెక్టుతో కేదార్‌నాథ్ ప్రయాణం 9 గంటల నుంచి 30 నిమిషాలకు తగ్గిపోతుందని వెల్లడించారు. వివాహాలు చేసుకొనేందుకు, సినిమాలు, షార్ట్‌ఫిలింల షూటింగ్‌లకు ఉత్తరాఖండ్‌లో చక్కటి వేదికలు ఉన్నాయని, వీటిని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సరిహద్దు గ్రామమైన హర్సిల్‌లో అడుగుపెట్టిన మొట్టమొదటి ప్రధానమంత్రి మోదీయేనని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ పేర్కొన్నారు.

రేపు గుజరాత్‌లో మోదీ పర్యటన

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8వ తేదీన గుజరాత్‌లో పర్యటించనున్నారు. నవసారి జిల్లాలో లఖ్‌పతి దీదీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా మహిళా పోలీసులు, మహిళా సిబ్బంది ఆధ్వర్యంలోనే నిర్వహించబోతున్నారు.

జైశంకర్‌పై దాడికి ఖలిస్తానీల యత్నం!

లండన్ పర్యటనలో ఘటన

- మంత్రి కారు సమీపంలో ఆందోళనకు దిగిన వైనం
- ఒకరిని అరెస్టు చేసిన పోలీసులు
- క్షమించరాని వైఫల్యం: భారత్
- హైకమిషనర్‌ను పిలిపించి తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చిన వైనం



లండన్/ఇస్లామాబాద్: భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ బ్రిటన్‌లోని లండన్‌లో పర్యటిస్తున్న వేళ ఖలిస్తానీ వేర్పాటువాదులు తీవ్ర కలకలం సృష్టించారు. ఆయన కారును అడ్డుకునేందుకు ప్రయత్నించారు. లండన్‌లో చాతం హౌస్‌లో కార్యక్రమంలో పాల్గొని కారులో వెనుతిరుగుతుండగా ఈ ఘటన జరిగింది. ఆయన కారుకు అత్యంత సమీపంగా వేర్పాటువాదులు దూసుకొచ్చారు. ఒకడు భారత జాతీయ జెండాను పట్టుకొచ్చి చింపేశాడు. మరికొందరు ఖలిస్తానీ, భారత వ్యతిరేక నినాదాలు చేశారు. మంత్రిపై దాడికి దిగినంత పని చేశారు. ఒక్కసారిగా జరిగిన ఈ అనూహ్య ఘటనతో లండన్ పోలీసులు షాక్‌కు గురయ్యారు. వెంటనే తేరుకుని ఒక వేర్పాటువాదిని అరెస్ట్‌చేశారు. మిగతావారిని చెదరగొట్టారు. దీనిపై భారత్ తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చింది. ఇది క్షమించరాని భద్రతా వైఫల్యమంటూ మండిపడింది. న్యూఢిల్లీ బ్రిటిష్ హైకమిషన్‌లోని చార్జ్ డీ అఫైర్స్ క్రిస్టినా స్కాట్‌ను పిలిపించి తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. అంతకుముందు షెవెనింగ్ హౌస్‌లో జైశంకర్ బ్రిటన్ విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీతో విస్తృత చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక సమన్వయం, రాజకీయ సహకారం, వాణిజ్యం, విద్య, సాంకేతిక పరిజ్ఞానం సహా పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు.

కశ్మీర్ అంశంలో ఎవరి జోక్యం అవసరం లేదు

ఛాతం హౌస్‌లో చర్చల సందర్భంగా కశ్మీర్ అంశాన్ని మీడియా జైశంకర్ వద్ద ప్రస్తావించింది. కశ్మీర్ సమస్యను పరిష్కరించడంలో అనుమతిస్తే తన వంతు పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన ప్రతిపాదనను ప్రధాని నరేంద్ర మోదీ అంగీకరిస్తారా? అని మీడియా ప్రశ్నించింది. '' ఈ విషయంలో భారత వైఖరి సుస్పష్టం. కశ్మీర్ అంశంలో ఎవరి జోక్యం అవసరం లేదు. ఇక కశ్మీర్ సర్వతోముఖాభివృద్ధి పథంలో మేం ఎంతో ముందుకెళ్లాం. ఆర్టికల్ 370ని రద్దుచేసి అవరోధాలను తొలగించాం. కశ్మీర్‌లో ఆర్థికాభివృద్ధి, సామాజికన్యాయంతో ఆ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టాం. మా కృషికి ఫలితంగా ఇటీవల అక్కడి అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక పోలింగ్ నమోదైంది. కశ్మీర్ అంశంలో భారత సర్కార్ మొదట్నుంచీ నిర్ణయాత్మక, ఆచరణాత్మక చర్యలే తీసుకుంటోంది. ఇప్పటికీ అపరిష్కృతంగా ఏదైనా ఉందంటే అది భారత్ ఆవల ఉందని అర్థం. మా నుంచి దొంగతనంగా లాక్కున్న కశ్మీర్ భూభాగాన్ని పాకిస్తాన్ తిరిగి మాకు ఇచ్చేస్తే ఆటోమేటిక్‌గా కశ్మీర్ అంశానికి పరిష్కారం లభించినట్లే'' అని జైశంకర్ వ్యాఖ్యానించారు. జైశంకర్ చేసిన వ్యాఖ్యలను పాకిస్తాన్ తప్పుబట్టింది. '' ఆజాద్ జమ్మూకశ్మీర్‌పై నిరాధార ఆరోపణలు చేసే బదులు భారత్ 77 ఏళ్లుగా ఆక్రమించిన అత్యధిక కశ్మీర్ భూభాగాలను ఖాళీచేయాలి'' అని పాకిస్తాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి షౌఖత్ అలీఖాన్ అన్నారు.

యూకే పార్లమెంట్‌లో ప్రస్తావించిన విపక్ష సభ్యుడు

జైశంకర్ పర్యటనలో వెలుగుచూసిన తీవ్ర భద్రతా వైఫల్యాన్ని లండన్‌లోని బ్రిటన్ పార్లమెంట్‌లో విపక్ష కన్జర్వేటివ్ పార్టీ సభ్యుడు బాబ్ బ్లాక్‌మ్యాన్ లేవనెత్తారు. '' విదేశీ మంత్రిపై దాడి యత్నం పూర్తిగా భద్రతా వైఫల్యమే. ఈ విషయంపై బ్రిటన్ హోంశాఖ మంత్రి యువెట్టీ కూపర్ సభాముఖంగా వివరణ ఇవ్వాలి'' అని బాబ్ డిమాండ్ చేశారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా

జైమాల్యా బాగ్చీ

సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం



న్యూఢిల్లీ: కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జైమాల్యా బాగ్చీని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం గురువారం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. 2013 జూలై 18న జస్టిస్ అల్తమస్ కబీర్ పదవీ విరమణ చేసిన చేసిన తర్వాత కలకత్తా హైకోర్టు నుంచి ఏ న్యాయమూర్తి కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందలేదు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం ప్రత్యేకంగా ప్రస్తావించింది. కొలీజియం సిఫార్సును కేంద్రం ఆమోదిస్తే జస్టిస్ జైమాల్యా బాగ్చీ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులవుతారు. ఆయన పదవీకాలం ఆరేళ్లకుపైగా ఉన్నందున సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందే అవకాశం ఉంది.

ఈసారి జెలెన్‌స్కీ వెంట మాక్రాన్, స్టార్మర్!

పారిస్: అమెరికా అత్యున్నత పరిపాలనా పీఠం శ్వేతసౌధం సాక్షిగా అగ్రరాజ్యాధినేత ట్రంప్‌తో వాగ్వాదంలో తన దేశం తరఫున గట్టిగా వాదించిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తాజాగా అనూహ్యంగా పట్టుసడలించారు. రష్యా దూకుడును అడ్డుకునేందుకు అమెరికా ఇన్నాళ్లూ చేసిన సైనిక, నిఘా సాయాన్ని హఠాత్తుగా నిలిపివేసిన వేళ జెలెన్‌స్కీ వైఖరిలో మార్పు రావడం గమనార్హం. ఒంటరిగా వచ్చిన జెలెన్‌స్కీ ఆనాడు ట్రంప్, జేడీ వాన్స్‌తో మాటల యుద్ధానికి దిగి దౌత్యమంటలు రాజేసిన నేపథ్యంలో అగ్రనేతల ఆగ్రహావేశాలను చల్లార్చేందుకు ఈసారి ఫ్రాన్స్, బ్రిటన్ అగ్రనేతలు రంగంలోకి దిగుతున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రిటన్ ప్రధాన మంత్రి కెయిర్ స్టార్మర్‌లు జెలెన్‌స్కీని అమెరికాను వెంటబెట్టుకుని తీసుకొచ్చి ట్రంప్‌తో సమాలోచనలు జరుపుతారని ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ భేటీ ఎప్పుడనేది ఇంకా నిర్ధారణకాలేదు. ''ఉక్రెయిన్, అమెరికా సంప్రదింపుల బృందాలు తదుపరి భేటీ కోసం తమ వంతు కృషిచేస్తున్నాయి. ఈ కృషిలో పురోగతి కనిపిస్తోంది'' అని గురువారం తెల్లవారు జామున జెలెన్‌స్కీ ఒక ప్రకటనచేశారు. బుధవారం ట్రంప్‌కు జెలెన్‌స్కీ ఒక లేఖ రాయడం, ఆ లేఖాంశాన్ని ట్రంప్ అమెరికా పార్లమెంట్ ఉభయసభల సంయుక్త సమావేశంలో బుధవారం ప్రస్తావించడం తెల్సిందే. ''అమెరికా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరితే వెంటనే యురోపియన్ సైనిక బలగాలను ఉక్రెయిన్‌కు పంపే వీలుంది. రష్యా దూకుడుకు ఈ బలగాలు అడ్డుకట్టవేస్తాయి. డీల్ కుదిరాక బలగాల మోహరింపుపై వచ్చే వారం పారిస్‌లో ఈయూ దేశాల సైనిక చీఫ్‌లతో చర్చలు జరుపుతాం'' అని మాక్రాన్ చెప్పారు.

ఆ పరిస్థితి రాకుండా ఉండేందుకే!

అమెరికా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందం కుదరకపోతే యుద్ధ పరిస్థితులు అనూహ్యంగా తలకిందులవుతాయని యూరోపియన్ యూనియన్ దేశాలు భావిస్తున్నాయి. అమెరికా నుంచి అన్ని రకాల సాయం నిలిచిపోతే, పెద్దన్న అమెరికాను కాదని ఈయూ దేశాలు ఉక్రెయిన్‌కు సాయం చేసే సాహసం చేయకపోతే తుదకు యుద్ధంలో రష్యాదే పైచేయి అవుతుంది. అప్పుడు తప్పని పరిస్థితుల్లో అమెరికాకు బదులు రష్యాతో ఉక్రెయిన్ శాంతి ఒప్పందం చేసుకునే అవకాశముంది. ఆ పరిస్థితి రాకుండా ఉండేందుకు ఉక్రెయిన్‌ను అమెరికాకు దగ్గరచేయాలని ఈయూ దేశాలు తామే పెద్దరికం తీసుకుని జెలెన్‌స్కీని అమెరికా రప్పించి 'శాంతి, ఖనిజ ఒప్పందం' కుదిరేలా చేయాలని భావిస్తున్నాయి. అందులోభాగంగా మాక్రాన్, స్టార్మర్ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

భారత్‌కు అప్పగించొద్దు... చిత్రహింసలకు గురి చేస్తారు

ముంబై ఉగ్రదాడి నిందితుడు రాణా

న్యూయార్క్: ముంబై ఉగ్రవాద దాడుల కీలకసూత్రధారి తహవూర్ రాణా తనను భారత్‌కు అప్పగించొద్దంటూ అమెరికా కోర్టుకు మొరపెట్టుకున్నాడు. తనను భారత్ చిత్రహింసలకు గురి చేస్తుందని ఆరోపించాడు. ''ప్రాణాంతక జబ్బులతో పోరాడుతున్న నన్ను భారత్‌కు అప్పగించడమంటే మరణశిక్ష విధించడమే. నా అప్పగింత అమెరికా చట్టాలతో పాటు ఐరాస తీర్పుల ఉల్లంఘనే. కనుక అప్పగింతపై స్టే విధించండి'' అని కోరాడు. పాక్ సంతతికి చెందిన కెనడా జాతీయుడైన రాణా లాస్‌ఏంజెలెస్‌లోని మెట్రోపాలిటన్ జైల్లో ఉన్నాడు. పాక్–అమెరికా ఉగ్రవాది డేవిడ్ కోల్మన్ హెడ్లీతో అతనికి దగ్గరి సంబంధాలున్నాయి. 26/11 దాడుల కేసులో భారత్‌కు అప్పగించేందుకు అమెరికా ఆమోదం తెలిపింది. రాణాకు చికిత్సపై హామీకి భారత ప్రభుత్వం నిరాకరించింది. దాంతో రాణాను భారత్‌కు అప్పగిస్తే బతికే అవకాశమే లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

16 ఏళ్లు రిలేషన్‌లో ఉండి రేప్ అంటే ఎలా?

అత్యాచారం కేసును తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఏకంగా 16 సంవత్సరాలు ఒక వ్యక్తితో సంబంధం నెరిపి ఇప్పుడు రేప్ కేసు పెడితే ఎలా? అని సుప్రీంకోర్టు ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై అభ్యంతరం వ్యక్తంచేసింది. పెళ్లిచేసుకుంటానని నమ్మించి రేప్ చేశాడని ఒక మహిళ దాఖలుచేసిన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టేసింది. మహిళ చేసిన ఆరోపణల్లో నిజం లేదని కోర్టు అభిప్రాయపడింది. '' పెళ్లిచేసుకుంటానని చెప్పి మోసం చేసి సంబంధం పెట్టుకుంటే దానిని రేప్‌గా భావించలేం. మహిళ సమ్మతి లేదని నిరూపణ అయితేనే రేప్‌గా పరిగణిస్తాం. ఈ కేసులో సమ్మతి లేదు అని చెప్పలేం . ఎందుకంటే ఉన్నత విద్యార్హతలున్న, పరిణతి సాధించిన చదువుకున్న మహిళ.. ఒక వ్యక్తి పెళ్లిచేసుకుంటానని నమ్మిస్తే 16 ఏళ్లపాటు అతడిని అలాగే నమ్మడం అనేది అసంభవం. 16 ఏళ్లపాటు తనపై లైంగికదాడిని ఆ మహిళ భరించిందంటే నమ్మశక్యంగా లేదు. సుదీర్ఘకాలాన్ని చూస్తుంటే లైంగిక సంబంధం అనేది పరస్పర సమ్మతితో కొనసాగినట్లు స్పష్టమవుతోంది. ఇన్నేళ్ల శారీరక సంబంధం తర్వాత ఇప్పుడొచ్చి అత్యాచారం చేశాడంటూ కేసు పెట్టడం సరికాదు. 16 ఏళ్ల కాలం అనేది 'బలవంతంగా లైంగిక దోపిడీచేశాడు. శారీరక సంబంధం కోసం వంచించాడు' అనే వాదనలను బలం చేకూర్చడంలేదు. పెళ్లిచేసుకుంటానని అతను మాటిస్తే ఇన్నేళ్లలో ఆమెకు ఒక్కసారైనా అనుమానం రాకపోవడం విచిత్రం. అతను వేరే మహిళను పెళ్లిచేసుకున్న తర్వాతే ఈ మహిళ తొలిసారిగా పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈ 16 సంవత్సరాల్లో వీళ్లు ఒకే చోట సహజీవనం చేశారు. ఈ కేసు పూర్తిగా ప్రేమ/సహజీవనానికి సంబంధించిన అంశం. ఇందులో అత్యాచారం అనే కోణానికి తావులేదు. మహిళ చేస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చే సాక్ష్యాధారాలు లేవు. ఇలాంటి సందర్భంలో ఇంకా అతనిపై నేర విచారణ కొనసాగించడం చట్టప్రకారం సబబు కాదు'' అంటూ సుప్రీంకోర్టు ఈ కేసును కొట్టేసింది. 2006లో ఒకరోజు రాత్రి ఇంట్లో చొరబడి రేప్ చేశాడని, తర్వాత పెళ్లిచేసుకుంటానని ఇన్నేళ్లు మోసంచేశాడని సంబంధిత మహిళ 16 సంవత్సరాల తర్వాత 2022లో ఫిర్యాదుచేసింది. దీంతో అదే ఏడాది ఎఫ్ఐఆర్ నమోదుచేసి కేసు విచారణ ప్రారంభించారు. ఈ కేసులో హైకోర్టులోనూ తనకు వ్యతిరేకంగా తీర్పురావడంతో ఆ వ్యక్తి చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించగా చిట్టచివరకు అతనికి అనుకూలంగా తీర్పు వచ్చింది. మార్చి మూడో తేదీనాటి ఈ కేసు తీర్పు వివరాలు గురువారం బహిర్గతమయ్యాయి.



సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 7 । మార్చి । 2025




శరవేగంగా..
మల్కాజిగిరి రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. నగరానికి తూర్పు వైపున చర్లపల్లి తర్వాత సకల సదుపాయాలతో మల్కాజిగిరి వినియోగంలోకి రానుంది. -10లో



స్వీట్ చేంజ్..
ఏదైనా శుభవార్త చెప్పే ముందు నోరు తీపి చేస్తారు. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు ట్రెండ్ మారింది. ప్రతి చిన్న విషయానికీ స్వీట్‌తో పండుగ చేసుకుంటున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
34.0/17.0

వాతావరణం
నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.









మహిళా దినోత్సవ సందడి

మహిళా పెన్షనర్స్ ఫోరం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, రాష్ట్ర ప్రభుత్వ మహిళా పెన్షనర్స్ ఫోరం అధ్యక్షురాలు ఆర్.ఉమాదేవి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ జి.వెన్నెల తదితరులు పాల్గొన్నారు. బోనాలు, బతుకమ్మలతో కూడిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - నాంపల్లి

చెరువుల అభివృద్ధికి సీఎస్సార్ నిధులు అందించాలి

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో చెరువుల అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామని, వాటికి పునరుజ్జీవం కల్పించడంతో పాటు సుందరీకరణకు కార్పొరేట్ సంస్థలు సీఎస్సార్ నిధులు అందించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. గురువారం నానక్‌రామ్‌గూడలోని ఖాజాగూడ పెద్ద చెరువుతో పాటు నెక్నాంపూర్‌లో ఉన్న ఇబ్రహీంబాగ్ చెరువును ఆయన పరిశీలించారు. ఖాజాగూడ చెరువు అభివృద్ధికి ఆటంకంగా మారిన అంశాలను ఆ పనులు చేపట్టిన ఎన్ఎస్ఎల్ ఇన్‌ఫ్రా, దివ్యశ్రీ ఇన్‌ఫ్రా సంస్థల ప్రతినిధులు రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణం స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఆయా చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా కాలువల మళ్లింపు పనులు చేపట్టాలని సూచించారు. పర్యాటకుల్ని ఆకర్షించేలా చెరువుల పరిసరాలను సుందరీకరించాలని, ఈ క్రతువులో పర్యాటకాభివృద్ధి సంస్థ కూడా భాగస్వామ్యం కావాలని తన వెంట ఉన్న ఈ శాఖ ఏజీఎం వరప్రసాద్‌కు రంగనాథ్ సూచించారు. నెక్నాంపూర్‌లోని ఇబ్రహీంబాగ్ చెరువు ఆక్రమణల్ని ఇటీవలే తొలగించామని హైడ్రా కమిషనర్ తెలిపారు. ఒకప్పుడు దుర్గం చెరువు, ఖాజాగూడ చెరువు, మల్కం చెరువు, ఫిలింనగర్ చెరువుల నుంచి వరద నీరు ఇబ్రహీంబాగ్ చెరువుకు చేరేదని స్థానికులు అధికారులకు తెలిపారు. నివాస ప్రాంతాలు పెరిగిపోవడంతో చెరువులు, మురుగుతో నిండిపోయాయన్నారు. 88 ఎకరాలకు పైగా ఉన్న ఇబ్రహీంబాగ్ చెరువు చుట్టూ తిరిగిన రంగనాథ్ స్థానికులతో మాట్లాడారు.

చదువుకు ఆధార్ లేకపోవడం అడ్డంకి కాదు

- సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్
- చిన్నారిని పాఠశాలలో చేర్పించిన న్యాయమూర్తి



శ్రీనిధిని స్కూల్లో చేర్పిస్తున్న జస్టిస్ అబ్దుల్ జావేద్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: చదువుకు ఆధార్ లేకపోవడం అడ్డంకిగా మారకూడదని, ప్రతి పేదకూ విద్య అందినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యపడుతుందని సీనియర్ సివిల్ జడ్జి, హైదరాబాద్ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ జావేద్ పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆధార్ కార్డు లేదంటూ సనత్‌నగర్‌కు చెందిన చిన్నారి శ్రీనిధిని చేర్చుకునేందుకు ఓ ప్రైవేట్ పాఠశాల నిరాకరించగా.. గురువారం ఆ స్కూల్‌కు వెళ్లి చేర్పించారు. ఆధార్ లేని కారణంగా చిన్నారి శ్రీనిధిని పాఠశాలలో చేర్చుకునేందుకు ప్రిన్సిపాల్ నిరాకరించారు. ఈ విషయం టీజీఎల్ఎస్ఏ సభ్య కార్యదర్శి పంచాక్షరికి తెలియడంతో వెంటనే చర్యలు తీసుకోవాలని మహ్మద్ అబ్దుల్ జావేద్‌కు ఆయన ఆదేశాలు జారీ చేశారు. చిన్నారి చదువుకు అనుమతి ఇవ్వాలని డీఈఓకు జావేద్ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు నేరుగా పాఠశాలకు వెళ్లి చేర్పించారు.

మహా నగర విస్తరణకు ఓకే

hmda Growing Global

ఇక ట్రిపుల్ ఆర్ వరకూ హైదరాబాద్

- హెచ్ఎండీఏ పరిధిని పెంచుతూ మంత్రివర్గం ఆమోదం

సాక్షి, సిటీబ్యూరో: మహా నగర పరిధి విస్తరణకు గురువారం మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. దీంతో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు పెరగనుంది. ఈ మేరకు గురువారం మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 7 జిల్లాలు, 7,257 చదరపు కిలోమీటర్లు ఉన్న హెచ్ఎండీఏ పరిధి తాజా నిర్ణయంతో సుమారు 11,000 చదరపు కిలోమీటర్ల నుంచి 12,000 చ.కి.మీ వరకు పెరగనుంది. ఇప్పుడు 70 మండలాలు, సుమారు 1000 గ్రామ పంచాయతీలు, మరో 8 కార్పొరేషన్లు, 38కి పైగా మున్సిపాలిటీలు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నాయి. కొత్తగా ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించడం వల్ల మరో 4 జిల్లాల పరిధిలోని 32 మండలాలు చేరనున్నాయి. దీంతో 11 జిల్లాలు, 106 మండలాలు, సుమారు 1400కు పైగా గ్రామాలతో హెచ్ఎండీఏ పరిధి భారీగా పెరగనుంది.

- హెచ్ఎండీఏ పరిధి పెరగడం వల్ల ట్రిపుల్ ఆర్ పరిధిలో శాటిలైట్ టౌన్‌షిప్పుల నిర్మాణం జరిగే అవకాశం ఉంది. కొంతకాలంగా స్తబ్దత నెలకొన్ని ఉన్న రియల్ ఎస్టేట్ రంగంలో కదలిక వచ్చే అవకాశం ఉంది. అంతర్జాతీయ సంస్థలు సైతం భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావచ్చని అంచనా. ఔటర్‌రింగ్‌రోడ్డు వరకు ఉన్న నగరాన్ని కోర్ అర్బన్‌గా, ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి ట్రిపుల్ ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని సెమీ అర్బన్‌గా, మిగతా ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా పరిగణిస్తారు. ఈ మేరకు సెమీ అర్బన్ వరకు సమగ్రమైన మాస్టర్ ప్లాన్ ను రూపొందించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఔటర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు వెలుపల మరో 5 కిలోమీటర్ల వరకు హెచ్ఎండీఏ పరిధి పెరగనుంది. ప్రస్తుతం 11 జిల్లాలకు పరిధిని పెంచడం వల్ల నల్లగొండ, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలు కొత్తగా చేరనున్నాయి.

'ఫ్యూచర్' అథారిటీకి గ్రీన్‌సిగ్నల్




ఫ్యూచర్ సిటీ స్వరూపం ఇలా..

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు దీటుగా నాలుగో నగరం ఆవిష్కృతం కాబోతోంది. ఇటు శ్రీశైలం, అటు నాగార్జునసాగర్ జాతీయ రహదారుల మధ్యలో ఉన్న ఏడు మండలాలు.. 56 గ్రామ పంచాయతీలతో సుమారు 30 వేల ఎకరాల్లో 'ఫ్యూచర్ సిటీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' పేరుతో మరో అద్భుత నగరం ఆవిష్కరణకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ తీర్మానం చేసింది. అంతేకాదు.. ఇప్పటి వరకు ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ మధ్యలో హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 36 గ్రామాలను కూడా కొత్తగా ఏర్పాటు చేసే ఎఫ్‌డీసీఏలో విలీనం చేయనున్నట్లు ప్రకటించింది. ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి కోసం కొత్తగా 90 పోస్టులను సృష్టించడమే కాకుండా, వాటి భర్తీకి ఆమోదం కూడా తెలిపింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ శంకుస్థాపనతో ఇప్పటికే ఈ ప్రాంతంలో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆ ధరలు మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించతలపెట్టిన 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ (రతన్‌టాటా) రోడ్డుకు భూసేకరణ చేపట్టింది. తొలి దశలో 19.2 కిలోమీటర్లకు రూ.1,665 కోట్లు కేటాయించింది. అదే విధంగా రెండో విడతలో 22.30 కిలోమీటర్ల దూరంలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు రూ.2,365 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే.



చైనీయులే డంగైపోయేలా!



అమెరికన్లే లక్ష్యంగా అంతర్జాతీయ ముఠా ఏర్పాటు

పేపాల్ కస్టమర్లకు ఫిషింగ్ మెయిల్స్ పంపిన గ్యాంగ్

- అక్రమ లావాదేవీల పేరుతో వ్యక్తిగత వివరాలు సేకరణ
- వీటిని వినియోగించి వారి ఖాతాల నుంచి సొమ్ము స్వాహా
- గుట్టు రట్టు చేసిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో
- 63 మంది నిందితుల అరెస్టు



నిందితుల నుంచి స్వాధీన పర్చుకున్న ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న శిఖా గోయల్

సాక్షి, సిటీబ్యూరో: బెట్టింగ్, లోన్ సహా వివిధ రకాల యాప్స్ మాటున ఇక్కడి వారిని నిలువునా ముంచుతున్న చైనీయులు సైతం డంగైపోయే సైబర్ నేరం వెలుగులోకి వచ్చింది. గుజరాతీ సూత్రధారిగా ఉన్న ఓ ముఠా దుబాయ్ కేంద్రంగా భారీ స్కామ్‌కు తెర లేపింది. పేపాల్‌కు చెందిన 'ఫ్రాడ్ ప్రివెన్షన్ టీమ్' పేరుతో అమెరికన్లకు మెయిల్స్ పంపి, ఫోన్లు చేసి వారి నుంచి భారీగా దండుకుంది. దీనికోసం మాదాపూర్‌లో ఎక్సిటో సొల్యూషన్స్ పేరుతో ఓ కాల్ సెంటర్‌నే ఏర్పాటు చేసింది. ఈ స్కామ్‌పై సమాచారం అందుకున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు ఆ కాల్ సెంటర్‌పై దాడి చేశారు. కీలక పాత్రధారులు సహా మొత్తం 63 మందిని అరెస్టు చేసినట్లు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు ప్రకటించారు.

డేటా షేరింగ్‌తో పరిచయం..

నగరానికి చెందిన చంద మనస్విని వెబ్ డిజైనింగ్ కోర్సు చేస్తుండగా.. ఆజాద్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. మనస్విని అమీర్‌పేటలో ఎక్సిటో సొల్యూషన్స్ పేరుతో బిజినెస్ ప్రాసెసింగ్ ఔట్‌సోర్సింగ్ (బీపీఓ) నిర్వహించింది. అప్పట్లో ఈమెకు కావాల్సిన డేటాను ఆజాద్ సరఫరా చేశాడు. గత ఏడాది అక్టోబర్‌లో ఆజాద్ ద్వారా మనస్వినికి గుజరాత్‌కు చెందిన కై వన్ పటేల్ రూపేష్ కుమార్ అలియాస్ జాదూ భాయ్ పరిచయమయ్యాడు. అమెరికన్లకు పేపాల్ పేరుతో టోకరా వేసే ప్లాన్ ఆమెకు చెప్పిన జాదూ భాయ్ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి నిర్వహించాలని కోరారు. దీనికి అంగీకరించిన ఆమె అప్పటికే తన పేరుతో ఉన్న ఎక్సిటో సొల్యూషన్స్ సంస్థనే వాడుకుందామని చెప్పింది. గత ఏడాది అక్టోబర్‌లో ఈ పేరుతో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినా... నవంబర్, డిసెంబర్ నెలలు అమెరికాలో సెలవుల సీజన్ కావడంతో అమలు వాయిదా పడింది. ఈ ఏడాది జనవరిలో మాదాపూర్‌లో కార్యాలయం లీజుకు తీసుకున్న మనస్విని అసలు కథ మొదలెట్టింది.

ఆంగ్లంపై పట్టు ఉండటంతో..

తాము టార్గెట్ చేసేది అమెరికన్లకు కావడంతో ఆంగ్లం, అందులోనూ అమెరికన్ల ఉచ్చారణ తెలిసిన వారినే టెలీ కాలర్లుగా ఏర్పాటు చేసుకోవాలని ఈ ముఠా భావించింది. సోషల్ మీడియాతో పాటు ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇచ్చిన మనస్విని ఈ రెండు అంశాల్లో పట్టున్న నాగాలాండ్‌కు చెందిన 22 మంది యువతుల్ని ఎంపిక చేసుకుంది. వీరిని నగరానికి రప్పించిన ఆమె సంజు, జేమ్స్, ప్రవీణ్ తదితరులతో టీమ్‌లు తయారు చేసి అప్పగించింది. వీళ్లు అమెరికన్లతో మాట్లాడే విధానంతో పాటు పేపాల్ పేరుతో ఎలా మోసం చేయాలనేది వారికి శిక్షణ ఇచ్చారు. ప్రతి టెలీకాలర్ రోజుకు కనీసం 30 ఫోన్లు చేయాలని షరతు విధిస్తూ, నెలకు రూ.30 వేల జీతం చెల్లించేవారు.

పేపాల్ యూజర్ నేమ్‌తో ఈ-మెయిల్...

ఈ ముఠా గూగుల్‌లో ఓ ఈ-మెయిల్ ఐడీ సృష్టించి దాని యూజర్ నేమ్ పేపాల్ ఉండేలా చేసింది. ఆ సంస్థ లోగోలతో కొన్ని లేఖలు రూపొందించింది. సూత్రధారి జాదూ భాయ్ సోదరుడు విక్కీ దుబాయ్‌లో ఉంటున్నాడు. అతడి ద్వారా వీరికి పేపాల్ కస్టమర్లకు సంబంధించిన డేటా వస్తోంది. ఈ స్కామ్ చేయడానికి టెలికాలర్లతో డైలర్ టీమ్, ఆన్‌లైన్ లావాదేవీల్లో పట్టున్న వాళ్లతో క్లోజర్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. విక్కీ నుంచి అందిన డేటా ఆధారంగా పేపాల్ కస్టమర్లకు ఆ సంస్థ పేరుతో ఫిష్పింగ్ ఈ-మెయిల్స్ పంపుతుంది. వాటిలో తమ కాల్ సెంటర్ నెంబర్లను పొందుపరుస్తూ... 'మీ పేపాల్ ఖాతా దుర్వినియోగమైంది' అంటూ సందేశం ఇచ్చేవాళ్లు. ఈ మెయిల్స్ చూసుకునే అమెరికన్లు యూజర్ ఐడీ, లోగోలు చూసి పేపాల్ నుంచే వచ్చినట్లు భావించే వాళ్లు. కంగారుతో అందులో ఉన్న కాల్ సెంటర్ నెంబర్లకు ఫోన్ చేస్తే.. వాటిని డైలర్ టీమ్ అందుకునేది. తమ వద్ద ఉన్న డేటా ఆధారంగా వినియోగదారుల లావాదేవీలు చెప్పే వాళ్లు వారిని పూర్తిగా నమ్మించే వాళ్లు.

రిఫండ్ చేస్తామంటూ..

పేపాల్ ఖాతా నుంచి దుర్వినియోగమైన మొత్తం రిఫండ్ చేస్తామంటూ కాల్‌ని క్లోజింగ్ టీమ్‌కు పంపేవాళ్లు. వీళ్లు వినియోగదారుల నుంచి వారి బ్యాంకు, వ్యక్తిగత వివరాలు తెలుసుకునే వారు. వీటి ద్వారా వారి బ్యాంకు ఖాతాలను యాక్సస్ చేసి వీలున్నంత కాజేసే వాళ్లు. ఈ మొత్తాలను బదిలీ చేయడానికి అవసరమైన అమెరికన్ బ్యాంకుల్లోని ఖాతాలను విక్కీ, జాదూ భాయ్ అందించే వాళ్లు. ఇలా వెళ్లిన మొత్తం నుంచి కొంత భాగం క్రిప్టోకరెన్సీ రూపంలో మనస్వినితో పాటు ఇతరులకు అందేది. ఇలా ఈ ఏడాది జనవరి నుంచి వీళ్లు అమెరికన్లకు కొల్లగొడుతూ పోయారు. ఈ కాల్ సెంటర్‌పై దాడి చేసిన టీజీసీఎస్‌బీ పోలీసులు మనస్విని, టెలికాలర్లతో సహా మొత్తం 63 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి 52 సెల్‌ఫోన్లు, 63 ల్యాప్‌టాప్స్, 27 మంది గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నారు. జాదూ భాయ్, విక్కీ, ఆజాద్ సహా పరారీలో ఉన్న సూత్రధారుల కోసం గాలిస్తున్నారు. వీళ్లు రూ.వందల కోట్లు కొల్లగొట్టి ఉంటారని అంచనా. అమెరికా కాన్సులేట్ సహా ఏజెన్సీల సహాయం తీసుకోవాలని నిర్ణయించారు.

జీహెచ్ఎంసీ టార్గెట్ 68,478 గ్రూపులు


కొత్తగా 'సెల్ఫ్ హెల్ప్' కోసం.. మహిళా దినోత్సవం నేపథ్యంలో

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటికే వివిధ బాధ్యతలతో సతమతమవుతున్న జీహెచ్ఎంసీ యూసీడీ విభాగానికి మున్సిపల్ పరిపాలన శాఖ మరో పెద్ద బాధ్యత అప్పగించింది. కాగా.. ఇప్పటికే తమ విభాగం చేయాల్సిన పనులు సజావుగా ముందుకు సాగకుండా.. కుటుంబ సర్వే, రేషన్ కార్డుల సర్వేతో సహా స్ట్రీట్ వెండర్ల ఇబ్బందుల పరిష్కారం, ప్రభుత్వ కార్యక్రమాలకు జనసమీకరణ.. ఇలా ఎన్నో పనులను అప్పజెప్పుతుండటంతో.. వాటిని పూర్తి చేయలేక ఆ విభాగం సతమతవుతోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మహిళాశక్తి క్యాంటీన్ ఏర్పాటుతో పాటు ఇతరత్రా బాధ్యతలను అప్పగించారు.

కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలి

మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తుండటంతో మహిళా దినోత్సవం నుంచి వారికి సంబంధించిన కార్యక్రమాల్ని మరింత విస్తృతం చేయాలని బల్దియా భావిస్తోంది. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులనూ భారీ సంఖ్యలో ఏర్పాటు చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకుంది. జీహెచ్ఎంసీలో ప్రస్తుతం దాదాపు 50 వేల సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల్లో దాదాపు 5 లక్షల మంది సభ్యులున్నారు. బీపీఎల్ పరిధిలోకొచ్చే పేద మహిళల్లో ఇంకా గ్రూపు సభ్యులు కాని వారిని గుర్తించి 68,478 గ్రూపులు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అంటే.. ప్రస్తుతమున్న గ్రూపుల కంటే ఇంకా ఎక్కువ గ్రూపుల్ని ఏర్పాటు చేయాలన్న మాట.

- మహిళా ఓటర్ల లెక్కలు, గ్రూపుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు తదితరాలను పరిగణనలోకి తీసుకొని జీహెచ్ఎంసీలో ఇన్ని గ్రూపుల ఏర్పాటు లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇందులో సగం గ్రూపుల్ని ఈ నెలాఖరులోగా ఏర్పాటు చేసి మిగతా సగం గ్రూపుల్ని జూన్ వరకు ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఈ మేరకు ఇటీవల సర్క్యులర్ జారీ చేసింది. ఇందుకుగాను ప్రతి మంగళవారం వార్డుల్లోని బస్తీల్లో సమావేశాలు నిర్వహించాలని సూచించింది. జీహెచ్ఎంసీతో పాటు గ్రేటర్ పరిధిలోకి వచ్చే కంటోన్మెంట్ బోర్డు, శివార్లలోని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని పురపాలికల్లోనూ కొత్త గ్రూపుల్ని ఏర్పాటు చేయాల్సిందిగా టార్గెట్లను విధించింది.



ఏర్పాటు చేయాల్సిన గ్రూపుల లక్ష్యం ఇలా..

జీహెచ్ఎంసీ : 68,478	కంటోన్మెంట్ బోర్డు: 1845
మేడ్చల్ జిల్లా పరిధిలో: గుండ్ల పోచంపల్లి (36), పోచారం (68), తూంకుంట (4), జవహర్‌నగర్(301), ఘట్‌కేసర్ (60), కొంపల్లి (121), దమ్మాయిగూడ(255), నిజాంపేట (1214), బోడుప్పల్ (254), దుండిగల్ (38), నాగారం(155), మేడ్చల్ (96), పీర్జాదిగూడ (314).	**రంగారెడ్డి జిల్లా పరిధిలో:** బండ్లగూడ జాగీర్ (528), మీర్‌పేట (583), మణికొండ(493), శంషాబాద్ (130), నార్సింగి (61), తుర్కయాంజాల్ (123), బడంగ్‌పేట (502), పెద్దఅంబర్‌పేట (162), ఆదిభట్ల (11), తుక్కుగూడ (14), జల్‌పల్లి (511), ఇబ్రహీం పట్నం (20), కొత్తూరు (7).

పొద్దున పొగమంచు.. మధ్యాహ్నం ఎండ దంచు!



శివారులో ఉదయం

నగర శివారు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల వరకు పొగ మంచు కురుస్తుండటంతో వాహనదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. మసక చీకటి అలుముకోవడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని మరీ వెళ్తున్నారు. కాగా.. ఉదయం 10 గంటల దాటిదంటే చాలు సూరీడు సుర్రుమంటున్నాడు. గురువారం శివారులో.. నగరంలో కనిపించిన ఈ చిత్రాలు పొద్దున పొగమంచుకు.. పగలు ఎండ వేడిమికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.
- సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సిటీలో మధ్యాహ్నం

హీరో నాగార్జున పరువునష్టం కేసు వాయిదా

- మంత్రి కొండా సురేఖ, హీరో నాగార్జున గైర్హాజరు
- విచారణ మార్చి 12కు వాయిదా

సిటీ కోర్టులు : రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో విచారణ జరిగింది. ఈ విచారణకు పిటిషనర్ నాగార్జునతోపాటు ప్రతివాది మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడంతో వారి తరుపున న్యాయవాదులు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణను మార్చి 12కు వాయిదా వేసింది. సినీ అగ్ర హీరో నాగార్జున కుమారుడైన హీరో నాగాచైతన్య–సమంత విడాకుల విషయంపై మంత్రి కొండా సురేఖ అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని, ఆమె చేసిన వ్యాఖ్యలతో తన కుటుంబ పరువుపోయిందని నాగార్జున నాంపల్లి కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఊరట

మూడు కేసులను కొట్టివేసిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు

సిటీ కోర్టులు : గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై నమోదైన మూడు కేసులను కొట్టివేస్తున్నట్లు నాంపల్లి లోని ప్రజాప్రతినిధుల కోర్టు గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. శ్రీరామనవమి ర్యాలీ, గత ఎన్నికల్లో చేపట్టిన ప్రచార ర్యాలీల సందర్భంగా సిటీలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని, దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సోషల్ మీడియాలో తప్పుడు స్పీచ్‌లు ఇచ్చారని ఆయనపై పలువురు సిటీలోని ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణలో భాగంగా రాజాసింగ్ తరుపు న్యాయవాది కరుణసాగర్ గతవారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో వాదనలు వినిపించారు. పోలీసుల తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వు చేసింది. దీంతో గురువారం చేపట్టిన విచారణలో రాజాసింగ్ తరుపు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం ఆయనపై నమోదైన మూడు కేసులను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సివిల్‌సప్లై అధికారుల ఆకస్మిక దాడులు

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలోని ఫత్తేపూర్ రేషన్ దుకాణంపై గురువారం సివిల్‌సప్లై అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. యాదయ్యగౌడ్ నిర్వహిస్తున్న రేషన్ దుకాణంలో పెద్ద ఎత్తున బియ్యం నిల్వలున్నాయని.. వీటిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నాడని పలువురు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన సివిల్‌సప్లై అధికారులు ఆకస్మికంగా దాడి చేసి దుకాణం సీజ్ చేశారు. ఎన్ని క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉంచారో శుక్రవారం లెక్కించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఇదే విషయమై తహసీల్దార్ సురేందర్‌ను వివరణ కోరగా సివిల్ సప్లై అధికారుల ఆదేశాల మేరకు రేషన్ దుకాణం వద్దకు ఆర్ఐను పంపామన్నారు.

అంబర్‌పేటలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్

- ప్రభుత్వ స్థలాన్ని చూపిస్తే నిర్మిస్తామని మంత్రి పొన్నం హామీ
- ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయం ప్రారంభం
- స్థానిక సమస్యల్ని ఏకరవు పెట్టిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
- ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మంత్రి



సాక్షి, సిటీబ్యూరో: స్థానిక ప్రజా ప్రతినిధులు అనువైన ప్రభుత్వ స్థలం చూపిస్తే అంబర్‌పేటలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన అంబర్‌పేటలో కొత్తగా నిర్మించిన ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... 'అంబర్‌పేటలో ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి పోలీసు విభాగంతో చర్చించి కొంత స్థలం ఇప్పిస్తాం. మున్సిపల్ కార్యాలయం, సబ్–రిజిస్ట్రార్ ఆఫీస్‌లు మంజూరు చేయాలంటే నిర్మాణానికి స్థలాలు చూపించాల్సిన అవసరం ఉంది. ఆర్థిక సంక్షోభం కారణంగానే ప్రభుత్వం గత ఏడాది పోలీసులకు సంబంధించిన కొన్ని సమస్యలు పరిష్కరించలేకపోయింది. భవిష్యత్తులో పోలీసు సంక్షేమానికి పెద్దపీట వేస్తాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు, సంయుక్త సీపీలు విక్రమ్ సింగ్ మాన్, జోయల్ డెవిస్‌లతో పాటు ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ఏళ్ల క్రితం నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థలో ఉందని, ఫైర్ స్టేషన్, రిజిస్ట్రార్ ఆఫీస్, మున్సిపల్ కార్యాలయాలు మంజూరు చేయాలని కోరారు. స్థలం ఉన్నప్పటికీ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీల నిర్మాణం జరగలేదని. స్థానిక సమస్యలను పరిష్కరించాలి మంత్రి పొన్నంను కోరారు.

గుడి మార్గాన్ని పోలీసులు కబ్జా చేశారు: వీహెచ్

' స్థానిక అమ్మ వారి గుడికి వెళ్లే మార్గాన్ని పోలీసులు కబ్జా చేశారు. దీంతో స్థానిక మహిళలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఆ గుడికి వెళ్లడానికి అవసరమైన దారి ఇవ్వాలి' అని మాజీ ఎంపీ వీ హనుమంతరావు అన్నారు. ఈ కార్యక్రమం జరుగుతుండగా మైక్ కొద్దిసేపు పని చేయలేదు. దీనిపై స్పందించిన వీహెచ్ 'కాంగ్రెస్సోళ్లు, పోలీసోళ్ల మీటింగ్స్ ఇలానే ఉంటాయి. వీళ్లు మైకులు ఖరాబు చేస్తారు' అంటూ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి వీహెచ్, పొన్నం ప్రభాకర్ ఒకే వాహనంలో వచ్చారు. వారికి స్వాగతం పలికేందుకు వెళ్లిన కొత్వాల్ ఆనంద్... వీహెచ్‌ను ఉద్దేశించి 'మీ ఇలాకాలోకి వచ్చాం' అనగా... 'సిటీ మొత్తం మీ ఇలాకానే... ఇక మా ఇలాకాలోకి వచ్చేదేముంది' అంటూ వీహెచ్ సమాధానం ఇచ్చారు.

ఎగ్జిబిషన్ సొసైటీ సహకారంతో పూర్తి:

ఈ కార్యాలయ నిర్మాణానికి 2015 అంచనాల ప్రకారం 2018లో శంకుస్థాపన జరిగింది. అయితే ఆ తర్వాత నిర్మాణ వ్యయం చాలా పెరిగిపోయింది. నేను రెండోసారి సీపీగా బాధ్యతలు స్వీకరించే నాటికి పనులు అసంపూర్తిగా ఉండటంతో పాటు ప్రారంభానికి సిద్ధం చేయడానికి కనీసం రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు అవసరమని అధికారులు చెప్పారు. ఆ రోజుకు పోలీసు సంక్షేమ నిధిలో కేవలం రూ.లక్ష బ్యాలెన్స్ ఉంది. దీంతో అప్పట్లో మా వద్దకు వచ్చిన ఎగ్జిబిషన్ సొసైటీకి విషయం చెప్పి, రూ.15 లక్షలు మంజూరు చేయించుకుని పనులు పూర్తి చేశాం.

– సీవీ ఆనంద్, పోలీసు కమిషనర్

దూరదర్శన్ మాజీ డైరెక్టర్ బాలకృష్ణ కన్నుమూత



లక్డీకాపూల్ : దూరదర్శన్ మాజీ డైరెక్టర్ దేవళ్ల.బాలకృష్ణ (92) గురువారం కన్నుమూశారు. హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం సంచాలకుడిగా పని చేయక ముందు ఆయన హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఆయన మృతి పట్ల ఆకాశవాణి , దూరదర్శన్ కార్యక్రమ సిబ్బంది సంతాపం తెలిపారు. ఆకాశవాణి, దూరదర్శన్ అభివృద్ధికి బాలకృష్ణ చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. శుక్రవారం ఉదయం అంబర్‌పేట శ్మశానవాటికలో బాలకృష్ణ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన బంధువు సాయి ప్రసాద్ పేర్కొన్నారు.

నేటి నుంచి ఓపెన్ టెన్నిస్ టోర్నీ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ (జేఐసీ)–హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హోటా) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నేషనల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ పోటీలకు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు జేఐసీ సెక్రెటరీ కిలారు రాజేశ్వర రావు తెలిపారు. జాతీయ స్థాయి హోటా, జేఐసీ నేషనల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ నగరంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 7 నుంచి 9 వరకు జరగనున్న ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 366 మంది టెన్నిస్ క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. 10 కేటగిరిల్లో సింగిల్స్, డబుల్స్ పోటీలకు 425 ఎంట్రీలు వచ్చాయన్నారు. గత కొంతకాలంగా ఈ పోటీల్లో పాల్గొంటున్న జూబ్లీహిల్స్ క్లబ్ సభ్యులను సీపీ చేతుల మీదుగా సత్కరించనున్నట్లు తెలిపారు. తమ క్లబ్ సభ్యుల్లో ఎనిమిది మంది 80 ఏళ్ల పైబడిని వారు ఉన్నారని, వారిని సత్కరించుకోవడం గౌరవంగా భావిస్తున్నామన్నారు.

ఫేస్‌బుక్‌లో పరిచయం... పుస్తెలతాడుతో పరారీ

వెంగళరావునగర్: ఫేస్‌బుక్‌లో పరిచయమై మాయ మాటలు చెప్పి ఓ మహిళ నుంచి పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడకు చెందిన మహిళకు ఫేస్‌బుక్‌లో గోల్డ్ గ్రూప్ ద్వారా మహేష్ నారాయణ దాస్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆమె నంబర్ తీసుకున్న అతను తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. గత ఫిబ్రవరిలో తన పుస్తెలతాడుకు బంగారు తీగ అల్లి ఇవ్వాలని కోరడంతో వారి ఇంటికి వచ్చాడు. ఇంటి వద్దే తీగ అల్లి ఇవ్వాలని కోరగా తాను కట్టర్ తీసుకురావడం మరచిపోయానని, కూకట్‌పల్లిలోని తన బంధువుల దుకాణానికి వెళ్లి అరగంటలో తెస్తానని చెప్పాడు. అతని మాటలు నమ్మిన బాధితురాలు 40 గ్రాముల పుస్తెలతాడు, పుస్తెలు అతడికి ఇచ్చింది. కూకట్‌పల్లికి వెళ్లిన మహేష్ తన ఆధార్‌కార్డు, తండ్రి నెంబర్, షాప్ ఫొటోలు ఆమెకు వాట్సాప్ చేశాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో సదరు మహిళ ఫోన్ చేయగా తనకు యాక్సిడెంట్ అయిందని, త్వరలోనే వస్తానని చెప్పాడు. అయితే ఈ నెల 4న బాధితురాలికి ఫోన్ చేసిన మహేష్ ఆమెను దుర్భాషలాడటమే గాక పుస్తెలతాడు ఇవ్వనని, నీ ఇష్టం వచ్చిన వారికి చెప్పుకో అంటూ బెదిరించాడు. దాంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ

- ఒకరి మృతి
- పది నిమిషాల్లో వస్తానని చెప్పి.. తిరిగిరాని లోకాలకు...



నగేష్ (ఫైల్)

చిలకలగూడ : మద్యం మత్తులో స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ మహ్మద్‌గూడ, శ్రీనివాసనగర్ ప్రాంతాలకు చెందిన పాస్టం నగేష్ (25), నర్సింగ్, శబరి, సాయికిరణ్ స్నేహితులు. నగేష్ శుభకార్యాల్లో బ్యాండ్ వాయించేవాడు. ఈనెల 5న కుటుంబ సభ్యులతో కలిసి మహ్మద్‌గూడలోని ఓ ఫంక్షన్‌కు వెళ్లిన అతను రాత్రి 9 గంటల ప్రాంతంలో వచ్చాడు. అదే సమయంలో స్నేహితుల నుంచి ఫోన్ రావడంతో పది నిమిషాల్లో వస్తానని చెప్పి బయటికి వెళ్లిన అతను తన స్నేహితులు నగేష్, నర్సింగ్, శబరి, సాయికిరణ్‌తో కలిసి పార్శిగుట్టలోని ఓ వైన్‌షాపు వద్ద మద్యం తాగారు. వైన్‌షాపు మూసివేసే సమయంలో మరికొంత మద్యాన్ని కొనుగోలు చేసి మహ్మద్‌గూడలోని ముత్యాలమ్మ ఆలయం వద్దకు వచ్చిన వారు మద్యంతో పాటు గంజాయి సేవించారు. ఈ క్రమంలో పచ్చబొట్టు విషయమై నగేష్, శబరి మధ్య గొడవ జరగడంతో నర్సింగ్ కలుగజేసుకున్నాడు. దీంతో వారు ఒకరినొకరు దూషించుకుంటు గల్లాలు పట్టుకుని ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో నర్సింగ్ చేతికి అందిన కర్రతో నగేష్‌పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో శబరి, సాయికిరణ్ అపస్మారకస్థితిలో పడి ఉన్న నగేష్‌ను సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నిందితుడు నర్సింగ్, మృతుడు నగేష్ బంధువులు కావడం గమనార్హం. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నర్సింగ్‌తోపాటు మిత్రులు శబరి, సాయికిరణ్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



రాజు మృతదేహం

జగద్గిరిగుట్ట : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వరంగల్ కు చెందిన రాజు (40) ఆస్ బెస్టాస్ కాలనీలో ఉంటూ సెంట్రింగ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసైన రాజు నెల రోజులుగా పనికి వెళ్లడం లేదు. గురువారం సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్న అతను సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో టోకరా



వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ రావు తదితరులు

నలుగురు నిందితుల అరెస్ట్

డబీర్‌పురా: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి పలువురిని మోసం చేసిన నలుగురు వ్యక్తులను గురువారం దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఛత్రినాక పోలీసులు అరెస్ట్ చేశారు. పురానీహవేలిలోని కార్యాలయంలో దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్–2 అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ రావు అధికారులతో కలిసి వివరాలు వెల్లడించారు. ఛత్రినాక ప్రాంతానికి చెందిన జ్యోతి, సునీల్ సింగ్ సామాజిక కార్యకర్తలుగా పని చేసేవాడు. ప్రజలకు కుల, ఆదాయ, జనన, మరణ ధృవీకరణ పత్రాలను ఇప్పించ,డంలో సహాయం చేస్తూ అనుబంధాన్ని ఏర్పచుకున్నారు. దీనిని అదనుగా చేసుకుని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తామంటూ అమాయకులను మోసం చేసేందుకు పథకం పన్నారు. ఇందులో భాగంగా వారిరువు లబ్ధిదారుల నుంచి ధృవీకరణ పత్రాలను సేకరించేందుకు సంతోష్‌నగర్‌కు చెందిన రమేశ్, ఛత్రినాకకు చెందిన నితిన్ కుమార్‌లను నియమించుకున్నారు. వారిద్దరూ పాత బస్తీలోని పలు ప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేశారు. ఏళ్లు గడుస్తున్నా డబుల్ బెడ్ రూం ఇళ్ల విషయమై ఎలాంటి పురోగతి లేకపోవడంతో ప్రజలు జ్యోతి, సునీల్ సింగ్‌లపై ఒత్తిడి తెచ్చారు. దీంతో వారు నకిలీ ప్రభుత్వ రబ్బర్ స్టాంపులను తయారు చేసి 2 బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ పేరుతో ప్రొసీడింగ్ ఆర్డర్లను రూపొందించారు. హైటెక్ సిటీ, తట్టి అన్నారం, కొల్లూరు తదితర ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించినట్లు నమ్మించి నకిలీ పత్రాలను అందజేశారు. దీనిపై సమాచారం అందడంతో దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛత్రినాక పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి జ్యోతి, సునీల్ సింగ్, రమేశ్, నితిన్ కుమార్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. లక్ష నగదు, రబ్బర్ స్టాంపులు, ప్రింటర్, ల్యాప్‌టాప్, నకిలీ అలాట్‌మెంట్ లెటర్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. 2020లో జ్యోతి ఇదే తరహాలో మోసాలకు పాల్పడినందున మొఘల్‌పురా, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు ఎం.మహేశ్, కె.నర్సింహులు, జి.అంజనేయులు, ఎన్.నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

'చెత్తవేస్తే ఈ–చలాన్' పై అధికారులకు శిక్షణ



సాక్షి,సిటీబ్యూరో: ఎక్కడ పడితే అక్కడ చెత్త, నిర్మాణ.. కూలివేతల(సీఅండ్‌డీ) వ్యర్థాలు వేసేవారిని గుర్తించి ఈ–చలాన్ ద్వారా పెనాల్టీలు విధించి, యూపీఐ ద్వారా వసూలు చేసేందుకు సిద్ధమైన జీహెచ్‌ఎంసీ సంబంధిత ఏఎంఓహెచ్‌లు, డీఈఈలు, ఏసీపీలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. శానిటేషన్ విభాగం అడిషనల్ కమిషనర్ సీఎన్ రఘుప్రసాద్, ఐటీ విభాగం అడిషనల్ కమిషనర్ అనురాగ్ జయంత్ వారికి శిక్షణ ఇచ్చారు. ఈ–చలాన్ విధించేందుకు టీసీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన విధానాన్ని, యాప్‌ను కాంప్రహెన్సివ్ చలాన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(సీసీఎంఎస్) యాప్‌గా వ్యవహరిస్తున్నారు. వారితోపాటు యాప్‌ను నిర్వహించే టీజీ ఆన్‌లైన్ ప్రతినిధులు యాప్ ఎలా పనిచేస్తుందో, ఎలా వాడాలో వివరించారు. తొలుత పైలట్‌గా చెత్త డబ్బాల్లో కాకుండా బయట చెత్తవేసే వాణిజ్య ప్రాంతాల్లోని వ్యాపారులు, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నవారు, సీఅండ్‌డీ వేస్ట్ వేస్తున్న వారికి పెనాల్టీలు విధించాలని సూచించారు. సంబంధిత అధికారులు జారీ అయిన చలాన్‌లు, చెల్లింపులు జరిగినవి, పెండింగ్‌లో ఉన్నవి ఎప్పటికప్పుడు చూసుకోవచ్చునన్నారు. చెత్త వేసేవారికి ఎస్ఎంఎస్ వెళ్తుందని, స్వచ్ఛ నిబంధనలు ఉల్లంఘించి వేసిన వ్యర్థాల ఫొటో అక్షాంక్ష, రేఖాంశలతో వస్తుందన్నారు. దేనికి ఎంత పెనాల్టీయో సాఫ్ట్‌వేర్‌లోనే పొందుపరిచి ఉంటుందని వారు వివరించారు.

దాబా బోర్డుల తొలగింపు

నగరంలో పలు ప్రాంతాల్లో సంతోష్ దాబా పేరిట వెలిసిన దాబాల బోర్డులను హైకోర్టు ఆదేశాలతో అధికారులు గురువారం తొలగించారు. ఇతరులు తమ పేరు వాడుకుంటున్నారని సంతోష్ దాబా యజమాని సునీల్ వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం వాటిని తొలగించాల్సిందిగా ఆదేశించింది. హైదరాబాద్‌లో 200కు పైగా హోటళ్లు ఈ పేరుతో బోర్డులు ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. – సాక్షి, సిటీబ్యూరో



మహిళాభ్యున్నతితోనే దేశాభివృద్ధి

రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ శిఖాగోయల్



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్

రాయదుర్గం: మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశ అభ్యున్నతి సాధ్యమని రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ శిఖా గోయల్ అన్నారు. గురువారం నాలెడ్జి సిటీ, టీహబ్ ప్రాంగణంలోని ది మార్వెల్ హాల్‌లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో 'ఎంపవర్ హర్ యాక్సిలరేటింగ్ ఈక్వాలిటీ అండ్ ఎంపవర్ మెంట్' అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శిఖా గోయల్ మాట్లాడుతూ మహిళా సాధికారత అంటే న్యాయం, సమానత్వం కాదని, సాధికారత శూన్యంలో జరగదని, అన్ని రంగాల్లో అభివృద్ధితోనే అది సాధ్యమన్నారు. తెలంగాణ పోలీసులు దేశంలో అన్ని కార్యక్రమాల్లో ముందున్నారని, ఇందుకు షీటీమ్, భరోసా కార్యక్రమాలే నిదర్శనంగా పేర్కొన్నారు. సుప్రీంకోర్టు సైతం 'భరోసా' నమూనాను ప్రశంసించిందని గుర్తు చేశారు. కార్యాలయాల్లో లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్న మహిళలకు భద్రత కల్పించేందుకు 'సహాస్'(ఎస్ఏహెచ్ఏఎస్) పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 300 మందికి పైగా మహిళా నిపుణులు, వ్యవస్థాపకులు, వ్యాపారులు, విద్యార్థులు, యువతులు పాల్గొన్నారు.

ఔటర్‌పై ఘోర ప్రమాదం

- అతివేగంగా వచ్చి ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ఇద్దరి దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం



రాములు (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. రావిర్యాల వండర్‌లా సమీపంలోని ఎగ్జిట్ నంబర్ 13 సమీపంలో డివైడర్‌పై ఉన్న మొక్కలకు హెచ్ఎండీఏ ట్యాంకర్ ద్వారా కొంగర కలాన్‌కు చెందిన చెనమోని రాములు (55) నీళ్లు పోస్తున్నాడు. ఉప్పల్‌లో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై ఘట్‌కేసర్ వద్ద ఔటర్ ఎక్కిన నాగర్ కర్నూల్ జిల్లా, చిన్నాంబాయి మండలం, బెక్కెం గ్రామానికి చెందిన కోషిక రవీందర్‌రెడ్డి, బత్తిని కృష్ణారెడ్డి (టీఎస్07జెఎం 1210) కారులో అతివేగంగా వెనుక నుంచి వచ్చి ట్యాంకర్‌తో నీరు పోస్తున్న రాములును ఢీకొట్టారు. దీంతో అతను గాల్లోకి ఎగిరి డివైడర్‌పై పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు.. ట్యాంకర్ వెనుక భాగం కిందికి దూసుకెళ్లడంతో ముందు సీట్లో కూర్చున్న కోషిక రవీందర్‌రెడ్డి (50) అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. కారు నడుపుతున్న బత్తిని కృష్ణారెడ్డి (45) పరిస్థితి విషమంగా ఉండటంతో నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో కారు 120– 140 స్పీడ్‌లో ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నా రు. ట్యాంకర్ కిందికి దూసుకెళ్లడంతో రవీందర్‌రెడ్డి మృతదేహంతో పాటు కృష్ణారెడ్డిని బయటకు తీసేందుకు పోలీసులు ఎంతో శ్రమించాల్సి వచ్చింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి ఎస్ఐ వెంకటేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఇద్దరు స్నేహితులు..

రోడ్డు ప్రమాదానికి గురైన కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి ఇద్దరూ ఒకే గ్రామానికి చెందిన స్నేహితులు. కృష్ణారెడ్డి కొండాపూర్‌లో ఉంటూ స్వీట్ షాప్ నిర్వహిస్తుండగా, రవీందర్‌రెడ్డి బోరబండలో ఉండేవాడు. వీరి మృతితో బెక్కంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



కారులో ఇరుక్కుపోయిన రవీందర్‌రెడ్డి మృతదేహం

కూలీ పనికి వెళితే..

కొంగరకలాన్‌కు చెందిన రాములు ఓ కాంట్రాక్టర్ వద్ద కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు.

మహేశ్వరరెడ్డికి డాక్టరేట్



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ సచివాలయంలో ఇరిగేషన్ విభాగంలో పనిచేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.వి.మహేశ్వరరెడ్డికి డాక్టరేట్ పట్టా లభించింది. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 'రిగిడ్ పేవ్‌మెంట్ అఫ్ షార్ట్ పానెల్డ్ కాంక్రీట్ పేవ్‌మెంట్' అనే అంశంపై పరిశోధన చేసి సమగ్ర నివేదిక సమర్పించినందుకు జేఎన్‌టీయూ అనంతపురం పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో...) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 23, బజ్జీమిర్చి 13, క్యాప్సికమ్ 33, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 15, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 21, చామగడ్డ 55, మొరంగడ్డ 35, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

దుర్భాషలాడుతున్నాడని కత్తితో దాడి

నిందితుడి అరెస్టు

ఖైరతాబాద్: దుర్భాషలాడుతున్నాడనే కోపంతో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... నసీర్ ఉస్సేన్ అనే వ్యక్తి ఖైరతాబాద్ రాజ్‌దూత్ చౌరస్తా సమీపంలోని మయూరి వైన్‌షాప్ వద్ద గార్బేజ్ తరలించే పనిచేస్తుంటాడు. విగ్నేష్ విరాట్ హోటల్ వద్ద పాన్‌షాప్ నిర్వహిస్తున్న సయ్యద్ అతీక్ ఉస్సేన్ వద్దకు సిగరెట్ల కోసం బుధవారం సాయంత్రం వచ్చాడు. చేతిలో కత్తితో వచ్చిన నసీర్ ఉస్సేన్‌ను కత్తితో ఎందుకు తిరుగుతున్నావని పాన్‌షాపు యజమాని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన ఆయన పాన్‌షాపు యజమాని సయ్యద్ అతీక్ ఉస్సేన్‌పై దాడిచేశాడు. ఈ సంఘటనలో అతీక్ ఉస్సేన్ ఛాతిపై గాయాలయ్యాయి. అడ్డుకునేందుకు ప్రయత్నించిన సయ్యద్ జావీద్ ఉస్సేన్ అనే వ్యక్తికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. తరచూ నసీర్ ఉస్సేన్‌ను పాన్‌షాపు యజమాని దుర్భాషలాడుతుండేవాడని ఈ కారణంగానే కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడండి

సనత్‌నగర్: అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులకు లేకుండా చూడాలని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని గురిమూర్తినగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ రామేశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి రోటరీ క్లబ్ యువజనోత్సవాలు

కాచిగూడ: వరల్డ్ రోటరాక్ట్ డే సందర్భంగా మార్చి 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రెండు తెలుగు రాష్ట్రాలలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఇంద్రజాలికుడు, రోటరీ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ యూత్ చైర్మన్ టి.విజయకాంత్ వెల్లడించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం, గంజాయి, పొగాకు అనేవి యువత ఎక్కువగా వాడుతున్నారని అన్నారు. ఈ మూడు మాదకద్రవ్యాలను వారి నుంచి దూరం చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ మేరకు యువతకు వరల్డ్ రోటరాక్ట్ డే సందర్భంగా అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 13న నిజాం కాలేజీలో యోగా ట్రెడిషనల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ భాగ్యనగర్ అధ్యక్షుడు ఆదినారాయణ, జి.సురేందర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, హరికిషన్, టి.కృష్ణమూర్తి, పసుపులేటి గోపాల్, షాని సోలోమన్, తదితరులు పాల్గొన్నారు.

అగ్రసేన్ బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభం

కాచిగూడ: హిమాయత్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అగ్రసేన్ బ్యాంక్ 6వ బ్రాంచ్‌ను గురువారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కుమార్ కేడియా, బోర్డు డైరెక్టర్ల నాయకత్వంలో అగ్రసేన్ బ్యాంక్ వినియోగదారులకు సేవలు అందిస్తోందన్నారు. బ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్ కేడియా మాట్లాడుతూ.. బ్యాంక్ కొత్త డిపాజిట్ స్కీమ్‌లను కూడా పరిచయం చేసిందన్నారు. ఇందులో 555 రోజుల డిపాజిట్‌తో 9శాతం వడ్డీ (9.5 శాతం సీనియర్ సిటిజన్స్‌కు) ఫ్యూచర్ స్టార్స్ ఆర్డీస్కీమ్, దీర్ఘకాలిక పొదుపు లక్ష్యాలకు మద్దతుగా రూపొందించబడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ అనిల్‌కుమార్, ఎఫ్టీసీసీఐ అధ్యక్షుడు సురేష్ సింఘాల్, సీనియర్ న్యాయవాదులు ఎం.రాజేందర్‌రెడ్డి, సునిల్, జనరల్ మేనేజర్ సీవీ రావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం.. పోషకాలు పుష్కలం!

- ప్లాస్టిక్ బియ్యం అనే అపోహ
- పక్కన పడేస్తున్న లబ్ధిదారులు
- మరికొందరు దళారీలకు విక్రయిస్తున్న వైనం
- తినడం వల్ల రక్తహీనత తగ్గుతుందంటున్న అధికారులు
- అవగాహన కల్పిస్తే మరింత ప్రయోజనం

బంజారాహిల్స్: రేషన్ బియ్యం ఇంట్లో వండుకునేందుకు ప్రజలు వెనకాడుతున్నారు. వాటిని ఎక్కడికక్కడ అమ్మేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో దళారీలకూ విక్రయిస్తున్నారు. రేషన్ బియ్యమే కదా? అని చాలామంది లబ్ధిదారులు వీటిని తేలిగ్గా తీసుకుంటున్నారు.

◆ రేషన్ బియ్యంలో పోషకాలు మెండుగా ఉన్నాయని, ఈ బియ్యం పోషకాల మిళితమని చాలామందికి తెలియడం లేదు. దీనిపై లబ్ధిదారులకు సంబంధిత అధికారులు అవగాహన కూడా కలిగించడం లేదు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పోషకాల బియ్యాన్ని లబ్ధిదారులకు సరఫరా చేస్తున్నది. ఇది తెలియని చాలామంది బియ్యం కొనుగోలు చేసిన కొద్దిసేపటికే కిలో రూ. 10లకు దళారీలకు విక్రయిస్తున్నారు.

◆ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఈ విషయంలో ప్రజలకు అవగాహన కలిగించే దిశలో ఏమాత్రం కార్యక్రమాలు చేపట్టకపోవడంతో రేషన్ బియ్యం పోషకాల మిళితం అనే విషయం ప్రజలకు తెలియకుండా పోతుంది.

◆ పౌర సరఫరాల శాఖ ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో మొత్తం 81 రేషన్‌షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో 83,013 తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ రేషన్‌కార్డుల్లో 2,92,882 మంది ప్రతి నెల ఉచితంగా 6 కిలోల పోషక విలువలు ఉన్న రేషన్ బియ్యాన్ని తీసుకుంటున్నారు.

◆ రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధిలో ప్రతి నెల 18,19,011 కిలోల బియ్యం తీసుకుంటున్నారు. రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వస్తున్నాయని చాలామంది భ్రమపడుతున్నారు. ప్రజలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని రైస్ మిల్లుల్లో బ్లెండింగ్ యూనిట్లను ఏర్పాటు చేయించింది. సాధారణ బియ్యానికి పోషకాలు జత చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. క్రమం తప్పకుండా ఈ బియ్యాన్ని వాడితే మహిళల్లో రక్తహీనత తగ్గుతుందని ప్రభుత్వం పేర్కొంటుంది.

మధ్యాహ్న భోజనానికి ఇవే...

◆ పోషకాల బియ్యం నరాల పటిష్టతకు, రక్తం వృద్ధి చెందడానికి, మెదడు సక్రమంగా పనిచేయడానికి ఉపయోగపడతాయి. ఇవే బియ్యాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి, అంగన్‌వాడీలకు సరఫరా చేస్తున్నారు. ఈ పోషకాల బియ్యంపై చాలామందిలో అపోహలు ఉన్నాయి. కొందరు ప్లాస్టిక్ బియ్యంగా భావించి పక్కన పారేస్తున్నారు.

◆ ఈ పోషకాల బియ్యాన్ని తలసేమియా వ్యాధి బాధితులు మినహా అందరూ తినవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల్లో రక్తకణాలు కొడవలి ఆకారంలో ఉండటం వల్ల నరాల్లో ఆగిపోయే ప్రమాదం పొంచి ఉంటుంది. అందుకే తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఈ పోషకాల బియ్యం అందించరు.

◆ రక్తహీనతతో బాధపడుతున్న వారు ఈ బియ్యం తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

100 కిలోలకు ఒక కిలో పోషక బియ్యం...

◆ ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పోషకాల బియ్యాన్ని పంపిణీ చేస్తుంది. 100 కిలోల బియ్యానికి ఒక కిలో పోషకాల బియ్యాన్ని జత చేస్తున్నారు. రైస్ మిల్లుల్లోనే ఈ ప్రక్రియ పూర్తి చేయిస్తున్నారు.

◆ ఈ రేషన్ బియ్యంలో బీ12, ఐరన్, ఫోలిక్ యాసిడ్ లాంటి పోషకాలు ఉంటాయని, లబ్ధిదారులు తప్పనిసరిగా తినాలని పౌర సరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నారు.

◆ ప్రజలకు ఈ బియ్యం ప్రాధాన్యతపై పెద్దగా అవగాహన ఉండటం లేదు. బియ్యం వండే ముందు, కడిగినప్పుడు నీటి మీద తేలేవే అసలైన పోషకాల సమ్మిళిత బియ్యం. ఈ బియ్యాన్ని చాలామంది ప్లాస్టిక్ బియ్యంగా భావించి మరికొంతమంది చైనా బియ్యంగా అభిప్రాయపడుతూ బయట పడేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. నీళ్లపై తేలిన గంజులను పక్కకు తీసి మిగిలిన బియ్యం కడిగేసుకోవాలి. తర్వాత పక్కకు తీసిన బియాన్ని మిగతా బియ్యంతో కలిపి వండుకోవాలి.



పోషకాలు కలిపిన బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

నేత్రపర్వం.. శ్రీవారి చక్రస్నానం





బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో స్వామివారి స్నపన తిరుమంజనం, చక్రస్నాన వేడుకలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉన్న పుష్కరిణిలో జరిగిన ఈ చక్రస్నాన ఘట్టంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి ఉత్సవమూర్తులకు, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణ వేడుకలను అర్చకులు వేడుకగా నిర్వహించారు. నగర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నీటిని అందిస్తున్న డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ ప్రధాన రహదారిలోని మెట్రోస్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నగర మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎండలు తీవ్రం అవుతున్న దృష్ట్యా బాటసారులు, దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. స్థానిక నేతలు నాగేశ్వరరావు, బాలాజీ, అశోక్, కుటుంబరావు, సారంగరావు, పాపారావు, యూత్ అసోసియేషన్ నేతలు నాగరాజు, నాళం రాజు,ఎం. రవికిరణ్, భరత్, మోజస్, సంఘ సేవకులు మాచర్ల పీటర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ 'మహిళా కరస్పాండెంట్ల'కు సత్కారం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

బంజారాహిల్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ మహిళా వ్యాపార కరస్పాండెంట్ల సహకారాన్ని కోరుతూ కార్యక్రమాన్ని నిర్వహించింది. గురువారం సోమాజిగూడలోని మెర్క్యురీ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొన్నేళ్లుగా ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ అతిపెద్ద బ్యాంకింగ్ నెట్‌వర్క్‌తో మారుమూల గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలను తీసుకెళ్తుందన్నారు.ఈ బ్యాంకింగ్ పాయింట్లను శిక్షణ పొందిన, బ్యాంకింగ్ సేవలను అందించేందుకు సాధికారత కలిగిన బిజినెస్ కరస్పాండెంట్లు నిర్వహిస్తారన్నారు. తెలంగాణలో ఈ బ్యాంక్ 15,000 మంది బిజినెస్ కరస్పాండెంట్లు ఉండగా, ఇందులో 3,000 మందికి పైగా మహిళలు ఉన్నారన్నారు. ఈ మహిళా బిజినెస్ కరస్పాండెంట్లలో 80 శాతం కంటే ఎక్కువ మంది తెలంగాణలోని బ్యాంకింగ్ సేవలు, సదుపాయాలు లేని ప్రాంతాల్లో పనిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ సేవలు అందించిన 5 మంది బిజినెస్ కరస్పాండెంట్లను బ్యాంక్ సత్కరించింది. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ భారత్‌కుమార్, పినాక్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను అడ్డుకునేందుకు మంద కృష్ణ కుట్ర

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణను ఆపేందుకు మంద కృష్ణ మాదిగ ఎన్నికుట్రలు చేసినా వర్గీకరణకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికను యథాతథంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టి బిల్లు కూడా అదే విధంగా ఉండేలా చూడాలని సీఎంకు ఆయన విజ్ఞప్తి చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మూడు దశాబ్దాలుగా వర్గీకరణ కోసం ఉద్యమాన్ని తానే చేస్తున్నానని చెప్పుకుంటూ రెండో వైపున సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణపైన ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే మంద కృష్ణ తట్టుకోలేక పోతున్నారని ఆరోపించారు. వర్గీకరణ చట్టమైన తర్వాత తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాదిగల కృతజ్ఞతా యాత్ర చేస్తామని తెలిపారు. ఈ యాత్ర 10 రోజుల పాటు 33 జిల్లా కేంద్రాల్లో జరుగనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ యాత్రకు సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రులను, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు రాములు, ఎంఆర్‌పీఎస్ నేతలు డాక్టర్ మీసాల మల్లేష్, డాక్టర్ ఎన్. నరసింహ బి.బాబురావు, కెఎస్ బోబు, బోయిని ఎల్లేష్, బోరెల్లి సురేష్, నక్క మహేష్, జెర్రీపోతుల సాయన్న, వరలక్ష్మీ, మారపాటి సాయిలు, వేణుగోపాల్, దేవేందర్, దేవరొండ నరేష్, గణేష్, చిలకమ్మ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి



జేఏసీ సమావేశంలో అభివాదం చేస్తున్న సుల్తాన్ యాదగిరి తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సీనియర్ జర్నలిస్టు షోయబ్ ఉల్లాఖాన్, జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రఫుల్ రాంరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో 'ది గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే'ను పురస్కరించుకొని గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన జర్నలిస్టులను గత ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వమైనా స్పందించి వారి సమస్యలపై సానుకూలంగా ఉండాలన్నారు. ఉద్యమ సమయంలో లాఠీలు, తూటాలు లెక్కచేయకుండా తమ వార్తల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. గతంలో కేసీఆర్ జర్నలిస్టులకు ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని గుర్తుచేశారు. అందుకే ప్రజలు వారిని తిరస్కరించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలా చేస్తే ప్రజలకు దూరం కావాల్సి వస్తుందన్నారు. కె.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు లక్ష్మీకాంతం, ప్రసాద్, డోలక్ యాదగిరి, పెద్ద యాదగిరి, అంజలి, జర్నలిస్టులు బి. శ్రీనివాస్, అఖిలేష్, కర్నాకర్, శేఖర్, గణేష్, కిరణ్, సత్యం, విజయ్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఫోన్‌పే పేరుతో డెలివరీ బాయ్‌కు టోకరా

బంజారాహిల్స్: ఫోన్‌పే చేస్తాను.. రూ. 5 వేలు ఇవ్వు అంటూ ఓ అపరిచితుడు డెలివరీ బాయ్‌ను మోసగించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-13లోని శ్రీరామ్‌నగర్‌లో నివసించే చందనకుమార్‌గుప్తా జెప్టో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఓ ఆర్డర్‌లో భాగంగా బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీలో హెచ్‌డీఎఫ్‌సీ బిల్డింగ్ వద్ద ఆగాడు. అదే సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి చందనకుమార్ వద్దకు వచ్చి రూ. 5,000 నగదు ఇస్తే ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేస్తానని చెప్పాడు. దీంతో చందనకుమార్ తన వద్ద ఉన్న రూ. 5 వేలు గుర్తుతెలియని వ్యక్తికి ఇచ్చి ఫోన్‌పే చేయాలని చెప్పాడు. సదరు వ్యక్తి ఫోన్‌పే చేసే నెపంతో సిగ్నల్స్ లేవంటూ కొంతదూరం నడుచుకుంటూ వెళ్లి అటు నుంచి అటే పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాధితుడు లబోదిబోమంటూ ఆగంతకుడి కోసం గాలించగా ఫలితం లేకుండా పోయింది. దీంతో తాను మోసపోయానని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

మహిళలకు ఉచిత ఫెర్టిలిటీ పరీక్షలు

బంజారాహిల్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నెలరోజుల పాటు ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఒయాసిస్ ఫెర్టిలిటీ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ దుర్గా జీ రావు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఒయాసిస్ ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జీవన విధానంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా రోజురోజుకు సంతాన లేనితో బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అన్నారు. గతంలో కేవలం మహిళల్లోనే సంతానలేమి సమస్యలు కనిపించేవని ప్రస్తుతం పురుషుల్లో కూడా కనిపిస్తున్నాయని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఉన్న తమ ఆస్పత్రులలో మహిళలకు ఉచిత ఫెర్టిలిటీ పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు సూచనలు అందిస్తామని చెప్పారు. సంతానలేని సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలి

కాచిగూడ: తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గవ్వల భరత్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై గవ్వల భరత్‌కుమార్‌కు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. రాజ్యాధికార సాధన కోసం నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కలిపిస్తూ చట్టబద్ధత చేసే వరకు పోరాటం చేయాలన్నారు. బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూనే విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. డాక్టర్ ఎన్. మారేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీలం వెంకటేష్, వేముల రామకృష్ణ, రాజేందర్, భూపేష్, మణికంఠ, సతీష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలపై స్పందించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చేనేత కార్మికుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మా సత్యనారాయణ, ఎస్.రవికుమార్ కోరారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో సంఘం ఆధ్వర్యంలో 'చేనేత కళా వెలుగులు'శీర్షికన కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా కవులు తమ కవిత్వాలను వినిపించి ఆహూతులను అలరించారు. ఈ సందర్భంగా కళాకారులు, కవులకు కీర్తి పద్మ పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వాలు ఎన్ని మారినా చేనేత కార్మికుల బతుకులు మారడం లేదన్నారు. అనేక ప్రాంతాలలో ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూచిపూడి నాట్యంలో మాస్టర్ డిగ్రీ చేసిన నాట్య గురువు కుమారి బి.వేదశ్రీతో పాటు పలువురికి కీర్తి పద్మ పురస్కారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు జేబీ రాజు, అమృత కుమార్ జైన్, రామకృష్ణ, చంద్రమౌళి, సరోజిని దేవి, భారతి తదితరులు పాల్గొన్నారు.



నాట్య గురువు కుమారి బి.వేదశ్రీకి కీర్తి పద్మ పురస్కారం ప్రదానం చేస్తున్న సంఘం ప్రతినిధులు

బాధితులకు న్యాయం జరిగేలా చూడండి

సనత్‌నగర్: చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన పుల్లయ్య బాధితులకు న్యాయం చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పోలీసు అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్‌లోని బీకేగూడలో నివసించే పుల్లయ్య గత కొన్ని సంవత్సరాలుగా చిట్టీలను నడుపుతూ ఇటీవల పరారీ అయ్యాడు. దీంతో పుల్లయ్య వద్ద చిట్టీలు కట్టిన సనత్‌నగర్, దాసారం బస్తీలకు చెందిన బాధితులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి తాము నితయం వివిధ రకాల పనులు చేసుకుంటూ చిట్టీలు కట్టామని,పుల్లయ్య నమ్మించి మోసం చేశాడని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఎస్సార్‌నగర్ ఇన్‌స్పెక్టర్, ఇతర పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, రాజేష్‌ముదిరాజ్, పీయూష్‌గుప్తా, ఆకుల రాజు, సాయి, కృష్ణమూర్తి, తిమ్మప్ప, దిలీప్, మల్లేష్ పాల్గొన్నారు.

'నిషా'చరులకు జైలు శిక్ష

పంజగుట్ట: మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపి, ఓ వ్యక్తిని ఢీకొట్టిన వ్యక్తితో పాటు, వెనక కూర్చున్న వ్యక్తికి న్యాయస్థానం 15రోజుల జైలు శిక్ష విధించింది. పంజగుట్ట పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 4వ తేదీన రాత్రి 11:30 గంటల ప్రాంతంలో పంజగుట్ట నిమ్స్ ఆసుపత్రి ముందు లింగయ్య అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా ఖైరతాబాద్ నుంచి పంజగుట్ట వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న బంజారాహిల్స్ నివాసి లాలు ప్రసాద్(25) ఢీ కొట్టాడు. దీంతో లింగయ్య కింద పడి గాయాలపాలయ్యాడు. వెంటనే అక్కడకు చేరుకున్న పంజగుట్ట పోలీసులు లింగయ్యను ఆసుపత్రికి తరలించి లాలూ ప్రసాద్‌ను, అతని వాహనం వెనక కూర్చున్న సనత్‌నగర్‌కు చెందిన పవన్ కుమార్(25) ఇద్దర్నీ పరిశీలించగా ఇద్దరూ మద్యం మత్తులో ఉన్నారు. వెంటనే అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి 5వ తేదీన మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ఇద్దరు నిందితులకు 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

సెల్‌ఫోన్ స్నాచింగ్

బంజారాహిల్స్: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి నుంచి ఇద్దరు ఆగంతకులు దారికాచి మొబైల్ ఫోన్ లాక్కెళ్లిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని గౌరీశంకర్‌కాలనీకి చెందిన సాగర్‌కుమార్ చౌదరి బుధవారం రాత్రి 11.40 గంటల సమయంలో సర్వీ హోటల్ నుంచి గౌరీశంకర్ కాలనీ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. మినర్వా హోటల్ వద్దకు రాగానే ఇద్దరు అగంతకులు యాక్టివా బైక్‌పై వచ్చి సాగర్‌కుమార్‌చౌదరి చేతిలో నుంచి మొబైల్ ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌గా జ్యోత్స్న

కాచిగూడ: కాచిగూడ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా తల్లోజు జ్యోత్స్న నియమితులయ్యారు. ఈమేరకు గురువారం హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. కాచిగూడ ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ కె.చంద్రకుమార్‌ను మెయిన్ పీసీఆర్‌కు బదిలీ చేశారు. ఇప్పటి వరకు తల్లోజు జ్యోత్స్న సెంట్రల్ జోన్ ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఏహెచ్ఓగా పనిచేశారు.

మహిళలు విపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలి

బంజారాహిల్స్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, యూజీసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఫిట్ ఇండియా' మహిళల క్రీడా వారోత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో వాకో ఇండియా, కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ సంయుక్తంగా కిక్ బాక్సింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వ విద్యాలయ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి ముఖ్యఅతిథిగా పాల్గొని 'స్త్రీలు, బాలికలకు: హక్కులు, సమానత్వం, సాధికారత' అనే అంశంపై ప్రసంగించారు. మహిళలు, బాలికలకు సమాజంలో హక్కులు, సమానత్వం, సాధికారత చాలా అవసరమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో సమాన భాగస్వామ్యం కలిగి ఉండాలని, వారి హక్కులను గౌరవించాలని, శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయరాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థలో మహిళలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో కిక్ బాక్సింగ్‌లో బంగారు పతక విజేతగా నిలిచిన ప్రవీణ్‌కుమార్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థి కావడం, ఇదే వేదికపై ప్రవీణ్‌కుమార్‌ను సన్మానించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎం.మహిపాల్, కోచ్ సురేష్‌పాటిల్, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశం పాల్గొన్న 10 మంది క్రీడాకారులు, యూజీసీ-డెబ్ అఫైర్స్ డైరెక్టర్ పల్లవీ కాబ్డే, విశ్వవిద్యాలయ మహిళా విభాగం ఇన్‌ఛార్జి డైరెక్టర్ మేరీ సునంద, శ్రీదేవి, రజనీ, ప్రమీలా కేతావత్, విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



మహిళల క్రీడా వారోత్సవాల్లో పాల్గొన్న పుష్పా చక్రపాణి

సాక్షి శుక్రవారం। 7। మార్చి। 2025

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో ఉమెన్స్ లీడర్‌షిప్ అవార్డ్స్–2025 కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు అవార్డులను అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క పాల్గొననున్నారు.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో స్వదాత్రి పేరిట కళాకారుడు బీపీ రెడ్డి వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో తెలంగాణ టీ చాంపియన్‌షిప్–2025 కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు థీమాటిక్ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది.
- బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5.30 గంటలకు ప్రొఫెసర్ జీఎస్ సాయిబాబా స్మారక సమావేశం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆయన రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

శరవేగంగా..

మల్కాజిగిరి రైల్వే స్టేషన్ పునరభివృద్ధి

ఇప్పటి వరకు 60 శాతం పనులు పూర్తి



సాక్షి, సిటీబ్యూరో: మల్కాజిగిరి రైల్వేస్టేషన్ పునరభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నగరానికి తూర్పు వైపున చర్లపల్లి తర్వాత సకల సదుపాయాలతో మల్కాజిగిరి వినియోగంలోకి రానుంది. ప్రధాన ముఖద్వారంతో పాటు స్టేషన్ విస్తరణ, ప్రత్యేక విశ్రాంతి గదులు, ఇతర సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. అమృత్ భారత్ పథకం కింద సుమారు రూ.27.61 కోట్లతో మల్కాజిగిరి అభివృద్ధి పనులను చేపట్టారు. ఇప్పటి వరకు 60 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలోనే మిగతా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని దక్షిణమధ్య రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. సబర్బన్ రైళ్లతో పాటు పలు దూర ప్రాంత రైళ్లకు మల్కాజిగిరిలో హాల్టింగ్ సదుపాయం ఉంది. ప్రయాణికుల రాకపోకలకు ప్రధాన కేంద్రంగా ఉన్న మల్కాజిగిరి స్టేషన్‌లో పునరభివృద్ధి వల్ల విశాలమైన కాన్‌కోర్స్, విశ్రాంతి గదులు, ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు కానున్నాయి. అలాగే.. దివ్యాంగ ప్రయాణికుల కోసం ప్రత్యేక టాయిలెట్లు, ర్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. సబర్బన్ గ్రేడ్–3 కేటగిరీకి చెందిన మల్కాజిగిరి స్టేషన్ నుంచి ప్రతి రోజు 2500 మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. ఏటా రూ.5.48 కోట్ల ఆదాయం లభిస్తుంది. ప్రతి రోజు 27 జతల రైళ్లు మల్కాజిగిరిలో ఆగుతాయి.



మల్కాజిగిరి రైల్వే స్టేషన్ పునరభివృద్ధి నమూనా చిత్రాలు

పునరభివృద్ధి పనులు ఇలా..

- మల్కాజిగిరి స్టేషన్ భవనం ముఖద్వారం అభివృద్ధి
- ప్రయాణికుల సౌకర్యార్థం 12 మీటర్ల వెడల్పు గల పాదచారుల వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జి)తో పాటు 3 లిఫ్టులు మరో 3 ఎస్కలేటర్లు.
- పెరగనున్న ప్లాట్‌ఫామ్ ఉపరితలం ఎత్తు. ప్లాట్‌ఫామ్‌పై అదనపు పై కప్పు ఏర్పాటు.
- ఇప్పటి వరకు టాయిలెట్ బ్లాకుల నిర్మాణం పూర్తయింది. వెయిటింగ్ హాల్ అభివృద్ధి చేశారు.
- వాహనాల పార్కింగ్‌తో పాటు పచ్చదనం విస్తరణపై ప్రత్యేక దృష్టి.
- ప్రయాణికులను ఆకట్టుకొనేలా కళలు, సంస్కృతి ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు.
- రైలు సూచిక బోర్డులు, కోచ్ సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తారు.
- తెలంగాణలో 40 స్టేషన్‌లు.

మహిళలు రాణిస్తేనే సంపూర్ణ ప్రగతి

మహిళా దినోత్సవాల్లో అద్దంకి దయాకర్

కవాడిగూడ: మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే సమాజం సంపూర్ణ ప్రగతి వైపు పయనిస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళల పక్షపాతిగా ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గురువారం దోమలగూడలోని ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను నిర్వహించింది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ ముఖ్యఅతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. దయాకర్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు బి. శ్యామ్, మహిళా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ దీపారెడ్డి, కన్వీనర్ ఉదయ సుజాత, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాల అధ్యక్షులు రాము, వినోద్ కుమార్, ఎంబీ కృష్ణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్–నాగమణి దంపతులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.



దయాకర్ దంపతులను సన్మానిస్తున్న తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నేతలు

శివసేన గ్రేటర్ అధ్యక్షుడిగా గణేశ్ గౌటే

లక్డీకాపూల్: శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా డాక్టర్ గణేశ్ గౌటే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గ్రేటర్‌లో శివసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర కార్యవర్గం దిశానిర్దేశం చేసింది. డాక్టర్ గణేశ్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తామని అన్నారు.



కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అవినాష్ జైస్వాల్, కేశవ్ గుప్త, కార్యవర్గ సభ్యులు సుదర్శన్ శ్రీనివాస్, పార్టీ నేతలు ఠాకూర్ వికాస్ శింగ్, కరణ్ , సూర్యవంశి , పాండు మహేష్ శ్రీనివాస్ చెందర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు ఎంపీ అనిల్ గైర్హాజరు

తదుపరి విచారణ 13వ తేదీకివాయిదా

సిటీ కోర్టులు: 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌పై నమోదైన కేసు విచారణ గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ విచారణకు ఆయనతోపాటు ఏ–2 గైర్హాజరుకాగా, ఏ3, ఏ4, ఏ5 హాజరయ్యారు. పలు సమావేశాల నేపథ్యంలో ఎంపీ అనిల్‌కుమార్ కోర్టుకు హాజరు కాలేకపోతున్నారని ఆయన తరఫు న్యాయవాది కుర్మ నరేందర్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారణను మార్చి 13వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రజాప్రతినిధుల కోర్టు పేర్కొంది. అనిల్‌యాదవ్ తన అభిమానులు, కార్యకర్తలతో పాదయాత్ర సందర్భంగా అడిక్‌మెట్ నుంచి రాంనగర్ గుండు వరకు వంద ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారని, రోడ్డుపై పెద్ద ఎత్తున టపాకులు కాల్చారని, చుట్టుపక్కల ఇళ్లల్లో ఉన్నవారికి, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలిగిందని పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనిల్‌కుమార్ యాదవ్‌తోపాటు మరో నలుగురిపై అప్పట్లో పోలీసులు కేసులు నమోదు చేశారు.

చెరువును కాపాడిన మేయర్



తాజ్‌బంజారా చెరువు గేటుకు తాళం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 1/11లో ఉన్న తాజ్ బంజారా చెరువు కబ్జా కాకుండా గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ సకాలంలో స్పందించారు. నిందితులను పట్టుకోవడమే కాకుండా ప్రభుత్వస్థలాన్ని కాపాడగలిగారు. రెండురోజుల క్రితం తాజ్ బంజారా చెరువులోకి గుర్తుతెలియని వ్యక్తులు టిప్పర్లు, లారీల ద్వారా ప్రవేశించారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో పెద్ద ఎత్తున మట్టిని డంపింగ్ చేస్తున్నారు. ఈ విషయమై స్థానికులు ఫిర్యాదు చేయడంతో మేయర్ వెంటనే స్పందించి చెరువును సందర్శించారు. మట్టిని డంపింగ్ చేస్తున్న లారీలను సీజ్ చేయాలని బంజారాహిల్స్ పోలీసులను ఆదేశించారు. చెరువు స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనపై విచారణ జరపాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని, డీసీ ప్రశాంతిని ఆదేశించారు. చెరువు స్థలంలో ఓ ఇంటి యజమాని మట్టితో చదును చేసి చెరువును ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డిని ఆదేశించారు. తహసీల్దార్ వెంటనే అక్కడికి వెళ్లి ప్రభుత్వ స్థలంలో కబ్జాలను అరికట్టి హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. పోలీసులు లారీలను సీజ్ చేసి యజమానులతోపాటు డ్రైవర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ చెరువును సుందరంగా తీర్చిదిద్దేందుకు మేయర్ ప్రణాళికలు రూపొందిస్తున్న క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఈ కబ్జాలకు తెగబడటం గమనార్హం. మేయర్ చెరువును కాపాడటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మైనింగ్‌లో ఇక వంద శాతం మహిళలే

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: మైనింగ్ రంగంలో అధికారుల స్థాయి నుంచి కార్మికుల వరకు వంద శాతం మహిళలే ఉండేలా చర్యలు తీసుకోవాలని బొగ్గు, గనుల శాఖను, కోల్ ఇండియా సంస్థను ఆదేశించినట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా 'గనుల రంగంలో మహిళల భాగస్వామ్యం–వివిధ రంగాల్లో మహిళల పాత్ర'అనే అంశంపై గురువారం బేగంపేటలోని హోటల్ తాజ్ వివంతాలో జరిగిన సదస్సులో ఆయన రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి పాల్గొన్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యం పెరిగితే ఉత్పత్తి సామర్థ్యం కూడా పెరుగుతుందని అన్నారు. మైనింగ్ రంగంలో పనిచేసే వారికి కోటి రూపాయల మేర హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.



సదస్సులో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క తదితరులు

మైనింగ్ రంగానికి మహిళా అంబాసిడర్‌ను నియమించనున్నట్లు చెప్పారు. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తేనే దేశం ముందడుగు వేస్తుందన్నారు. మైనింగ్‌లో మాత్రమే కాకుండా మహిళలు శక్తియుక్తులతో దేశాన్ని ముందుకు నడిపిస్తుండటం గర్వకారణమని పేర్కొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా...

2047లో వికసిత్ భారత్ కలను నెరవేర్చేందుకు బాటలు వేస్తూ ఈ దేశ ఆడబిడ్డలు చరిత్ర సృష్టిస్తున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. మహిళల గౌరవాన్ని పెంచేందుకు స్వచ్ఛభారత్ అభియాన్ ద్వారా ప్రధాని మోదీ 11 కోట్ల టాయిలెట్లు నిర్మింపజేశారని తెలిపారు. మెటర్నిటీ సెలవులు కూడా 12 వారాల నుంచి 26 వారాల వరకు పెంచామని, ఉన్నత విద్యలో మహిళల అడ్మిషన్లు 28 శాతానికి పైగా పెరిగాయని పేర్కొన్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్‌లో మహిళల అడ్మిషన్లు 43 శాతం మేర పెరిగినట్లు చెప్పారు. ఎయిర్‌ఫోర్స్ పైలట్స్‌లో 15 శాతం మంది మహిళలే ఉన్నారని, ఈ విషయంలో ఏ దేశం కూడా మనకు సాటి రాదని అన్నారు. ఈ సంఖ్యను 30 శాతానికి పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని తెలిపారు.

ఎస్‌హెచ్‌వోలుగా నలుగురు మహిళా ఇన్‌స్పెక్టర్లు

పోస్టింగ్ ఇచ్చిన సీవీ ఆనంద్ ● ఉమెన్స్ డే నేపథ్యంలో కొత్వాల్ నిర్ణయం



సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. శనివారం ఉమెన్స్ డేను పురస్కరించుకొని నలుగురు మహిళా ఇన్‌స్పెక్టర్లకు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌వో)గా పోస్టింగ్ ఇస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నగర పోలీసు కమిషనర్‌గా ఆనంద్ 'తొలి ఇన్నింగ్స్'లోనూ మహిళా దినోత్సవం నేపథ్యంలో ఇలాంటి ప్రయోగం చేశారు. నగర కమిషనర్‌గా పనిచేస్తుండగా ఓ మహిళా ఇన్‌స్పెక్టర్‌ను తొలిసారిగా శాంతిభద్రతల విభాగం ఠాణాకు (లాలాగూడ) పూర్తిస్థాయి ఎస్‌హెచ్‌వోగా నియమించారు. ఇప్పుడు ఆయన 'సెకండ్ ఇన్నింగ్స్'లో నలుగురికి అవకాశం ఇచ్చారు. ఈ మేరకు గురువారం వారికి బదిలీ ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ 'మీరు కూడా స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా సత్తా చూపించాలి'అని ఆకాంక్షించారు. సెంట్రల్ జోన్ మహిళా ఠాణా ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న తల్లోజు జ్యోత్స్నను కాచిగూడ ఠాణా ఇన్‌స్పెక్టర్‌గా, కంట్రోల్ రూమ్‌లో ఉన్న దోమాట దిబోరా మేయిన్‌ను సెంట్రల్ జోన్ మహిళా ఠాణా ఇన్‌స్పెక్టర్‌గా, టాస్క్‌ఫోర్స్‌లో అడ్మిన్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న చిట్టీ బుర్రను సెక్రటేరియేట్(లేక్) ఠాణా ఇన్‌స్పెక్టర్‌గా, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్న పి.వెంకట లక్ష్మీని నాంపల్లి ట్రాఫిక్ ఠాణా ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. కాచిగూడలో పనిచేస్తున్న కాగిత చంద్రకుమార్‌ను కంట్రోల్ రూమ్‌కు, లేక్ ఠాణా ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను నల్లకుంట ట్రాఫిక్ ఠాణా ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ కొత్వాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

స్థానిక ఎన్నికల్లో మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించాలి

షబ్బీర్ అలీకి బీఎంఆర్‌పీఎఫ్ వినతి



సాక్షి, సిటీబ్యూరో: స్థానిక సంస్థల ఎన్నికల్లో మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించి రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలని భారత్ మైనార్టీస్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (బీఎంఆర్‌పీఎఫ్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్, నాయకుడు ఆసిఫ్ హుస్సేన్ ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు అన్ని రంగాల్లో మైనార్టీలకు 10 శాతం రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. మంత్రివర్గంలో ఇద్దరు మైనారిటీలకు చోటు కల్పించాలన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

పరీక్ష కేంద్రాల్లో అసౌకర్యాలు ● పట్టించుకోని ఇంటర్మీడియెట్ బోర్డు

సాక్షి,సిటీబ్యూరో: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు పరీక్ష కేంద్రాలో సరైన అసౌకర్యాల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొన్ని ప్రయివేటు కాలేజీలోని పరీక్ష కేంద్రాల్లో సరైన గాలి, తాగునీరు లేక తీవ్ర అవస్థలకు గురయ్యారు. పరీక్ష కేంద్రాల్లోకి చేతివాచీలకు అనుమతిలేనందున నిర్వాహకులు కనీసం వాల్‌క్లాక్‌లను కూడా ఏర్పాటు చేయలేదు. ప్రతీ అరగంటకూ బెల్ మోగిస్తామని బోర్డు ప్రకటించినప్పటికీ ఆచరణలో అది అమలు కాలేదు. కొన్ని కేంద్రాల్లో బెంచీలు, కుర్చీలు సరిగాలేవు. కొన్నిచోట్ల వాటర్ బాటిళ్లను అనుమతించకపోవడంతో విద్యార్థులు దాహార్తితో అలమటించారు. పరీక్ష కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు లేకపోవడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 77,495 మంది విద్యార్థులకుగాను 75,083 మంది హాజరయ్యారు.

తగ్గుతున్న 'యువ భారత్'

జర్మనీ ప్రొఫెసర్ సంతోష్ మెహ్రోత్రా

సనత్‌నగర్: భారత దేశంలో 2040 నాటికి జనాభాలో యువజనుల శాతం తగ్గిపోతుందని జర్మనీలోని ఐజెడ్‌ఏ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్‌కు చెందిన రీసెర్చ్ ఫెలో ప్రొఫెసర్ సంతోష్ మెహ్రోత్రా అన్నారు. బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) ఏడో వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అతిథి ఉపన్యాసం ఇచ్చారు. భారతదేశం వృద్ధాప్య సమాజంగా మారబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 91 శాతం మంది కార్మికులు అసంఘటిత రంగంలో ఉన్నారని పేర్కొన్నారు. 12 శాతం మంది మాత్రమే అధికారిక పెన్షన్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) ప్రకారం ప్రభుత్వాలు వారందరికీ సామాజిక భద్రత కల్పించాలన్నారు. కానీ, అసంఘటిత రంగ కార్మికుల భద్రతా విషయాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. దేశంలో రాబోయే 10–15 సంవత్సరాల్లో అర్హత కలిగిన శ్రామిక వర్గానికి సామాజిక బీమా ఎలా అందించాలో ఆయన వివరించారు. ఈ సమావేశంలో సెస్ వ్యవస్థాపక సభ్యులు జె మహేందర్‌రెడ్డి, జీఆర్‌రెడ్డి, డైరెక్టర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఆ నిర్వచనంలో కాస్ట్ అకౌంటెంట్‌ను చేర్చాలి

కవాడిగూడ: అకౌంటెంట్ నిర్వచనంలో కాస్ట్ అకౌంటెంట్‌ను చేర్చాలని ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ డాక్టర్ లావణ్య కందూరి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం దోమలగూడలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2025 ఆదాయ పన్ను బిల్లును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. సులభతర వ్యాపారానికి, పన్ను చెల్లింపుదారులకు అనుకూలమైన వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ నిబద్ధతను ఈ బిల్లు స్పష్టంగా తెలియజేస్తోందని పేర్కొన్నారు. పన్ను విధానం, అనుసరణ, వ్యయ నియంత్రణ, ఆర్థిక, వ్యూహాత్మక ప్రణాళికలు వంటి ముఖ్యమైన రంగాల్లో కాస్ట్ అకౌంటెంట్‌ల నైపుణ్యాన్ని గుర్తించాలని కోరారు. ఆదాయ పన్ను బిల్లు 2025లోని సెక్షన్ 515(3)(బి) ప్రకారం అకౌంటెంట్ నిర్వచనంలో కాస్ట్ అకౌంటెంట్‌ను చేర్చాలని కోరుతూ లోక్‌సభకు సమగ్రమైన నివేదికను సమర్పించినట్లు వెల్లడించారు. 2013 కంపెనీల చట్టం ప్రకారం అంతర్గత ఆడిటర్‌లుగా కాస్ట్ అకౌంటెంట్లు అర్హత పొందినట్లు గుర్తు చేశారు.

గురుకుల్‌ను సందర్శించిన రీజినల్ కో ఆర్డినేటర్

ఘట్‌కేసర్: పట్టణంలో ఏడు దశాబ్దాల క్రితం వ్యాస్‌జీ నిర్మించిన గురుకుల్ పాఠశాల, జూనియర్ కళాశాలను, బస్ ప్రయాణ ప్రాంగణాన్ని మహాత్మాగాంధీ–జ్యోతిరావుపూలే గురుకుల విద్యాలయాల రీజినల్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్ రెడ్డి గురువారం సందర్శించారు. జెడ్పీ బాలికలు, బాలుర పాఠశాలను తరలించాలని, గురుకుల్‌లో కేజీ–పీజీ వరకు విద్యను బోధించాలని కొంత కాలంగా పూర్వపు విద్యార్థులు సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఉత్తరాలు పంపుతున్నారు. దీంతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, వెంకటేశ్, ఐమ్ము పాల్గొన్నారు.



గురుకుల్‌ను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

కంటోన్మెంట్ మెంబర్‌గా భానుక నర్మద



భానుక నర్మదకు అభినందనలు తెలుపుతున్న బీజేపీ నేతలు

- నోటిఫికేషన్ జారీ చేసిన రక్షణ శాఖ
- జనవరిలో ఇచ్చిన ఉత్తర్వులకు సవరణ
- పంతం నెగ్గించుకున్న ఎంపీ ఈటల రాజేందర్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు కొత్త సివిలియన్ నామినేటెడ్ మెంబర్(సీఎన్ఎం) నియమితులయ్యారు. రెండున్నరేళ్లపాటు బోర్డు సభ్యుడిగా కొనసాగిన జె.రామకృష్ణ స్థానంలో భానుక నర్మద మల్లికార్జున్‌ను నియమిస్తూ రక్షణ శాఖ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. దేశవ్యాప్తంగా 56 కంటోన్మెంట్‌లలో సివిలియన్ నామినేటెడ్ మెంబర్‌లను నియమిస్తూ ఈ ఏడాది జనవరి 3న వెలువరించిన గెజిట్ నోటిఫికేషన్‌లో మూడు మార్పులు చేసి కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో జె.రామకృష్ణ స్థానంలో భానుక నర్మద మల్లికార్జున్, దేవ్‌లాలీ కంటోన్మెంట్‌లో ప్రీతమ్ దినకర్ అథవ్ స్థానంలో సచిన్ సురేశ్ థాక్రే, షిల్లాంగ్ కంటోన్మెంట్‌లో రాజ్‌బిర్ శర్మ స్థానంలో బిపెన్ ప్రధాన్‌ను నియమించింది. గతంలో కేంద్రం ప్రకటించిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా వీరు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు లేదా, ఆయా కంటోన్మెంట్‌లకు ఎన్నికలు నిర్వహించే వరకు పదవిలో కొనసాగుతారు.

మూడేళ్లుగా వేరీడ్ బోర్డే..

కేటగిరీ –1కు చెందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఎనిమిది మంది ప్రజాప్రతినిధులు ఉంటారు. 2015 జనవరిలో సికింద్రాబాద్‌లో చివరిసారిగా ఎన్నికలు జరిగాయి. 2021 ఫిబ్రవరితో బోర్డు పదవీ కాలం ముగిసినప్పటికీ ఏడాదిపాటు పొడిగించారు. 2022 ఫిబ్రవరి 11 తేదీ నుంచి 16 మంది సభ్యుల బోర్డు స్థానంలో ముగ్గురు సభ్యులతో కూడిన వేరీడ్ బోర్డును ఏర్పాటు చేశారు. దీనిలో స్థానిక మిలటరీ స్టేషన్ కమాండర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం నియమించే సివిలియన్ నామినేటెడ్ మెంబర్ సభ్యులుగా ఉంటారు. 2022 ఆగస్టులో తొలిసారిగా జె.రామకృష్ణ నామినేటెడ్ మెంబర్‌గా నియమితులయ్యారు.

ఎంపీ ఈటల ఒత్తిడితోనే..

మల్కాజ్‌గిరి ఎంపీగా ఈటల రాజేందర్ విజయంలో కీలకంగా వ్యవహరించిన కంటోన్మెంట్ స్థానంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఒకే వ్యక్తికి వరుసగా నాలుగు సార్లు అవకాశం కల్పించడమేంటని ప్రశ్నిస్తూ రామకృష్ణ స్థానంలో భానుక నర్మద మల్లికార్జున్ పేరును ఈటల ప్రతిపాదించారు. ఈటల విజ్ఞప్తికి అనుగుణంగా కేంద్రం గత నెలలో వెలువరించిన గెజిట్‌లో మార్పులు చేస్తూ మరో నోటిఫికేషన్ వెలువరించడం గమనార్హం.

మహిళా దినోత్సవ కానుక : భానుక నర్మద

అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఒక్క రోజు ముందే కేంద్రం కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినెటెడ్ మెంబర్‌గా అవకాశం కల్పించడంపట్ల ఆనందంగా ఉంది. ఇది మహిళా దినోత్సవ కానుకగా భావిస్తాను. 2011 మే నెలలో తొలిసారిగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షురాలిగా ఎన్నికై, దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యక్షురాలినయ్యా.

నేడు మక్కా మసీదులో 'యౌముల్ ఖురాన్'



చార్మినార్: రంజాన్ మాసంలో వచ్చే ప్రతి శుక్రవారం మక్కా మసీదులో యౌముల్ ఖురాన్ పఠన కార్యక్రమం ఉంటుంది. ఈ పఠన కార్యక్రమాలను రంజాన్ మాసంలో వచ్చే నాలుగు శుక్రవారాల్లో మొదటివారం మజ్లిస్ పార్టీ, రెండో వారాన్ని సున్నీ ఒలేమా బోర్డు, మూడోవారాన్ని ఎంబీటీ నిర్వహిస్తుండగా, చివరి శుక్రవారాన్ని మళ్లీ మజ్లిస్ పార్టీ నిర్వహించనుంది. మొదటి కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాల్గొననున్నట్లు ఎంఐఎం పార్టీ వర్గాలు తెలిపాయి. సాధారణంగా ప్రతి రంజాన్ మాసంలోని మొదటి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ పాల్గొని ఖురాన్ ప్రాధాన్యత, విశిష్టతను ముస్లింలకు వివరిస్తారు. ఈసారి ఎంపీ అసదుద్దీన్‌తోపాటు పాషా ఖాద్రీ కూడా పాల్గొంటారని పార్టీ నాయకులు చెబుతున్నారు.

సిల్ట్ తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వాహనాల యజమానులతో జలమండలి ఎండీ భేటీ

సాక్షి, సిటీబ్యూరో: డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి బయటికి తీసిన సిల్ట్‌ను ఏ రోజుకారోజు తొలగించాలని, ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం జలమండలి ప్రధాన కార్యాయలంలో సిల్ట్ కార్టింగ్ వాహనాల యజమానులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీతో వాహనాల కదలికలను ఎప్పటికప్పుడు డ్యాష్ బోర్డులో గమనిస్తున్నట్లు చెప్పారు. 180 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో సిల్ట్ కార్టింగ్ వాహనాలదే కీలకపాత్ర అని అన్నారు. సెక్షన్‌లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం వాహనాల యజమానులు పలు సమస్యల్ని ఎండీ దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

అనంతరం సిల్ట్ కార్టింగ్ యజమానులు ఎండీ అశోక్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్–1 అమరేందర్ రెడ్డి, వాహనాల యజమానులు పాల్గొన్నారు.

ఆర్టీసీ వర్క్‌షాపులో గంట వెసులుబాటు ఇవ్వాలి

సాక్షి,సిటీబ్యూరో: ముస్లిం ఉద్యోగులకు రంజాన్ మాసంలో ఒక గంట వెసులుబాటును ఆచరణలో అమలు చేయాలని ఆల్ మే వా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఫరూక్ హుస్సేన్, డాక్టర్ సయ్యద్ వహీద్ షాహ ఖాద్రీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌లకు వినతిపత్రాలు పంపించారు. రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా అన్ని విభాగాల్లో ముస్లిం ఉద్యోగులు ఒక గంట ముందు విధి నిర్వహణ ముగించుకొని వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆర్టీసీలోని జోనల్ వర్క్‌షాప్ మేనేజర్ కవిత వాటిని బేఖాతరు చేస్తూ తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. గతంలో సైతం ఇదేవిధంగా వ్యవహరిస్తే అప్పటి అధికారులు జోక్యం చేసుకోవడంతో వెసులుబాటు ఇచ్చారని గుర్తు చేశారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్ ‌ శుక్రవారం ‌ 7 ‌ మార్చి ‌ 2025



ఏదైనా శుభవార్త చెప్పే ముందు నోరు తీపి చేస్తారు. ఇది ఒకప్పటి మాట. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది.. ప్రతి చిన్న విషయానికీ స్వీట్‌తో పండుగ చేసుకుంటున్నారు. అంతేనా! అంటే కాదు..కొందరు భోజనానికి ముందు.. కొందరు భోజనానికి తర్వాత కూడా స్వీట్ తినే అలవాటు చేసుకుంటున్నారు. ఈ అలవాటుకు అనుకూలంగా నగరంలోని పలు రెస్టారెంట్స్, హోటల్స్ ఫుడ్ సర్వ్ చేసేటప్పుడు చివరి వంటకంగా డిసర్ట్స్ సర్వ్ చేస్తున్నారు. స్టార్టర్స్, మెయిన్ కోర్సు వగైరాలన్నీ పూర్తయ్యాక ఫైనల్‌గా అందించే తీపి కబురు కోసం ఫుడ్ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీటిని తరచూ మారుస్తూ చెఫ్స్ కూడా ఆ ఆసక్తిని సజీవంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఒకప్పుడు మిఠాయి అంటే స్వీట్ షాప్ మాత్రమే గుర్తొచ్చే నగరవాసులు.. ఇప్పుడు కొన్ని రకాల డిసర్ట్స్‌ను ఎంజాయ్ చేసేందుకు రెస్టారెంట్స్‌కు క్యూ కడుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో



స్వీట్ చేంజ్..

విందులో పసందైన రుచులు

- స్వీట్స్ పట్ల నగరవాసుల్లో మారుతున్న అభిరుచి
- లాస్ట్ బట్ నాట్ లీస్ట్ అంటూ కొత్త టేస్టులు
- భోజనం చివరన డిసర్ట్స్‌కు ప్రాధాన్యం
- వెరైటీ తీపి రుచులను పంచుతున్న చెఫ్స్
- స్వీట్ షాప్స్ మించిన వెరైటీలతో రెస్టారెంట్స్



భోజనం అయిపోగానే కాస్తంత తీపి రుచిని ఆస్వాదించడం చాలా కాలంగా ఒక సంప్రదాయంగా స్థిరపడింది. ఇప్పుడు ఆ సంప్రదాయం ఇంతింతై వటుడింతై అన్నట్లు.. రెస్టారెంట్స్ వడ్డించే విందులో డిసర్ట్స్‌ని అత్యంత ప్రాధాన్యత కలిగిన భాగంగా మార్చేసింది. మిఠాయిలు ఆస్వాదించాలంటే కేవలం స్వీట్ షాప్స్ మాత్రమే శరణ్యం అనే పరిస్థితి మారి కేవలం డిసర్ట్స్ కోసం రెస్టారెంట్స్‌కి వెళ్లడం ఇప్పుడు సాధారణంగా మారింది.

జామ్.. బూమ్..




రెస్టారెంట్ల తొలినాళ్లలో గులాబ్ జామ్ వంటి అందరికీ తెలిసిన స్వీట్లను మాత్రమే వడ్డించేవారు. అయితే ఆ తర్వాత క్రమంలో పూర్తి భోజనాన్ని మూడు భాగాలుగా విభజించిన తర్వాత డిసర్ట్స్ పేరుతో మెనూలో ప్రత్యేక స్థానాన్ని తీపి వంటకాలకు కేటాయించారు. తొలినాళ్లలో గులాబ్ జామ్, హల్వా, జిలేబీ, రసమలాయ్, కోవా మాత్రమే చాలా కాలం డిసర్ట్స్‌గా రాజ్యమేలాయి. అయితే మల్టీ క్యుజీన్‌ల వెల్లువ ధాటికి మెయిన్ కోర్సుతో పాటు డిసర్ట్స్ కూడా విభిన్న రుచులకు విస్తరించాయి. ఒకప్పుడు ఆరు వెరైటీల దగ్గర నుంచి ఇప్పుడు అతిథులకు తీపి రుచులను పెద్ద సంఖ్యలో లంచ్, డిన్నర్‌లలో వడ్డిస్తున్నారు.

బేకరీ ఉత్పత్తులకూ చోటు..

తొలుత అందరికీ బాగా తెలిసిన ప్రాంతీయ తీపి వంటకాలు ఆ తర్వాత పేస్ట్రీలకు కూడా డిసర్ట్స్ స్టైల్ మారుతూ వచ్చింది. రసమలాయ్‌కి బదులు అదే ఫ్లేవర్‌లో ఐస్‌క్రీమ్ పెడుతున్నారు. బఫేలో కాంటినెంటల్ చీజ్ కేక్, బ్రౌనీ, చాకోలావా, మథుపై.. ఇలా బేకరీ ఐటమ్స్ కూడా భాగం చేస్తున్నారు. కొంత కాలంగా ఐస్‌క్రీమ్ కూడా డిసర్ట్స్‌లో తప్పనిసరి భాగం అయిపోయింది. ఐస్‌క్రీమ్‌కి కాంబినేషన్‌గా గులాబ్‌జామ్/పేస్ట్రీస్/ మూంగ్‌దాల్ హల్వా వంటివి అతిథుల నోరూరిస్తున్నాయి. కొన్నిచోట్ల సంప్రదాయ వంటకాలైన ఖద్దూ కా ఖీర్, ఫ్రూట్ కస్టర్డ్.. సేమియా పాయసం, సగ్గుబియ్యం పాయసం, పూర్ణాలు, బొబ్బట్లు కూడా వడ్డిస్తున్నారు.





ఆరోగ్య 'తీపి'..రస్తు..

ఇటీవల ప్రారంభమైన ఆరోగ్యకరమైన వంటకాల ప్రభావం రెస్టారెంట్స్ మీద కూడా పడింది. దీనిలో భాగంగా కొత్తగా పరిచయమైన మిల్లెట్స్‌తో తయారైన తీపి వంటకాలను అతిథులకు అందిస్తున్నారు. కొర్రల పరమాన్నం, జవారి లడ్డు, రాగుల పాయసం, ఊదల లడ్డు, సామల పరమాన్నం.. వంటివి నెమ్మదిగా విస్తరిస్తున్నాయి. ఇవన్నీ పంచదార కాకుండా తృణధాన్యాలు, బెల్లంతో తయారవడం డయాబెటిక్ రోగులకు కూడా పెద్దగా హానికారకం కాకపోవడంతో వీటి పట్ల నగరవాసుల్లో మోజు పెరిగిందని చెఫ్ యాదగిరి చెబుతున్నారు. ఆయా సీజన్లలో వచ్చే పండ్లను ఉపయోగించి తయారు చేసే సీజనల్ డిసర్ట్స్ కూడా రెస్టారెంట్స్‌లో సందడి చేస్తున్నాయి. సీతాఫలం దొరికే సీజన్లో సీతాఫల్ రబ్డీ, ప్రస్తుతం జామకాయలు విరివిగా దొరుకుతాయి కాబట్టి జామూన్ డిలైట్ ఇలా ఆయా సీజన్స్ ప్రకారం కొత్త రుచులను అందిస్తున్నారు. అలాగే మల్‌బరీ పండ్లు విరివిగా లభించే సమయంలో ఐస్‌క్రీమ్ మల్‌బరీస్ మిక్స్, మల్‌బరీ జ్యూస్ వంటివి అందిస్తున్నారు.





శిల్పారామంలో థీమాటిక్ ఎగ్జిబిషన్

- ఆకట్టుకుంటున్న ఉత్పత్తులు
- ఈనెల 15 వరకూ కొనసాగింపు

మాదాపూర్ : కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో 10 రోజుల పాటు నిర్వహించే ఈ థీమాటిక్ ఎగ్జిబిషన్ గురువారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ప్రొడెక్టివిటీ కౌన్సిల్, తెలంగాణ సమగ్ర హస్తకళల క్లస్టర్ అభివృద్ధి పథకం కింద డెవలప్‌మెంట్ ఆఫ్ హ్యాండీ క్రాఫ్ట్స్, మినిస్ట్రీస్ ఆఫ్ టెక్స్‌టైల్స్ న్యూ ఢిల్లీ సౌజన్యంతో నిర్వహించనున్నారు. ప్రదర్శనను హ్యాండీ క్రాఫ్టస్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ సువర్చలా, ఎపీఐటీసీఓ సీఈవో విజయ్, ఆంధ్రప్రదేశ్ ప్రొడెక్టివిటీ కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరఘు, శిల్పారామం జనరల్ మేనేజర్ నర్సింహులు పాల్గొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 50 మంది హస్తకళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. బొబ్బిన్ లేస్ స్టేషన్ ఘన్‌పూర్, పామ్‌లీఫ్ క్రాఫ్ట్, కలంకారి, స్టిచ్‌క్రాఫ్ట్, మట్టిపాత్రల తయారీ, జర్దోసి, ఇమిటేషన్ జ్యువెలరీ, కార్పెట్స్, బంజారా సూదిపని, లక్కగాజులు, చెరియల్ స్క్రోల్ పేయింటింగ్ వంటి ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

'రైజ్ ది మైక్, ఓన్ ది నైట్'



సాక్షి, సిటీబ్యూరో: మహిళా దినోత్సవం నేపథ్యంలో నగరంలోని ది హోపరీ వేదికగా 'రైజ్ ది మైక్, ఓన్ ది నైట్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శనివారం రాత్రి జరగనున్న ఈ వినూత్న కార్యక్రమంలో నగరానికి చెందిన మహిళా రచయితలు, మ్యూజీషియన్స్, స్టోరీ టెల్లర్స్ ఇతర కళాకారులు పాల్గొనున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ వేదికగా మహిళా సాధికారత, భద్రత, మహిళా ప్రోత్సాహం తదితర అంశాలపై వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు మ్యూజిక్, పోయెట్రీకి సంబంధించిన వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఓ వైపు తమ ఇళ్లను చక్కదిద్దుకుంటూనే.. మరో వైపు సమాజ హితం కోసం తమవంతు సేవలు అందిస్తున్నారు. కాలనీ మహిళలకు రిక్రియేషన్ కల్పించడంతో పాటు సమాజ సంక్షేమానికి పలు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్రీడలు, వివిధ రకాల పోటీల ద్వారా మహిళల్లో దాగివున్న ప్రతిభను, కళలను వెలికితీస్తున్నారు. వారే వనస్థలిపురం జనప్రియ హోమ్స్ కాలనీకి చెందిన శ్రీ వైష్ణవి జనప్రియ మహిళా మండలి సభ్యులు. - వనస్థలిపురం



అందరికీ ఆదర్శంగా..

శ్రీ వైష్ణవి జనప్రియ మహిళా మండలి సంక్షేమ కార్యక్రమాలు

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని జనప్రియ హోమ్స్ కాలనీలో 13 యేళ్ల క్రితం 2012లో కాలనీ మహిళలు శ్రీ వైష్ణవి జనప్రియ మహిళా మండలిని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి ప్రతి బుధవారం సమావేశం నిర్వహించుకుంటూ పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. కాలనీ మహిళలకు రిక్రియేషన్ కల్పించడం కోసం ఫ్రీ తంబోలా, కుకింగ్ డెమో, షార్ట్, లాంగ్ డ్యూరేషన్ గేమ్స్, టాలెంట్ షోలు నిర్వహిస్తున్నారు. రిపబ్లిక్ డే, ఇండిపెండెన్స్ డే, చిల్డ్రన్స్ డే, ఉమెన్స్ డే, మహిళా మండలి వార్షికోత్సవాలు జరుపుకుంటున్నారు.



సేవా కార్యక్రమాలు..

అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు వెళ్లి తగిన సాయం అందించడం. వేసవిలో చలివేంద్రాలు నిర్వహణ. మహిళల కోసం ఉచిత వైద్య శిబిరాలు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన బుక్స్ అందజేయడం. మహిళలకు వివిధ అంశాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం. పలు సందర్భాల్లో మహిళలకు పోటీలు నిర్వహించి వారిలోని ప్రతిభను వెలికితీయడం చేస్తున్నామని శ్రీ వైష్ణవి జనప్రియ మహిళా మండలి అధ్యక్షురాలు పి.జ్యోతి సాయి చెబుతున్నారు.

రా మ్యాంగో నుంచి

ఆగమ కలెక్షన్స్



సాక్షి, సిటీబ్యూరో: సరికొత్త శైలి దుస్తులకు పేరొందిన ప్రముఖ బ్రాండ్ రా మ్యాంగో.. తమ నూతన కలెక్షన్స్‌ను ఆగమ పేరుతో రూపొందించింది. ఈ వైవిధ్యభరిత కలెక్షన్లను నగరంలో అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ తెలిపింది. కలెక్షన్ విశేషాల్లోకి వెళితే.. దక్కన్ నుంచి మష్రూ ఇకత్, బెంగాల్ నుంచి కంతా ఎంబ్రాయిడరీ ఉన్నాయి. సంప్రదాయ ఆధ్యాత్మిక తల మేలు కలయికగా ఈ డిజైన్లు రూపొందాయి. ఈ కలెక్షన్.. బెంగాల్‌కు చెందిన కంతా అనే క్విల్టింగ్ ఎంబ్రాయిడరీ సంప్రదాయాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది.



ఆకట్టుకునే ఆకృతులు

- ఇనుప వ్యర్థాలతో అద్భుతమైన శిల్పాలు
- ప్లాస్టిక్, రాతితో తయారు చేసిన ఆకృతులు





మాదాపూర్ : పనికిరాని వ్యర్థాలను సైతం అద్భుతమైన ఆకృతులుగా మలుస్తున్నారు కళాకారులు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ ఈ ఆకట్టుకునే ఆకృతులకు వేదికైంది.. కళాకారులు వ్యర్థాలతో రూపొందించిన శిల్పాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నిత్యం చిత్ర ప్రదర్శనలతో అలరారే చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీని సందర్శించేందుకు దేశం నలుమూలల నుంచి ఔత్సాహికులు వస్తుంటారు. అంత ర్జాతీయ స్థాయిలో ఆకట్టుకునే విధంగా పరిసరాల్లో పెయింటింగ్స్, మ్యూరల్స్, స్కల్ప్చర్స్ అందుబాటులో ఉంచారు. ఇనుప వ్యర్థాలతో రూపొందించిన గణేశ్, వివిధ రకాల పక్షులు ఆర్ట్ లవర్స్‌ని కట్టిపడేస్తున్నాయి. జేఎన్ఏఎఫ్‌యూ, పొట్టిశ్రీరాములు యూనివర్శిటీ విద్యార్థులు, ఫ్యాకల్టీ తయారు చేసిన శిల్పాలను ఇక్కడ ప్రదర్శించారు.

కళాకారులను ప్రోత్సహించేందుకు..



చిత్రకళాకారులు వేసిన చిత్రాలను ప్రదర్శించేందుకు ఆర్ట్ గ్యాలరీ ఎంతగానో ఉపయోగపడుతుంది. కళాకారులను ప్రోత్సహించేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. సందర్శకులను ఆకట్టుకునేందుకు పరిసర ప్రాంతాల్లో వివిధ రకాల శిల్పాలు, ఆకృతులు అందుబాటులో ఉంచాము.
– డాక్టర్ కె.లక్ష్మి, ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్



ఆర్ట్ వర్క్ @హైదరాబాద్..

'సోషల్ సెయిలర్' ఆధ్వర్యంలో నిర్వహణ..









'సోషల్ సెయిలర్' ఆధ్వర్యంలో ఆర్ట్ మీటప్స్ మొదలు పాట్ మేకింగ్, పెయింటింగ్ వరకూ విభిన్న అంశాలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో నగరంలోని విభిన్న వేదికల్లో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో కాన్వాస్ పెయింటింగ్, ఫ్లూయిడ్ ఆర్ట్, రెసిన్ బీచ్ ఆర్ట్, సల్సా - బచాటా మిక్సర్‌లు, క్వీర్ మీటప్‌లు తదితర వినూత్న కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. ఇందులో పాల్గొని కళాత్మకతపై అవగాహన పెంచుకోవాలని అనుకునేవారు ఒంటరిగానైనా, బృందంగానైనా ప్రత్యేక రుసుముతో పాల్గొనవచ్చు. ఇందులో భాగంగా ఆర్ట్ మీటప్, ఫ్లూయిడ్ ఆర్ట్, కాన్వాస్ పెయింటింగ్, పెయింట్ యువర్ టోట్ బ్యాగ్ వంటి కార్యక్రమాలను నగరంలోని మైండ్ స్పేస్ వేదికగా నిర్వహిస్తుండగా.. కాఫీ మగ్ పెయింటింగ్, కాయిల్ పాటరీ వంటి కార్యక్రమాలను కోల్‌కతా, నోయిడా వంటి నగరాల్లో నిర్వహించనున్నారు. ఈ శిక్షణా శిబిరాలకు సంబంధించి దరఖాస్తుల కోసం బుక్ మై షోలో సంప్రదించాలని నిర్వాహకులు పేర్కొన్నారు. – సాక్షి, సిటీ బ్యూరో

క్లుప్తంగా...

జానారెడ్డి నివాసానికి సీఎం

- జానా అసంతృప్తిపై మాట్లాడేందుకే రేవంత్ రెడ్డి సమావేశం?
- శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరిన జానారెడ్డి!

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని కాంగ్రెస్ సీనియర్ నేత కె.జానారెడ్డి నివాసానికి వెళ్లారు. మంత్రివర్గ సమావేశం కంటే ముందు జానారెడ్డితో సీఎం భేటీ కావడంలో ప్రత్యేకత ఏమీ లేదని, ఇది మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేశాయి. కాగా, తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై జానారెడ్డి కొంత అసంతృప్తితో ఉన్నారని, ఆ అంశంపై మాట్లాడేందుకు ఆయనను సీఎం కలిశారనే చర్చ జరుగుతోంది. మరోవైపు ఈ భేటీలో.. తన సన్నిహితుడు, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీగా అవకాశమివ్వాలని జానారెడ్డి సీఎం రేవంత్‌ను కోరినట్టు తెలిసింది.

త్వరలో బీజేపీకి 'గిఫ్ట్' ఇస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: కరీంనగర్–మెదక్–ఆదిలాబాద్–నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిని కాంగ్రెస్ పార్టీకి రంజాన్ గిఫ్ట్‌గా ఇచ్చామంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్ ఇచ్చారు. 'మేము బీజేపీకి ఇప్పటికే ఎన్నో 'గిఫ్ట్'లు ఇచ్చాం. త్వరలో మరో 'గిఫ్ట్' కూడా ఇస్తాం' అని వ్యాఖ్యానించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల తీర్పును గౌరవిస్తామన్న ఆయన.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. ఇప్పటికే ఏర్పడిన ఫెవికాల్ బంధాన్ని మరింత గట్టిగా చేసుకోవడానికి ఈ ఎన్నికల్లో ఉపయోగించుకున్నాయని ఆయన విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎందుకు అభ్యర్థిని నిలబెట్టలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఓటేసిన ప్రతి ఒక్కరికీ, క్రియాశీలకంగా పనిచేసిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ పదవి అడుగుతలేను

జగ్గారెడ్డి స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ పదవి గురించి అనవసర ఊహాగానాలకు తావు లేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. 'నేను ఎమ్మెల్సీ అడుగుతలేను. అడ గొద్దు కూడా. నాకు పార్టీ ఇప్పటికే టికెట్ ఇచ్చింది. పోటీ చేశాను. కానీ, పరిస్థితులు అనుకూలించక ఓడిపోయాను. మూడుసార్లు ఎమ్మె ల్యేగా ఉన్న నేను ఎమ్మెల్సీ కావాలని పదేపదే అడిగే గుణం కలవాడిని కాదు'.. అని వ్యాఖ్యా నించారు. ఈ మేరకు ఢిల్లీకి రైలులో వెళ్తున్న ఆయన వీడియోతో పాటు ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ పదవి విషయంలో మీడియా ఊహాగానాలను నమ్మవద్దని, అలాంటి వార్తలు రాయొద్దని సూచించారు. రాహుల్ అపాయింట్‌మెంట్ దొరికితే ఆయనతో మాట్లాడతానని జగ్గారెడ్డి తెలిపారు.

కులగణన కోసం ప్రధానిపై ఒత్తిడి చేద్దాం: ఆర్ కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: జనగణనలో భాగంగా బీసీ కులగణన జరగాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. బీసీ కులగణన కోసం ప్రధాని నరేంద్రమోదీపైన ఒత్తిడి చేయాలని, ఇందు కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యూహాత్మక కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. అన్ని రాష్ట్రాల కమిటీల అధ్వర్యంలో బీసీ హక్కుల సాధన ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు వివరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన గవ్వల భరత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీలు రాజకీయంగా ఎదిగినప్పుడే అభివృద్ధి చెందుతారని చెప్పారు.

కరీంనగర్‌లో పార్టీని ప్రక్షాళన చేయాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ నేత నరేందర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీని ప్రక్షాళన చేయాలని, ఎక్కడెక్కడ లోపాలు ఉన్నాయన్న విషయంపై ముఖ్యమంత్రికి నివేదిక ఇస్తానని కరీంనగర్–మెదక్–ఆదిలాబాద్–నిజామాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఓటమిపాలైన ఆయన గురువారం కరీంనగర్‌లోని తన కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడుతూ, పట్టభద్రుల నిర్ణయాన్ని శిరసావహిస్తానని అన్నారు. సోషల్ మీడియాలో కొందరు తనపై దుష్ప్రచారం చేశారన్నారు. తాను ఓడిపోయినందుకు కార్యకర్తలు బాధపడొద్దని, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కరీంనగర్‌లో కాంగ్రెస్‌కు లీడర్ అవసరం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో మంత్రి శ్రీధర్‌బాబు తనకోసం ఎంతో కష్టపడ్డారంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

అడవిలోనే ప్రతిఫలం దక్కేలా!



అంతరించి పోతున్న అటవీ పండ్ల మొక్కలకు ప్రాణం.. ములుగు అటవీ కళాశాలలో 2 ఎకరాల్లో వైల్డ్ ఫ్రూట్ గార్డెన్

వివిధ ప్రాంతాల్లో 70 రకాల అటవీ మొక్కల సేకరణ.. అడవుల్లో కోతులకు ఆహారాన్ని సమృద్ధిగా చేయటమే లక్ష్యం

సాక్షి, సిద్దిపేట: అమ్మలాంటి అడవి మనిషి అత్యాశకు అంతరించిపోయే దుస్థితికి చేరుకుంది. దీంతో అడవినే ఆవాసంగా చేసుకొని బ్రతికే జంతువులు జనావాసాల్లోకి చొచ్చుకొస్తున్నాయి. ముఖ్యంగా వానరాలు అడవుల్లో ఆహారం దొరక్క గ్రామాలపై దండెత్తుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించేందుకు సిద్దిపేట జిల్లా ములుగులోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థ వినూత్న ప్రయత్నం చేస్తోంది. అంతరించిపోతున్న అటవీ పండ్ల మొక్కలకు ప్రాణం పోసి కళాశాల ప్రాంగణంలో 2 ఎకరాల విస్తీర్ణంలో వైల్డ్ ఫ్రూట్ గార్డెన్‌ను పెంచుతున్నారు. 70 రకాల అరుదైన పండ్ల మొక్కలతో ఈ గార్డెన్ అలరారుతోంది. మామిడి, జామ, ద్రాక్ష, సంత్ర, దానిమ్మ లాంటి అందరికీ తెలిసిన చెట్లతోపాటు దట్టమైన అడవుల్లో పెరిగే ఫాల్–సా, లక్ష్మణ ఫలం, నారపండు, బొట్కు, కలిమి పండు, చిన్న కలింగ, నల్ల జీడి, నార మామిడి, బుడ్డ ధరణి, గార్సినియా, తెల్ల నేరడు వంటి చెట్లను కూడా ఈ గార్డెన్‌లో పెంచుతున్నారు. ఒక్కో పండ్ల రకం 5 మొక్కల చొప్పున మొత్తం 350 మొక్కలు ఈ గార్డెన్‌లో ఉన్నాయి. ప్రతి మొక్క వద్ద దాని పేరు, శాస్త్రీయ నామం, నాటినవారి పేరుతో నేమ్ బోర్డులను ఏర్పాటు చేశారు.



ఫాల్–సా

ఈ చెట్లు ఎక్కువగా శ్రీలంకలోనూ, మన అమ్రాబాద్ అడవుల్లోనూ పెరుగుతాయి. ఇవి అచ్చం పరికి పండ్ల మాదిరిగా ఉంటాయి. ఈ చెట్టు సుమారు 6 ఫీట్ల ఎత్తు వరకు పెరుగుతుంది. ఈ పండ్లను ఆయుర్వేద మందులలో సైతం వినియోగిస్తారు.



గార్సినియా

కర్ణాటక, మహారాష్ట్ర అడవుల్లో ఎక్కువగా పెరుగుతుంది. ఆ ప్రాంతాల్లో చింతపండుగా వినియోగిస్తారు. ఈ మొక్కలను కర్ణాటక అడవుల్లో నుంచి తీసుకువచ్చారు. వీటిని కోతులు, పక్షులు, మనుషులు ఇష్టంగా తింటారు.

బొట్కు..

ఈ పండును కోతులు ఇష్టంగా తింటాయి. మధ్యప్రదేశ్ అడవుల్లో ఎక్కువగా ఉంటాయి. ఇది ఇప్పకాయ మాదిరిగా ఉంటుంది. నొప్పులకు, వాపులకు ఈ చెట్టు ఆకుల రసాన్ని వినియోగిస్తారు.



కలిమి పండు..

ఇది చెర్రీ పండు మాదిరిగా ఉంటుంది. వికారాబాద్ అడవుల్లో అధికంగా పెరుగుతుంది. దీనిని వికారాబాద్ నుంచి తీసుకువచ్చారు. ఈ పండును ఆయుర్వేద మందుల తయారీలో వినియోగిస్తారు. కోతులు, పక్షులు ఇష్టంగా తింటాయి.



వివిధ అడవుల్లో సేకరించాం



➤ అడవుల్లో పలు రకాల అటవీ పండ్ల చెట్లు అంతరించి పోవడంతో కోతులకు తిండి లభించడం లేదు. దీంతో అవి జనావాసాల్లోకి వస్తున్నాయి. తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్ అడవుల్లో వివిధ పండ్ల గింజలను సేకరించి వాటి ద్వారా మొక్కలను పెంచుతున్నాం. ఇప్పటివరకు 70 రకాల అడవి పండ్ల మొక్కలను నాటాం. ఇంకా 30 రకాల మొక్కలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇలా ఉత్పత్తి అయిన తర్వాత అడవుల్లో మొక్కలను నాటుతాం. దీంతో కోతులు మళ్లీ అడవుల బాట పట్టే అవకాశం ఉంది. అలాగే కొత్త తరానికి సైతం ఆ పండ్లు తెలుస్తాయి.

– డాక్టర్ హరీశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అటవీ కళాశాల, పరిశోధన సంస్థ, ములుగు

కాంగ్రెస్‌లో కులాల 'లెక్కలు'



- సామాజికవర్గాల వారీగా కూడికలు.. తీసివేతలతో కసరత్తు
- బీసీలకు రెండు కేబినెట్ బెర్తులు కావాలంటున్న టీపీసీసీ చీఫ్
- రెడ్లకూ రెండు మంత్రి పదవులు అవసరమంటున్న మరో ముఖ్యనేత
- మాల, మాదిగ వర్గాలను నొప్పించకుండా పదవుల కూర్పు
- కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల వరకు అన్ని పదవులూ భర్తీ చేసే యోచనలో ఏఐసీసీ.. ఈ నెల 10లోపు అన్ని ఖరారయ్యే చాన్స్.. నేడు కీలక భేటీ
- మాలకు మంత్రిగా అవకాశమిస్తే..మాదిగకు వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ, సలహాదారు పదవులు
- లంబాడకు మంత్రివర్గంలో స్థానం లేనట్టే... డిప్యూటీ స్పీకర్‌తోపాటు ఒక వర్కింగ్ ప్రెసిడెంట్

సాక్షి, హైదరాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీలో పదవుల భర్తీకి కులాల కోణంలోనే కసరత్తు జరుగుతోంది. ముందుగా కేబినెట్ బెర్తుల్లో రెడ్లు, బీసీలకు రెండేసీ పదవులు ఇవ్వాలా అనే విషయంలో పోటీ ఏర్పడుతోందని సమాచారం. ఇద్దరు బీసీలకు మంత్రి పదవులు కావాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ గట్టిగా అడుగుతుండగా, రెడ్డి నాయకులకు కచ్చితంగా రెండు కేబినెట్ బెర్తులు అవసరమే అని మరో ముఖ్యనేత పట్టుపడుతున్నట్టు తెలిసింది. ఎస్సీల్లో మాల, మాదిగలు, బీసీల్లో ప్రధాన ఐదు కులాలతోపాటు ఎంబీసీలు, ఎస్టీల్లో లంబాడ సామాజికవర్గాన్ని నొప్పించకుండా పదవులు భర్తీ చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వారిని ప్రత్యేక ప్రతినిధులుగా, ప్రభుత్వ సలహాదారులుగా నియమించే అవకాశాలున్నాయి. ఈనెల 10వ తేదీ కల్లా పదవుల కసరత్తు పూర్తి చేసేలా..7న కీలక భేటీ జరగనుంది.

భర్తీ చేసే పదవులు ఇవే..

ఆరు కేబినెట్ బెర్తులు, ఒక డిప్యూటీ స్పీకర్, ఒక చీఫ్ విప్, ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధి, రెండు లేదా మూడు ప్రభుత్వ సలహాదారులు, నాలుగు ఎమ్మెల్సీలు, నలుగురు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఇద్దరు ఏఐసీసీ కార్యదర్శులు, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ, క్రమశిక్షణ కమిటీ, టీపీసీసీ కోశాధికారి, 20 మంది వరకు ఉపాధ్యక్షులు, 25–30 మంది ప్రధాన కార్యదర్శులు, 20 వరకు కార్పొరేషన్ చైర్మన్లు, అన్ని కార్పొరేషన్లకు డైరెక్టర్ల పోస్టులను భర్తీ చేయనున్నారు.

మూడు సూత్రాల ఆధారంగా...

మంత్రివర్గ విస్తరణ విషయంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొందరు నేతలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, రాష్ట్రంలో పదవుల పంచాయితీలు ఉండొద్దని, సామాజిక న్యాయం జరగాలని, బీసీలు, మాదిగలకు ప్రాధాన్యం తగ్గొద్దని ఏఐసీసీ సూత్రీకరించింది. అక్కడి నుంచి సంకేతాల మేరకు వివిధ పదవుల భర్తీకి టీపీసీసీ మల్లగుల్లాలు పడుతోంది.

రెండింటికీ లింకు పెట్టి....

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులకు.. కేబినెట్ భర్తీకి లింకు పెట్టి కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈసారి కేబినెట్‌లో ఎస్టీ (లంబాడ)లకు అవకాశం ఇవ్వలేని నేపథ్యంలో ఆ సామాజికవర్గానికి చెందిన నేతను ఎమ్మెల్సీగా ఎంపిక చేస్తారు. అందులో భాగంగానే అటు లంబాడ, ఇటు మహిళ కోటాలో ఖమ్మం జిల్లాకు చెందిన విజయాబాయి పేరు తెరపైకి వచ్చింది. దీంతోపాటు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా లంబాడ వర్గానికే చెందిన బాలూనాయక్‌ను నియమించనున్నారు. ఎంపీ బలరాంనాయక్, కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌లలో ఒకరికి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశం ఇస్తారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

➤ మాలలకు కేబినెట్‌లో అవకాశమిస్తే మాదిగసామాజిక వర్గానికి చెందిన దొమ్మాట సాంబయ్య, రాచమళ్ల సిద్దేశ్వర్‌లలో ఒకరికి ఎమ్మెల్సీగా అవకాశమిస్తారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్‌ను ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా పంపనున్నారు. ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తున్న మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్‌ను ఏఐసీసీ కార్యదర్శిగా పంపే అవకాశాలున్నాయి. మల్లురవి, మధుయాష్కీలలో ఒకరికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా అవకాశమిచ్చే యోచనలో అధిష్టానం ఉన్నట్టు తెలుస్తోంది.

➤ ఇక, ఓసీ కోటాలో వేం నరేందర్‌రెడ్డి, టి. జీవన్‌రెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి. ఓసీలకు కాదంటే జీవన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించే చాన్స్ ఉంది.

మంత్రి పదవులు ఐదా.. ఆరా?

రాష్ట్ర కేబినెట్ 18 మంత్రి పదవులు భర్తీ చేసే అవకాశముంది. ప్రస్తుతం సీఎంతో కలిపి 12 మంది మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

➤ ఆరుగురికి మంత్రి పదవులు ఇస్తారంటూ ప్రచారం జరుగుతోంది. రెండు రెడ్లకు, రెండు బీసీ (ముదిరాజ్, మున్నూరుకాపు), ఒకటి ఎస్సీ (మాల), ఒకటి మైనార్టీ వర్గానికి ఇవ్వనున్నారు. ఒకవేళ ఐదింటిని మాత్రమే భర్తీ చేయాలనుకుంటే మైనార్టీ లేదంటే రెడ్లలో ఒకటి తగ్గించొచ్చు.

➤ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఏఐసీసీ మాట ఇచ్చిన విధంగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గడ్డం వివేక్‌లకు బెర్తులు ఖాయమైనట్టే.

➤ బీసీల కోటాలో వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్‌లకూ దాదాపు ఓకే అయినట్టే. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పి.సుదర్శన్‌రెడ్డి (నిజామాబాద్)కి కూడా మంత్రి పదవి ఖరారైనట్టే.

➤ మైనార్టీ కోటాలో షబ్బీర్‌అలీ లేదంటే ఆమేర్ అలీ ఖాన్‌ల పేర్లు వినిపిస్తున్నాయి.

➤ ఐదింటిని మాత్రమే భర్తీ చేయాలనుకుంటే సుదర్శన్‌రెడ్డిని ఆపేసి షబ్బీర్‌అలీని మంత్రిని చేసే అవకా శాలున్నాయి. లేదంటే మైనార్టీ కోటాను ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టి ఇద్దరు రెడ్డి, ఇద్దరు బీసీ, ఒక ఎస్సీ నేతతో మంత్రివర్గ విస్తరణ చేసే అవకాశాలున్నాయి.

➤ మంత్రివర్గ విస్తరణ కసరత్తులో రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం లభించే అవకాశం లేనందున, ఆ జిల్లాకు చెందిన మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలలో ఒకరిని అసెంబ్లీలో చీఫ్‌విప్‌గా నియమించే అవకాశాలున్నాయి. ఎంబీసీ వర్గాలకు చెందిన మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను విప్‌గా అవకాశమిస్తారు.

➤ బీసీ కోటాలో ఈసారి ఎమ్మెల్సీగా యాదవసామాజిక వర్గానికి చెందిన నేతను నియమించొచ్చు. మున్నూరు కాపు, ముదిరాజ్, పద్మశాలి, గౌడ్‌లకు కేబినెట్‌లో ప్రాతినిధ్యం లభిస్తే.. కచ్చితంగా ఎమ్మెల్సీగా యాదవ వర్గానికి అవకాశం దక్కుతుంది. ఈ కోటాలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ పేరు వినిపిస్తోంది. మొత్తం మీద కాంగ్రెస్ పార్టీలో పదవుల భర్తీ అంశం పూర్తిగా సామాజిక కోటాలోనే జరుగుతుండడం గమనార్హం.

నేడు బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ

- ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై చర్చించే అవకాశం
- పార్టీ ప్లీనరీ తదితరాలపై నేతలతో చర్చ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు శుక్రవారం భేటీ కానున్నా రు. ఎర్రవల్లి నివాసంలో మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమయ్యే ఈ భేటీకి రావా ల్సిందిగా పార్టీకి చెందిన కొందరు ముఖ్య నేతలకు ఆహ్వానం అందినట్లు సమాచారం. ఈ నెల 10న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల నామినేషన్ల దాఖలుకు గడువు ముగుస్తున్న నేపథ్యంలో నేతలతో కేసీఆర్ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. అభ్యర్థి ఎంపిక, ఒకరు లేదా ఇద్దరు అభ్యర్థులకు అవకాశం కల్పించడంలో సాధ్యాసాధ్యాలు వంటి అంశాలు ఈ భేటీలో ప్రస్తావనకు వస్తాయని పార్టీ నేతలు వెల్లడించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు భిక్షమయ్య గౌడ్, జోగు రామన్న, పార్టీ నాయ కులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరుల పేర్లు పార్టీ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఏప్రిల్ 27 నాటికి పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంలో ఏడాది పొడవునా నిర్వహించాల్సిన రజతోత్సవ వేడుకలు, ప్లీనరీ, ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహణ తదితర అంశాలపై శుక్రవారం జరిగే భేటీలో కార్యాచరణ ప్రణాళికపై కేసీఆర్ దిశా నిర్దే శం చేస్తారు. కార్యక్రమాల నిర్వహణ కమిటీలు, సభ్యత్వ నమోదు షెడ్యూలు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కమిటీల ఏర్పాటు, వాటి విధి విధానాలకు సంబంధించి అధినేత పలు సూచనలు చేయనున్నారని తెలుస్తోంది.

ఏం చేశారు.. ఏమి చేయగలరు?

రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఏఐసీసీ ఇంటర్వ్యూలు
గాంధీభవన్‌కు 25 మంది ముఖ్య నేతలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సారథ్యంలోని ఏఐసీసీ బృందం రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై దృష్టి సారించింది. అందులో భాగంగా గురువారం 25 మంది రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు గాంధీభవన్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించింది. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా నాయకులను ఎంపిక చేసిన ఏఐసీసీ.. వారిని గురువారం ఉదయం గాంధీభవన్‌కు వచ్చి ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణునాథ్‌ను కలిసి మాట్లాడాలని ఫోన్ ద్వారా తెలిపింది. అలా సమాచారం అందుకుని వచ్చిన వారిలో ఎన్ఎస్‌యూఐ మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, వెడ్మబొజ్జు, చిక్కుడు వంశీకృష్ణ, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కై లాశ్ నేత, అధికార ప్రతినిధులు చనగాని దయాకర్, గౌరి సతీశ్, రవళిరెడ్డి, బొజ్జా సంధ్యారెడ్డి, సరితా తిరుపతయ్య యాదవ్, జీహెచ్ఎంసీ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

ఏమైనా ఆశిస్తున్నారా?: గాంధీభవన్‌కు పిలిపించిన నాయకులతో ఏఐసీసీ కార్యదర్శులు.. పార్టీ సంస్థాగత కోణంలోనే సమాచారం రాబట్టినట్టు తెలిసింది. ఎన్ని రోజుల నుంచి పార్టీలో ఏ హోదాలో ఉన్నారు?, గతంలో ఏదైనా పార్టీలో పనిచేశారా? ఇప్పటివరకు పార్టీ బలోపేతానికి ఏం చేశారు?, ఇకపై ఏం చేయగలరు?, మీరు పార్టీలో, లేదంటే ప్రభుత్వంలో ఏదైనా పదవి ఆశిస్తున్నారా? అనే ప్రశ్నలను వేసినట్టు తెలిసింది. మహిళా నాయకురాళ్లతో మాట్లాడిన సమయంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్‌లాంటి పథకాలపై మహిళల స్పందన ఎలా ఉందని ప్రశ్నించినట్టు సమాచారం. కాగా, పార్టీ సంస్థాగత బలోపేతానికే ఈ కార్యక్రమం నిర్వహించినట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. ఇంటర్వ్యూల నివేదికను ఇద్దరు ఏఐసీసీ కార్యదర్శులు మీనాక్షి నటరాజన్‌కు అందజేస్తారని ఆ వర్గాలు వెల్లడించాయి.

ఎమ్మెల్సీ అభ్యర్థులను ఢిల్లీలో తేలుద్దాం

- భట్టి, ఉత్తమ్, మహేశ్‌గౌడ్‌తో కలిసి రేపు హస్తినకు సీఎం రేవంత్‌రెడ్డి!
- పార్టీ పెద్దలతో చర్చలు.. వీలునుబట్టి అదే రోజు లేదా మర్నాడు అభ్యర్థుల అధికారిక ప్రకటన
- ఓ ప్రైవేటు కార్యక్రమం కోసం నేడు విడిగా ఢిల్లీ వెళ్లనున్న ముఖ్యమంత్రి

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ అధిష్టానంతో చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఆయనతోపాటు డిప్యూటీ సీఎం భట్టి, కీలక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వెళ్లనున్నట్లు సమాచారం. శనివారం పరేడ్ గ్రౌండ్స్‌లో సభ అనంతరం వారంతా కలిసి ఢిల్లీ వెళ్తారని తెలియవచ్చింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వార్ధా నుంచి నేరుగా ఢిల్లీ చేరుకుంటారని.. అక్కడ పార్టీ పెద్దలతో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులపై చర్చిస్తారని గాంధీ భవన్ వర్గాల ద్వారా తెలిసింది. బుధవారం సీఎం నివాసంలో జరిగిన చర్చల్లో బీసీలకు ఎన్ని ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వాలనే విషయమై ఏకాభిప్రాయం రాలేదని.. మిగిలిన అంశాల్లో ఏకాభిప్రాయం ఉన్న నేపథ్యంలో శనివారం అధిష్టానంతో చర్చల అనంతరం అభ్యర్థుల జాబితా ఫైనల్ అవుతుందని తెలుస్తోంది. వీలునుబట్టి అదే రోజున లేదంటే మరుసటి రోజున అభ్యర్థులను అధికారికంగా ప్రకటించనున్నారని సమాచారం. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడం కోసం శుక్రవారం ఉదయం విడిగా ఢిల్లీ వెళ్లి సాయంత్రానికి హైదరాబాద్ చేరుకుంటారని సీఎంవో వర్గాల ద్వారా తెలిసింది.

రేసులో విజయశాంతి, రేఖానాయక్!

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీల రేసులో ఇద్దరు మహిళా నేతల పేర్లు కొత్తగా తెరపైకి వచ్చాయి. మాజీ ఎంపీ విజయశాంతితోపాటు మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌ల పేర్లు ఈ జాబితాలో వినిపిస్తున్నాయి. విజయశాంతి గురువారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలవగా రేఖానాయక్ హైదరాబాద్‌లో ఏఐసీసీ కార్యదర్శులను కలిసి తనకు ఎమ్మెల్సీగా అవకాశమివ్వాలని కోరినట్లు సమాచారం. మరోవైపు ఓసీ వర్గానికి ఎమ్మెల్సీ ఇవ్వాల్సి వస్తే సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న టి. జీవన్‌రెడ్డి, టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, గాంధీభవన్ ఇన్‌చార్జి కుమార్‌రావుల పేర్లను కూడా పార్టీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

కార్యకర్తలను చూసి గర్వపడుతున్నా: మోదీ

బీజేపీ ఎమ్మెల్సీలకు ప్రధానితోపాటు అమిత్ షా, నడ్డా అభినందనలు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడానికి కారణమైన పార్టీ కార్యకర్తలను చూసి తాను గర్వపడుతున్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అద్వితీయమైన మద్దతునిచ్చి తెలంగాణ బీజేపీని ఆశీర్వదించిన తెలంగాణ ప్రజలకు గురువారం ఆయన సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా ఎన్నికైన అభ్యర్థులకు అభినందనలు చెప్పారు. ఎంతో శ్రద్ధగా పనిచేస్తున్న పార్టీ కార్యకర్తలను చూసి చాలా గర్వపడుతున్నానని మోదీ అన్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని అఖండ విజయంతో ఆశీర్వదించినందుకు తెలంగాణ ప్రజలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీలుగా గెలుపొందిన మల్క కొమరయ్య, అంజిరెడ్డికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అభినందనలు తెలిపారు. ఈ విజయం కోసం కృషి చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గోవర్ధనగిరిధారిగా శ్రీనారసింహుడు



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం స్వామి గోవర్ధనగిరిధారి అలంకార సేవలో, సాయంత్రం సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్!

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే అందుకు ఉదాహరణ: కిషన్‌రెడ్డి



ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన సి.అంజిరెడ్డి, మల్క కొమురయ్యతో కిషన్‌రెడ్డి. చిత్రంలో రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/సనత్‌నగర్: తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి అన్నా రు. 'సేవ్ తెలంగాణ– సపోర్ట్ బీజేపీ' నినాదంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రకటించారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో బీజేపీ గెలిచిన నేపథ్యంలో.. ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం విజయో త్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మె ల్సీలు సి.అంజిరెడ్డి, మల్క కొమురయ్యతోపాటు ఎంపీలు ఎం.రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డితో కలిసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టారని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో 37 శాతం మంది బీజేపీకి మద్దతు తెలిపారని, తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వంపై ఉపాధ్యా యులు, పట్టభద్రుల్లో తీవ్ర అసంతృప్తి ఉందని అన్నారు.

'సేవ్‌తెలంగాణ, సపోర్ట్‌బీజేపీ'నినాదం: రాష్ట్రంలో ఇకపై 'సేవ్ తెలంగాణ–సపోర్ట్ బీజేపీ'అనే నినాదంతో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో తమ పార్టీకి ఉన్న 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలతో రానున్న రోజుల్లో పోరాటాలకు సమాయత్తం అవుతామని చెప్పారు. ఒకటి రెండు నెలల్లో పార్టీకి సంబంధించిన అన్ని కమిటీలను ఏర్పాటు చేసుకొని రాష్ట్రంలో బలమైన శక్తిగా ముందుకెళ్లి పోరాడతామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా బయటపడిందని అన్నారు. రాష్ట్రంలో భవిష్యత్తులో ఎప్పుడు, ఏ ఎన్నికలు జరిగినా బీజేపీ విజయం తథ్యమని అన్నారు.

బీజేపీ విజయోత్సవం: ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ స్థానాల్లో గెలిచిన నేపథ్యంలో గురువారం బీజేపీ కార్యా లయంలో విజయోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్య క్షుడు జి.కిషన్‌రెడ్డి బీజేపీ జెండా చేతబూని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. కరీంనగర్ ఇతర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిచిన మల్క కొమురయ్య, ఇవే జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిచిన సి.అంజిరెడ్డిలను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీలు ఎం.రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, సూర్యనారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



తాను పెంచుకుంటున్న కుక్క చనిపోవడంతో మంత్రి కొండా సురేఖ కన్నీరుమున్నీర య్యారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–10 లోని తన నివాసంలో సురేఖ ఓ కుక్కను ఎంతో ప్రేమగా పెంచుకుంటున్నారు. ఆ కుక్కను 'హ్యాపీ' అని ముద్దుగా పిలుచు కునేవారు. కాగా, గురువారం ఉదయం గుండెపోటుతో కుక్క మృతి చెందింది. దీంతో మంత్రి కంటతడి పెట్టుకున్నారు.

– బంజారాహిల్స్ (హైదరాబాద్)

బీసీ రిజర్వేషన్లపై మూడు బిల్లులు పెట్టాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీల రిజర్వేషన్లు పెంచడానికి అసెంబ్లీలో మూడు వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గురువారం ఆమె తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచకుండా కాంగ్రెస్ కుట్ర చేస్తోందని విమర్శించారు. మూడు అంశాలను ఒకే బిల్లులో పెడితే న్యాయవివాదం తలెత్తుతుందని, జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు సంబంధించిన అంశం కాబట్టి ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. పట్టణ, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి కేసీఆర్ రాష్ట్రస్థాయిలోనే చట్టం తెచ్చి సాధ్యం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రస్థాయిలో చట్టం ద్వారా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచే అవకాశం ఉందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఓడిపోయిందని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తీరు బీసీల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు ఈ ఎన్నికల్లో బీసీయేతర అభ్యర్థులను బరిలోకి దింపాయన్నారు. చట్టసభల్లో కూడా బీసీలకు రిజర్వేషన్లు ఉండాలని, బీసీ రిజర్వేషన్లు ఉంటే ఆ స్థానంలో కచ్చితంగా అన్ని పార్టీలు బీసీకే టికెట్ ఇచ్చేవని అన్నారు.



మాంసం.. మంటలు

మాంసం ఉత్పత్తితో భారీగా గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల

కిలో గొడ్డు మాంసం ఉత్పత్తితో	కిలో మేక మాంసం ఉత్పత్తికి	అతి తక్కువ ఉద్గారాల విడుదల కోడి మాంసం ఉత్పత్తిలోనే
99.48 కిలోల ఉద్గారాలు	39.72 కిలోల విష వాయువులు	

కిలో కూరగాయల ఉత్పత్తికి దాదాపు అర కేజీ ఉద్గారాలే విడుదల

ముక్క లేకపోతే ముద్ద దిగనివాళ్లు చాలామందే ఉంటారు. మాంసాహారుల్లో ప్రకృతి ప్రేమికులు కూడా ఉంటారు. అయితే, మనం ఇష్టంగా తినే ఈ మాంసమే భూగోళాన్ని అగ్నిగోళంగా మండిస్తోందని చాలామందికి తెలియదు. మాంసం కోసం పెంచే జంతువుల వల్ల కార్బన్ డైఆక్సైడ్ (సీవో2) వంటి గ్రీన్‌హౌస్ (పర్యావరణానికి హాని చేసేవి) వాయువులు అసాధారణ స్థాయిలో విడుదలవుతున్నాయి. అవి భూగోళాన్ని విపరీతంగా వేడెక్కిస్తున్నాయి. అంతిమంగా పర్యావరణానికి, జీవజాలం మనుగడకు ముప్పు తెస్తున్నాయి. మాంసం కోసం జంతువులను పెంచే క్రమంలో నేల, నీరు, ఎరువులు, ఇంధనం వంటి ప్రకృతి వనరులు విరివిగా ఖర్చవుతుంటాయి. మాంసాన్ని ప్రాసెస్, నిల్వ చేయడానికి, రవాణాకు కూడా కొంత ఇంధనం ఖర్చవుతుంది. ఒక్కో దశలో భారీగా హరిత గృహ వాయువులు విడుదలవుతాయి. శాకాహారంతో పోల్చితే మాంసాహారం ఉత్పత్తికి ఎక్కువ ఉద్గారాలు వెలువడతాయన్నది తెలిసిందే. అయితే, మాంసాహారంలో కూడా గొడ్డు మాంసం ఉత్పత్తిలో అత్యధికంగా, కోడి మాంసం ఉత్పత్తిలో అతి తక్కువగా గ్రీన్‌హౌస్ వాయువులు విడుదలవుతాయని తేలింది.

ఏయే ఆహారం ఉత్పత్తిలో ఎంత మోతాదులో గ్రీన్‌హౌస్ వాయువులు విడుదలవుతాయంటే..

ఆహారం రకం (ఒక కేజీకి)	గ్రీన్‌హౌస్ వాయువులు (కేజీల్లో)
గొడ్డు మాంసం (మాంసం కోసం పెంచే పశువులు)	99.48
మేక/గొర్రె మాంసం	39.72
గొడ్డు మాంసం (పాడి పశువులు)	33.3
రొయ్యలు (చెరువుల్లో పెంచినవి)	26.87
చీజ్	23.88
చేపలు (చెరువుల్లో పెంచినవి)	13.63
పంది మాంసం	12.31
కోడి మాంసం	9.87
కోడిగుడ్లు	4.67
వరి బియ్యం	4.45
వేరుశనగలు	3.23
తోఫు (సోయా ఉత్పత్తి)	3.16
పాలు	3.15
టమాటాలు	2.09
పప్పుధాన్యాలు	1.79
మొక్కజొన్న	1.7
గోధుమ	1.57
పండ్లు	1.05
కూరగాయలు	0.53
గింజలు	0.43

-సాక్షి, సాగుబడి డెస్క్

రూ.1,500 కోట్ల పెనాల్టీ.. వసూలు చేయాల్సిందే

ఆదాయపన్ను శాఖకు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ లేఖ


సాక్షి, అమరావతి: రిజర్వ్‌బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లు వసూలు చేసిన మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు విధించిన రూ.1,500 కోట్ల పెనాల్టీని వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కేంద్ర ఆదాయ పన్ను శాఖను కోరారు. ఇప్పటికే 16 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఈ విషయాన్ని సత్వరం పరిష్కరించి పెనాల్టీని వసూలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థను నిర్వహించిన హిందూ అవిభాజ్య కుటుంబ (హెచ్‌యూఎఫ్) కర్త చెరుకూరి రామోజీరావు మరణించినందున దీనికి సంబంధించి గతంలో ఉమ్మడి హైకోర్టు విధించిన స్టే కూడా తొలగిపోయినట్లేనని స్పష్టం చేశారు. ఈమేరకు ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌కు ఉండవల్లి అరుణ్ కుమార్ ఇటీవల రెండు వేర్వేరు లేఖలు రాశారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ ఆర్బీఐ చట్ట నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసిన అక్రమ డిపాజిట్ల ఉదంతాన్ని అందులో సవివరంగా ప్రస్తావించారు.

అక్రమంగా డిపాజిట్లు వసూలు నిర్ధారించిన ఆర్బీఐ

మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ పేరిట రామోజీరావు ప్రజల నుంచి అక్రమంగా డిపాజిట్లు వసూలు చేసిన విషయాన్ని ఉండవల్లి అరుణ్ కుమార్ తొలిసారి 2006లో ఆధారాలతో సహా బట్టబయలు చేశారు. రిజర్వ్ బ్యాంకు చట్టం ప్రకారం బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదు. కానీ మార్గదర్శి ఫైనాన్షియర్స్ రెండు లక్షల మందికిపైగా డిపాజిటర్ల నుంచి అక్రమంగా రూ.2,600 కోట్లకుపైగా డిపాజిట్లు వసూలు చేసింది. ఇదే విషయాన్ని ఉండల్లి అరుణ్‌కుమార్ అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం, ఆర్బీఐలకు లేఖల ద్వారా తెలియచేశారు. ఈ క్రమంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ కేసు నమోదు చేసింది. ఆర్బీఐ సెక్షన్ 45 ఎస్ నుంచి తమకు మినహాయింపు ఉందని రామోజీ అప్పట్లో అడ్డగోలుగా వాదించారు. అయితే ఆ వాదనను ఆర్బీఐ కొట్టిపారేసింది. 45 ఎస్ కింద రామోజీరావుకు మినహాయింపు వర్తించదని.. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట వసూలు చేసినవి ముమ్మాటికీ అక్రమ డిపాజిట్లేనని స్పష్టం చేసింది. దాంతో విధి లేని పరిస్థితుల్లో రామోజీరావు తన మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థను మూసివేస్తున్నామని.. సేకరించిన అక్రమ డిపాజిట్లను తిరిగి చెల్లించేస్తామని ఆర్బీఐ, న్యాయస్థానాలకు విన్నవించారు.

రూ.1,500 కోట్ల పెనాల్టీ విధించిన ఐటీ శాఖ స్టే తెచ్చుకున్న రామోజీ

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్ల ద్వారా రామోజీ సముపార్జించిన అక్రమ ఆదాయంపై



Date: 18-2-2025

From,
Vundavalli Aruna Kumar
Former Member of Parliament
1st floor,
Sravanthi Apartments,
Prakasham Nagar,
Rajamahendravaram 533103.

To
The Principal Chief Commissioner of Income tax,
Andhra Pradesh,
Income Tax Bhavan,
IT Towers,
AC Guards, Hyderabad.

Respected Madam/Sir,

In continuation of my letter dated 10-02-2025(delivered on 13-02-2025 in your office), I would like to draw your attention that the petitioner Ch. Ramoji Rao (Kartha of HUF) in W.P.No.15939 (Batch of writs) of 2008, has expired on 08-06-2024.

As could be seen from the case status the legal representatives of the deceased are not brought on record till today, and the writ petitions may abate and cannot continue as per law.

In similar circumstances Sri Ch. Kiran S/O Ramoji Rao filed application for substitution as Kartha of HUF and the name was allowed by the Hon'ble High Court of Telangana.

It is requested that necessary steps may be initiated in this regard.

Thanking you...
Yours Sincerely,
(Vundavalli Aruna Kumar)

ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌కు ఉండవల్లి రాసిన లేఖ

ఆదాయపన్ను శాఖ 2008లో రూ.1,500 కోట్ల పెనాల్టీ విధించింది. ఈ మేరకు ఆదాయపన్ను చట్టం సెక్షన్ 271 డి ప్రకారం మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు నోటీసులు జారీ చేసింది. అయితే ఆ నోటీసులపై రామోజీ న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. స్టే విధించి 16 ఏళ్లు దాటినప్పటికీ దాన్ని తొలగించేందుకు ఇప్పటికీ ఆదాయపన్ను శాఖ సరైన చర్యలు తీసుకోలేదు. దాంతో రూ.1,500 కోట్ల పెనాల్టీ చెల్లింపు అంశం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది.

'మార్గదర్శి'పై చర్యలు తీసుకోవాల్సిందేనన్న 'సుప్రీం'

మార్గదర్శి ఫైనాన్షియర్స్ తమ డిపాజిటర్లకు డిపాజిట్ల మొత్తాన్ని తిరిగి చెల్లించేసినందున ఇక ఎలాంటి చర్యలు అవసరం లేదని ఏపీ – తెలంగాణ ఉమ్మడి హైకోర్టు విభజనకు ముందు రోజు అంటే 2018 డిసెంబర్ 31న తీర్పునిచ్చింది. ఆ తీర్పును అప్పటి టీడీపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయకుండా రామోజీరావుకు సహకరించింది. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్రమ డిపాజిట్లు ఎవరెవరికి తిరిగి చెల్లించారో వివరాలు వెల్లడించాలని.. అక్రమాలకు పాల్పడిన మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. అనంతరం 2019 మేలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యింది. ఈ కేసును విచారించిన సుప్రీం కోర్టు.. గతంలో ఉమ్మడి ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు చేపట్టాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ క్రమంలో కేసును తిరిగి విచారించాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. ఈ విషయంలో తెలంగాణ హైకోర్టుకు సహకరించాలని ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు సూచించింది. ప్రస్తుతం ఈ కేసు తెలంగాణ హైకోర్టులో విచారణలో ఉంది. హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావు మరణించినా సరే... అక్రమ డిపాజిట్లు వసూలు చేసిన మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.


పెనాల్టీ వసూలుకు చర్యలు చేపట్టండి

ఈ పరిణామాల నేపథ్యంలో ఉండవల్లి అరుణ్ కుమార్ కేంద్ర ఆదాయపన్ను శాఖకు లేఖ రాశారు. హెచ్‌యూఎఫ్ కర్త చెరుకూరి రామోజీరావు మరణించినందున ఆ సంస్థపై ఐటీ శాఖ విధించిన పెనాల్టీకి సంబంధించి గతంలో న్యాయస్థానం ఇచ్చిన స్టే ఉత్తర్వులు తొలగిపోయిననట్లేనని వివరించారు. రామోజీరావు మరణించిన తరువాత ఆయన కుటుంబ సభ్యులను ఈ కేసు రికార్డుల్లో నమోదు చేయనందున గతంలో ఇచ్చిన స్టే ఉత్తర్వులు మనుగడలో లేనట్లుగానే పరిగణించాల్సి ఉంటుందన్నారు. రామోజీ స్థానంలో తనను హెచ్‌యూఎఫ్ కర్తగా పరిగణించాలని ఆయన కుమారుడు సీహెచ్.కిరణ్ మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసును విచారిస్తున్న తెలంగాణ హైకోర్టును కోరారు. కానీ మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై ఆదాయపు పన్ను శాఖ విధించిన పెనాల్టీకి సంబంధించిన కేసులో మాత్రం రామోజీరావు వారసుల పేర్లు రికార్డుల్లో నమోదు కాలేదు. కాబట్టి గతంలో ఆదాయ పన్ను శాఖ విధించిన రూ.1,500 కోట్ల పెనాల్టీపై న్యాయస్థానం ఇచ్చిన స్టే తొలగిపోయినట్లుగానే పరిగణించాలని కూడా ఉండవల్లి అరుణ్ కుమార్ నివేదించారు. ఈ నేపథ్యంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు విధించిన రూ.1,500 కోట్ల పెనాల్టీని వసూలు చేసేందుకు ఆదాయపన్ను శాఖ న్యాయపరంగా అన్ని చర్యలూ చేపట్టాలని కోరారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలపై తానే ఫిర్యాదుదారుడిని కాబట్టి పెనాల్టీ అంశంపై ప్రస్తుత పరిస్థితిని తనకు వివరిస్తే అవసరమైతే తాను కూడా తగిన న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

తొక్కిపెడుతున్న బాబు సర్కారు..

మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త రామోజీరావు భారీ ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని ఆర్బీఐ ఆధారాలతో సహా న్యాయస్థానానికి నివేదించినా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని తొక్కిపెడుతూ మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగానే.. మార్గదర్శి ఫైనాన్షియర్స్ కర్త రామోజీరావు మరణించినందున ఈ వ్యాజ్యాలపై విచారణే అవసరం లేదంటూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ఇటీవల తెలంగాణ హైకోర్టుకు తెలిపింది. అనవసరమైన విచారణ జరిపి సమయాన్ని వృథా చేసుకోవద్దని ఏకంగా న్యాయస్థానానికే సూచించింది.

చట్ట విరుద్ధంగా జరిగిందా.. లేదా?



'డిపాజిట్లు వెనక్కి ఇచ్చేశారు సరే..! అసలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయడమే నిబంధనలకు విరుద్ధమని ఆర్బీఐ చెబుతోంది కదా? వసూలు చేసిన డిపాజిట్లను వెనక్కి ఇచ్చేయడం వేరు.. చట్ట విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేయడం వేరు. ఈ రెండింటికీ చాలా వ్యత్యాసం ఉంది. డిపాజిట్ల వసూలు చట్ట విరుద్ధంగా జరిగిందా.. లేదా? అలా వసూలు చేయడం చేయడం నేరమా? కాదా? అన్నదే ముఖ్యం. తుది విచారణలో ఈ విషయాన్ని కూడా తేలుస్తాం...'

– మార్గదర్శినుద్దేశించి గతంలో తెలంగాణ హైకోర్టు వ్యాఖ్య

డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధమే: ఆర్బీఐ

మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త రామోజీరావు ఆర్బీఐ చట్టం సెక్షన్ 45 (ఎస్)కి విరుద్ధంగా ప్రజల నుంచి అక్రమంగా డిపాజిట్లు వసూలు చేశారని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే పలు దఫాలు న్యాయస్థానానికి నివేదించింది. ఇది సెక్షన్ 58 బీ (5ఏ) ప్రకారం అత్యంత శిక్షార్హమైన నేరమని స్పష్టం చేసింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త రామోజీరావుల చట్ట ఉల్లంఘనలకు సంబంధించి ఆర్బీఐ తన కౌంటర్‌లో పలు కీలక విషయాలను తెలంగాణ హైకోర్టు ముందుంచింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ చట్ట విరుద్ధంగా వసూలు చేసిన డిపాజిట్లపై తమకు ప్రజల నుంచి, డిపాజిటర్ల నుంచి ఫిర్యాదులు అందాయని వెల్లడించింది. డిపాజిట్ల వసూలు విషయంలో తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్న మార్గదర్శి, రామోజీ వాదన శుద్ధ అబద్ధమని స్పష్టం చేసింది. ఇదే సమయంలో... చట్ట విరుద్ధంగా ప్రజల నుంచి రూ.వేల కోట్లు వసూలు చేసిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కర్త చెరుకూరి రామోజీరావు మరణించిన నేపథ్యంలో, తమపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడం నిష్ప్రయోజనమంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేసిన వాదనను ఆర్‌బీఐ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావు ప్రజల నుంచి వేల కోట్ల రూపాయలను డిపాజిట్ల రూపంలో వసూలు చేశారని, ఇది ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45ఎస్‌కి విరుద్ధమని పునరుద్ఘాటించింది. అంతేకాక ఇలా అక్రమంగా డిపాజిట్లు వసూలు చేయడం ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 58 బీ (5ఏ) ప్రకారం శిక్షార్హమని హైకోర్టు దృష్టికి తెచ్చింది. రామోజీరావు మరణించినప్పటికీ మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ప్రొసీడింగ్స్‌ను కొనసాగించాల్సిందేనని స్పష్టం చేసింది.

ఎండిపోయిన వరి పొలంలో మేస్తున్న పశువులు



'బోరు'మంటున్న పొలాలు

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం ఏపూరు, తెట్టెకుంట తండాకు చెందిన రైతు బదావత్ శంకర్ రెండు ఎకరాల పొలం నీరు లేక ఎండిపోయింది. ఏపూరు గ్రామానికి చెందిన రైతు వీరబోయిన సతీశ్ ఎకరం రూ.20 వేల కౌలు చొప్పున మొత్తం 4 ఎకరాలు తీసుకుని వరి సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో.. బోరు ఎండిపోయింది. దీంతో రూ.60 వేలు ఖర్చు చేసి మూడు బోర్లు వేసినా ఫలితం లేకపోయింది. పంట బాగా ఎదుగుతున్న సమయంలో నీటి కొరత వేధిస్తుండడంతో.. చేసేది లేక పశువులను మేపుతున్నారు. పరిసర గ్రామాల్లో ఒక్కొక్క రైతు 3 నుంచి 4 బోర్ల చొప్పున సుమారు 150 బోర్లు వేయించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

అత్యవసర భూ సేకరణ ఎందుకు?

లగచర్ల, హకీంపేట్ భూ సేకరణపై సర్కార్‌కు హైకోర్టు ప్రశ్న
- భూ సేకరణ ప్రక్రియను నిలిపివేస్తూ ఆదేశాలు
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం
- తదుపరి విచారణ ఏప్రిల్ 7వ తేదీకి వాయిదా

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట్‌లో అత్యవసర భూ సేకరణ ఎందుకోసమో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. అక్కడ ఏర్పాటు చేయదలచిన బహుళార్థసాధక పారిశ్రామిక పార్కుపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అప్పటివరకు భూ సేకరణ ప్రక్రియపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 7వ తేదీకి వాయిదా వేసింది.

ఫార్మా విలేజ్ స్థానంలో ఇండస్ట్రియల్ పార్కు..: లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటు నిర్ణయాన్ని గత ఏడాది నవంబర్‌లో వెనక్కు తీసుకున్న ప్రభుత్వం.. అందుకు బదులుగా మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీని కోసం లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో 1,177.35 ఎకరాలు సేకరించేందుకు గత ఏడాది నవంబర్ 29న ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ లగచర్లకు చెందిన గోపాల్ నాయక్‌తో పాటు 14 మంది ఒక పిటిషన్, హకీంపేట్‌కు చెందిన కె.శివకుమార్ మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ జే.శ్రీనివాస్‌రావు గురువారం విచారణ చేపట్టారు. అత్యవసర భూ సేకరణ పేరిట ప్రభుత్వం భూ సేకరణ చట్టంలోని సెక్షన్ 10 (ఏ), సెక్షన్ 40 కింద నోటిఫికేషన్ జారీచేసింది. ఈ సెక్షన్ల ప్రకారం ప్రజలు, గ్రామసభల అభిప్రాయం తీసుకోకుండానే నేరుగా భూ సేకరణ చేపట్టవచ్చు. దీనిని పిటిషనర్లు సవాల్ చేశారు. సర్కార్ ఈ భూ సేకరణ ఎందుకు చేపట్టింది? అత్యవసరం ఏముంది? అనే వివరాలను నోటిఫికేషన్‌లో పేర్కొనలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ల తరఫున మాజీ అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, సీనియర్ న్యాయవాది వి.రఘునాథ్ వాదనలు వినిపిస్తూ.. సామాజిక ప్రభావ అంచనా నివేదిక, ప్రజాభిప్రాయ సేకరణ, మార్కెట్ విలువ నిర్ధారణ లేకుండా ప్రభుత్వం భూ సేకరణ చేపట్టిందని ఆరోపించారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదనలు వినిపించారు. రైతులకు ఎకరానికి రూ.20 లక్షలు, 150 గజాల ప్లాటు, అర్హులకు ఉద్యోగం, ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు కట్టుకునే సదుపాయం కల్పించినట్లు నివేదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ల వాదనను పరిగణనలోకి తీసుకుని.. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

హైకోర్టు స్టేతో రైతుల సంబురాలు



దుద్యాల్: భూసేకరణపై స్టే విధిస్తూ గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో రోటిబండతండా, పులిచర్లకుంటతండా గ్రామాలకు చెందిన గిరిజన రైతులు సంతోషం వ్యక్తం చేశారు. రోటిబండ తండాలోని ప్రధాన చౌరస్తాలో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకొన్నారు.

మురుగునీటి నిర్వహణకు రూ.133 కోట్లు ఇవ్వండి: ఈటల



సాక్షి, న్యూఢిల్లీ: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మురుగునీటి నిర్వహణ కోసం రూ.133 కోట్లు కేటాయించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు.. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఎంపీగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మల్కాజిగిరిలో మురుగునీటి సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నలభై లక్షలకు పైగా జనాభాతో.. దేశంలోనే అతి పెద్ద పార్లమెంటు నియోజకవర్గమైన మల్కాజిగిరిలో మురుగు నీటి నిర్వహణ ఆందోళనకరంగా ఉందని తెలిపారు. ఏళ్ల నాటి ఇక్కడి సీవరేజ్ నెట్‌వర్క్.. జంటనగరాల నుంచి పెద్ద ఎత్తున వస్తున్న మురుగునీటి ఒత్తిడిని తట్టుకోలేకపోతోందని వివరించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని 'ఈటల' కోరారు.

హెలీప్యాడే కల్లం..



సిద్దిపేట జిల్లా రంగనాయక సాగర్ జలాశయాన్ని వీక్షించడానికి వచ్చే ప్రముఖుల కోసం ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ ప్రస్తుతం పంట కల్లంగా మారింది. ఇటీవల వీఐపీల సందర్శన తగ్గింది. దీంతో హెలీప్యాడ్ ఉదయం వేళ రైతులకు కల్లంగా.. రాత్రివేళ మందుబాబులకు అడ్డాగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే హెలీప్యాడ్ దుస్థితి ఇలా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- చిన్నకోడూరు(సిద్దిపేట)

జాప్యానికి జరిమానా..!

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ జాప్యంపై కేంద్రం సీరియస్

- రాష్ట్ర ప్రభుత్వం, నిర్మాణ సంస్థకు తదుపరి ఖర్చుపై 10 శాతం పెనాల్టీ
- 2026 అక్టోబర్ 31 నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశం
- అంచనా వ్యయం రూ.60 కోట్లు పెంపు
- పాత నిర్మాణ సంస్థే కొనసాగింపు
- పనులు, ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణ.. స్వతంత్ర సంస్థకు

సాక్షి, హైదరాబాద్: ఐదున్నరేళ్ల జాప్యంతో వాహనదారులకు ప్రత్యక్ష నరకం చూపుతున్న ఉప్పల్–మేడిపల్లి ఎలివేటెడ్ కారిడార్ విషయంలో కేంద్ర ఉపరితల రవాణా శాఖ కఠిన నిర్ణయం తీసుకుంది. ఏడేళ్ల క్రితం మొదలైన పనులు ఇంకా సగం కూడా పూర్తి కాకపోవటానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కాంట్రాక్టు సంస్థ కారణమని తేల్చి.. రెండింటికి పెనాల్టీ విధించింది. పనుల్లో జాప్యం వల్ల నిర్మాణ వ్యయం పెరగనుండటంతో దాదాపు రూ.60 కోట్ల మేర అంచనాను పెంచింది. ఇటీవల ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఈ కారిడార్‌ను ఓ కొలిక్కి తీసుకొచ్చింది.

ఇదీ నేపథ్యం..: హైదరాబాద్–భూపాలపట్నం 163 జాతీయ రహదారి మీద హైదరాబాద్–వరంగల్ మధ్య వాహనాల రద్దీ బాగా పెరిగి ఉప్పల్ సమీపంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. దీంతో దిగువన 150 మీటర్ల సర్వీసు రోడ్డు నిర్మిస్తూ, ఘట్కేసర్ వైపు వెళ్లే వాహనాలకు నిరాటంక ప్రయాణానికి వీలు కల్పించేలా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని 2017లో ప్రతిపాదించారు. ఉప్పల్ కూడలి నుంచి మేడిపల్లి వరకు 6.2 కి.మీ నిడివితో 45 మీటర్ల వెడల్పు ఉండే ఆరు వరుసల ఫ్లైఓవర్‌కు డిజైన్ చేశారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం కోసం 11.5 కి.మీ. నిడివితో నిర్మించిన పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే తర్వాత, ఇదే పెద్ద ఫ్లైఓవర్ కానుండటం గమనార్హం. 2018 జూలైలో ప్రారంభమైన పనులను 2020 జూలై నాటికి పూర్తి చేయాలని అప్పట్లో నిర్ణయించారు. రూ.670 కోట్ల అంచనా వ్యయంతో దీన్ని ప్రారంభించారు. కానీ, నిర్మాణ సంస్థ అసాధారణ రీతిలో వ్యవహరించిన తీరు మొదటికే మోసం తెచ్చింది. ఓ రష్యన్ కంపెనీతో కలిసి నిర్మాణ సంస్థ ఏకంగా 25 శాతం తక్కువకు టెండర్ దక్కించుకుంది. అంత తక్కువ మొత్తంలో ఈ వంతెనను పూర్తి చేయటం కష్టమని దానికి తర్వాత తెలిసొచ్చింది. అదే సమయంలో కంపెనీ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. 43 శాతం మాత్రమే పనులు చేసి ఆపేసింది. అసంపూర్తి పనులతో ఆ మార్గంలో వాహనదారులకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఏడేళ్లుగా వాహనదారులు ఆ ప్రాంతాన్ని దాటేందుకు నానా అవస్థలకు గురవుతున్నారు.

నిర్మాణం పాత సంస్థదే.. పర్యవేక్షణకు స్వతంత్ర సంస్థ

టెండర్ ఒప్పందాన్ని రద్దు చేసుకుని కొత్త టెండర్ పిలిచి మరో నిర్మాణ సంస్థకు బాధ్యత అప్పగించాలని తొలుత అధికారులు భావించారు. కానీ, దీనివల్ల మరింత జాప్యంతోపాటు ఖర్చు కూడా పెరుగుతుందని గుర్తించి, పాత నిర్మాణ సంస్థకే బాధ్యత అప్పగించారు. పని పూర్తి చేసేందుకు ఆ సంస్థ కూడా అంగీకరించింది. కంపెనీ ఆర్థిక నష్టాల నేపథ్యంలో ప్రస్తుతం ఈ ప్రాజెక్టు వ్యవహారం నేషనల్ కంపెనీలా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో ఉంది. ఇప్పుడు ఈ ప్రాజెక్టును పర్యవేక్షించేందుకు చార్టర్డ్ అకౌంటెంట్ సంస్థను నియమించాలని నిర్ణయించారు. ఆర్థిక వ్యవహారాలు సహా మొత్తం ఆ సంస్థే పర్యవేక్షించనుంది. మరో సంస్థతో అవగాహన కుదుర్చుకుని నిర్మాణ సంస్థ పనులు ప్రారంభించింది.

20 నెలల్లో పూర్తి: ప్రాజెక్టు పనులను 20 నెలల్లో పూర్తి చేయాలని కేంద్రం గడువు విధించింది. 2026 అక్టోబర్ 31 నాటికి వంతెనను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించింది.

తాజా నిర్ణయాలు ఇవీ

రూ.28 కోట్ల పెనాల్టీ: పనుల్లో జాప్యానికి రాష్ట్ర ప్రభుత్వం, నిర్మాణ సంస్థల తీరు కారణమని కేంద్ర ఉపరితల రవాణాశాఖ తేల్చింది. సకాలంలో భూసేకరణ పూర్తి చేయలేకపోవటం, నిర్మాణానికి వీలుగా స్తంభాలు, ఇతర కట్టడాలను తొలగించకపోవటంతో పనుల్లో జాప్యం జరిగింది. పనులు మొదలయ్యాక నిర్మాణ సంస్థ మధ్యలో ఆపేసి ఆ జాప్యాన్ని కొనసాగించింది. దీంతో.. ఆ ఫ్లైఓవర్‌ను పూర్తి చేసేందుకు భవిష్యత్తులో ఖర్చుచేసే మొత్తంపై 10 శాతాన్ని పెనాల్టీగా విధించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం, నిర్మాణ సంస్థ చెరిసగం భరించాలని పేర్కొంది.

అంచనా రూ.60 కోట్లు పెంపు: ఈ ప్రాజెక్టు ఒప్పంద అంచనా రూ.425.10 కోట్లు. ఇందులో ఇంకా 225.56 కోట్ల పని చేయాల్సి ఉందని లెక్క తేలింది. కానీ, ఆ మొత్తంతో పని పూర్తి కాదు. మరో రూ.60 కోట్లు అదనంగా వెచ్చించాల్సి ఉంటుందని ప్రాథమికంగా తేల్చారు. అంటే రూ.286 కోట్లు ఖర్చవుతుందన్నమాట. నిర్మాణ సంస్థ పెనాల్టీగా రూ.14 కోట్లు చెల్లించాల్సి ఉంది. పెరిగిన అంచనా వ్యయాన్ని కేంద్రం భరిస్తుంది. ఆ మొత్తాన్ని చెల్లించే క్రమంలో రూ.14 కోట్ల పెనాల్టీని మినహాయించుకోవాలని అధికారులను కేంద్ర ఉపరితల రవాణా శాఖ ఆదేశించింది.

మహిళా జర్నలిస్టులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క



జర్నలిస్టుల సంక్షేమం కోసం కొత్త పాలసీ

- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

బంజారాహిల్స్ (హైదరాబాద్): తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమం కోసం కొత్త పాలసీని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. జర్నలిస్టులకు వైద్య సదుపాయం, వేతనాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని చెప్పారు. 'ది జర్నలిస్టు కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్' ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని సొసైటీ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతక్క సొసైటీలోని సీనియర్ మహిళా జర్నలిస్టులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో విజయాలు సాధిస్తున్న మహిళలను మరింత ప్రోత్సహించాలని ఆమె కోరారు. కాగా, గతంలో మూడు కాలనీల్లో కలిపి 36 మంది మహిళా జర్నలిస్టులకు ప్రభుత్వం సొసైటీ ద్వారా ఇళ్ల స్థలాలను కేటాయించిందనీ, ఇంకా వందకు పైగా మహిళా జర్నలిస్టులు వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారని సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మండభేరి గోపరాజు మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ దేవులపల్లి అమర్, హౌసింగ్ సొసైటీ కార్యదర్శి రవీంద్రబాబు పాల్గొన్నారు.

● శ్రీ విశ్వశాంతి

గుడిసెలో మొదలై చదువుల గూడై

'నీ దగ్గర ఏముంది?' అనే ప్రశ్నకు తిరుగులేని జవాబు... 'నా దగ్గర కల ఉంది!'
ఆ కలే చేతిలో చిల్లిగవ్వ లేని ఎంతోమందిని విశ్వ విజేతలను చేసింది.
'శ్రీ విశ్వశాంతి' కల కూడా అలాంటిదే.
కొన్ని దశాబ్దాల క్రితం...
పేదింటి బిడ్డ మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు కన్న కల... శ్రీ విశ్వశాంతి.
రవీంద్రుడి 'విశ్వభారతి'లాంటి విలువైన కల అది.
'ప్రపంచమంతా ఒకే గూడులో' అనే నినాదం పునాదిపై ఏర్పాటైన
'విశ్వభారతి' తనకు స్ఫూర్తి.

ఆరుగురు విద్యార్థులతో మొదలైన విశ్వశాంతి గ్రామీణ విశ్వవిద్యాలయం స్థాయికి ఎదిగింది. 16 రాష్ట్రాలకు చెందిన 6,500 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఆ విజయ ప్రస్థానం మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు మాటల్లోనే...



విజయశిఖరం : మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు

కృష్ణా జిల్లా ఉయ్యూరు సమీపంలోని గండిగుంట గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన నా దగ్గర కరెన్సీ నోట్లు లేవు. కల మాత్రమే ఉంది. అయినా సరే, చిన్న గుడిసెలో 'శ్రీ విశ్వశాంతి' పాఠశాల ప్రారంభించాను. ఆరుగురు విద్యార్థులతో మొదలైన ఆ పాఠశాల 'ఇంతింతై వటుడింతై...' అన్నట్లుగా ఎదిగిపోయింది. బలమైన విద్యా వ్యవస్థగా నిర్మాణం అయిన 'శ్రీ విశ్వశాంతి గ్రామీణ విశ్వ విద్యాలయం' గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ముస్తాబైంది.

ఆ రోజుల్లో...

నేను, మా ఆవిడ ప్రమీలారాణి టీచర్‌లుగా పనిచేసేవాళ్లం. మా నెల జీతం నూట ఇరవై రూపాయలు. 'మేము కొత్త స్కూలు స్టార్ట్ చేయాలనుకుంటున్నాం' అని చెప్పినప్పుడు విన్నవారు – 'ఎందుకొచ్చిన రిస్కు... వచ్చిన జీతంతో సర్దుకుపోకుండా' అని సలహా ఇస్తారేమో?...ఇలాంటి సందేహాలు ఎన్నో వచ్చాయి.

'చాలా విజయాలు భద్ర జీవితాల్లోనే ఆగిపోతాయట!' అనే మాట గుర్తుకు వచ్చింది. 'నాకు ఇక్కడ సుఖంగానే ఉంది కదా... రిస్కు తీసుకోవడం ఎందుకు' అనుకునే చాలామందిలో నేను ఉండిపోదల్చుకోలేదు. నాకు ఇష్టమైన నాయకుడు జవహర్‌లాల్ నెహ్రూ. ఆ మహనీయుడు చెప్పిన విలువైన మాట – 'అజ్ఞానం అనేది ఎప్పుడూ మార్పుకు భయపడుతుంది'

అయితే నేను మార్పుకు భయపడే రకం కాదు. అందుకే ధైర్యంగా నా కలకు శ్రీకారం చుట్టాను. 1975 ఫిబ్రవరి 22న ఉయ్యూరు పట్టణంలో ఒక తాటాకు పాకలో 'శ్రీ విశ్వశాంతి' పాఠశాలను ప్రారంభించాం.

'ఎంతో ఊహిస్తే ఆరుగురు విద్యార్థులేనా!' అని మేము నిరాశపడిపోలేదు.

'ఈరోజు ఆరుగురు...రేపు నూరు మంది' అనుకున్నాము. అది వృథా పోలేదు. మరుసటి ఏడాది నుంచే హాస్టల్‌ను కూడా ప్రారంభించాము. అక్కడ మొదలైన ప్రస్థానం ప్రస్తుతం ఉయ్యూరు (గండిగుంట) పరిధిలో సువిశాలమైన 80 ఎకరాల విస్తీర్ణంలో అధునాతన భవన సముదాయంతో విస్తరించింది. స్టేట్, సీబీఎస్‌ఈ సిలబస్ అందుబాటులో ఉంది. ఎల్‌కేజీ నుంచి ప్లస్ 2 వరకూ విద్యాబోధన అందిస్తున్నాం. 'మాదల ప్రమీలారాణి మెమోరియల్ జూనియర్ కళాశాల' ఏర్పాటు చేశాం. దేశంలోని 16 రాష్ట్రాలకు చెందిన 6500 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. మా గ్రామీణ యూనివర్శిటీపై ప్రత్యక్షంగా 768 మంది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఆరుగురితో మొదలైన విద్యాసంస్థ అందనంత ఎత్తు ఎదగడానికి కారణం ఏమిటి?

'మన ఆదర్శాలు, అంకితభావాన్ని మరచిపోయినప్పుడు మాత్రమే అపజయం ఎదురవుతుంది' అంటారు నెహ్రూ. పేద విద్యార్థులకు అండగా ఉండాలి అనే ఆదర్శాన్ని, సంస్థ కోసం క్షణ క్షణం కష్టపడాలి అనే అంకితభావానికి నేను ఎప్పుడూ దూరం కాలేదు. అదే శ్రీ విశ్వశాంతి విజయ రహస్యం. 'శ్రీ విశ్వశాంతి 'గుడ్‌విల్'కు గుడ్ ఎగ్జాంపుల్‌గా నిలిచినా 'పక్కా కమర్షియల్' దారిలోకి ఎప్పుడూ వెళ్లలేదు. ఏ ప్రాంతంలో ప్రారంభమైందో ఆ ప్రాంతంలోనే పెరిగి, పెద్దై వటవృక్షమై ఎంతోమంది విద్యార్థులు, ఉద్యోగులకు నీడను ఇస్తోంది. విద్యాసంస్థ ఏర్పాటు చేసిన నాటి నుంచి సింగిల్ బ్రాంచ్‌గానే నడుపుతున్నాం.

– ఈడా శివప్రసాద్,
సాక్షి, కంకిపాడు, కృష్ణా జిల్లా

సేవాపథంలో...

గ్రామీణ విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గించి చేయూత అందించాలనేది మాదల ప్రమీలారాణి కోరిక. ఆమె కోరిక మేరకు ఏటా 300 మందికి పైగా విద్యార్థులకు ఫీజు రాయితీ ఇస్తున్నారు. ఎన్నో రకాల సామాజిక సేవా కార్యక్రమాలను శ్రీ విశ్వశాంతి నిర్వహిస్తోంది. '50వ వసంతంలోకి అడుగుపెట్టిన వేళ అంతర్జాతీయ ప్రమాణాలు, అన్ని రకాల వసతులు, సౌకర్యాల కల్పనతో విద్య అందించటం కోసం పాటుపడుతున్నాం. కుమారులు, కోడళ్లు అంతా పాఠశాలలోనే ఉంటూ విద్యా ప్రగతిలో భాగస్వాములు అవుతూ ఉన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చక్కగా చదివితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. తద్వారా దేశ ప్రగతి సాధ్యమవుతుంది' అంటున్నారు మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు.

ఫేస్ ప్రోగ్రాం

అధునాతన సౌకర్యాలు, వసతులతో కూడిన కంప్యూటర్ ల్యాబ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ల్యాబ్‌లు, లైబ్రరీలు గ్రామీణ యూనివర్శిటీలో అందుబాటులో ఉన్నాయి. 'ఫేస్ ప్రోగ్రాం' పేరుతో విద్యార్థులను అన్ని పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఐఐటీ, జెఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, ఎన్‌డీఏ, నీట్, ఒలంపియాడ్‌లకు కోచింగ్‌లను అందిస్తున్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ వింగ్, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. విశ్వశాంతిలో శిక్షణ పొందిన ఎంతోమంది విద్యార్థులు నేవీ, ఆర్మీలలో ఉన్నత స్థాయిలో ఉన్నారు. ఎన్‌సీసీలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న విధానం ఎన్నో ప్రశంసలు అందుకునేలా చేసింది. అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. స్టేట్, సీబీఎస్‌ఈ, జెఈఈ మెయిన్స్, అడ్వాన్స్డ్, నీట్ ఫలితాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధిస్తూ రికార్డులు సృష్టిస్తోంది శ్రీవిశ్వశాంతి. అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల సందర్భంగా 'అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా' ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ విద్యారత్న' పురస్కారాన్ని 'శ్రీవిశ్వశాంతి' ఫౌండర్ మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు అందుకున్నారు.



ఇష్టంగా కష్టపడాలి...

ప్రతి విద్యార్థికీ లక్ష్యశుద్ధి ఉండాలి. అప్పుడే లక్ష్యం సిద్ధిస్తుంది. సమయాన్ని సక్రమంగా వినియోగించుకుంటూ ఇష్టమైన పాఠ్యాంశాలను కష్టంతో కాకుండా ఇష్టంగా చదువుకోవాలి. సమయ పాలన విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలి. ప్రస్తుత ప్రపంచీకరణ పరిస్థితుల్లో ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. తమకు అనువైన, ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని ఆ రంగంలో నైపుణ్యం సాధించి స్థిరపడాలి. అందుకు సూక్ష్మమైన, సున్నితమైన మార్గాలను అన్వేషించి సాధించుకోవటం అలవర్చుకోవాలి. పట్టుదలతో ఎంచుకున్న లక్ష్యాన్ని ఇష్టంతో సాధించేందుకు ప్రయత్నం చేయాలి. ఎంత కష్టమైనా కష్టం అనిపించదు. విజయం సాధించటం సులువు అవుతుంది. ఎవరూ పుట్టుకతోనే ఉన్నతులు కారు. జీవితంలో చూపిన అచంచలమైన కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం మాత్రమే ప్రతి ఒక్కరినీ ఉన్నతులను చేస్తుంది. విద్య నేర్పే గురువులు కూడా గుర్తించాల్సింది ఏమిటంటే... గురువు అంటే నిరంతర విద్యార్థి అని అర్థం. గురువు అనే అర్థం చాలా విస్తృతమైనది. ఇది అర్థం కావాలంటే మన పూర్వ అపూర్వ శాస్త్రాలను అధ్యయనం చేస్తే తెలుస్తుంది. ఇవన్నీ నేను లైబ్రరీల్లో అనేక పుస్తకాలను చదవటం వల్ల తెలుసుకున్నదే.

యుద్ధ అశాంతి నుంచి శ్రీ విశ్వశాంతి

చదువుకునే రోజుల్లో లైబ్రరీకి ఎక్కువగా వెళ్లేవాడిని. జవహర్‌లాల్ నెహ్రూ పుస్తకాలు చదవటం అంటే ఇష్టం. ఆయన జీవితం స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. కుటుంబ పరిస్థితుల కారణంగా మా సోదరుడు కృష్ణమూర్తి 18వ ఏట ఆర్మీలో చేరాడు. అప్పుడు యుద్ధాలు ఎక్కువగా ఉండేవి. ఎందరో సైనికులు చనిపోయారంటూ వార్తలు విని చాలా కలత చెందేవాణ్ణి. యుద్ధాల వల్ల ఎన్నో కుటుంబాలు రోదనకు, వేదనకు గురవుతున్నాయి. అసలు యుద్ధం ఎందుకు? ఇరు వర్గాల నేతలు కూర్చుని సంప్రదించుకుంటే విశ్వశాంతి జరుగుతుంది అనేది నా ఉద్దేశం. ఆ ఆకాంక్ష నుంచే పుట్టిందే శ్రీ విశ్వశాంతి. భిన్నత్వంలో ఏకత్వం ఉండాలనే తలంపుతో విద్యాసంస్థను నడుపుతున్నాను.

– మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు

సొంతంగా పాల డైరీ

చదువుపై మాత్రమే కాదు విద్యార్థుల ఆరోగ్యంపై కూడా శ్రీ విశ్వశాంతి గ్రామీణ యూనివర్శిటీ తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. విద్యార్థులు ఆహ్లాద భరిత వాతావరణంలో గడిపేలా ప్రాంగణం అంతా పచ్చని మొక్కలతో తీర్చిదిద్దారు. యూనివర్శిటీ సొంతంగా పాల డైరీ నిర్వహిస్తోంది. సమర్థంగా డెయిరీ నిర్వహణకు 'బెస్ట్ డెయిరీ ఫామ్ ఆఫ్ ఏపీ అవార్డు'ను అందుకున్నారు. ఈ యూనివర్శిటీలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు.



పాల డైరీలో మాదల

యంగ్ టాలెంట్

అమీనాపురం టు ఆస్కార్

హైస్కూల్ రోజుల నుంచి ఆస్కార్ గెల్చుకున్న సినిమాలు, విజేతల గురించి తెలుసుకునే ఆసక్తి సుమంత్‌కు ఉంది. కట్ చేస్తే... ఇప్పుడు సుమంత్ పేరు పక్కన 'ఆస్కార్' అనే పాపులర్ సౌండ్ కూడా వినిపిస్తోంది!

విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో



సుమంత్‌రెడ్డి

బ్లాక్‌బస్టర్ మూవీ 'డూన్ 2' ఆస్కార్ గెల్చుకుంది. ఈ సినిమా విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో తెలుగు యువకుడు సుమంత్‌రెడ్డి ఉన్నాడు.

తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అమీనాపురం గ్రామానికి చెందిన ఎడ్ల సుమంత్ రెడ్డికి చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం అంటే ప్రాణం. కొత్తగా బొమ్మలు వేయడంలో ప్రతిభ చూపేవాడు. పోటీల్లో బహుమతులు గెల్చుకోవడం సాధారణంగా మారింది.

జేఎన్‌టీయూ, హైదరాబాద్‌లో బీఎఫ్‌ఏ విభాగంలో డిగ్రీ చేసిన సుమంత్ ప్రసిద్ధ యానిమేషన్ కంపెనీలలో పనిచేశాడు. బెంగళూరులోని 'ఎక్స్‌ఎన్‌ట్రిక్స్' కంపెనీలో సీనియర్ త్రీ–డి ఆర్టిస్ట్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. అంతర్జాతీయ ప్రాజెక్టులలో కూడా మంచి పేరు తెచ్చుకున్నాడు. రాజమౌళి నిర్మించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలో జంతువుల సన్నివేశాలను రూపొందించాడు. 'డూన్–2' సినిమాకు పనిచేసిన 1500 మంది వీఎఫ్‌ఎక్స్ నిపుణుల్లో సుమంత్ కీలకమైన విభాగంలో పనిచేసి అరుదైన గౌరవం దక్కించుకున్నాడు.

సైఫై సినిమాలు తీయాలనుకుంటున్న, విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో తనదైన గుర్తింపు తెచ్చుకోవాలనుకుంటున్న సుమంత్‌రెడ్డికి అభినందనలు తెలియజేద్దాం.

– ఈరగాని భిక్షం,
సాక్షి, మహబూబాబాద్

సాక్షి సినిమా



● విక్రమ్

యాక్షన్ థ్రిల్లర్

విక్రమ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'వీర ధీర శూరన్: పార్ట్ 2'. ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరాముడు, దుషారా విజయన్ ముఖ్య పాత్రలు పోషించారు. రియా శిబు నిర్మించిన ఈ మూవీ ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగులో ఎన్వీఆర్ సినిమాస్ సంస్థ విడుదల చేస్తోంది. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'వీర ధీర శూరన్: పార్ట్ 2'. ఈ మూవీ ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ఉంటుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా మా చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమేరా: తేని ఈశ్వర్.



● రష్మిక, విక్కీ కౌశల్

తెలుగువారి ప్రేమకు కృతజ్ఞతలు - విక్కీ కౌశల్

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ తనయుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ బయోపిక్‌గా రూపొందిన చిత్రం 'ఛావా'. విక్కీ కౌశల్, రష్మికా మందన్న ప్రధాన పాత్రల్లో నటించారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. దినేష్ విజన్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న హిందీలో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాను తెలుగులో గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్స్ సంస్థ నేడు విడుదల చేస్తోంది. ''ఛావా' తెలుగు ట్రైలర్ దాదాపు 5 మిలియన్ల వ్యూస్ సాధించింది. తెలుగులో 550కి పైగా స్క్రీన్లలో రిలీజ్ చేస్తున్నాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ''ఛావా' పట్ల తెలుగువారి అద్భుతమైన సపోర్ట్, ప్రేమకు కృతజ్ఞతలు. ఈ చిత్రాన్ని తెలుగులో తీసుకు వస్తున్నందుకు మేము గర్విస్తున్నాం. శంభాజీ మహారాజ్ కీర్తి, అజేయమైన శౌర్యం, త్యాగాన్ని చూసే అవకాశం మీకు లభిస్తుంది... అలాగే మీ హృదయాలను తాకుతుంది. ఈ చిత్రాన్ని మీరందరూ బిగ్ స్క్రీన్‌పై ఎక్స్‌పీరియన్స్ చేయాలని కోరుకుంటున్నాను'' అంటూ విక్కీ కౌశల్ ఓ వీడియో విడుదల చేశారు.

డబుల్ బొనాంజ



● శర్వానంద్

శర్వానంద్ హీరోగా అభిలాష్ కంకర దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్. విక్రమ్ సమర్పణలో వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మోటార్ సైకిల్ రేసర్ పాత్రలో శర్వానంద్ నటిస్తున్నారు. గురువారం (మార్చి 6) శర్వానంద్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా నుంచి కొత్త స్టిల్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''మూడు తరాల నేపథ్యం, ప్రేమ, కలలు... వంటి అంశాల నేపథ్యంతో ముడిపడి 1990, 2000 ప్రారంభంలో సాగే మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్ ఇది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జిబ్రాన్.

నారీ నారీ నడుమ మురారి: శర్వానంద్ హీరోగా నటిస్తున్న మరో చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య హీరోయిన్లు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఈ సినిమా కొత్త పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇలా బర్త్ డేకి తన ఫ్యాన్స్‌కు శర్వానంద్ డబుల్ బొనాంజ ఇచ్చారు.

అన్‌లిమిటెడ్ నవ్వులు

నయనతార లీడ్ రోల్‌లో 'మూకుత్తి అమ్మన్ 2' సినిమా ఆరంభమైంది. సుందర్ సి. దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దునియా విజయ్, రెజీనా కాసాండ్రా, యోగిబాబు, ఊర్వశి, అభినయ, రామచంద్ర రాజు, అజయ్ ఘోష్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. డా. ఇషారి కె. గణేశ్ నిర్మిస్తున్నారు. కోటి రూపాయలతో వేసిన ప్రత్యేకమైన సెట్‌లో ఈ చిత్రం గురువారం పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయింది. ''నయనతార నటించిన 'మూకుత్తి అమ్మన్: పార్ట్ 1' భారీ విజయం సాధించింది. ఈ మూవీ తెలుగులో 'అమ్మోరు తల్లి' పేరుతో రిలీజ్ కాగా మంచి స్పందన లభించింది. 'మూకుత్తి అమ్మన్ 2' చిత్రం అన్‌లిమిటెడ్ నవ్వులతో కూడిన ఎగ్జయిటింగ్ కథాంశంతో ఉంటుంది. రూ. 100 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం పాన్ ఇండియా ఎంటర్‌టైనర్లలో ఒకటిగా నిలుస్తుంది. ఈ మూవీని అన్ని దక్షిణ భారత భాషలతో పాటు హిందీలోనూ విడుదల చేస్తాం'' అని మేకర్స్ తెలిపారు. నిర్మాతలు సునీల్ నారంగ్, సి. కల్యాణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



● సుందర్ .సి, ఖుష్బూ, నయనతార, మీనా, రెజీనా



● అనుపమ, సునీత, గద్దం ప్రసాద్, రాజా, వెంకట్ రెడ్డి

మిస్టర్ రెడ్డిని ఆదరించాలి - స్పీకర్ గద్దం ప్రసాద్

''మిస్టర్ రెడ్డి' మూవీ టీమ్ చాలా ఉత్సాహంగా కనిపిస్తోంది. దర్శకుడు వెంకట్ చాలా యంగ్‌గా కనిపిస్తున్నారు. హీరో, నిర్మాత నరసింహా రెడ్డి యాక్టివ్‌గా, ఎనర్జిటిక్‌గా ఉన్నారు. ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గద్దం ప్రసాద్ చెప్పారు. గోల్డ్ మ్యాన్ రాజా (టి. నరసింహారావు–టీఎస్‌ఆర్) నటించి, నిర్మించిన చిత్రం 'మిస్టర్ రెడ్డి'. వెంకట్ వోలాద్రి దర్శకత్వంలో టీఎస్‌ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి గద్దం ప్రసాద్, పట్నం సునీతా రెడ్డి, నల్లగొండ గద్దర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. గోల్డ్ మ్యాన్ రాజా మాట్లాడుతూ– ''మిస్టర్ రెడ్డి' టీజర్ అందరికీ నచ్చిందని భావిస్తున్నా. కొత్తవాళ్లమంతా చేసిన ఈ ప్రయత్నాన్ని అందరూ ప్రోత్సహించాలి. త్వరలో విడుదల కానున్న మా సినిమాని ఆదరించాలి'' అన్నారు. ''ఈ చిత్రం కోసం మేమంతా కష్టపడి పని చేశాం. ఔట్‌పుట్ బాగా వచ్చింది'' అని వెంకట్ వోలాద్రి పేర్కొన్నారు. ''మిస్టర్ రెడ్డి' లాంటి మంచి చిత్రంలో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు మహాదేవ్, అనుపమా ప్రకాశ్.

మా ప్రయోగం నిరాశపరచదు - బి. శివప్రసాద్



''రా రాజా' సినిమాలో నటీనటులు తెరపై కనిపించరు. కేవలం డైలాగులు మాత్రమే వినిపిస్తాయి. అయినప్పటికీ ప్రేక్షకులు అన్ని రకాల భావోద్వేగాలను అనుభూతి చెందుతారు. లవ్, కామెడీ, హారర్... ఇలా అన్ని అంశాలతో ఆద్యంతం అలరించేలా ఈ చిత్రం ఉంటుంది'' అని బి. శివప్రసాద్ తెలిపారు. నటీనటులు కనిపించకుండా కేవలం డైలాగులు మాత్రమే వినిపించేలా తీసిన ప్రయోగాత్మక చిత్రం 'రా రాజా'. బి. శివప్రసాద్ దర్శకత్వంలో పద్మ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ''మాతృ' సినిమాతో నిర్మాతగా మారాను. నేనే నిర్మాతగా, దర్శకుడిగా తీసిన 'రా రాజా' ఎవర్నీ నిరాశపరచదు. మా ప్రయోగాన్ని అందరూ ఆదరించాలి'' అని బి. శివప్రసాద్ అన్నారు.



కాలేజ్ బ్యాక్‌డ్రాప్ సినిమాలు చేస్తూ, 'సమ్మర్‌లో కాలేజీలో...' అంటూ సిల్వర్ స్క్రీన్ కోసం కాలేజీకి వెళుతున్న కొందరు స్టార్స్‌పై ఆర్టికల్. రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్న సినిమా [illegible] కోసం సాక్షి ఫన్ [illegible] ఈ పేపర్ చదవండి.

ఓటీటీ | ఇది చూడొచ్చు

ఇల్లు కట్టి చూడు... పెళ్లి చేసి చూడు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ వెబ్ సిరీస్ 'లవ్ అండర్ కన్‌స్ట్రక్షన్' ఒకటి. ఈ వెబ్ సిరీస్ గురించి తెలుసుకుందాం.



కొన్నాళ్ల క్రితం సీరియల్స్‌లో తరువాత భాగం చూడాలంటే వారం ఆగాల్సి వచ్చేది. ఇప్పుడు అవే సీరియల్స్ రోజువారీ ఎపిసోడ్స్‌గా వచ్చాయి. ఇప్పుడు అది కూడా మారి అన్నీ ఎపిసోడ్స్ ఒకేసారి వెబ్ సిరీస్ పేరిట ఓటీటీ తీసుకు వచ్చింది. ఓపిక ఉన్నంతవరకు కథ మొత్తాన్ని ఒకేసారి చూడవచ్చు, కాకపోతే వెబ్ సిరీస్ కూడా సీజన్స్ పేరిట కొన్ని నెలలు వెయిట్ చేయిస్తున్నాయి. వెబ్ సిరీస్ అనేది ఇండియాలో ఇప్పుడిప్పుడే ట్రెండ్ అవుతోంది. అటువంటి వెబ్ సిరీసే 'లవ్ అండర్ కన్‌స్ట్రక్షన్'. ఇదో మలయాళ వెబ్ సిరీస్... కాకపోతే తెలుగులో హాట్ స్టార్ వేదికగా లభ్యమవుతోంది. ఈ సిరీస్ కథ చాలా సింపుల్. వినోద్ దుబాయ్‌లో ఓ ఐటీ ఎంప్లాయి. కేరళలో తన తల్లిదండ్రుల కోసం ఓ ఇల్లు కట్టాలనుకుంటాడు. ఆ ఇల్లు కట్టడం కోసం తన స్నేహితుడైన అజును తన తల్లిదండ్రులకు తోడుగా ఉండమంటాడు. వినోద్ తల్లిదండ్రులను అజు తన అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో రెంటుకి ఉండమంటాడు. ఎందుకంటే తన అపార్ట్‌మెంట్ వినోద్ స్థలానికి దగ్గరగా ఉంటుంది. వినోద్ తండ్రి బాగా కోపిష్టి. అలా అపార్ట్‌మెంటులోకి దిగిన వెంటనే ఇలా అసోషియేషన్ సెక్రటరీతో గొడవపడతాడు. మరో పక్క అజు తనకు ఓ ఫోన్ కావాలని, అది తమ అపార్ట్‌మెంట్ సెక్రటరీ కూతురు గౌరీతో పంపమని అడుగుతాడు. అలా వినోద్, గౌరి కలుసుకొని ప్రేమించుకుంటారు. ఇక్కడేమో గౌరీ వాళ్ల నాన్న, వినోద్ వాళ్ల నాన్న గొడవలు తారాస్థాయికి వెళతాయి. ఈ లోపు వినోద్‌కు దుబాయ్‌లో ఉద్యోగం ఊడిపోతుంది. అప్పుడు గౌరి, వినోద్ ఇండియా వచ్చి ఇల్లు కట్టి పెళ్లి చేసుకోవాలనుకుంటారు. ఇద్దరూ ఇండియా వచ్చాక వారికి ఎదురైన పరిస్థితులేంటి? వాళ్లిద్దరూ పెళ్లి చేసుకున్నారా? లేదా అన్నది మాత్రం 'లవ్ అండర్ కన్‌స్ట్రక్షన్' వెబ్ సిరీస్‌లో చూడాల్సిందే. ఈ సిరీస్ మొత్తం ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. అలాగే ఆఖరున వచ్చే ఒక ట్విస్టు మాత్రం ఎవరూ ఊహించనిది, ఊహకందనిది. ఈ సిరీస్ వీకెండ్ వాచబుల్.

– ఇంటూరు హరికృష్ణ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	610	74,340
నిఫ్టీ ▲	207	22,545

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11:30 ముగింపు)			
నాస్‌డాక్	18,134	▽	419
డోజోన్స్	42,537	▽	469
ఎఫ్‌టీఎస్ఈ 100	8,679	▽	77
డాక్స్	23,419	▲	338
షాంఘై	3,381	▲	39
నికాయ్	37,705	▲	286

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	85,876
బంగారం (99.5 స్వచ్ఛత)	85,532
వెండి (కిలో)	96,460

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.50	87.52
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	110.70	113.61
€	యూరో	ఎస్‌బీఐ	92.61	95.27
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.60	59.07
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.09	56.31
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.06	67.74
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.33	23.89
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.83	24.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.14	12.97

ఓటీటీ.. బంపర్ హిట్

- 12.5 కోట్లకు చేరిన యూజర్లు
- 2024లో రూ.35,600 కోట్ల ఆదాయం
- పోటాపోటీ షోలు, విస్తృతమైన టైటిల్స్
- మరింత విస్తరణకు భారీ అవకాశాలు



సాక్షి, బిజినెస్ డెస్క్

డిజిటల్ స్ట్రీమింగ్ మీడియా సేవల (ఓటీటీ) ముందు నేడు సినిమా థియేటర్లు, టీవీలు చిన్న బైపోతున్నాయి. ప్రేక్షకుల సందడి లేక థియేటర్లు వెలవెలబోతుంటే.. వీక్షకులను కాపాడుకునేందుకు టీవీ చానళ్లు తంటాలు పడుతున్నాయి. వీటికి అందనన్నట్టుగా ఓటీటీ వేదికలు ఎక్స్‌ప్రెస్ వేగంతో దూసుకుపోతున్నాయి. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, జియోస్టార్, యూట్యూబ్, జీ5, సోనీలివ్, ఆహా.. ఇలా ఓటీటీల జాబితా చాలా పెద్దదే. ఓటీటీ సేవలకు 4జీ టెలికం ఊతమిస్తే.. కరోనా విపత్తు ప్రేక్షకులకు మరింత చేరువ చేసిందని చెప్పుకోవాలి. బాహుబలుల కుస్తీపట్లకు వేదికైన 'వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్' (డబ్ల్యూడబ్ల్యూఈ) షోలకు అమెరికా తర్వాత ఎక్కువ మంది వీక్షకులు ఉన్నది భారత్‌లోనేనని నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ వెల్లడించారు. డబ్ల్యూడబ్ల్యూఈకి చెందిన రా, ఎన్ఎక్స్‌టీ, స్మాక్‌డౌన్ ఇలా ప్రతి ఫార్మాట్‌కు సంబంధించి షోలు నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. 2019లోనే డబ్ల్యూడబ్ల్యూఈ ఫార్మాట్‌లను భారత్‌లో 5 కోట్ల మంది యూజర్లు వీక్షించడం గమనార్హం. చేతిలో స్మార్ట్‌టీవీ మాదిరిగా ఓటీటీ పరిశ్రమ విస్తరిస్తోంది.

భారీగా ఆదాయం..

2024లో ఓటీటీ సంస్థలు రూ.35,600 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నాయి. ఇందులో యూజర్ల సబ్‌స్క్రిప్షన్ చార్జీలతోపాటు ప్రకటనల ఆదాయం కలిసి ఉంది. ఇందులో 40 శాతం యూట్యూబ్‌కే రావడం గమనార్హం. 2022లో 11.2 కోట్ల ఓటీటీ యూజర్లు కాస్తా, 2023లో 9.6 కోట్లకు తగ్గారు. దీంతో మరింత కంటెంట్‌తో, చౌక ప్లాన్లతో ఓటీటీలు 2024లో యూజర్లను 12.5 కోట్లకు పెంచుకున్నాయి. కెనక్టెట్ టీవీల (ఇంటర్నెట్ అనుసంధానం కలిగినవి) కొనుగోళ్లు పెరుగుతుండడం ఓటీటీలకు మరింత డిమాండ్‌ను తెచ్చి పెడుతోంది. చేతిలో స్మార్ట్ ఫోన్‌కు బదులు పెద్ద సైజు టీవీ తెరలపై షోలను వీక్షించేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. పరిశ్రమ ఆదాయం 2022లో రూ.21,600 కోట్లుగా ఉంటే, 2023లో రూ.30,300 కోట్లకు, 2024లో రూ.35,600 కోట్లకు వృద్ధి చెందింది.



విస్తరణ వ్యూహాలు..

అమెజాన్ ప్రైమ్‌లో ఇప్పుడు 'శివరాపల్లి' వెబ్ సిరీస్ అదరగొడుతోంది. దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఓటీటీ షోలలో 'పంచాయత్' ఒకటి. మొదట హిందీలో వచ్చిన ఈ షో ఆ తర్వాత తమిళంలోకి 'తలైవెట్టియాన్ పాళయం'పేరుతో అనువదించగా, అక్కడా దుమ్ము దులుపుతోంది. ఆ తర్వాత శివరాపల్లి పేరుతో గత నెలలో విడుదలై క్రమంగా ఆదరణ పెంచుకుంటోంది. అమెజాన్ ప్రైమ్ ఇప్పుడు 8,500 టైటిళ్లను ఆఫర్ చేస్తోంది. కొత్తగా విడుదలైన సినిమాలను వేగంగా ప్రైమ్‌లోకి తీసుకొచ్చేందుకు ఎంత చెల్లించడానికైనా వెనుకాడడం లేదు. సెలబ్రిటీ షోల విషయంలోనూ దూకుడు ప్రదర్శిస్తోంది. సోనీ లివ్ 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్', 'రాకెట్ బోయ్స్', షార్క్ ట్యాంక్ ఇండియా, మిలియన్ డాలర్ లిస్టింగ్ తదితర పాపులర్ షోలతో తన యూజర్లను 3.3 కోట్లకు పెంచుకోవడం గమనార్హం. 5.5 కోట్ల యూజర్లు కలిగిన జియోహాట్‌స్టార్ అయితే.. రిలయన్స్ జియోకి ఉన్న 42 కోట్ల కస్టమర్లకు చేరువయ్యేందుకు వ్యూహాలు అమలు చేస్తోంది. సాధారణంగా ఒక వెబ్‌సిరీస్‌లో 6–7 షోలు ఉంటే.. 100 వరకు ఎపిసోడ్‌లతో సిరీస్ తీసుకు రావాలని నిర్మాతలను కోరుతోంది. తద్వారా యూజర్ ఎంగేజ్‌మెంట్ పెంచుకోవాలని అనుకుంటోంది.

2024లో టాప్ ఓటీటీ ప్లేయర్లు..

కంపెనీ	ఆదాయం (రూ.కోట్లలో)	చందాదారులు (కోట్లలో)	సందర్శకులు (కోట్లలో)
యూట్యూబ్	14,300	-	45.4
మెటా	6,337	-	32.4
జియోస్టార్	6,100	5.5	18.8
నెట్‌ఫ్లిక్స్	3,392	1.5	4.7
అమెజాన్ ప్రైమ్	2,803	1.8	-
సోనీలివ్	1,700	3.4	2.1
జీ5	919	-	5.2

విలీనాలు.. కొనుగోళ్లు

భారీ మార్కెట్, అదే సమయంలో గణనీయమైన పోటీ నేపథ్యంలో ఓటీటీ పరిశ్రమలో అగ్రస్థానంలో ఉన్న డిస్నీ హాట్‌స్టార్.. తనకు ప్రధాన ప్రత్యర్థిగా అవతరిస్తున్న జియో సినిమాస్‌తో చేతులు కలపడం పరిశ్రమలో స్థిరీకరణ దిశగా బలమైన అడుగులు పడినట్టయింది. పరిశ్రమలో ఇప్పుడు జియోహాట్‌స్టార్ నంబర్ 1 ప్లేయర్. జీతో విలీనం అయ్యేందుకు సోనీ చేసిన ప్రయత్నం ఫలించలేదు. పోటీ పెరగడంతో అమెజాన్ లైట్ పేరుతో ఒక్కరు/ఇద్దరు సభ్యుల కుటుంబం కోసం తక్కువ చార్జీల నమూనాను తీసుకొచ్చింది. అలాగే, 2024లో ఎంఎక్స్ ప్లేయర్‌ను కొనుగోలు చేసి.. దీనిపై ఉచిత కంటెంట్‌ను అందుబాటులో ఉంచింది.



వృద్ధికి భారీ అవకాశాలు..

90 కోట్ల టీవీ వీక్షకులతో పోల్చి చూస్తే.. 12.5 కోట్ల వీక్షకులు కలిగిన ఓటీటీ పరిశ్రమకు మరింత మందిని చేరుకునేందుకు గణనీయమైన అవకాశాలున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. దేశంలో స్మార్ట్‌ఫోన్ యూజర్లు 2024 నాటికి 65 కోట్ల మంది ఉంటారని అంచనా. 5 కోట్ల కనెక్టెడ్ టీవీలు కూడా ఉన్నాయి. ఈ పరంగా చూస్తే ఓటీటీల విస్తరణకు దండిగా అవకాశాలున్నాయన్నది విశ్లేషకుల అభిప్రాయం. తొమ్మిదేళ్ల క్రితం ఫస్ట్ గేర్‌లోకి ప్రవేశించిన ఓటీటీ పరిశ్రమ ప్రస్తుతం పట్టణ యూజర్లకు వేగంగా చేరువ కాగా, దేశంలోని ఇతర ప్రాంతాల వారికీ తమ కంటెంట్‌ను చేరువ చేయాల్సి ఉందంటున్నారు. ఇందుకు వీలుగా ప్రకటనలతో కూడిన తక్కువ సబ్‌స్క్రిప్షన్ ప్యాక్‌లు సాయపడతాయని చెబుతున్నారు.

బుల్ భళా



రెండో రోజూ ర్యాలీ
- 610 పాయింట్లు ప్లస్
- సెన్సెక్స్ @ 74,340
- 22,500 దాటిన నిఫ్టీ

ముంబై: టారిఫ్‌లపై యూఎస్ వెనక్కి తగ్గుతోందనే అంచనాలు ఇన్వెస్టర్లకు జోష్‌నిస్తున్నాయి. దీంతో వరుసగా రెండో రోజు స్టాక్ మార్కెట్లు దూకుడు చూపాయి. సెన్సెక్స్ 610 పాయింట్లు జంప్‌చేసి 74,340 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 207 పాయింట్లు ఎగసి 22,545 వద్ద స్థిరపడింది. ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువకు రూ. 4.53 లక్షల కోట్లకుపైగా జమయ్యింది. రూ. 3,97,57,851 కోట్లకు చేరింది. చమురు ధరలు తగ్గడం, సానుకూల ప్రపంచ మార్కెట్లు సెంటిమెంటును మెరుగుపరిచాయి. 2 రోజుల్లో మార్కెట్ విలువ రూ. 12.5 లక్షల కోట్లు పెరిగింది!

ఆయిల్ షేర్ల జోరు

ఎన్ఎస్ఈలో ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్, ఫార్మా, ఎఫ్ఎంసీజీ 2.6–1.2 శాతం మధ్య బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఏషియన్ పెయింట్స్, కోల్ ఇండియా, బీపీసీఎల్, హిందాల్కో, ఆర్ఐఎల్, ఎన్‌టీపీసీ, సిప్లా, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫిన్, సన్ ఫార్మా, శ్రీరామ్, ఐషర్, హీరోమోటో, యాక్సిస్ 5–2 శాతం మధ్య జంప్‌చేశాయి. హెచ్‌పీసీఎల్ 5 శాతం, ఐవోసీ 4 శాతం, బీపీసీఎల్ 3.2 శాతం ఎగిశాయి. మరోసారి చిన్న షేర్లకు డిమాండ్ నెలకొంది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 1.6 శాతం, మిడ్‌క్యాప్ 0.7 శాతం చొప్పున పెరిగాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
వ్యక్తిగత బాధ్యతలే కెరీర్ పురోగతికి బ్రేక్!
భారత్‌లో టెస్లాకు అంత ఈజీ కాదు: సజ్జన్ జిందాల్

నయారా ఎనర్జీ షేర్ల బైబ్యాక్

- మైనారిటీ వాటాదారులకు ఎగ్జిట్ ఆఫర్
- రూ. 731 ధరలో 2.59 కోట్ల షేర్లకు రెడీ



న్యూఢిల్లీ: ఇంధన రిటైలర్ నయారా ఎనర్జీ మైనారిటీ వాటాదారుల నుంచి ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనుంది. షేరుకి రూ. 731 ధరలో 2.59 కోట్లకుపైగా షేర్లను బైబ్యాక్ చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. దేశీ ప్రయివేట్ రంగ ఇంధన రిటైలింగ్‌లో అతిపెద్ద కంపెనీగా నిలుస్తున్న నయారా ఎనర్జీ స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి 2016 ఫిబ్రవరి 17న డీలిస్టయిన సంగతి తెలిసిందే. గతంలో ఎస్సార్ ఆయిల్‌గా వ్యవహరించిన కంపెనీ బీఎస్ఈ, ఎన్ఎస్ఈ నుంచి స్వచ్ఛందంగా తప్పుకుంది. ఈ నేపథ్యంలో మైనారిటీ వాటాదారులు కంపెనీ నుంచి వైదొలగేందుకు షేర్ల బైబ్యాక్‌కు తెరతీసింది. ఇందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ తాజాగా పేర్కొంది.

ఎన్ఎండీసీ సీఎండీగా అమితవ ముఖర్జీ



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇనుప ఖనిజ మైనింగ్ దిగ్గజం ఎన్ఎండీసీ.. కొత్త చైర్మన్, ఎండీగా అమితవ ముఖర్జీని నియమించింది. సీఎండీగా ముఖర్జీ గురువారం(6) నుంచి బాధ్యతలు స్వీకరించినట్లు కంపెనీ పేర్కొంది. ఇప్పటివరకూ సీఎండీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2025 మార్చి 6 నుంచి బోర్డు సీఎండీగా ఎంపిక చేసినట్లు ఎన్ఎండీసీ వెల్లడించింది. వయసురీత్యా 2028 ఫిబ్రవరి 29 వరకూ లేదా తదుపరి ఆదేశాలు జారీ చేసేటంతవరకూ ముఖర్జీ పదవిని నిర్వహించనున్నట్లు తెలియజేసింది. 2018 నవంబర్‌లో ఫైనాన్స్ డైరెక్టర్‌గా కంపెనీలో చేరిన ముఖర్జీ 2023 మార్చి నుంచి సీఎండీగా అదనపు బాధ్యతలు చేపట్టారు.

నేటి నుంచి సన్‌రైజర్స్ తొలి రెండు మ్యాచ్‌ల టికెట్లు అమ్మకం... ఉదయం 11 గంటల నుంచి district appలో విక్రయం

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు సొంతగడ్డపై ఆడే తొలి రెండు మ్యాచ్‌లకు సంబంధించి టికెట్లను ఈరోజు ఆన్‌లైన్‌లో విక్రయించనున్నారు. ఈనెల 23న ఉప్పల్ స్టేడియంలో జరిగే తమ తొలి లీగ్ మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ జట్టుతో సన్‌రైజర్స్ ఆడనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం గం. 3:30 నుంచి జరుగుతుంది. అనంతరం ఈనెల 27న ఉప్పల్ స్టేడియంలోనే జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో సన్‌రైజర్స్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌ను రాత్రి గం. 7:30 నుంచి నిర్వహిస్తారు. ఈ రెండు లీగ్ మ్యాచ్‌లకు సంబంధించి టికెట్లను ఈరోజు ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ మ్యాచ్‌ల అధికారిక టికెటింగ్ పార్ట్‌నర్ district appలో district.in వెబ్‌సైట్‌లో ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయవచ్చు.

వారియర్స్ ఆశలు ఆవిరి!

- యూపీపై ముంబై ఇండియన్స్ ఘనవిజయం
- హేలీ మాథ్యూస్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- ఐదు వికెట్లతో మెరిసిన అమెలియా కెర్


హేలీ మాథ్యూస్

లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో 'ప్లే ఆఫ్' దశకు అర్హత సాధించే అవకాశాలు సజీవంగా ఉండాలంటే గెలవాల్సిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ జట్టు నిరాశపరిచింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై గెలిచి ప్లే ఆఫ్స్ దశకు చేరువైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. జార్జియా వోల్ (33 బంతుల్లో 55; 12 ఫోర్లు) డబ్ల్యూపీఎల్‌లో తొలి అర్ధశతకంతో ఆకట్టుకోగా... గ్రేస్ హ్యారిస్ (28; 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ దీప్తి శర్మ (27; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. కిరణ్ నవ్‌గిరె (0), షినెల్ హెన్రీ (6), శ్వేత సెహ్రావత్ (0), ఉమా ఛెత్రీ (1) విఫలమయ్యారు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో అమేలియా కెర్ 38 పరుగులిచ్చి 5 వికెట్లతో అదరగొట్టగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హేలీ మాథ్యూస్ (2 వికెట్లు; 68 పరుగులు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరిపించింది. ఓపెనర్లు రాణించడంతో ఒకదశలో 7.5 ఓవర్లలో 74 పరుగులు చేసిన యూపీ వారియర్స్ ఆ తర్వాత అదే జోరు కొనసాగించలేకపోయింది. అమేలియా విజృంభణతో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి సాధారణ స్కోరుకే పరిమితమైంది. అనంతరం లక్ష్యఛేదనలో ముంబై ఇండియన్స్ 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. హేలీ (46 బంతుల్లో 68; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), సివర్ బ్రంట్ (23 బంతుల్లో 37; 7 ఫోర్లు) రాణించారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 58 బంతుల్లోనే 92 పరుగులు జోడించడంతో ముంబై సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. లీగ్‌లో భాగంగా శుక్రవారం జరగనున్న మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో గుజరాత్ జెయింట్స్ ఆడుతుంది.

సునీల్ ఛెత్రి పునరాగమనం



న్యూఢిల్లీ: రిటైర్మెంట్ నుంచి వెనక్కి రావాలని భారత ఫుట్‌బాల్ దిగ్గజం సునీల్ ఛెత్రి నిర్ణయం తీసుకున్నాడు. గత ఏడాది జూన్‌లో కువైట్‌తో జరిగిన మ్యాచ్ అనంతరం 40 ఏళ్ల సునీల్ ఛెత్రి అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు. ఛెత్రి రిటైర్మెంట్ తర్వాత భారత ఫుట్‌బాల్ జట్టుకు ఆశించిన ఫలితాలు రాలేదు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒక్క దాంట్లోనూ గెలవలేదు. దాంతో ఈ నెలలో షిల్లాంగ్‌లో జరిగే రెండు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారత జట్టు తరఫున సునీల్ ఛెత్రి బరిలోకి దిగనున్నాడు. ఈ విషయాన్ని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ధ్రువీకరించింది. మార్చి 19న మాల్దీవులతో, 25న బంగ్లాదేశ్‌తో భారత్ ఆడుతుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో పాల్గొనే 26 మంది సభ్యులతో కూడిన భారత జట్టును గురువారం ప్రకటించగా... సునీల్ ఛెత్రికి స్థానం దక్కింది. భారత సీనియర్ జట్టు తరఫున 151 మ్యాచ్‌లు ఆడిన సునీల్ ఛెత్రి 94 గోల్స్ సాధించాడు. ప్రొఫెషనల్ లీగ్‌లో ఇంకా కొనసాగుతున్న సునీల్ ఛెత్రి బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్‌కు ఆడుతున్నాడు.

శ్రీకాంత్ పరాజయం



పారిస్: ఓర్లియాన్స్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో వీరిద్దరూ ఓడిపోయారు. శ్రీకాంత్ 30 నిమిషాల్లో 11-21, 17-21తో టాప్ సీడ్, ప్రపంచ ఏడో ర్యాంకర్ లీ జి జియా (మలేసియా) చేతిలో... ప్రణయ్ 18-21, 9-21తో ప్రపంచ 14వ ర్యాంకర్ చున్ యి లిన్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలయ్యారు. మరోవైపు భారత రైజింగ్ స్టార్ ఆయుశ్ శెట్టి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ మాజీ చాంపియన్, మూడో సీడ్ కీన్ యె లో (సింగపూర్)పై నెగ్గిన ఆయుశ్ గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 21-17, 21-17తో ప్రపంచ 38వ ర్యాంకర్ జేసన్ గుణవాన్ (హాంకాంగ్)పై గెలుపొందాడు. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో గద్దె రుత్విక శివాని–రోహన్ కపూర్ (భారత్) జంట గాయం కారణంగా బరిలోకి దిగకుండా తమ ప్రత్యర్థి యాంగ్ పోసువాన్–లింగ్ ఫాంగ్ హు (చైనీస్ తైపీ) జోడీకి వాకోవర్ ఇచ్చింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అక్షరాలా అమూల్యం

అక్షర్ పటేల్ భారత జట్టు తరఫున 2014లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. అయితే పదేళ్ల కాలంలో కేవలం 14 టెస్టులు, 57 వన్డేలు, 60 టి20లు మాత్రమే ఆడగలిగాడు. తనలాంటి లెఫ్టార్మ్ స్పిన్ బౌలింగ్, లెఫ్ట్ హ్యాండ్ బ్యాటింగ్ కలగలిసిన సీనియర్ ప్లేయర్ రవీంద్ర జడేజా నీడలోనే అతను ఎక్కువ కాలం ఉండిపోవడమే అందుకు కారణం. జడేజా ఏదో కారణంతో జట్టుకు దూరమైతే తప్ప అక్షర్‌కు అవకాశం దక్కకపోయేది. కానీ గత ఏడాది కాలంలో పరిస్థితి మారింది. వన్డేలు, టి20ల్లో చక్కటి ప్రదర్శనలతో అతను జట్టు విజయాల్లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. జడేజాతో పోలికలు వచ్చినా సరే... తనదైన శైలిలో రెండు విభాగాల్లోనూ వైవిధ్యాన్ని కనబరుస్తూ స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు.

సాక్షి క్రీడా విభాగం


అక్షర్ పటేల్

వన్డేలు, టి20ల్లో సత్తా చాటుకున్న ఆల్‌రౌండర్

ఏడాది కాలంగా నిలకడైన ప్రదర్శన | భారత జట్టులో స్థానం సుస్థిరం

టి20 వరల్డ్ కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాతో భారత్ పోరు... 34 పరుగులకే జట్టు రోహిత్, పంత్, సూర్యకుమార్ వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో తీవ్ర ఒత్తిడి మధ్య ఐదో స్థానంలో అక్షర్ బరిలోకి దిగాడు. మరో ఎండ్‌లో కోహ్లిలాంటి దిగ్గజం ఉండగా అక్షర్ కీలక బాధ్యతలు తన భుజాన వేసుకున్నాడు. పాండ్యా, దూబే, జడేజాలాంటి ఆల్‌రౌండర్లను కాదని అక్షర్‌పై నమ్మకంతో కోచ్ ద్రవిడ్ ముందు పంపించాడు. దూకుడుగా ఆడి సాధ్యమైనన్ని ఎక్కువ పరుగులు రాబట్టే ఉద్దేశంతో వచ్చిన అతను తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. కోహ్లితో కలిసి అక్షర్ నాలుగో వికెట్‌కు 54 బంతుల్లో 72 పరుగులు జోడించాడు. ఇందులో కోహ్లి 23 బంతుల్లో ఒక్క బౌండరీ లేకుండా 21 పరుగులు చేస్తే... అక్షర్ ఒక ఫోర్, 4 సిక్స్‌లతో 31 బంతుల్లో 47 పరుగులు సాధించాడు. చివరకు భారత్ ప్రపంచ చాంపియన్‌గా నిలవడంలో ఈ ఇన్నింగ్స్ విలువేమిటో అందరికీ తెలిసింది. ఆ మ్యాచ్ టీమిండియాలో అక్షర్ స్థాయిని పెంచింది. ఇప్పుడు దాదాపు ఏడాది కాలంగా అది కనిపిస్తోంది.

2021లో ఇంగ్లండ్ జట్టు టెస్టు సిరీస్ కోసం భారత్‌కు వచ్చింది. ఈ సిరీస్‌లో జడేజా గైర్హాజరులో 3 టెస్టులు ఆడిన అక్షర్ కేవలం 10.59 సగటుతో 27 వికెట్లు పడగొట్టాడు. నిజానికి ఈ ప్రదర్శన అతనికి టెస్టు జట్టులో స్థానాన్ని సుస్థిరం చేయాలి. కానీ అలా జరగలేదు. ఆ తర్వాత కూడా అడపాదడపా అవకాశాలే తప్ప రెగ్యులర్‌గా బరిలోకి దిగలేదు. అలాంటి సమయంలో అక్షర్ వన్డేలు, టి20లపై ఎక్కువగా దృష్టి పెట్టాడు. జడేజాతో పోలిస్తే అక్షర్ బంతిని ఎక్కువ టర్న్ చేయలేడు. అందుకే టెస్టులతో పోలిస్తే వన్డే, టి20లకు అవసరమైన నైపుణ్యాలను సానబెట్టుకున్నాడు. బౌలింగ్‌కు కాస్త పేస్ జోడించి 'ఆర్మ్ బాల్'తో నేరుగా వికెట్లపైకి సంధిస్తూ బ్యాటర్లను ఇబ్బంది పెట్టే శైలితో ఫలితం సాధించాడు. దీని వల్ల కొన్నిసార్లు బ్యాటర్‌కు భారీ షాట్ ఆడే అవకాశం వచ్చినా... అదే ఉచ్చులో ఎల్బీడబ్ల్యూ లేదా బౌల్డ్‌కు అవకాశం ఉంటుంది. ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో మ్యాక్స్‌వెల్ వికెట్ దీనికి చక్కటి ఉదాహరణ. ఇదే సమయంలో తన బ్యాటింగ్‌లో మరింత సాధన చేశాడు. పరిమిత ఓవర్లలో భారీ షాట్లతో పరుగులు రాబట్టడంలో తన ప్రత్యేకత చూపించాలని అతను భావించాడు. అన్నింటికి మించి జడేజాతో ఫీల్డింగ్ విషయంలో సహజంగానే పోలిక వచ్చింది. ఇందులోనూ ప్రత్యేక సాధన చేసి తాను ఫీల్డింగ్‌లోనూ చురుకైన వాడినేనని నిరూపించుకోవడం అతనికి వన్డేలు, టి20ల్లో మరిన్ని అవకాశాలు కల్పించింది. టి20 వరల్డ్ కప్‌లో అందరికీ సూర్యకుమార్ క్యాచ్ బాగా గుర్తుండిపోవచ్చు. అంతకుముందు ఆసీస్‌తో మ్యాచ్‌లో మార్ష్ క్యాచ్‌ను బౌండరీ వద్ద అక్షర్ ఒంటిచేత్తో అందుకున్న తీరు అద్భుతం. ఇక జడేజా రిటైర్మెంట్‌తో టి20ల్లో అతని స్థానం సుస్థిరమైంది.

బ్యాటర్‌గానే తన కెరీర్ మొదలు పెట్టిన అక్షర్ తనలోని అసలైన బ్యాటర్‌ను గత కొంత కాలంగా బయటకు తెచ్చాడు. ముఖ్యంగా గత రెండేళ్లుగా అతని దానికి పూర్తి న్యాయం చేకూరుస్తున్నాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ అతనికి అలాంటి అవకాశం ఇచ్చింది. వాటిని చాలా వరకు అక్షర్ సమర్థంగా వాడుకున్నాడు. ఇప్పుడు భారత జట్టు అవసరాలరీత్యా అతనికి ఐదో స్థానంలో ఆడే అవకాశం దక్కుతోంది. వన్డేల్లో రాహుల్‌కే కీపర్‌గా తొలి ప్రాధాన్యత లభిస్తుండటంతో పంత్‌కు చోటు ఉండటం లేదు. దాంతో టాప్-6లో అంతా కుడిచేతి వాటం బ్యాటర్లే ఉంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని అక్షర్‌ను మేనేజ్‌మెంట్ ఐదో స్థానంలో పంపిస్తోంది. అది చక్కటి ఫలితాలను కూడా అందించింది. అక్షర్ బ్యాటింగ్‌లో చెప్పుకోదగ్గ అంశం అతను స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొనే తీరు. ముఖ్యంగా డీప్ మిడ్ వికెట్ మీదుగా స్లాగ్ స్వీప్‌తో అతను పెద్ద సంఖ్యలో పరుగులు రాబడుతున్నారు. అలవోకగా సిక్స్‌లు కొడుతున్న అతని నైపుణ్యం జట్టుకు అదనపు బలాన్ని ఇస్తోంది. టి20 వరల్డ్ కప్ తర్వాత శ్రీలంకతో వన్డే సిరీస్‌లో అతను తొలిసారి ఐదో స్థానంలో ఆడాడు. అక్షర్ వరుసగా 44, 52, 41 నాటౌట్, 8, 42, 27 పరుగులు సాధించాడు. ఒక బ్యాటర్‌గా చూస్తే ఇవన్నీ అద్భుత గణాంకాలు కాకపోయినా... ఆల్‌రౌండర్ కోణంలో, పైగా తక్కువ స్కోర్ల మ్యాచ్‌లలో ఈ స్కోర్లన్నీ అమూల్యమైనవే. ఇప్పుడు టీమిండియాలో అన్ని విధాలా ఆధారపడదగ్గ ప్లేయర్‌గా మారిన అక్షర్ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే సుదీర్ఘ కాలం జట్టుకు ప్రాతినిధ్యం వహించగలడు.



SHOWROOMS: TELANGANA: HYDERABAD: RENAULT GACHIBOWLI Ph: 9289220863, RENAULT HITECH CITY Ph: 9311733970, RENAULT KUKATPALLY Ph: 7067322620, RENAULT LB NAGAR Ph: 9311700671.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

కొమురయ్య.. దీవెనలివ్వాలయ్యా..

గోపు వంశీయుల ప్రత్యక్ష దైవం కొమురయ్య | భవిష్యవాణి చెప్పేవారని భక్తుల విశ్వాసం | 9 నుంచి గోపు కొమురయ్య జాతర ప్రారంభం | 10న తొలిసారిగా ఎడ్లబండ్ల పోటీలు


గోపు కొమురయ్య జాతర వద్ద నూతన ఆలయ నిర్మాణం


కొలువుదీరిన మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులు

రామగుండం:

ఆరు దశాబ్దాల క్రితం నాటి మాట ఇది.. గోపు వంశీయుడొకరు భవిష్యవాణి చెప్పేవారు. తన మరణాన్ని కూడా ముందుగానే ప్రకటించి కన్ను మూశారు. ఆ రోజు నుంచి ఆయనను దైవంగా గోపు వంశీయులు కొలుస్తూ జాతరను నిర్వహిస్తున్నారు. గోపు వంశీయులు భక్తి ప్రపత్తులతో కొలిచే ఆ దైవం పేరు గోపు కొమురయ్య.

65 ఏళ్లుగా జాతర

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ముర్మూర్ గ్రామానికి చెందిన గోపు కొమురయ్య మరణానంతరం.. ఆయన పేరిట 65 ఏళ్లుగా (మల్లికార్జున కల్యాణం) గోపు వంశీయులు జాతరను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

భవిష్యవాణితోనే బహుళ ప్రాచుర్యం

ఆరు దశాబ్దాల క్రితం గోపు కొమురయ్య బతికుండగానే భవిష్యవాణి చెప్పారని ఆయన భక్తులు విశ్వసిస్తారు. సమాజంలో జరిగే శుభాలు, దుష్పరిణామాలు ముందుగా గ్రహించేవారని.. పూనకం వచ్చిన సమయంలో.. తన వద్దకు వచ్చే వారికి భవిష్యవాణిని వినిపించేవారంటారు. తన మరణ తేదీని ముందుగా ప్రకటించారని.. తన పేరుతో జాతర నిర్వహించాలని ప్రకటించిన సమయానికే శివైక్యం పొందారని భక్తుల కథనం. దీంతో కొమురయ్య సమాధిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరిగిపోయింది. యాదవ కులబాంధవులు ఆయనను ప్రత్యక్ష దైవంగా కొలుచుకుంటున్నారు. కొమురయ్య సమాధికి గది నిర్మించి ఆలయంగా పూజిస్తున్నారు. దశాబ్దాల తరబడి.. రోజూ ఉదయం క్రమం తప్పకుండా సమాధి వద్ద గోపు వంశీయులు దీపారాధన చేస్తున్నారు. సమాధి వద్ద గోపు వంశీయులు శ్రీ మల్లికార్జున స్వామి కల్యాణం పేరిట జాతర నిర్వహిస్తుండడం ఆనవాయితీ. పొరుగు జిల్లాల నుంచి సైతం అధిక సంఖ్యలో యాదవ కులస్తులు రావడం జాతర ప్రత్యేకత. ఈ క్రమంలో ప్రతీ హోలీ పండుగకు ముందు ఫాల్గుణ మాసం ఆది, సోమవారాల్లో జాతర నిర్వహిస్తుంటారు.



> **కొమురయ్య ఉన్నట్టే భావిస్తాం**
>
> గోపు కొమురయ్య జ్ఞాపకార్థం నిర్వహించే జాతరకు ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. 65 ఏళ్లుగా మా వంశీయులు నిష్ఠతో దీపారాధన చేస్తున్నారు. ఆయన మా మధ్య లేకపోయినా.. జీవించి ఉన్నట్లుగానే భావిస్తున్నాం.
>
> – గోపు అయిలయ్యయాదవ్, జాతర కార్యనిర్వాహక ప్రతినిధి

జాతరకు సకల ఏర్పాట్లు

అంతర్గాం మండలం ముర్మూర్ శివారులోని ఆయన సమాధి (ఆలయం) వద్ద ఈనెల 9 నుంచి కార్యనిర్వాహక ప్రతినిధి గోపు అయిలయ్య యాదవ్ నేతృత్వంలో జాతర నిర్వహించనున్నారు. ఇందులో భాగంగానే తొలిరోజు దృష్టి కుంభం, మైలలు తీయడం, రుద్రాభిషేకం, బియ్యం, సుంకు పెద్ద పట్నంతో పాటు ఉదయం 11.45 గంటలకు శ్రీమల్లికార్జునస్వామి కల్యాణోత్సవాలను నిర్వహించనున్నారు. 10వ తేదీ వేకువజామున 4 గంటలకు అగ్నిగుండ ప్రవేశం అనంతరం ఇప్పలపల్లి భరత్ స్వామి జంగమ మహేశ్వరులచే కొమురన్న జీవిత చరిత్రపై ఒగ్గు కథ ప్రదర్శించనున్నారు. ఈసారి తొలిసారిగా ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించనుండగా, ముగ్గురికి భారీగా ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జాతరకు వచ్చే భక్తులకు అన్నదానం చేస్తారు.

వట్టి జానయ్యపై దర్యాప్తు

త్వరగా ముగించండి

4 వారాల్లో చార్జ్‌షీట్లు దాఖలు చేయండి

తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: సూర్యాపేటకు చెందిన వట్టి జానయ్యపై దాఖలైన కేసుల్లో దర్యాప్తును వేగంగా పూర్తిచేసి నాలుగు వారాల్లోగా చార్జ్‌షీట్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. గత రాష్ట్ర ప్రభుత్వం తనపై పెద్ద సంఖ్యలో కేసులు పెట్టడాన్ని సవాల్ చేస్తూ 2023 సెప్టెంబర్ 20న జానయ్య సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తాను బీఆర్ఎస్ పార్టీని వీడి బీఎస్పీలో చేరిన తర్వాత ఈ కేసులు పెట్టిందని పేర్కొంటూ.. ఆరు స్పెషల్ లీవ్ పిటిషన్లు (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. వీటిపై గురువారం జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా జానయ్య ముందస్తు బెయిల్‌కు తాము అభ్యంతరం తెలపటం లేదని, పిటిషన్ల కొట్టివేత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని చార్జ్‌షీట్లను దాఖలు చేసిందని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. రెండు ఎఫ్ఐఆర్‌లలో దర్యాప్తు పెండింగ్‌లో ఉన్నందున వాటికి సంబంధించిన చార్జ్‌షీట్‌లు దాఖలు చేయలేదని చెప్పారు. దీంతో ఆ రెండు ఎఫ్ఐఆర్‌లలో దర్యాప్తును నాలుగు వారాల్లో పూర్తిచేసి చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

బీఆర్ఎస్, బీజేపీ

చీకటి రాజకీయాలు

అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం: మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో చీకటి ఒప్పందం కారణంగానే బీజేపీ గెలిచిందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు ఎక్కడా చెక్కు చెదరలేదని అన్నారు. బీజేపీ రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవడం ద్వారా ఆ పార్టీ ఎమ్మెల్సీల సంఖ్య మూడుకు పెరిగినా... దీనివల్ల ప్రభుత్వానికి, ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఆయన విమర్శించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అడ్డగోలు అవినీతితో కేసీఆర్ కుటుంబం అనేక కేసులలో చిక్కుకుందని, దీంతో క్విడ్ ప్రోకో పద్ధతిన బీఆర్ఎస్–బీజేపీలు వారివారి లాభాల కోసం పని చేస్తున్నాయని ఆరోపించారు. గత పార్లమెంట్ ఎన్నికల ముందు నుంచే ఈ ఒప్పందాలు అమలవుతున్నాయని, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందంతో బీజేపీకి మద్దతివ్వడం వల్లనే ఆ పార్టీ 8 సీట్లు గెలిచిందని ఆయన చెప్పారు. అందులో భాగంగానే ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో 22 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉండి బీజేపీని గెలిపించిందన్నారు. ఇది ఆ పార్టీల తాత్కాలిక విజయమేనని, ఈ ఎన్నికలకు రాబోయే ఎన్నికలకు సంబంధం ఉండదని తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ స్థానాలు గెలుస్తుందని, ఆ ఫలితాలను రెఫరెండమ్‌గా భావించవచ్చని మల్లు రవి తెలిపారు. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల ఎంపికలో కచ్చితంగా సామాజిక న్యాయం ఉంటుందన్నారు.

పెసా మొబిలైజర్ల వేతనాలు, శిక్షణకు రూ.33 కోట్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోపంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు–పెసా) చట్టం కింద కార్యక్రమాల విస్తరణకు కృషి చేస్తున్న కో–ఆర్డినేటర్లు, మొబిలైజర్లకు పెండింగ్ జీతాలు, పెసా శిక్షణ కార్యకలాపాల కోసం ప్రభుత్వం రూ.33 కోట్లు విడుదల చేసింది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులు, అభివృద్ధి, పెసా చట్టంపై అవగాహన కల్పనతో పాటు, వీటికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలను కో–ఆర్డినేటర్లు, మొబిలైజర్లు నిర్వహిస్తున్నారు. ఐటీడీఏ పీవోల పర్యవేక్షణలో పనిచేసే వీరు.. క్షేత్రస్థాయి పర్యటించి ఆదివాసీల హక్కులు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచే వీరి వేతనాలు పెండింగ్‌లో ఉండిపోవడంతో.. పీఆర్ మంత్రి సీతక్క చొరవతో ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసింది. రాష్ట్రంలోని ఐటీడీఏలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి మరింత క్రియాశీలం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సంబంధిత అధికారులు వెల్లడించారు.

ఎనిమిది కుటుంబాల గ్రామ బహిష్కరణ

ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోయిస్టుల నిర్ణయం

చర్ల: పోలీసు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారనే నెపంతో మావోయిస్టులు ఎనిమిది కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. దంతెవాడ జిల్లా తుస్వాల్ పంచాయతీ పరిధి తోడ్మా, కొహకబెడా గ్రామాలకు చెందిన ఎనిమిది కుటుంబాలను బుధవారం అదుపులోకి తీసుకున్న మావోయిస్టులు ప్రజాకోర్టు నిర్వహించారు. పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తూ.. మావోయిస్టు దళాల సమాచారాన్ని వారికి చేరవేస్తున్నారన్న ఆరోపణలతో ఆ కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేశారు. తక్షణమే గ్రామాలు విడిచి వెళ్లకపోతే హతమారుస్తామని మావోయిస్టులు హెచ్చరించడంతో.. ఆ కుటుంబాలు బస్తర్ జిల్లాలోని కేలేపాల్, వాహన్పూర్ గ్రామాలకు తరలి వెళ్లినట్లు తెలిసింది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు గురువారం వివరాలు సేకరించారు. ప్రజాకోర్టులో పాల్గొన్న వారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది.


జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్‌–ఖమ్మం–నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డికి సీఎం అభినందనలు తెలిపారు.

అమెరికాతో మైత్రీ బంధంపై

మోదీ పునరాలోచించాలి

సీపీఐ నారాయణ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ దేశాల భద్రతకు ప్రమాదకరంగా మారుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఖండించాలని, ఆ దేశంతో మైత్రీ బంధంపై పునరాలోచించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. మఖ్దూం భవన్‌లో గురువారం ఆయన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాల నాగేశ్వరరావులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ రంగానికి ఆద్యుడిని తానేనని చెప్పుకునే ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు.. అమెరికా ప్రభుత్వం టెకీల పట్ల అనుసరిస్తున్న అమానుష విధానాలపై స్పందించకపోవడం దారుణమన్నారు. బీజేపీ ప్రభుత్వానికి ఆక్సిజన్ అందిస్తున్న చంద్రబాబు, ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకురావాలని హితవు పలికారు. భారత్ పట్ల ట్రంప్ నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తున్నాడని, ఈ తరుణంలో ప్రధాని దేశ ప్రతిష్టను కాపాడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ వలసదారుల పేరుతో భారతీయుల పట్ల అమెరికా అమానుషంగా వ్యవహరించడం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. అక్రమ వలసల పేరుతో భారతీయులకు సంకెళ్లు వేసి, సైనిక విమానాల్లో తరలించడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. దేశ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా అమెరికా వ్యవహరిస్తుంటే, మోదీ దీటుగా స్పందించాల్సిన అవసరం ఉందని నారాయణ పేర్కొన్నారు.

ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజం

మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని.. ఒక్క ఓటమితోనే భవిష్యత్తు అంధకారం కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన విమర్శలమీద పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ అవగాహనలేమికి నిదర్శనమని గురువారం మంత్రి పొన్నం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ మంత్రులకు దమ్ముంటే కేంద్రం నుంచి నిధులు తీసుకుని రావాలని డిమాండ్ చేశారు. రామగుండం నుంచి హైదరాబాద్‌కు ఎనిమిది లేన్ల రహదారిని నిర్మించాలని, ఈ గెలుపు బీజేపీ–బీఆర్ఎస్ బంధాన్ని బయటపెట్టిందని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నిక జరిగితే అభ్యర్థిని నిలబెట్టకుండా బీజేపీతో కుమ్మక్కు అయ్యారని మంత్రి ఆరోపించారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, కేంద్ర మంత్రిగా ఉంటూ 'రంజాన్ గిఫ్ట్'అంటూ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

ఆయకట్టును స్థిరీకరించండి

మంత్రి ఉత్తమ్‌ను కలిసిన భువనగిరి ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: రంగనాయకసాగర్ డీ–10 కెనాల్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ–3 కెనాల్ పరిధిలో ఉన్న ఆయకట్టును స్థిరీకరించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి దూల్మిట్ట, చేర్యాల మండలాల్లోని పలు గ్రామాలకు నీరు అందించే కాలువ పరిస్థితిని ఎంపీ చామల పరిశీలించి, ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా గ్రామాల్లో సాగుభూములకు నిరంతర నీరందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. జనగామ జిల్లా దూల్మిట్ట, చేర్యాల మండలాల్లోని కమలాయపల్లి, అర్జున్‌పట్ల, ఆకునూర్, జూలపల్లి, లింగాపూర్, దూల్మిట్ట గ్రామాల్లో మొత్తం 6 వేల ఎకరాలకు రంగనాయకసాగర్ డీ–10 కెనాల్ ద్వారా నీరు విడుదల చేయాలని కోరారు. మంత్రి ఉత్తమ్ స్పందిస్తూ రైతుల పంటలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన నీరు విడుదల చేసేలా చూడాలని ఆదేశించారు.

పసుపు.. ఈసారి

పసిడి పంటే

గతేడాదితో పోలిస్తే పెరిగిన సాగు.. దిగుబడి కూడా

- నిజామాబాద్ మార్కెట్‌కు ఈ సీజన్‌లో ఇప్పటివరకు 5,00,985 క్వింటాళ్లు రాక
- సీజన్ ముగిసేలోగా మరో 3.65 లక్షల క్వింటాళ్లు వస్తుందని అంచనా
- గత ఏడాదితో పోలిస్తే 1.50 లక్షల క్వింటాళ్లు అధికంగా వచ్చే అవకాశం
- గిట్టుబాటు ధరతో రైతుల్లో హర్షం


నిజామాబాద్ మార్కెట్‌లో కుప్పలుగా పోసిన పసుపు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పసుపు పండించిన రైతులకు ధర గిట్టుబాటు అవుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా పసుపు సాగు విస్తీర్ణం పెరిగింది. అతివృష్టి లేకపోవడంతో దుంపకుళ్లు తెగులు (నీరు నిలిస్తే వచ్చే తెగులు) రాలేదు. దీంతో దిగుబడి సైతం గత ఏడాది కంటే ఎక్కువగా వస్తోంది. రాష్ట్రంలో పండించిన పసుపు పంటలో 80 శాతం నిజామాబాద్ మార్కెట్‌కు వస్తుంది. ఇప్పటివరకు ఫింగర్ పసుపు రకానికి అత్యధికంగా క్వింటాల్‌కు రూ.13,311 ధర పలికింది. సగటున క్వింటాల్‌కు రూ.11,300 ధర దక్కుతోంది. గోళా పసుపునకు అత్యధికంగా క్వింటాల్‌కు రూ.10 వేలు పలికింది. సగటున క్వింటాల్‌కు రూ.9,900 దక్కుతోంది. ఫింగర్ పసుపునకు కనీస ధర రూ.10 వేలు, గోళా పసుపునకు కనీస ధర రూ.9వేలు తగ్గకుండా నిజామాబాద్ మార్కెట్ కమిటీ చొరవ తీసుకుంది. ప్రస్తుతం 15 నుంచి 20 శాతం తేమ ఉంటోందని, రైతులు తేమ శాతాన్ని 12 శాతానికి పరిమితం చేసుకుంటే మరింత ధర దక్కుతుందని మార్కెట్ కమిటీ చెబుతోంది.

తగ్గుతూ వచ్చి.. మళ్లీ పెరుగుదల దిశగా..

నిజామాబాద్ మార్కెట్‌కు ఈసారి ఎక్కువగా పసుపు రానున్నట్టు అధికారులు చెబుతున్నారు. 2019–20లో 10,78,821 క్వింటాళ్లు, 2020–21లో 8,55,516 క్వింటాళ్లు, 2021–22లో 8,38,932 క్వింటాళ్లు, 2022–23లో 7,49,072 క్వింటాళ్లు, 2023–24లో 7,23,470 క్వింటాళ్ల పసుపు నిజామాబాద్ మార్కెట్‌కు వచ్చింది. ఈ ఏడాది జనవరి చివరి వారంలో సీజన్ ప్రారంభమైంది. ఇప్పటి వరకు 5,00,985 క్వింటాళ్ల పసుపు నిజామాబాద్ మార్కెట్‌కు వచ్చింది. గత ఏడాది కంటే 1.50 లక్షల క్వింటాళ్లు అధికంగా పసుపు రానుందని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. ఈ నెలాఖరుకు మరో 2.25 లక్షల క్వింటాళ్లు, ఏప్రిల్‌లో 85 వేల క్వింటాళ్లు, మే నెలలో మరో 65 వేల క్వింటాళ్లు పసుపు ఇక్కడి మార్కెట్‌కు వస్తుందని అధికారుల అంచనా. మొత్తంగా మరో 3.65 లక్షల క్వింటాళ్లు రానున్నట్టు లెక్కలు వేస్తున్నారు. గత ఏడాది రాష్ట్రంలో సగటున ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది దుంపకుళ్లు సోకక పోవడంతో ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 35 వేల ఎకరాల్లో పసుపు సాగు చేయగా ఇందులో 19 వేల ఎకరాలు నిజామాబాద్ జిల్లా రైతులు సాగు చేశారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 45 వేల ఎకరాలు సాగు చేయగా, ఇందులో నిజామాబాద్ జిల్లా రైతులు 22 వేల ఎకరాలు పసుపు సాగు చేశారు.

> **నిరంతర పర్యవేక్షణ**
>
> పసుపు రైతులకు మేలు చేసేవిధంగా పసుపు ట్రేడింగ్ విషయమై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. క్వింటాల్‌కు రూ.10 వేల ధర తగ్గకుండా కటాఫ్ పెట్టాం. ఈ–నామ్ ద్వారా ఆన్‌లైన్ బిడ్డింగ్ విషయమై పక్కాగా వ్యవహరిస్తున్నాం. రైతులు 12 శాతం కంటే ఎక్కువ తేమ లేకుండా చూసుకోవాలి. తద్వారా ట్రేడర్లు తక్కువ ధరకు కోట్ చేయకుండా చూస్తాం.
>
> – ముప్ప గంగారెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్

క్లుప్తంగా...

ఉల్లాస్ కార్యక్రమానికి రూ.7.25 కోట్లు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రాయోజిత కార్యక్రమమైన ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అమలుకు ప్రభుత్వం రూ.7,25,88,000 నిధులను కేటాయించింది. ఈమేరకు గురువారం ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024–25లో ఓ త్రైమాసికానికి నిధులు విడుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. పాఠశాల విద్యకు దూరమైన 15 ఏళ్ల పైబడిన వయసు గలవారిలో చదవడం, రాయడంతో పాటు ప్రాథమిక లెక్కలతో పాటు డిజిటల్ లిటరసీని నేర్పిస్తారు. వయోజన విద్యలో భాగంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఇంటర్ విద్యలో పదోన్నతులకు కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ విద్యా మండలిలోని ఒకటి, రెండు స్థాయి గెజిటెడ్ అధికారుల పదోన్నతులకు కమిటీని ఏర్పాటు చేశారు. ఈమేరకు గురువారం ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీలో ఇంటర్ విద్య కమిషనర్ కన్వీనర్ మెంబర్‌గాను, పాఠశాల విద్య డైరెక్టర్, ఇన్‌చార్జ్ డిప్యూటీ కార్యదర్శి సభ్యులుగాను ఉంటారు. కమిటీ రెండేళ్ల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.

విధులకు హాజరవ్వని వైద్యులకు నోటీసులు

సాక్షి, అమరావతి: కొద్దినెలలుగా విధులకు హాజరవ్వని 170 మంది వైద్యులకు వైద్య శాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. వీరందరూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఆస్పత్రులకు చెందిన స్పెషలిస్ట్, సూపర్ స్పెషలిస్ట్ వైద్యులు. ప్రొఫెసర్, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్‌లు, ఇతర హోదాల్లో పనిచేస్తున్న వీరు విధులకు హాజరవ్వడం లేదు. ఈకారణంగా రోగుల వైద్య సేవల కల్పనపై ప్రతికూల ప్రభావం పడుతోంది.

ప్రాథమిక బడులను బలిచేయొద్దు

ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను రద్దు చేయవద్దని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (పీఎస్‌టీయూ) అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి , ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లోని 3–5 తరగతులను మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విలీనం చేయడం తగదని వారు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ఇప్పటికే 20 వేల ఉపాధ్యాయ పోస్టులు సర్‌ప్లస్ అయ్యాయని, తరగతుల తరలింపుతో ఇంకా ఎన్ని పోస్టులు సర్‌ప్లస్ అవుతాయోనని ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఇక డీఎస్సీ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు.

సచివాలయ ఉద్యోగులకు చేనేత వస్త్రాలపై 50 శాతం డిస్కౌంట్

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల కోసం చేనేత వస్త్రాల 50 శాతానికి డిస్కౌంట్ సేల్ ప్రారంభమైంది. వెలగపూడిలో రాష్ట్ర సచివాలయంలో మూడో బ్లాక్‌లో ఉన్న ఆప్కో షోరూమ్‌లో చేనేత వస్త్రాలపై 50 శాతం తగ్గింపు ధరల ప్రత్యేక కౌంటర్‌ను మంత్రి సవిత గురువారం ప్రారంభించారు. ఈ డిస్కౌంట్ విక్రయాలను ఈనెల 13 వరకు (గురు, శుక్ర, సోమవారాల్లో) ఉంటుందని, సచివాలయ ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి సవిత కోరారు. మరో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యే బండారు శ్రావణి చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు.

నల్లమల.. వన్యప్రాణుల ఖిల్లా



ప్రకృతి అందాలకు నల్లమల అటవీ ప్రాంతం ఆలవాలమైంది. ఎటు చూసినా ఆకాశాన్నంటే చెట్లు, బెబ్బులి గర్జనలు, నెమళ్ల నాట్యాలు, అరుదైన పక్షుల కిలకిలా రావాలు, అటు నుంచి ఇటు పరిగెత్తే జింకలు, సెలయేళ్లు, పర్యాటక ప్రదేశాలకు నల్లమల అటవీ ప్రాంతం నెలవుగా మారింది. ప్రతి ఏడాది మార్చి 3న ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. ప్రజలకు వణ్యప్రాణుల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు.


హనీ బజర్డ్ పక్షి

ప్రకృతి అందాలకు నిలయం నల్లమల

- అభయారణ్యంలో 87కు పైగా పెద్ద పులులు
- 400 కు పైగా చిరుతలు, దుప్పులు, జింకలు
- అరుదైన పక్షిజాతులు, వృక్ష సంపద
- నేడు వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం




మార్కాపురం: నల్లమల అటవీ ప్రాంతం ప్రకాశం, గుంటూరు, కర్నూలు జిల్లాల పరిధిలో సుమారు 6.50 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతంలో 87కు పైగా రాయల్ బెంగాల్ టైగర్లు, సుమారు 400 కు పైగా చిరుతలు తిరుగుతున్నాయి. వీటితోపాటు వందల సంఖ్యలో దుప్పులు, జింకలు, నీల్‌గాయ్‌లు, ఎలుగుబంట్లు ఉన్నాయి. వీటితోపాటు ఆకాశంలో 4 నుంచి 5 కిలో మీటర్ల ఎత్తులో తిరుగుతూ క్షణాల్లో భూమిమీద తిరిగే వన్యప్రాణులను తినే అరుదైన క్రస్టడ్ హాక్ ఈగల్ (నల్లపాముల గద్ద), షార్టు టోడోస్ స్నేక్‌ఈగల్, హనీబజర్, క్రస్టడ్ సర్పెంట్ ఈగల్‌లు సంచరిస్తున్నాయి. ఇక రష్యా నుంచి 8 వేల కిలోమీటర్లు ప్రయాణించి నల్లమలకు వచ్చే మాన్‌టిగ్యూష్ హేరియర్, పాలిడ్ హ్యారియర్ తదితర పక్షులకు కూడా నల్లమల ప్రాంతం నివాసంగా మారింది.

మార్కాపురానికి చుట్టుపక్కల నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పెద్దదోర్నాల, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, పెద్దారవీడు, అర్ధవీడు, గిద్దలూరు తదితర మండలాల్లో అటవీ సమీప గ్రామాలున్నాయి. పెద్దదోర్నాల మండలంలోని నల్లగుంట్ల, వై చర్లోపల్లి, తుమ్మలబైలు, శ్రీశైల శిఖరం, బొమ్మలాపురం, ఘాట్‌రోడ్డు, అర్ధవీడు మండలంలోని వెలగలపాయ, మాగుటూరు తాండ, గన్నెపల్లి, లక్ష్మీపురం, దొనకొండ, మార్కాపురం మండలం గొట్టిపడియ, పెద్దారవీడు మండలం గుండంచర్ల తదితర గ్రామాల సమీపాల్లోకి వన్యప్రాణులు తరచుగా వస్తుంటాయి. ముఖ్యంగా పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, నెమళ్లు సంచరిస్తున్నాయి. అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల సంరక్షణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు. పెద్దపులులు, చిరుతలకు అడవిలోనే నీటి సమస్య లేకుండా సోలార్ సాసర్‌పిట్‌లు ఏర్పాటుచేసి అధికారులు నీటి సమస్య తీర్చారు. నల్లమల పరిధి పెరిగిపోతోంది. గతంలో ఏపీలోని ప్రకాశం, గుంటూరు, కర్నూల్, తెలంగాణలోని మహబూబ్‌నగర్, నల్గొండ తదితర జిల్లాలతో అనుసంధానంగా ఉండగా ఇప్పుడు శేషాచలం అడవులను కలుపుతూ ఎన్‌ఎస్‌టీఆర్ (నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు), శేషాచలం అడవులను కలిపి టైగర్ కారిడార్ ఏర్పాటైంది. నల్లమల అడవిలోని పెద్దపులులు కడప మీదుగా వనిపెంట, ఒంటిమిట్ట తదితర ప్రాంతాల్లో ఉన్న శేషచలం అడవుల్లో కూడా సంచరిస్తున్నాయి. దీంతో నల్లమల పరిధి 8 వేల చదరపు కిలోమీటర్ల నుంచి 16 వేల చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సుమారు 1000 మంది సిబ్బందిని, 85 బేస్ క్యాంపులను ఏర్పాటు చేశారు. పులుల సంరక్షణకు తీసుకునే చర్యల వలన పులుల సంఖ్య పెరగడం విశేషం.

ఆకట్టుకుంటున్న జంగిల్ సఫారీ..

దోర్నాల నుంచి శ్రీశైలం మధ్య అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీ పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జంగిల్ సఫారీని చూడొచ్చు. అటవీశాఖాధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో నల్లమల అటవీ ప్రాంతంలో సుమారు 25 కిలోమీటర్ల వరకూ ప్రయాణించవచ్చు. జింకలు, నెమళ్లు, పలురకాల పక్షిజాతులు కనిపిస్తాయి. ఇందులో పులికుంట వద్ద వ్యూ పాయింట్ వద్ద కాసేపు వాహనాన్ని ఆపుతారు. పెద్దపులులు, చిరుతలు ఇక్కడికి తరచుగా వచ్చి నీళ్లు తాగుతాయి. ఇక కొండ చిలువలు, పెద్ద పెద్ద చెట్లకు చుట్టుకుని కనిపిస్తాయి.





జంగిల్ సఫారీ అద్భుతం



నల్లమల అటవీ ప్రాంతంలో దోర్నాల నుంచి శ్రీశైలం మధ్యలో అటవీశాఖ వారు ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీ చాలా అద్భుతం. విజ్ఞానంతోపాటు వినోదాన్ని కూడా అందిస్తుంది. ప్రతి ఒక్కరూ సెలవు రోజుల్లో పిల్లలను తీసుకుని జంగిల్ సఫారీకి వెళితే అన్నీ రకాల వన్యప్రాణులను మనం చూడవచ్చు.

– జీఎల్ రమేష్‌బాబు, టీచర్ మార్కాపురం

ఆప్కాస్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి

- ప్రభుత్వ నిర్ణయంతో 1.20 లక్షల మంది ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది
- శాసన మండలిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీల ద్వారా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించాలని చూడటం సరైన పద్ధతి కాదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు విమర్శించారు. గురువారం శాసన మండలిలో చైర్మన్ 'స్పెషల్ మెన్షన్ (ప్రత్యేక ప్రస్తావన)'కు సభ్యులకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆప్కాస్ ద్వారా 1.20 లక్షల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారన్నారు. కానీ, ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీ ప్రతిపాదనతో ఈ ఉద్యోగులంతా ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఇప్పటివరకు వీరందరికీ నిబంధనల మేరకు నియమకాలు, జీతాల చెల్లింపులు, ఇతర పథకాలు అమలవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం కూడా ఆప్కాస్‌ను కొనసాగించి, మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు.

- రాష్ట్రంలో 74 వేల మంది ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సరైన విద్యను అందించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు కోరారు. అందుకోసం స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన టీచర్లను నియమించాలని సూచించారు. సీఎం మొదటి సంతకం చేసిన ఫైల్‌లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను కలిపి భర్తీ చేయాలన్నారు.
- గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాల జీవో నంబర్ 3ను సుప్రీం కోర్టు కొట్టేసిన నేపథ్యంలో గిరిజన యువత హక్కులను కాపాడేలా చట్టబద్ధంగా ప్రత్యామ్నాయం చూపించాలని ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి కోరారు. గిరిజన ఉన్నత పాఠశాలల్లో పండిట్ పీఈటీ పోస్టులను 100 శాతం ఉన్నతీకరించి అర్హత కలిగిన వారికి పదోన్నతులు ఇవ్వాలని అన్నారు.
- 2004 కంటే ముందు నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి కోరారు. కేంద్ర ప్రభుత్వం సైతం వీరికి పాత పెన్షన్ అమలు చేస్తోందన్నారు. ఏపీలో 11వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు పాత పెన్షన్ లో చేరేందుకు ఎదురు చూస్తున్నట్టు సభ దృష్టికి తీసుకొచ్చారు.

ఒక్కదానికీ సమాధానం రాలేదు..

ప్రత్యేక ప్రస్తావనలో సభ్యులు పలు అంశాలు లేవనెత్తినప్పటికీ, ఒక్క దానికి కూడా ప్రభుత్వం నుంచి జవాబు రావట్లేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వంకా రవీంద్ర అసహనం వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా ప్రతి సమావేశంలో స్పెషల్ మెన్షన్ ఇస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన కరువైందన్నారు. ఇకనైనా అవునో.. కాదో.. ఏదో ఒకటి సమాధానం చెప్పించాలని చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు.

మహిళల అదృశ్యంపై మౌనమేల పవన్?

- విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించవచ్చు కదా..
- డిప్యూటీ సీఎంకు సీపీఎం లేఖ
- మహిళల సమస్యలపై చర్చ కోసం ఒక రోజు అసెంబ్లీ నిర్వహించాలని సూచన

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారంటూ 2023 జూలైలో ప్రకటించిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్.. ఎన్నికల అనంతరం మౌనం దాల్చడం దురదృష్టకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్రానికి చెందిన మహిళలు, పిల్లలు అదృశ్యమైనట్టు ప్రకటించిన మీరు.. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి అయి కూడా విచారణ జరిపి వాస్తవాలను ఎందుకు వెల్లడించడం లేదంటూ ప్రశ్నించారు. కూటమి నేతల వాగ్దానాలను నమ్మి అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు మిమ్మల్ని గెలిపించారని.. ఈ నేపథ్యంలో వారి సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి ఒక రోజు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించి చర్చించాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ వాగ్దానాల అమలు, 2029 నుంచే మహిళా రిజర్వేషన్ల అమలు, మహిళల అదృశ్యంపై విచారణ వంటి అనేక అంశాలపై ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అసెంబ్లీ సెషన్ జరపాలని కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రాసిన లేఖను గురువారం ఆయన మీడియాకు విడుదల చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని, ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తామని, రూ.10 లక్షలు రుణం తీసుకున్న పొదుపు మహిళలకు జీరో వడ్డీ ఇస్తామని, తల్లికి వందనం, మూడు ఉచిత సిలిండర్లు.. తదితర పథకాలను అమలు ఎక్కడంటూ శ్రీనివాసరావు ప్రశ్నించారు.

ఏడాదికోసారి విద్యుత్ తనిఖీ తప్పనిసరి

- ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల ద్వారా ధ్రువీకరణ పత్రాలు జారీ
- ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ రూల్స్, 2025 విడుదల

సాక్షి, అమరావతి: పరిశ్రమలు, సంస్థల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థను పూర్తి చేసిన తరువాత ఏడాదికోసారి ఖచ్చితంగా కాంట్రాక్టర్ తనిఖీ చేయాలి. అన్నీ బాగుంటే, ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి. మూడో వ్యక్తి (థర్డ్ పార్టీ) ద్వారా కూడా తనిఖీలు నిర్వహించాలి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ రూల్స్, 2025ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. డైరెక్టర్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ సేఫ్టీ, చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ నుంచి ప్రభుత్వానికి వచ్చిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. వాటి ప్రకారం..

- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా అంతర్గత, బాహ్య విద్యుత్ ఇన్‌స్టాలేషన్ పనులు ప్రొఫెషనల్, లేదా కంపెనీ ద్వారా నిర్వహించాల్సిందే.
- ఈ కంపెనీ, 'ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ రూల్స్, 2025' ప్రకారం ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల లైసెన్స్ పొందాలి. – విద్యార్హత, అనుభవం ఉన్న ఒక సూపర్‌వైజర్‌ను, ఇద్దరు వైర్‌మెన్లను నియమించుకోవాలి.
- సూపర్‌వైజర్‌కు గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూషన్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ, కనీసం ఒక సంవత్సరం అనుభవం ఉండాలి. లేదంటే గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూషన్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా, కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.
- వైర్‌మెన్లకు వైర్‌మెన్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో గుర్తింపు పొందిన సంస్థ లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణత పొందాలి.
- సూపర్‌వైజర్, వైర్‌మెన్ తప్పనిసరిగా 'ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ రూల్స్, 2025' కింద ఏర్పాటైన సబ్–కమిటీ నిర్వహించే ఇంటర్వ్యూలో ఉత్తీర్ణులు కావాలి.

ప్రజా సంక్షేమానికి తూట్లు పొడుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

హామీల అమలు కోసం పోరాటం చేయాలని సీపీఎం నిర్ణయం


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య, నాయకులు

నరసరావుపేట: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం నింపి పోరాటాలకు సిద్ధం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. గురువారం పల్నాడు జిల్లా కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ మోదీ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు రెండు కోట్ల ఉద్యోగాలు, పంటకు కనీస మద్దతు ధర, రైతు ఆదాయం రెట్టింపు అంటూ హామీలు గుప్పించారని, నేడు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని అన్నారు. బీజేపీలో భాగమైన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అంటూ విస్తృతంగా ప్రచారం చేసి తీరా అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయలేక పోతున్నామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. మిర్చికి కనీస మద్దతు ధర రూ. 25 వేలు ప్రకటించాలని, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, కేరళ తరహా ఋణ పాలసీ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యతోనే మహిళల అభివృద్ధి

మంత్రులు సంధ్యారాణి, సవిత, అనిత, నిమ్మల పిలుపు

సాక్షి, అమరావతి: విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆడబిడ్డల చదువును ప్రోత్సహించాలని రాష్ట్ర మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, ఎస్.సవిత, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ ఆడబిడ్డలపై ఆంక్షలు పెట్టకుండా మగపిల్లలతో సమానంగా పెంచాలని పిలుపునిచ్చారు. ఉద్యోగం చేసే చోట వేధింపులు, అవమానాలు ఎదురైతే తక్షణమే తమకు ఫిర్యాదు చేయాలని, తగిన న్యాయం చేస్తామని చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ వారంలో ఒక రోజు ఇంట్లో, విధుల్లోనూ చేనేత వస్త్రాలు ధరించి చేనేత కార్మికులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కె.వైదురీదేవి, ఉపాధ్యక్షురాలు ఎం.లక్ష్మణకుమారి, కార్యదర్శి సుస్మితతోపాటు పలు శాఖల ఉద్యోగినులు పాల్గొన్నారు.

మీడియా పాయింట్

ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించడం లేదు

సాక్షి, అమరావతి: కూటమి అధికారంలోకి వచ్చాక వైద్య, ఆరోగ్య రంగానికి అన్ని రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలోనే తక్కువగా నిధులు కేటాయిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైద్య, ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో 6.4శాతం ఖర్చు పెట్టింది. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో 6.2శాతమే కేటాయించింది. అయినా ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించడం లేదు. దీనివల్ల నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్య తగ్గిపోతోంది. పేదలకు ఉచిత వైద్యం అందడం లేదు. ఈఎస్ఐ ఆస్పత్రులు కూడా తక్కువగా ఉండటం వల్ల కార్మికులు సక్రమంగా వైద్యసేవలు పొందలేకపోతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక జాతీయ రహదారుల వెంబడి లిక్కర్ షాపులు పెట్టడం, వాటిలో సిట్టింగ్ ఏర్పాటు చేయడం వల్ల విశృంఖలత్వం పెరిగిపోతోంది.

– వంకా రవీంద్రనాథ్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 63,285 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,829 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.11 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

శాస్త్రోక్తంగా శాంతి అభిషేకాలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ఏకాంత సేవతో ముగిశాయి. గురువారం పంచమూర్తులు, పరివార దేవతలకు శాంతి అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబతో పాటు వినాయక స్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యా స్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప, త్రిశూలం, పరివార దేవతల ఉత్సవమూర్తులకు వేదపండితులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యా సమాచారం

ఎస్వీయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పద్మావతి



తిరుపతి సిటీ: ఎస్వీయూ సైన్స్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పద్మావతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు 31 ఏళ్ల బోధన, పరిశోధన రంగాలలో విశేష అనుభవం ఉంది. ఆమెను వర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



చిట్టమూరు : తిరుపతి జిల్లా చిట్టమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న పిడుగు భరత్ మహీపతి ప్రపంచ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మీనాకుమారి గురువారం తెలిపారు. ఈనెల 4 నుంచి బెంగళూరులోని కంఠీరవ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన 43వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలలో పాల్గొని హ్యామర్ త్రో విభాగంలో వెండి పథకం సాధించినట్టు వెల్లడించారు. అలాగే మేలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగే ప్రపంచ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలలో భారత దేశం తరపున పాల్గొననున్నట్టు వివరించారు. భరత్ మహీపతిని ఉపాధ్యాయులు, ప్రజలు అభినంధించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం



నెల్లూరు సిటీ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం గ్రామంలో గొట్టేటి మురళి (48) భార్య సలోమి, కుమారుడు, కుమార్తెతో కలిసి జీవిస్తున్నాడు. మురళి గతంలో ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఇటీవల కూలి పనులకు వెళ్తున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్, కోడి పందేలు ఆడడంతో కొంతమేర డబ్బులు పోగొట్టుకున్నాడు. ఒకవైపు అప్పులు, మరోవైపు కుటుంబ పోషణ కష్టం కావడంతో మానసికంగా కుంగిపోయాడు. ఇంటి వద్ద గడ్డి మందు తాగడంతో స్థానికులు గమనించి హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

సాక్షి సినిమా

సమ్మర్‌లో స్టూడెంట్స్ సెలవులు తీసుకుంటారు.
కానీ సిల్వర్ స్క్రీన్ స్టార్స్ కొందరు స్టూడెంట్స్‌గా కాలేజీలకు వెళ్తున్నారు.
మరికొందరు పర్ఫెక్ట్ వేసవిలో వెళ్తామంటున్నారు.
ఇలా వేసవిలో కాలేజీలకు వెళ్తున్న ఆ సమ్మర్ స్టూడెంట్స్ (నటీనటులు) డీటైల్స్ ఏంటో ఓ లుక్ వేయండి.

సమ్మర్‌లో కాలేజీలో

సాగర్ ప్రేమ

క్యారెక్టర్‌కు తగ్గట్లుగా భలే మౌల్డ్ అవుతుంటారు హీరో రామ్. తన లేటెస్ట్ మూవీ కోసం రామ్ మరోసారి కాలేజీ కుర్రాడిగా మారిపోయారు. 'మిస్ శెట్టి... మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ దర్శకుడు పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో రామ్ హీరోగా ఓ పీరియాడికల్ లవ్‌స్టోరీ మూవీ రూపొందుతోంది. ఈ చిత్రంలోనే కాలేజీ స్టూడెంట్ సాగర్ పాత్రలో నటిస్తున్నారు రామ్. సాగర్ ప్రేయసి మహాలక్ష్మిగా భాగ్యశ్రీ భోర్సే నటిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. హైదరాబాద్‌లో చిత్రీకరణను పూర్తి చేసిన యూనిట్ కొత్త షెడ్యూల్ చిత్రీకరణను ఇటీవల రాజమహేంద్రవరంలో ప్రారంభించింది. కాగా ఇది కాలేజీ లవ్‌స్టోరీ మూవీగా ఉంటుందని తెలిసింది. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఇక గతంలో 'దేవదాసు, రెడీ, కందిరీగ' వంటి సినిమాల్లో రామ్ కాలేజీ కుర్రాడిగా నటించిన సంగతి తెలిసిందే.


● రామ్


● శింబు


స్టూడెంట్ లీడర్

'అడివి రాముడు, మున్నా, మిర్చి' వంటి చిత్రాల కోసం కాలేజీ క్యాంపస్‌కు వెళ్లారు హీరో ప్రభాస్. కొంత గ్యాప్ తర్వాత ప్రభాస్‌ను దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాలేజీ క్యాంపస్‌కు తీసుకెళ్లనున్నారట. ప్రభాస్ హీరోగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ వేసవిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ సినిమాలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించనున్నారు. అయితే ప్రభాస్ క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని, కథలో భాగంగా ఈ హీరో స్టూడెంట్ లీడర్‌గా, ఆ తర్వాత ప్రొఫెసర్‌గా కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. గతంలో సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'అర్జున్ రెడ్డి, యానిమల్' సినిమాల్లో కాలేజీ సన్నివేశాలు ఉన్న సంగతి తెలిసిందే. దీంతో 'స్పిరిట్' సినిమాలోనూ కాలేజ్ సన్నివేశాలు ఉండే అవకాశాలు ఉన్నాయనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. టీ సిరీస్ భూషణ్ కుమార్, భద్రకాళి పిక్చర్స్ ప్రణయ్ రెడ్డి ఈ సినిమాను నిర్మించనున్నారు. 2026 చివర్లో ఈ సినిమా రిలీజ్ అయ్యే చాన్సెస్ ఉన్నాయి.


● ప్రభాస్

మోస్ట్ వయొలెంట్ స్టూడెంట్

జనరల్‌గా పుస్తకాల్లో పెన్నులు పెట్టుకుంటారు స్టూడెంట్స్. కానీ ఓ స్టూడెంట్ మాత్రం బుక్‌లో నెత్తురు అంటిన ఓ కత్తిని పెట్టుకున్నాడు. మరి... ఈ మోస్ట్ వయొలెంట్ స్టూడెంట్ గురించిన పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే థియేటర్స్‌కు వెళ్లాల్సిందే. సిల్వర్ స్క్రీన్‌పై వయొలెంట్‌గా కనిపించనున్న ఈ స్టూడెంట్ ఎవరో కాదు... శింబు. ఆయన హీరోగా రాజ్‌కుమార్ బాలకృష్ణన్ దర్శకత్వంలో ఓ కాలేజీ బ్యాక్‌డ్రాప్ మూవీ రూపొందుతోంది. శింబు కెరీర్‌లోని ఈ 49వ సినిమా చిత్రీకరణ ఆల్రెడీ ప్రారంభమైంది. డ్వాన్ పిక్చర్స్ ఈ మూవీని నిర్మిస్తోంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు మేకర్స్ సాయి పల్లవిని అప్రోచ్ అయ్యారని, మరో కీలక పాత్రకు సంతానంతో సంప్రదింపులు జరుపుతున్నారని కోలీవుడ్ సమాచారం. ఇక శింబు కెరీర్‌లోని 'మన్మథన్' (తెలుగులో 'మన్మథ'గా అనువాదమైంది), 'వల్లవన్' (తెలుగులో 'వల్లభ'గా అనువాదమైంది) చిత్రాల్లో కాలేజీ నేపథ్యం ఉంటుంది. ఈ రెండు చిత్రాలూ హిట్స్‌గా నిలిచాయి. ఇలా కొంతకాలం తర్వాత శింబు మళ్లీ కాలేజీ నేపథ్యంలో ఉన్న మూవీ చేస్తుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో అంచనాలు ఉన్నాయి.


● శివ కార్తికేయన్

స్టూడెంట్ లవ్‌స్టోరీ

హీరోయిన్ రష్మికా మందన్నా తొలిసారి నటిస్తున్న ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'ది గర్ల్ ఫ్రెండ్'. ఓ అమ్మాయి కొత్తగా కాలేజీలో జాయిన్ కావడం, ఆ తర్వాత ఆ అమ్మాయి వద్దనుకుంటూనే ప్రేమలో పడటం, ఆ ప్రేమ సంఘర్షణతో మానసికంగా ఇబ్బందులు పడటం... వంటి అంశాలతో ఈ మూవీ ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలోనే కాలేజీ అమ్మాయిగా నటిస్తున్నారు రష్మికా మందన్నా. కన్నడ నటుడు దీక్షిత్ శెట్టి ఈ మూవీలో మరో లీడ్ రోల్ చేస్తున్నారు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసమే రష్మికా మందన్నా కాలేజీకి వెళ్తున్నారు.

సైన్యమై కదలిరా...

'సైన్యమై కదలిరా... పెను సైన్యమై కదలిరా...!' అంటూ స్టూడెంట్స్‌కు పిలుపునిచ్చారు హీరో శివ కార్తికేయన్. 'పరాశక్తి' సినిమా కోసమే శివ కార్తికేయన్ ఈ పిలుపునిచ్చారు. 'గురు, ఆకాశం నీ హద్దురా!' వంటి సినిమాలను తీసిన సుధ కొంగర దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా 'పరాశక్తి' అనే సినిమా రానుంది. ఈ పీరియాడికల్ స్టూడెంట్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్‌లో అథర్వ, శ్రీలీల, రవిమోహన్ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా కాలేజ్ నేపథ్యంలో ఉంటుంది. కాలేజీ లీడర్‌గా శివ కార్తికేయన్ నటిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఆకాశ్ భాస్కరన్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఇక 'పరాశక్తి' శివ కార్తికేయన్ కెరీర్‌లో 25వ చిత్రం కాగా, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్‌కు 100వ చిత్రం కావడం విశేషం. అలాగే టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా రాణిస్తున్న శ్రీలీలకు ఇది తమిళంలో తొలి చిత్రం. 'పరాశక్తి' సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకున్నారు. ఇక గతంలో 'డాన్' అనే కాలేజీ బ్యాక్‌డ్రాప్ మూవీతో బ్లాక్‌బస్టర్ హిట్ సాధించారు శివ కార్తికేయన్. ఈ సినిమా తెలుగులో కూడా అనువాదమై హిట్‌గా నిలిచింది. దీంతో శివ కార్తికేయన్ చేస్తున్న 'పరాశక్తి' సినిమాపై తమిళ ఇండస్ట్రీలో అంచనాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే... ఈ సినిమాను తొలుత హీరో సూర్య చేయాల్సింది. సూర్య, సుధ కొంగరల మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ రావడంతో శివకార్తికేయన్ హీరోగా ఈ సినిమా రూపొందుతోంది.


● నయనతార

డియర్ స్టూడెంట్స్

'డియర్ స్టూడెంట్స్' అంటున్నారు నయనతార. మలయాళ నటుడు నివిన్ పౌలి హీరోగా నటిస్తున్న కాలేజీ డ్రామా ఫిల్మ్ 'డియర్ స్టూడెంట్స్'. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాలేజీ క్యాంపస్ డ్రామా ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో నయనతార ముందు స్టూడెంట్‌గా, ఆ తర్వాత కాలేజీ లెక్చరర్‌గా కనిపించనున్నారట. సందీప్ కుమార్, జార్జ్ ఫిలిప్ రాయ్ ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. నివిన్ పౌలి నిర్మిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ ఏడాదే థియేటర్స్‌లోకి వచ్చే అవకాశం ఉంది. ఇక శింబు హీరోగా చేసిన 'వల్లభ' సినిమాలో కాలేజీ లెక్చరర్‌గా నటించారు నయనతార. అలాగే నయనతార తన 75వ చిత్రం 'అన్నపూర్ణి'లోని మేజర్ సీన్స్‌లో కాలేజీ స్టూడెంట్‌లా నటించిన సంగతి తెలిసిందే.

ఈ తరహాలో ఈ సమ్మర్ సమయంలో కాలేజీ బ్యాక్‌డ్రాప్ సినిమాల కోసం షూటింగ్‌కు వెళ్లనున్న మరికొందరు తారలు ఉన్నారు.

- ముసిమి శివాంజనేయులు



కాలేజీ మ్యాజిక్

కళాశాల ఫెస్ట్ కోసం సొంతంగా ఓ పాటను స్వరపరిచేందుకు నలుగురు యువతీ యువకుల జీవితంలో సాగిన భావోద్వేగ ప్రయాణం ఇతివృత్తంగా 'మ్యాజిక్' అనే మూవీ రూపొందుతోంది. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా కాలేజీ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. సారా అర్జున్, అన్మోల్ కజాని, ఆకాశ్ శ్రీనివాస్, సిద్ధార్థ్ తణుకు ప్రధాన పాత్రల్లో గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతున్న మ్యూజికల్ డ్రామా 'మ్యాజిక్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నలుగురు కాలేజ్ స్టూడెంట్స్ ఓ సాంగ్ కోసం ఏం చేశారనే అంశాలు సినిమాలో ఆసక్తికరంగా ఉంటాయట. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌పై స్పష్టత రానుంది.




● జాన్వీకపూర్

సెట్స్‌లో సెలబ్రేషన్స్

జాన్వీ కపూర్ పుట్టినరోజు(మార్చి 6) సెలబ్రేషన్స్ 'ఆర్‌సీ 16'(వర్కింగ్ టైటిల్) సెట్స్‌లో జరిగినట్లు తెలుస్తోంది. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఈ మూవీ రూపొందుతోంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రామ్‌చరణ్, జాన్వీ కపూర్‌తో పాటు ఇతర ముఖ్య తారాగణం పాల్గొంటుండగా, కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ షూటింగ్ షెడ్యూల్ 12 రోజుల పాటు జరుగుతుంది. కాగా ఈ సినిమా తొలి షూటింగ్ షెడ్యూల్ మైసూర్‌లో ప్రారంభమైనప్పుడు ఈ సినిమా సెట్స్‌లో జాన్వీ కపూర్ పాల్గొన్నారు. మళ్లీ ఇప్పుడు ఈ సినిమా సెట్స్‌లో పాల్గొంటున్నారు. గురువారం జాన్వీ కపూర్ బర్త్ డే. సో... సెట్స్‌లో ఈ బ్యూటీ బర్త్ డే సెలబ్రేషన్స్ కూడా జరిగి ఉంటాయని ఊహించవచ్చు. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సంస్థల సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్స్ చేస్తున్నారు.

యాక్షన్ సీక్వెన్స్‌లు ఎంత కష్టమో తెలిసింది

- దివ్య భారతి

జీవీ ప్రకాశ్‌కుమార్, దివ్య భారతి హీరో హీరోయిన్లుగా నటించిన అడ్వెంచర్ థ్రిల్లర్ మూవీ 'కింగ్‌స్టన్'. ప్యారలల్ యూనివర్స్ పిక్చర్స్, జీ స్టూడియోస్ పతాకాలపై జీవీ ప్రకాశ్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో నేడు (శుక్రవారం) విడుదల అవుతోంది. గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత మహేశ్వర్ రెడ్డి ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం దివ్య భారతి మాట్లాడుతూ– ''బ్యాచిలర్' (2021) మూవీ తర్వాత జీవీ ప్రకాశ్‌గారు, నేను మళ్లీ 'కింగ్‌స్టన్' సినిమాలో కలిసి నటించాం. అయితే 'కింగ్‌స్టన్' పూర్తి భిన్నమైన చిత్రం. ఇందులో నేను పల్లెటూరి అమ్మాయిగా నటించాను. చేపలు పట్టడం ఓ ఊరి ప్రజల జీవనాధారం. కానీ సముద్ర తీరంలోని ఈ ఊరి మత్స్యకారులందరూ చేపల వేటకు వెళ్లడం మానేస్తారు? వాళ్లకు ఉన్న శాపం ఏమిటి? ఆ ఊరి కోసం హీరో హీరోయిన్లు ఏం చేశారు? అన్నది 'కింగ్‌స్టన్' సినిమా చూసి, తెలుసుకోవాలి. ఈ సినిమా కోసం జీవీ ప్రకాశ్‌గారు చాలా కష్టపడ్డారు. ఆయన తొలిసారి నిర్మాతగా ఉన్న ఈ సినిమాలో నటించినందుకు సంతోషంగా ఉంది. ఇక ఈ మూవీలో హీరోతో పాటు నాకూ యాక్షన్ సీన్స్ ఉన్నాయి. తొలిసారిగా యాక్షన్ సీక్వెన్స్‌లు చేశాను. యాక్షన్ సీక్వెన్స్‌లు ఎంత కష్టమో నాకు తెలిసింది. అయితే యాక్షన్ సీక్వెన్స్ చేసే ముందు నేను కాస్త ప్రిపేర్ అయ్యాను. గాయాలు కాలేదు. ప్రస్తుతం తమిళంలో రెండు సినిమాలు చేస్తున్నాను. తెలుగులో 'సుడిగాలి' సుధీర్‌తో 'ది గోట్' మూవీ చేస్తున్నాను. మరో రెండు తెలుగు ప్రాజెక్ట్స్ చర్చల దశల్లో ఉన్నాయి'' అని అన్నారు.


● దివ్యభారతి

అది దా సర్‌ప్రైజు

హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. కాగా ఈ సినిమాలోని 'అది దా సర్‌ప్రైజు' అనే స్పెషల్ సాంగ్‌లో హీరోయిన్ కేతికా శర్మ అదిరిపోయే స్టెప్పులేశారు. ఈ పాటను ఈ నెల 10న రిలీజ్ చేయనున్నట్లుగా గురువారం మేకర్స్ వెల్లడించారు. ఈ పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. చంద్రబోస్ సాహిత్యం అందించారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించారు. ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఇదిలా ఉంటే... హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో వచ్చిన తొలి మూవీ 'భీష్మ' సూపర్‌హిట్ సాధించింది. దీంతో వీరి కాంబినేషన్‌లోనే వస్తున్న 'రాబిన్‌హుడ్'పై అంచనాలు ఉన్నాయి.


● కేతికాశర్మ

బిజినెస్ రీల్

30 రోజుల్లోగా నిధుల వినియోగం

ఏఎంసీలకు తప్పనిసరి చేసిన సెబీ



న్యూఢిల్లీ: ఇకపై అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ)లు తప్పనిసరిగా కొత్త ఫండ్ పథకం(ఎన్‌ఎఫ్‌వో) నిధుల ను 30 రోజుల్లోగా వినియోగించవలసి ఉంటుంది. 2025 ఏప్రిల్ 1నుంచి అమల్లోకి వచ్చే విధంగా ఇందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశాలు జారీ చేసింది. వెరసి ఏఎంసీలు ఎన్‌ఎఫ్‌వోలో భాగంగా సమీకరించిన నిధుల ను సంబంధిత పెట్టుబడుల కోసం 30 రోజుల్లోగా వెచ్చించవలసి ఉంటుంది. సెబీ తాజా స ర్క్యులర్ ప్రకారం ఇన్వెస్టర్లకు యూనిట్ల కేటాయింపు తదుపరి గడువు అమల్లోకి రానుంది. దీంతో మ్యూచువల్ ఫండ్ పథకాలలో తప్పుడు విక్రయాలకు తావివ్వకుండా సెబీ చెక్ పెట్టనుంది. పథకం సమాచార పత్రా(ఎస్ఐడీ)లలో ఏ ఎంసీలు నిధుల వినియోగ గడువు, కేటాయింపు తదితరాలను వెల్లడించవలసి ఉంటుంది. ఒకవేళ 30 పనిదినాల్లోగా నిధుల వినియోగాన్ని చేపట్టలేకపోతే.. కారణాలను వివరిస్తూ ఏఎంసీ ఇన్వెస్ట్‌మెంట్ కమిటీకి లేఖ ద్వారా వెల్లడించవలసి ఉంటుంది. తద్వారా కమిటీ మరో 30 రోజుల గడువును ఇచ్చేందుకు వీలుంటుంది.

2026లో చాయ్ పాయింట్ లిస్టింగ్

టీ, కాఫీ చైన్ తాజా ప్రణాళికలు



న్యూఢిల్లీ: టీ, కాఫీ చైన్.. చాయ్ పాయింట్ 2026 మే నెలకల్లా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యే ప్రణాళికల్లో ఉంది. ఈ అంశాన్ని ప్రతిరోజు సుమారు 9 లక్షల కప్పుల టీ, కాఫీ విక్రయిస్తున్న సంస్థ సహవ్యవస్థాపకుడు తరుణ్ ఖన్నా తెలియజేశారు. అయి తే కుంభమేళాలో రోజుకి 10 లక్షలకంటే అధికంగా విక్రయించినట్లు తెలియజేశారు. ముంబైలో తమ విద్యార్థి అములీక్ సింగ్ బిజ్రాల్‌తో కలసి ఒక కేఫ్‌లో టీ తాగే సమయంలో 2009లో చాయ్ పాయింట్ ప్రారంభించే ఆలోచన వచ్చినట్లు హార్వార్డ్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఖన్నా వెల్లడించారు. ప్లాస్టిక్ కప్పులలో అంత శుభ్రతలేని విధంగా అందిస్తున్న చాయ్ స్థానే అత్యున్నత నాణ్యతతో, పరిశుభ్రంగా అందుబాటు ధరలో సువాసనలతో కూడిన చాయ్ అందించాలనే ఆలోచనతో చాయ్ పాయింట్‌కు తెరతీసినట్లు వివరించారు. దీంతో టీ అందించే వ్యక్తు(చోటూ)లకు ఉపాధిని సైతం కల్పించవచ్చని భావించినట్లు తెలియజేశారు. దీంతో 2010లో బెంగళూరులోని కోరమంగళలో తొలి ఔట్‌లెట్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అములీక్‌తో కలిసి ఐదుగురు ఉద్యోగులతో బిజినెస్‌ను మొదలుపెట్టినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రోజుకి 90 లక్షల కప్పుల టీ, కాఫీలను విక్రయిస్తున్నట్లు తెలియజేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-3-2025

విశాఖ	435–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425–00
విజయవాడ	410–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ASIANPAINT	2,267.00	4.75
COALINDIA	382.15	3.77
BPCL	264.96	3.56
HINDALCO	680.45	3.51
RELIANCE	1,211.50	3.05

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,501.90	-2.35
TRENT	5,048.90	-1.12
BEL	272.50	-0.88
BRITANNIA	4,690.00	-0.68
KOTAKBANK	1,920.15	-0.67

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,005
ఎన్ఎస్ఈ	94,950
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,80,468
ఎఫ్ఐఐ	- 2,377
డీఐఐ	+ 1,618

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	66	$ 66.31
బ్రెంట్	69	$ 69.30

వ్యక్తిగత బాధ్యతలే కెరీర్ పురోగతికి బ్రేక్!



- నాయకత్వ బాధ్యతలకు మహిళలు దూరం
- ప్రోత్సహించినా వెనకడుగు
- నౌకరి నివేదిక వెల్లడి
- నెలసరి సమయంలో సెలవుకు ప్రాధాన్యం

ముంబై: ఉద్యోగంతోపాటు, వ్యక్తిగత బాధ్యతలకు సమప్రాధాన్యం దృష్ట్యా మహిళలు కెరీర్‌లో నాయకత్వ బాధ్యతలకు దూరం అవుతున్నారు. నాయకత్వ బాధ్యతలు చేపట్టే విషయంలో తమకు తగినంత ప్రోత్సాహం ఉన్నప్పటికీ ఆ విషయంలో ముందడుగు వేయలేకపోతున్నట్లు నౌకరి సర్వేలో తెలిపారు. 'మహిళా నిపుణులు అసుల ఏమి కోరుకుంటున్నారు?' పేరుతో నౌకరీ సర్వే నివేదికను విడుదల చేసింది.

మహిళా ఉద్యోగులు ఏం చెబుతున్నారు?

- నాయకత్వ బాధ్యతల నిర్వహణ దిశగా తమకు ప్రోత్సాహం ఉందని 66 శాతం మంది తెలిపారు. అయినప్పటికీ 44 శాతం మంది మహిళలు ఈ బాధ్యతల నిర్వహణ పట్ల సుముఖంగా లేరు. ఉద్యోగం–వ్యక్తిగత జీవితానికి సమ ప్రాధాన్యం ఇవ్వడం కోసమే వారు నాయకత్వాన్ని వద్దనుకుంటున్నారు. ఈ బాధ్యతలు స్వీకరిస్తే కెరీర్ సాఫీగా సాగిపోకుండా, క్లిష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.
- అస్పష్టత, ప్రమోషన్లలో పక్షపాతం కారణాలతో 35 శాతం మంది, నాయకత్వానికి సంబంధించి పరిమిత కార్యక్రమాల నేపథ్యంలో 14% మంది, తమకు సరైన మార్గదర్శకులు లేరన్న కారణంతో 7 % మంది నాయకత్వ పాత్రను చేపట్టడానికి ముందుకు రావడం లేదు.
- 50 పట్టణాల నుంచి సుమారు 70వేల మంది మహిళల అభిప్రాయాలను నౌకరీ తన సర్వే కోసం స్వీకరించింది.
- పురుషులతో సమాన వేతనం కంటే కూడా నెలసరి సమయంలో సెలవుకు మహిళా ఉద్యోగుల ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉద్యోగంలో తమ మొదటి ప్రాధాన్యం దీనికేనని 34 శాతం మంది చెప్పారు. కొత్తగా కెరీర్ ఆరంభించిన మహిళల్లో సగం మంది ఈ విషయంలో చర్చించడానికి అవకాశం లేదన్నారు. 75 శాతం మంది తాము పనిచేసే చోట ఈ తరహా విధానాల్లేవని తెలిపారు.
- 2 ఏళ్లలోపు సర్వీసు ఉన్న నిపుణుల్లో 75 శాతం మంది నాయకత్వ బాధ్యతల్లో సమ ప్రాధాన్యం కోరుకుంటుంటే, మూడింట ఒక వంతు మంది సీనియర్లు (15 ఏళ్లకు పైగా సర్వీసు) వేతనాల్లో పారదర్శకత అవసరమని అంటున్నారు.
- మహిళలు కెరీర్‌లో మరింత ముందుకు వెళుతున్న కొద్దీ వేతనాల్లో అసమానతలు పెరుగుతున్నట్టు ఈ నివేదిక తెలిపింది. రూ.2–5 లక్షల మధ్య వేతనాలు అందుకుంటున్న వారిలో 11% మంది స్త్రీ–పురుష ఉద్యోగుల మధ్య వేతన వ్యత్యాసాన్ని గుర్తిస్తుంటే.. రూ.50 లక్షల నుంచి ఏడాదికి రూ.కోటి వరకు వేతనం అందుకుంటున్న వారిలో 26 శాతం మందికి అది అనుభవమవుతోంది.
- ముంబైలో 28%, బెంగళూరులో 27%, ఢిల్లీలో 24% చొప్పున వేతన వ్యత్యాసం ఉంది. అది కూడా బీఎఫ్ఎస్ఐ రంగంలో 28%, ఎఫ్ఎంసీజీ రంగంలో 27%, ఐటీలో 24% చొప్పున స్త్రీ–పురుష ఉద్యోగుల మధ్య వేతనాల్లో అంతరం ఉంది.

ఉద్యోగాలకు ముందుకొస్తున్న మహిళలు



- టైర్ 2, 3 పట్టణాల్లో బలమైన వృద్ధి
- నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ ఆప్నా వెల్లడి

ముంబై: ఉద్యోగ బాధ్యతలు చేపట్టేందుకు మరింత మంది మహిళలు ముందుకు వస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా 2021 నుంచి 2024 మధ్యకాలంలో టైర్-2, 3 ఇతర నాన్ మెట్రో పట్టణాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నట్టు ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ 'ఆప్నా డాట్ కో' వెల్లడించింది. ముఖ్యంగా టైర్-2, 3 పట్టణాల నుంచి మహిళా అభ్యర్థుల దరఖాస్తులు మూడు రెట్లు పెరిగినట్టు తెలిపింది. మెట్రోలకు వెలుపల ఉద్యోగాల్లో పెరుగుతున్న మహిళల భాగస్వామ్యాన్ని ఇది తెలియజేస్తున్నట్టు పేర్కొంది. పెరుగుతున్న ఉపాధి అవకాశాలు, డిజిటల్ అనుసంధానత, నియామకాల్లో వస్తున్న మార్పులు చిన్న పట్టణాల్లోనూ వివిధ రంగాల్లో మహిళల ప్రవేశానికి వీలు కల్పిస్తున్నట్టు తెలిపింది.

- టైర్-2, 3 పట్టణాల్లో సేల్స్, బిజినెస్ డెవలప్‌మెంట్, అడ్మిన్, బ్యాక్‌ఆఫీస్, కస్టమర్ సపోర్ట్‌లో మహిళలు ఎక్కువగా ఉపాధి పొందుతున్నారు. 55 శాతం మంది మహిళలు ఈ ఉద్యోగాల్లోనే చేరుతున్నారు.
- అంతేకాదు కఠిన పరిస్థితులు ఉండే క్షేత్రస్థాయి అమ్మకాలు, డెలివరీ, లాజిస్టిక్స్‌లోనూ కొందరు పనిచేసేందుకు సుముఖత చూపుతున్నారు.
- క్షేత్రస్థాయి విక్రయాల్లో ఉద్యోగానికి 6 లక్షలు, డెలివరీ, లాజిస్టిక్స్ ఉద్యోగాలకు 2.5 లక్షల దరఖాస్తులు, సెక్యూరిటీస్ సేవల ఉద్యోగాలకు 1.5 లక్షల దరఖాస్తులు 2021–2024 మధ్యకాలంలో వచ్చాయి.
- లక్నో, జైపూర్, ఇండోర్, భోపాల్, సూరత్, నాగ్‌పూర్, కోయింబత్తూర్ మహిళలకు ఉపాధి కేంద్రాలు. ఆప్నా ప్లాట్‌ఫామ్‌పై ఉద్యోగ దరఖాస్తుల్లో 45% ఇక్కడివే.

మహిళా పారిశ్రామిక వేత్తలకు సాధికారత

- నైపుణ్య కల్పన, మార్గదర్శక సాయం
- నీతి ఆయోగ్, ఎస్ఎంఈ ఫోరమ్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ: మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత కోసం ఎస్ఎంఈ ఫోరమ్, నీతి ఆయోగ్ సంయుక్తంగా 'ఏ మిలియన్ ఉమెన్ అరైజ్' పేరుతో కార్యక్రమాన్ని చేపట్టాయి. దేశవ్యాప్తంగా 6 కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) సంస్థలు ఉంటే, అందులో 35 శాతం మహిళల నిర్వహణలోనివేనని కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ డైరెక్టర్ అంకితా పాండే ఈ సందర్భంగా తెలిపారు. అయినప్పటికీ లింగపరమైన పక్షపాతం, మార్కెట్లో పరిమిత అవకాశాల వంటి వినూత్న సవాళ్లను వారు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. సంఘటితం చేయడం, మార్గదర్శకం, సామర్థ్య నిర్మాణం, ఈ–కామర్స్‌తో అనుసంధానం ద్వారా ఈ అంతరాలను పరిష్కరించేందుకు ఎంఎస్ఎంఈ శాఖ కట్టుబడి ఉన్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మహిళా వ్యాపారవేత్తలకు మద్దతుగా మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫామ్ (డబ్ల్యూఈపీ)ను ఏర్పాటు చేసినట్టు నీతి ఆయోగ్ డైరెక్టర్ అన్నారాయ్ తెలిపారు. మహిళ వ్యాపారవేత్తలకు రుణ సదుపాయం, నిబంధనలపరమైన మద్దతు, నైపుణ్య కల్పన, మార్గదర్శకం, నెట్‌వర్కింగ్ పరంగా సాయమందించనున్నట్టు చెప్పారు. నీతి ఆయోగ్ సహకారంతో డబ్ల్యూఈపీ కార్యక్రమాన్ని లక్షలాది మంది ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలకు చేరువ చేయగలమని ఇండియా ఎస్ఎంఈ ఫోరమ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ చెప్పారు. ఎంఎస్ఎంఈలకు మెరుగైన రవాణా పరిష్కారాలను అందించే లక్ష్యంతో ఎయిర్‌లైన్స్ సంస్థ ఇండిగోతో ఎస్ఎంఈ ఫోరమ్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఈ సందర్భంగా కుదుర్చుకుంది.

రెట్టింపు సంఖ్యలో మహిళలకు రుణాలు: సరళ్ ఎస్‌సీఎఫ్

బ్లాక్‌సాయిల్ క్యాపిటల్‌కు చెందిన ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ 'సరళ్ ఎస్‌సీఎఫ్' 2025లో రెట్టింపు మహిళా వ్యాపారవేత్తలకు సాయమందించాలనుకుంటోంది. ఇప్పటికే 150 మంది మహిళా వ్యాపారవేత్తలకు రూ.64 కోట్ల రుణాలను సమకూర్చినట్టు ప్రకటించింది. వృద్ధికి పెట్టుబడి, దీర్ఘకాల స్థిరత్వం దిశగా వారికి మద్దతుగా నిలుస్తున్నట్టు పేర్కొంది. 2024లో ఈ సంస్థ అంతక్రితం సంవత్సరంతో పోల్చితే 34 శాతం అధికంగా రూ.1,237 కోట్ల రుణాలను మంజూరు చేసినట్టు ప్రకటించింది.

భారత్‌లో టెస్లాకు అంత ఈజీ కాదు

జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చీఫ్ సజ్జన్ జిందాల్



న్యూఢిల్లీ: భారత్‌లో తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లాకు ఇక్కడి మార్కెట్‌పై పట్టు సాధించడం అంత సులువు కాదని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ వ్యాఖ్యానించారు. టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రాలాంటి దేశీ దిగ్గజాల తరహాలో అది రాణించలేకపోవచ్చని తెలిపారు. ఎర్న్‌స్ట్ అండ్ యంగ్ 'ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. "మస్క్ చాలా స్మార్ట్. అందులో సందేహం లేదు. ఆయన చాలా గొప్ప పనులు చేస్తున్నారు. కానీ ఆయన ఉన్నది అమెరికాలో, భారత్‌లో కాదు. ఇక్కడ విజయం సాధించాలంటే అంత సులభం కాదు. మహీంద్రా, టాటాల్లాగా ఆయన రాణించలేరు'' అని జిందాల్ పేర్కొన్నారు. ఈవీల దిగుమతులపై టారిఫ్‌ల తగ్గింపు అవకాశాలతో భారత మార్కెట్లో ప్రవేశించేందుకు టెస్లా సన్నాహాలు చేసుకుంటున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ కూడా ఈవీ సెగ్మెంట్లో అవకాశాలను అందిపుచ్చుకునే ప్రయత్నాల్లో ఉంది. చైనాకు చెందిన ఎస్ఏఐసీ కార్పొరేషన్‌తో ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ ఇండియా ఇటీవలే ఎలక్ట్రిక్, ప్లగ్–ఇన్ హైబ్రిడ్స్ మొదలైన పలు వాహనాలను ప్రదర్శించింది.

ఓలా ఎలక్ట్రిక్‌కి పీఎల్ఐ ప్రోత్సాహకాలు



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ సంస్థలకు సంబంధించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం (పీఎల్ఐ–ఆటో స్కీమ్) కింద రూ. 73.74 కోట్లు లభించినట్లు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ వెల్లడించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలపై ఈ మొత్తం మంజూరు అయినట్లు వివరించింది. దీంతో ఈ స్కీము కింద ప్రోత్సాహకాలు అందుకున్న తొలి టూ వీలర్ ఈవీగా నిల్చినట్లు ఓలా ఎలక్ట్రిక్ వివరించింది. ఓలా ప్రస్తుతం ఎలక్ట్రిక్ టూ వీలర్ సెగ్మెంట్లో 28 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉంది. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునే క్రమంలో దేశీయంగా ఆటోమోటివ్ రంగంలో తయారీని, పర్యావరణ అనుకూల మొబిలిటీ సొల్యూషన్స్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం 2021లో పీఎల్ఐ–ఆటో స్కీమ్‌ను ప్రకటించింది. అయిదేళ్ల వ్యవధి కోసం దీనికి రూ. 25,938 కోట్లు కేటాయించింది.

క్యాస్ట్రాల్ ఇండియాపై అరామ్‌కో కన్ను

- బీపీ నుంచి కొనుగోలు యోచన
- 13 శాతం దూసుకెళ్లిన షేరు



న్యూఢిల్లీ: గత నాలుగు రోజులుగా ర్యాలీ బాటలో సాగుతున్న లూబ్రికెంట్స్ తయారీ దిగ్గజం క్యాస్ట్రాల్ ఇండియా కౌంటర్‌కు మరోసారి డిమాండ్ పెరిగింది. దీంతో బీఎస్ఈలో షేరు 11 శాతం జంప్‌చేసి రూ. 246 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలోనూ 10 శాతం ఎగసి రూ. 245 వద్ద నిలిచింది. ఒక దశలో 13.4 శాతం దూసుకెళ్లి రూ. 252 వద్ద గరిష్టానికి చేరింది. ఎన్ఎస్ఈలో 7.39 కోట్ల షేర్లు, బీఎస్ఈలో 23.62 లక్షల షేర్లు ట్రేడయ్యాయి. బీపీ(గతంలో బ్రిటిష్ పెట్రోలియం)కు చెందిన లూబ్రికెంట్ బిజినెస్‌ను సౌదీ చమురు దిగ్గజం అరామ్‌కో కొనుగోలు చేయనున్నట్లు వెలువడిన వార్తలు షేరుపై సానుకూల ప్రభావం చూపుతున్నాయి. దీంతో వరుసగా నాలుగో రోజు క్యాస్ట్రాల్ ఇండియా బలపడింది.

10 బిలియన్ డాలర్లు..

క్యాస్ట్రాల్ బ్రాండుతో బీపీ.. లూబ్రికెంట్స్ విక్రయించే సంగతి తెలిసిందే. బీపీ ఇటీవల పునర్వ్యవస్థీకరణలో భాగంగా లూబ్రికెంట్స్ విభాగం విలువను దాదాపు 10 బిలియన్ డాలర్లుగా మదింపు చేసినట్లు తెలుస్తోంది! కాగా.. వాల్వోలైన్ లూబ్రికెంట్స్ యూనిట్‌తో క్యాస్ట్రాల్ ఆస్తులను జత చేసే యోచనలో అరామ్‌కో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. 2023లో 2.65 బిలియన్ డాలర్లకు వాల్వోలైన్‌ను అరామ్‌కో కొనుగోలు చేసింది. భారత్, చైనా, ఆగ్నేయ ఆసియాలో అదనపు రిఫైనింగ్, కెమికల్స్ బిజినెస్‌ల కొనుగోలుకి చూస్తున్నట్లు అరామ్‌కో గతేడాది పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో క్యాస్ట్రాల్ ఇండియా కొనుగోలుపై అంచనాలు పెరిగినట్లు నిపుణులు తెలియజేశారు.

ఇంటర్నెట్‌లాగే ఏఐతో కొత్త ఉద్యోగాలొస్తాయ్..

జోహో సీఈవో మణి వెంబు



బెంగళూరు: గతంలో ఇంటర్నెట్, సోషల్ మీడియాతో కొత్త కెరియర్లు వచ్చినట్లే కృత్రిమ మేధతో (ఏఐ) కూడా కొత్త ఉద్యోగాలు వస్తాయని జోహో సీఈవో మణి వెంబు తెలిపారు. ఏఐ సొల్యూషన్స్‌కి సంబంధించి పాశ్చాత్య దేశాలకు భారత్ గట్టి పోటీదారుగా ఎదగగలదని ధీమా వ్యక్తం చేశారు. పుష్కలంగా నిపుణుల లభిస్తుండటం, దేశీయంగా సొల్యూషన్స్ రూపొందించుకోవాలన్న ఆకాంక్షలు పెరుగుతుండటం ఇందుకు దోహదపడగలవని వెంబు చెప్పారు. ఏఐ కల్పించగలిగే అవకాశాలను విశాల దృక్పథంతో పరిశీలించి, తగు దిశలో ముందుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు. ఏఐ, కొత్త సాంకేతికతలను ఉపయోగించి తమ ప్రస్తుత సిబ్బంది ఉత్పాదకతను పెంచుకునే మార్గాలపై జోహో ప్రధానంగా దృష్టి పెడుతోందని వెంబు వివరించారు. మరోవైపు, అమెరికాలో విధానాలు, టారిఫ్‌లపరంగా చోటు చేసుకుంటున్న పరిణామాల ప్రభావాలను దేశీ ఐటీ పరిశ్రమ ఇప్పుడే అంచనా వేయలేదని, వేచి చూసే ధోరణిని పాటించాల్సి ఉంటుందని వెంబు చెప్పారు.

హిల్‌మ్యాన్ ల్యాబ్స్‌తో అరబిందో ఫార్మా ఒప్పందం రద్దు



న్యూఢిల్లీ: పిల్లల టీకాల్లో ఉపయోగించే పెంటావాలెంట్ వాక్సిన్ క్యాండిడేట్‌ను అభివృద్ధి చేసి, విక్రయించేందుకు సంబంధించి సింగపూర్ కంపెనీ హిల్‌మ్యాన్ ల్యాబరేటరీస్‌తో కుదుర్చుకున్న లైసెన్స్ ఒప్పందాన్ని తమ అనుబంధ సంస్థ ఆరో వాక్సిన్స్ రద్దు చేసుకున్నట్లు అరబిందో ఫార్మా తెలిపింది. ఇది ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నందున కంపెనీపై గానీ దాని అనుబంధ సంస్థలు లేదా ఆర్థికాంశాలపై గానీ గణనీయ ప్రభావమేమీ ఉండబోదని పేర్కొంది. ఆరో వాక్సిన్స్, హిల్‌మ్యాన్ ల్యాబ్స్ 2023 సెప్టెంబర్ 23న ఈ ఒప్పందం కుదుర్చుకున్నాయి.

వచ్చే ఏడాది రూ. 1,100 కోట్ల లాభం

ఓయో తాజా అంచనాలు



న్యూఢిల్లీ: రానున్న ఆర్థిక సంవత్సరం (2025–26)లో రూ. 1,100 కోట్ల నికర లాభం ఆర్జించగలమని ట్రావెల్ టెక్ స్టార్టప్ ఓయో అంచనా వేసింది. ఈ బాటలో రూ. 2,000 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) సాధించగలమని భావిస్తున్నట్లు యూనికార్న్ సంస్థ ఓయో వ్యవస్థాపకుడు రితేష్ అగర్వాల్ పేర్కొన్నారు. ఇందుకు ఆదాయంలో వృద్ధి దోహదపడగలదని అభిప్రాయపడ్డారు. ఇటీవల కొనుగోలు చేసిన మోటెల్ 6 తాజా అంచనాలకు దన్నుగా నిలవనున్నట్లు తెలియజేశారు. ఈ కాలంలో మోటెల్ 6 ఇబిటా రూ. 630 కోట్లకు చేరగలదని ఓయో ఊహిస్తోంది. ఓయో కొనుగోలు చేశాక తొలిసారి మోటెల్ 6 పూర్తి ఏడాది పనితీరును వెల్లడించనుంది. వెరసి ఓయో సంయుక్త ఇబిటా రూ. 2,,000 కోట్లను తాకనున్నట్లు సంబంధిత వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో ఓయో రూ. 166 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో నమోదైన రూ. 25 కోట్లతో పోలిస్తే నికర లాభం ఆరు రెట్లు ఎగసింది. వెరసి ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి 9 నెలల్లో(ఏప్రిల్–డిసెంబర్) రూ. 457 కోట్ల నికర లాభం ప్రకటించింది. గతేడాది ఇదే కాలంలో రూ. 111 కోట్ల నష్టం ప్రకటించింది.

విదేశీ చిన్న సంస్థలను ఆకట్టుకోవాలి

నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్ సుమన్ బెరీ



న్యూఢిల్లీ: ప్రపంచ దేశాల నుంచి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ(ఎంఎస్ఎమ్ఈ)లను ఆకట్టుకోవలసి ఉన్నట్లు నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్ సుమన్ బెరీ పేర్కొన్నారు. తద్వారా దేశీయంగా పోటీతత్వం పెరగడం, చిన్న, మధ్యతరహా సంస్థలు భారీ సరఫరా చైన్లతో సమీకృతంకావడం తదితరాలకు దారి ఏర్పడుతుందని తెలియజేశారు. దీంతో 7–8 శాతం ఆర్థిక పురోగతిని సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ఇతర దేశాల నుంచి ఎంఎస్ఎమ్ఈలను ఆకట్టుకోవడం ద్వారా దేశీ సంస్థలు పూర్తిస్థాయిలో పోటీతత్వాన్ని పెంపొందించుకోగలవని పరిశ్రమల సమాఖ్య సీఐఐ ఏర్పాటు చేసిన ఒక ఈవెంట్‌లో బెరీ వివరించారు. పెద్ద సంస్థలను ఆకట్టుకోవడంలో చైనా విజయవంతమైందని, ఆ దేశంతో పోటీ పడేందుకు భారత్ చాలా దూరం ప్రయాణించవలసి ఉంటుందని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాలుగా థాయ్‌లాండ్, జపాన్‌లలో ఆటో రంగం గ్లోబల్ వేల్యూ చైన్ ద్వారా సమీకృతమైనట్లు వివరించారు. వాణిజ్యం ద్వారా లాభపడటం, ఇన్నోవేషన్స్ పురోగతికి దోహదపడతాయని, అయితే వృద్ధిని కొనసాగించడం కష్టతరమని అభిప్రాయపడ్డారు. దేశీ కార్పొరేట్ రంగం ముందుకురావలసి ఉన్నదని, ఎంఎస్ఎమ్ఈలు భారీ సరఫరా చైన్లతో మమేకం కావలసి ఉన్నదని తెలియజేశారు. తద్వారా నిజమైన పోటీతత్వం పెరగడంతోపాటు.. 7–8 శాతం వృద్ధికి వీలుంటుందని వివరించారు.

డిపాజిట్లపై బీమా పెంచితే బ్యాంకులపై ప్రభావం

- లాభం రూ.12,000 కోట్లు తగ్గిపోవచ్చు
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా



ముంబై: డిపాజిట్లపై బీమా పరిమితిని రూ.5 లక్షలకు మించి పెంచితే అది బ్యాంకుల లాభదాయకతపై ప్రభావం చూపిస్తుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. దీనివల్ల సుమారు రూ.12,000 కోట్ల మేర లాభం తగ్గిపోవచ్చని అంచనా వేసింది. ప్రస్తుతం ఒక బ్యాంక్ పరిధిలో ఒక కస్టమర్ పేరిట రూ.5లక్షల బీమా సదుపాయాన్ని డీఐసీజీసీ అందిస్తోంది. ఇందుకు గాను బ్యాంక్‌లు డిపాజిట్ల మొత్తంపై డీఐసీజీసీకి ప్రీమియం చెల్లిస్తుంటాయి. రూ.5 లక్షలకు మించి పెంచే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్టు కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి నాగరాజు ఇటీవలే ప్రకటించడం గమనార్హం. ప్రభుత్వం ఆమోదం తెలిపితే, నోటిఫై చేస్తామని చెప్పారు. "ఇటీవల ఓ కోపరేటివ్ బ్యాంక్ (న్యూ ఇండియా కోపరేటివ్ బ్యాంక్) వైఫల్యం నేపథ్యంలో డిపాజిట్ ఇన్సూరెన్స్ పరిమితి పెంపు చర్చకు వచ్చింది. ఇది బ్యాంక్‌లపై స్వల్ప స్థాయిలోనే అయినా, చెప్పుకోతగ్గ మేర లాభదాయకతపై ప్రభావం చూపించనుంది''అని ఇక్రా ఫైనాన్షియల్ రంగం రేటింగ్స్ హెడ్ సచిన్ సచ్‌దేవ పేర్కొన్నారు. పంజాబ్ అండ్ మహారాష్ట్ర కోపరేటివ్ బ్యాంక్ వైఫల్యంతో చివరిగా 2020 ఫిబ్రవరిలో డిపాజిట్‌పై బీమాను రూ.లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచినట్టు గుర్తు చేశారు.

97.8 శాతం డిపాజిట్లకు రక్షణ

2024 మార్చి నాటికి 97.8 శాతం బ్యాంక్ ఖాతాలు బీమా రక్షణ పరిధిలో ఉన్నట్టు ఇక్రా తెలిపింది. ఈ ఖాతాల్లోని డిపాజిట్ల మొత్తం రూ.5లక్షల్లోపే ఉన్నట్టు పేర్కొంది. ఇన్సూర్డ్ డిపాజిట్ రేషియో (ఐడీఆర్) 43.1 శాతంగా ఉన్నట్టు తెలిపింది. ఈ ఐడీఆర్‌ను 47 శాతం నుంచి 66.5 శాతానికి తీసుకెళితే, అప్పుడు బ్యాంకుల నికర లాభం రూ.1,800 కోట్ల నుంచి రూ.12,000 కోట్ల మేర ప్రభావితమవుతుందని వివరించింది. దీంతో బ్యాంకుల రిటర్న్ ఆన్ అసెట్స్ (ఆర్‌వోఏ) 0.01–0.04 శాతం మేర, రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్‌వోఈ) 0.07–0.4 శాతం మేర ప్రభావితం కావొచ్చని అంచనా వేసింది.

టెన్నిస్ ప్లేయర్లకు 'మెటర్నిటీ లీవ్'

డబ్ల్యూటీఏ కొత్త ఆలోచన


బెలిండా బెన్‌చిచ్

రియాద్: మహిళా టెన్నిస్ క్రీడాకారిణుల కోసం ఉమెన్ టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యూటీఏ) కీలక ప్రతిపాదనతో ముందుకొచ్చింది. టూర్‌లో ఆడుతున్న ప్లేయర్ ఎవరైనా గర్భం ధరిస్తే 12 నెలల పాటు వారికి డబ్బులు చెల్లిస్తూ 'పెయిడ్ మెటర్నిటీ లీవ్' ఇవ్వాలని నిర్ణయించింది. సరొగసీ లేదా దత్తత తదితర కారణాలతో అమ్మగా మారితే వారికి 2 నెలల పాటు ఈ సౌకర్యం కల్పిస్తారు. సౌదీ అరేబియాకు చెందిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (పీఐఎఫ్) ఈ మొత్తాలను చెల్లించేందుకు సిద్ధమైంది. ఏడాది కాలంగా పీఐఎఫ్... డబ్ల్యూటీఏ స్పాన్సర్లలో ఒకరిగా వ్యవహరిస్తోంది. ఈ కొత్త పథకం ద్వారా కనీసం 300 మంది టెన్నిస్ ప్లేయర్లకు ప్రయోజనం కలగుతుందని డబ్ల్యూటీఏ సీఈఓ పోర్షియా వెల్లడించింది. మహిళల టెన్నిస్ చరిత్రలో ఇది కొత్త అధ్యాయమని పేర్కొన్న ఆమె... టెన్నిస్ ఆడుతూ అమ్మగా మారిన ప్లేయర్లు ఆటకు ఒక్కసారిగా దూరం కాకుండా మళ్లీ వచ్చి పాల్గొనేందుకు ఇది ఊతమిస్తుందని తెలిపింది. సెరెనా (అమెరికా), అజరెంకా (బెలారస్), వొజ్నియాకి (డెన్మార్క్), క్లియ్‌స్టర్స్ (బెల్జియం), బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్), ఒసాకా (జపాన్) వంటి స్టార్లు తల్లిగా మారిన తర్వాత తిరిగొచ్చి టైటిల్స్ గెలిచారు. పిల్లలకు అమ్మలైన తర్వాత తిరిగొచ్చి ఆడుతున్న వారు ప్రస్తుతం 25 మందికి పైగా ప్లేయర్లు ఉన్నారు.


విలియమ్సన్

'పిచ్‌పై భారత్‌కు స్పష్టత ఉంది'

ఫైనల్ పోరుపై న్యూజిలాండ్ స్టార్ విలియమ్సన్ వ్యాఖ్య

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో అన్ని మ్యాచ్‌లు ఒకే వేదికపై, ఒకే మైదానంలో ఆడుతూ, కనీసం ప్రయాణం చేసే అవసరం కూడా లేకుండా భారత్‌కు అన్ని అనుకూలతలు ఉన్నాయని వస్తున్న విమర్శల్లో మరో కీలక ఆటగాడు గొంతు కలిపాడు. టీమిండియాతో ఆదివారం జరిగే తుది పోరుకు ముందు కివీస్ టాప్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ పరోక్షంగా ఇదే విషయంపై మాట్లాడాడు. దుబాయ్‌లో పరిస్థితులపై భారత్‌కు మంచి అవగాహన ఉంది కదా అనే ప్రశ్నకు సమాధానమిస్తూ... 'దుబాయ్‌లో ఎలాంటి వ్యూహాలు పని చేస్తాయో భారత్‌కు బాగా తెలుసు. అన్ని మ్యాచ్‌లు ఒకే చోట ఆడిన జట్టుకు అక్కడి పరిస్థితులు, పిచ్ ఎలా స్పందిస్తుందో అవగాహన ఉంటుంది కదా. కానీ షెడ్యూల్ అలా ఉంది కాబట్టి ఏమీ చేయలేం. ఇతర అంశాల ప్రభావం ఉన్నా సరే... మేం ఫైనల్‌పైనే పూర్తిగా దృష్టి పెట్టాం. లాహోర్‌లో ఆడిన వాటితో పోలిస్తే అక్కడి పరిస్థితులు భిన్నం. మేమూ ఒక మ్యాచ్ దుబాయ్‌లో ఆడాం. ఫైనల్ కోసం అందుబాటులో ఉన్న సమయాన్ని వాడుకొని సన్నద్ధమవుతాం. భారత్ చేతిలో ఓడిన గత లీగ్ మ్యాచ్ నుంచి పాఠాలు నేర్చుకుంటాం' అని విలియమ్సన్ అన్నాడు. మరోవైపు కివీస్ కెప్టెన్ మైకేల్ సాంట్నర్ కాస్త భిన్నంగా స్పందించాడు. విభిన్న పరిస్థితుల్లో ఆడాల్సి రావడం అంతర్జాతీయ క్రికెట్ స్వభావమని, టోర్నీ షెడ్యూల్‌ను నిర్ణయించేది తాను కాదన్న సాంట్నర్ ఫైనల్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు చెప్పాడు.

నా మద్దతు న్యూజిలాండ్‌కే: మిల్లర్


న్యూజిలాండ్‌తో సెమీఫైనల్లో వీరోచిత సెంచరీ చేసినా జట్టును గెలిపించలేకపోయిన దక్షిణాఫ్రికా బ్యాటర్ డేవిడ్ మిల్లర్ తమ సెమీస్ మ్యాచ్ షెడ్యూల్‌పై అసంతృప్తి వ్యక్తం చేశాడు. శనివారం కరాచీలో ఇంగ్లండ్‌తో మ్యాచ్ ఆడిన దక్షిణాఫ్రికా ఆ తర్వాత దుబాయ్‌కు వెళ్లి ఆదివారం భారత్, కివీస్ మ్యాచ్ ఫలితం తేలిన తర్వాత మళ్లీ లాహోర్‌కు తిరిగొచ్చింది. 'మా షెడ్యూల్ ఏమాత్రం బాగా లేదు. దుబాయ్‌కి ప్రయాణం గంటా 40 నిమిషాలే కావచ్చు. కానీ మేం వెళ్లక తప్పలేదు. మ్యాచ్ ముగిసిన తర్వాతే ఆ రోజే సిద్ధమై సాయంత్రం దుబాయ్‌కు వెళ్లాం. సోమవారం తెల్లవారుజామున మళ్లీ పాకిస్తాన్‌కు వచ్చాం' అని మిల్లర్ అన్నాడు. ఫైనల్లో తలపడే భారత్, న్యూజిలాండ్‌లు పటిష్టమైన జట్లే అన్న మిల్లర్... తాను మాత్రం కివీస్ గెలవాలనే కోరుకుంటున్నట్లు స్పష్టం చేశాడు.



నిద్రపోయి... టైమ్డ్ అవుట్!

పాక్ బ్యాటర్ సౌద్ షకీల్ అనూహ్య నిష్క్రమణ

రావల్పిండి: పాకిస్తాన్ దేశవాళీ క్రికెట్‌లో అతి పెద్ద ఫస్ట్‌క్లాస్ టోర్నీ 'ప్రెసిడెంట్స్ ట్రోఫీ'లో అరుదైన ఘటన చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్తాన్ (ఎస్‌బీపీ), పాకిస్తాన్ టెలివిజన్ (పీటీవీ) తలపడుతున్నాయి. ఎస్‌బీపీ 128/1తో బ్యాటింగ్ చేస్తోంది. ఈ సమయంలో పీటీవీ బౌలర్ షహజాద్ చెలరేగి వరుస బంతుల్లో రెండు వికెట్లు తీశాడు. మూడో వికెట్ పడగానే సౌద్ షకీల్ బ్యాటింగ్‌కు రావాల్సి ఉంది.



అయితే అతను అదే సమయంలో డ్రెస్సింగ్ రూమ్‌లో నిద్రలో ఉన్నాడు! బ్యాటింగ్‌కు సిద్ధంగా లేని అతను నిద్రలోంచి లేచి హడావిడిగా క్రీజ్‌లోకి వచ్చాడు. అయితే అప్పటికే ఆలస్యమైపోయింది. నిబంధనల ప్రకారం కొత్త బ్యాటర్ మూడు నిమిషాల్లోగా గార్డ్ తీసుకోవాల్సి ఉంటుంది. సౌద్ షకీల్ ఆలస్యం చేశాడంటూ పీటీవీ కెప్టెన్ ఆమద్ బట్ అప్పీల్ చేశాడు. దాంతో అంపైర్లు చర్చించి షకీల్‌ను 'టైమ్డ్ అవుట్'గా ప్రకటించడంతో అతను నిరాశగా వెనుదిరిగాడు. ఆ వెంటనే క్రీజ్‌లోకి వచ్చిన ఇర్ఫాన్ ఖాన్ బౌల్డ్ కావడంతో షహజాద్ ఖాతాలో హ్యాట్రిక్ చేరింది. పాకిస్తాన్ తరఫున 19 టెస్టులు, 19 వన్డేలు ఆడిన సౌద్ షకీల్ ఇటీవల చాంపియన్స్ ట్రోఫీలో కూడా బరిలోకి దిగాడు. రంజాన్ కారణంగా ప్రెసిడెంట్స్ ట్రోఫీ మ్యాచ్‌లకు పూర్తిగా రాత్రి వేళలో (రా.గం.7.30 నుంచి తెల్లవారుజామున 2.30 మధ్య) నిర్వహిస్తున్నారు.

సన్‌రైజర్స్ జట్టులో వియాన్ ముల్డర్



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో బరిలోకి దిగనున్న గత ఏడాది రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఒక మార్పు చోటు చేసుకుంది. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు ఆడాల్సిన ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ కాలివేలి గాయం కారణంగా టోర్నీకి దూరమయ్యాడు. బ్రైడన్ కార్స్ స్థానంలో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్‌ను సన్‌రైజర్స్ యాజమాన్యం తీసుకుంది. ఈ మార్పునకు ఐపీఎల్ నిర్వాహకులు ఆమోదం తెలిపారు. 27 ఏళ్ల ముల్డర్‌కు సన్‌రైజర్స్ రూ. 75 లక్షలు చెల్లించనుంది. గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో కార్స్‌ను సన్‌రైజర్స్ జట్టు అతని కనీస ధర రూ. 1 కోటికి కొనుగోలు చేసింది. అయితే చాంపియన్స్ ట్రోఫీ టోర్నీలో ఆస్ట్రేలియా మ్యాచ్ సందర్భంగా కార్స్ గాయపడ్డాడు. దాంతో అతను చాంపియన్స్ ట్రోఫీలోని మిగతా రెండు మ్యాచ్‌ల్లో ఆడలేదు. గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి కార్స్‌కు రెండు నెలల సమయం పట్టే అవకాశముంది. చాంపియన్స్ ట్రోఫీలో పోటీపడ్డ దక్షిణాఫ్రికా జట్టులో సభ్యుడైన ముల్డర్ ఇప్పటి వరకు 18 టెస్టులు, 25 వన్డేలు, 11 టి20 మ్యాచ్‌లు ఆడాడు.

డబుల్స్ సెమీస్‌లో రష్మిక జోడీ


రష్మిక

గుర్‌గ్రామ్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 6-3, 6-4తో అంటోనియా ష్మిడిట్ (జర్మనీ)-క్లారా వ్లాసీలర్ (బెల్జియం) జోడీపై విజయం సాధించింది. 87 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక-వైదేహి తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. మరోవైపు హైదరాబాద్‌కే చెందిన సహజ యామలపల్లి ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. భారత్‌కే చెందిన వైదేహి 6-3, 6-3తో భారత రెండో ర్యాంకర్ సహజను ఓడించింది.

కోమల్ 'హ్యాట్రిక్'... తెలంగాణ జట్టు గెలుపు

పంచ్‌కుల: జాతీయ సీనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ 'బి' డివిజన్‌లో తెలంగాణ జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. బిహార్ జట్టుతో గురువారం జరిగిన లీగ్ 'బి' డివిజన్ పూల్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 5-2 గోల్స్ తేడాతో గెలుపొందింది. తెలంగాణ తరఫున కోమల్ గుర్జర్ (12వ, 50వ, 55వ నిమిషాల్లో) మూడు గోల్స్ చేసి 'హ్యాట్రిక్' సాధించింది. పూజా రాథోడ్ (13వ నిమిషంలో), ముందారి సుమి (43వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. బిహార్ జట్టుకు ఇభా కెర్కెట్టా (21వ నిమిషంలో), నూతన్ టొప్నో (36వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. నాలుగు జట్లు పోటీపడ్డ పూల్ 'ఎ'లో తెలంగాణ జట్టు 6 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో నెగ్గిన ఉత్తరాఖండ్ 9 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అస్సాం జట్టు 3 పాయింట్లతో మూడో స్థానంలో, పాయింట్ల ఖాతా తెరవడంలో విఫలమైన బిహార్ జట్టు చివరిదైన నాలుగో స్థానంలో నిలిచాయి.

ముష్ఫికర్ ముగించె..




వన్డేలకు వీడ్కోలు పలికిన బంగ్లాదేశ్ వికెట్ కీపర్	ఇప్పటికే టి20ల నుంచి తప్పుకున్న రహీమ్	టెస్టు ఫార్మాట్‌లో కొనసాగనున్నట్లు వెల్లడి

ఢాకా: వన్డే క్రికెట్‌కు మరో స్టార్ ప్లేయర్ వీడ్కోలు పలికాడు. బుధవారం ఆస్ట్రేలియా మేటి ప్లేయర్ స్టీవ్ స్మిత్ ఈ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పగా... తాజాగా బంగ్లాదేశ్ సీనియర్ వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీమ్ వన్డే క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. చాంపియన్స్ ట్రోఫీ అనంతరం 37 ఏళ్ల ముష్ఫికర్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. టోర్నీలో భాగంగా ఒక్క మ్యాచ్‌లోనూ విజయం సాధించలేకపోయిన బంగ్లాదేశ్ జట్టు గ్రూప్ దశ నుంచే నిష్క్రమించగా... సామాజిక మాధ్యమాల వేదికగా ముష్ఫికర్ గురువారం తన నిర్ణయాన్ని వెల్లడించాడు. 2006లో జింబాబ్వేపై వన్డే అరంగేట్రం చేసిన ముష్ఫికర్... 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 274 మ్యాచ్‌లాడి 36.42 సగటుతో 7795 పరుగులు చేశాడు. ఇందులో 9 సెంచరీలు, 49 హాఫ్‌సెంచరీలు ఉన్నాయి. వన్డేల్లో 243 క్యాచ్‌లు అందుకున్న రహీమ్... 56 స్టంపౌట్‌లు చేశాడు. 'వన్డే క్రికెట్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నా. కెరీర్‌లో సాధించిన దాంతో సంతృప్తిగా ఉన్నా. జాతీయ జట్టు తరఫున ఎప్పుడు మైదానంలో అడుగుపెట్టినా 100 శాతానికి మించి శ్రమించా. జట్టు విజయం కోసం నిబద్ధతతో కష్టపడ్డా. గత కొన్ని రోజులుగా కెరీర్ విషయంలో ఎన్నో ఆలోచనలు చుట్టుముట్టాయి. చివరకు వన్డేల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నా. ఇన్నాళ్లు అండగా నిలిచిన కుటుంబ సభ్యులు, సహచరులు, అభిమానులకు ఎప్పటికీ రుణపడి ఉంటా' అని ముష్ఫికర్ ఫేస్‌బుక్ వేదికగా వెల్లడించాడు. రెండు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో 94 టెస్టులు, 102 టి20ల్లోనూ రహీమ్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

- బంగ్లాదేశ్ తరఫున వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన రెండో ప్లేయర్‌గా ముష్ఫికర్ (7795) కొనసాగుతున్నాడు. తమీమ్ ఇక్బాల్ (8357 పరుగులు) మాత్రమే అతడికంటే ముందున్నాడు.
- అంతర్జాతీయ వన్డేల్లో 250కి పైగా మ్యాచ్‌లు ఆడి 7 సెంచరీలకు పైగా చేసిన నాలుగో వికెట్ కీపర్‌గా రహీమ్ నిలిచాడు. కుమార సంగక్కర (404 వన్డేల్లో 25 సెంచరీలు; శ్రీలంక), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (287 వన్డేల్లో 16 సెంచరీలు; ఆస్ట్రేలియా), ధోనీ (350 వన్డేల్లో 10 సెంచరీలు; భారత్)ముందున్నారు.
- చాంపియన్స్ ట్రోఫీలో సీనియర్ ఆటగాడిగా మరింత బాధ్యతగా ఆడాల్సిన ముష్ఫికర్ ఏమాత్రం ఆకట్టుకోలేకపోయాడు. భారత్‌తో మ్యాచ్‌లో ఖాతా తెరవకుండానే అవుటైన అతడు... న్యూజిలాండ్‌పై 2 పరుగులకు పరిమితమయ్యాడు. దీంతో టోర్నీ ముగిసి స్వదేశానికి చేరిన వెంటనే తన నిర్ణయం ప్రకటించాడు. గతేడాది మార్చిలో న్యూజిలాండ్‌పై చివరిసారి ముష్ఫికర్ హాఫ్‌సెంచరీ చేశాడు.
- 2022 టి20 ప్రపంచకప్ అనంతరం టి20ల నుంచి తప్పుకున్న ముష్ఫికర్... 94 టెస్టుల్లో బంగ్లాదేశ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. మరో 6 టెస్టులు ఆడితే ముష్ఫికర్ 100 టెస్టులు పూర్తి చేసుకోనున్న తొలి బంగ్లాదేశ్ క్రికెటర్‌గా రికార్డు సృష్టిస్తాడు.
- బంగ్లాదేశ్ తరఫున వరుసగా అత్యధిక వన్డేలు ఆడిన ప్లేయర్‌గానూ ముష్ఫికర్ రికార్డు నెలకొల్పాడు. 2010 నుంచి 2016 మధ్యకాలంలో అతడు... వరుసగా 92 మ్యాచ్‌ల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

- 2007 వన్డే ప్రపంచకప్‌లో భాగంగా భారత్‌పై బంగ్లాదేశ్ విజయం సాధించడంలో ముష్ఫికర్ కీలక పాత్ర పోషించాడు. టీమిండియాతో పోరులో మూడోస్థానంలో బ్యాటింగ్‌కు దిగి అజేయ అర్ధశతకం సాధించాడు. దీంతో ఒక్కసారిగా అతడి పేరు మారుమోగిపోయింది. అప్పటి నుంచి మిడిలార్డర్‌లో నమ్మదగ్గ ప్లేయర్‌గా ఎదిగాడు.

అవకతవకలకు తావులేకుండా...



అథ్లెట్ల ఎంపికపై కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: క్రీడాకారుల ఎంపిక విషయంలో పారదర్శకత పెంపొందించాలనుకుంటున్న కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ... జాతీయ క్రీడా సమాఖ్యలకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. సెలెక్షన్ ప్రక్రియను వీడియో రూపంలో పొందుపరచాలని ఇప్పటికే స్పష్టంచేసిన కేంద్ర మంత్రిత్వ శాఖ... ఎంపిక ప్రక్రియకు ముందు పాటించాల్సిన నిబంధనలను తాజాగా వెల్లడించింది. సెలెక్షన్‌లో అవకతవకలకు తావివ్వకుండా జవాబుదారీతనం పెంపొందించేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి. క్రీడాకారులను ఎంపిక చేయడానికి 15 రోజుల ముందే దానికి సంబంధించిన పూర్తి వివరాలను వివిధ జాతీయ క్రీడా సమాఖ్యలు వెల్లడించాలని క్రీడా మంత్రిత్వ శాఖ సూచించింది. దీనివల్ల ట్రయల్స్‌లో అన్యాయం జరిగిందనే విమర్శలకు అవకాశం ఇవ్వకూడదని భావిస్తోంది. ఇటీవలి కాలంలో రెజ్లింగ్, షూటింగ్‌తో పాటు సెలెక్షన్స్ అవకతవకలపై పలు ఫిర్యాదులు అందడంతో... కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ జాతీయ క్రీడా సమాఖ్యలకు ప్రత్యేక సూచనలు చేశారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వకూడదని సూచించారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసింది. భారత ఒలింపిక్స్ సంఘం (ఐఓఏ), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్), జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్)లకు పంపింది.

- ఎంపిక ప్రక్రియకు సంబంధించిన నియమ నిబంధనలను ప్రతి సమాఖ్య తమ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచడం తప్పనిసరి. సెలెక్షన్‌కు మూడు నెలల సమయం ఉన్నప్పుడు మాత్రమే వాటిలో మార్పు చేర్పులు చేయాలి.
- సెలెక్షన్ ప్రక్రియనంతా వీడియోలో నిక్షిప్తం చేయాలి. వీటి రికార్డులను సెలెక్షన్ కమిటీ సంతకం చేసిన అనంతరం విధిగా 'సాయ్'కు అందజేయాలి. ప్రతి ట్రయల్‌కు ముందు అవసరమైన ఆర్థిక సహాయానికి సంబంధించిన వివరాలను మంత్రిత్వ శాఖకు తెలియజేయాలి.
- ఒలింపిక్స్, పారాలింపిక్స్, ఆసియా గేమ్స్, పారా ఆసియా గేమ్స్, కామన్వెల్త్ క్రీడల వంటి పెద్ద టోర్నీల ఎంపిక ప్రమాణాలను కనీసం రెండు సంవత్సరాల ముందుగానే పొందుపరచాలి. ఈ అంశంలో అథ్లెట్‌లకు అవగాహన కల్పించాలి.
- విదేశీ టోర్నీల్లో పాల్గొనేందుకు వెళ్లే సమయంలో పాటిస్తున్న నిబంధనల విషయంలో పునరాలోచించాలని ప్రముఖ షూటింగ్ కోచ్ జస్పాల్ రాణా గతంలోనే కోరగా... తాజాగా కేంద్ర మంత్రిత్వ శాఖ ఈ అంశంలోనూ కీలక సవరణలు చేసింది.
- సెలెక్షన్ కమిటీలోని సభ్యులెవరూ... ఫిర్యాదుల పరిష్కార కమిటీలో భాగం కాకూడదు. ఇది సహజ న్యాయ సూత్రానికి విరుద్ధం. జాతీయ క్రీడా సమాఖ్య వివాద పరిష్కార కమిషన్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- జాతీయ క్రీడా సమాఖ్యల అధ్యక్షులు ఎంపిక ప్రక్రియను దగ్గరుండి పరిశీలించాలి. హై పెర్ఫార్మెన్స్ డైరెక్టర్, చీఫ్ కోచ్, మాజీ క్రీడాకారులు, ఖేల్‌రత్న, అర్జున అవార్డు గ్రహీతలు ఇలా అందుబాటులో ఉన్న వారిని సెలెక్షన్ కమిటీకి ఎంపిక చేసే అధికారం జాతీయ క్రీడా సమాఖ్యల అధ్యక్షులదే.

సాక్షి ప్లస్
శుక్రవారం। 7-3-2025

హెయిర్‌కట్‌లో తలపండింది

ప్రపంచంలోనే అత్యంత వృద్ధ క్షురకురాలిగా 108 ఏళ్ల షిట్సూయ్ హకోయ్‌షీ రికార్డు

టోక్యో: శతాధిక వృద్ధులు సాధారణంగా తమ పని తాము చేసుకోవడానికి చాలా కష్ట పడుతుంటారు. ఒంట్లో పటుత్వం తగ్గిపోయి లేచి నడవడానికి, గాజు వస్తువులను పగలకుండా జాగ్రత్తగా పట్టుకెళ్లడానికి ఎంతో కష్టపడుతుంటారు. ఇక కత్తెర పట్టుకుని జుట్టు కత్తిరించమంటే వాళ్లు చేసే కటింగ్ దెబ్బకు హెయిర్‌స్టయిల్ ఎటు పోతుందో ఎవరూ చెప్పలేరు. అలాంటిది ఏకంగా 108 ఏళ్ల వయసులో కూడా ఓ బామ్మ ఎంచక్కా కత్తెరను ఒడుపుగా చురకత్తిలాగా ఝుళిపిస్తూ చక్కటి తలకట్టు తీర్చిదిద్దుతోంది. ఆమె పేరే షిట్సూయ్ హకోయ్‌షీ.

9 దశాబ్దాలుగా హెయిర్‌స్టయిల్ వృత్తిలో..

ఈశాన్య టోక్యోలోని టొచిగి జిల్లాలోని నకగవా పట్టణంలోని బామ్మ షిట్సూయ్‌కు బార్బర్ దుకాణం ఉంది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో అంటే 1916 నవంబర్ పదో తేదీన రైతు కుటుంబంలో ఈమె జన్మించారు. హెయిర్ కటింగ్ అంటే ఈమెకు చాలా ఇష్టం. ''టోక్యోలో ఉద్యోగం ఉంది. కావాలంటే అక్కడికెళ్లి జాయిన్ అవ్వు''అని స్నేహితురాలి తల్లి ఇచ్చిన సలహాను షిట్సూయ్ పాటించారు. టీనేజీలో ఉండగానే 14 ఏళ్ల వయసులోనే ఒంటరిగా టోక్యో సిటీకి వెళ్లి బార్బర్ అప్రెంటిస్‌గా చేరారు. 20 ఏళ్ల వయసులో బార్బర్‌గా లైసెన్స్ సంపాదించారు. 24 ఏళ్ల వయసులో జెరోను పెళ్లాడారు. తర్వాత భర్తతో కలిసి బార్బర్ షాప్ ప్రారంభించారు. వీళ్లకు ఇద్దరు సంతానం. 1937లో జపాన్‌పై చైనా జరిపిన యుద్ధంలో ఈమె భర్త ప్రాణాలు కోల్పోయారు. తర్వాత ఎనిమిదేళ్లకు అంటే 1945 మార్చి పదో తేదీన టోక్యోపై అమెరికా జరిపిన బాంబు దాడిలో ఈమె బార్బర్ దుకాణం పూర్తిగా ధ్వంసమైంది. దీంతో పిల్లలు, కట్టుబట్టలతో ఈమె నగరాన్ని వీడి టొచిగి జిల్లాలోని వేరే ప్రాంతానికి తరలిపోయారు. తర్వాత ఎనిమిదేళ్లకు 1953లో సొంతూరు నకగవాకు చేరి అక్కడ తన పేరు మీద 'రిహాట్సు హకోయ్‌షీ'అని బార్బర్ దుకాణం ప్రారంభించారు. అప్పట్నుంచీ అదే దుకాణంలో దశాబ్దాలుగా కటింగ్ వృత్తిలోనే కొనసాగుతున్నారు. రిహాట్సు అంటే జపనీస్ భాషలో బార్బర్ అని అర్థం.



కస్టమర్లే నా దేవుళ్లు

108 ఏళ్ల వయసులోనూ బార్బర్‌గా కొనసాగుతున్న ఈమెకు గత బుధవారం గిన్నిస్ ప్రపంచ రికార్డ్ నిర్వాహకులు వరల్డ్ రికార్డ్ సర్టిఫికేట్‌ను అందజేశారు. ఇన్నాళ్లూ అమెరికాలో 107 ఏళ్ల వయసులోనూ బార్బర్‌గా కొనసాగిన ఆంటోనీ మాన్సినెల్లీ అనే తాతకు గిన్నిస్ ప్రపంచ రికార్డ్ సర్టిఫికేట్ ఉండేది. ఆయన 2018లో మరణించడంతో అప్పట్నుంచీ ఎవరికీ ఆ సర్టిఫికేట్ ఇవ్వలేదు. బామ్మ విషయం తెల్సి తాజాగా ఈమెకు ఆ రికార్డ్ కట్టబెట్టారు. ''108 ఏళ్ల వయసు బామ్మ వణుకుతూ కటింగ్ ఎలా చేస్తుందో అన్న భయం, అనుమానం లేకుండా నామీద నమ్మకంతో వస్తున్న కస్టమర్లే నాకు దేవుళ్లు. వాళ్ల సంతోషమే నాకు అమితానందాన్ని ఇస్తుంది. వయసులో సెంచరీ దాటినా నేను నా వృత్తిని వదులుకోను. కత్తెరలను పక్కనబెట్టే ప్రసక్తే లేదు. ఓపిక ఉన్నంతకాలం కటింగ్ చేస్తా. ఈ ఏడాది 109వ పుట్టినరోజు జరుపుకోబోతున్నా. ఓపిక తగ్గితే 110 ఏళ్ల వయసులో కటింగ్‌ను ఆపేస్తా''అని బామ్మ నవ్వుతూ చెప్పారు.



గురువారం ముంబైలోని ధారావి తోళ్ల మార్కెట్లో దుకాణదార్లతో కాంగ్రెస్ అగ్రనేత మాటామంతి

జుట్టు దొంగలు

దాదాపు రూ.1 కోటి విలువైన తల వెంట్రుకలను దొంగలించిన చోరశిఖామణులు

బెంగళూరు: రాత్రిళ్లు వజ్రాభరణాల దుకాణాలు, ఏటీఎంలను కొల్లగొట్టి దొంగలు కోట్ల విలువైన నగదు, బంగారాన్ని కొట్టేసే ఘటనలు రోజు ఏదో ఒక రాష్ట్రంలో చూస్తున్నే ఉన్నాం. కానీ ఈసారి కొందరు దొంగలు తమ చోరకళలో వైవిధ్యం ప్రదర్శించారు. బంగారం కొట్టేస్తే దానిని నగదుగా, ఒక వేళ నగదును కొట్టేస్తే నేరుగా వాడుకునే వెసులుబాటు దొంగలకు ఉంది. కానీ చోరీ చేసిన దానిని వెంటనే నగదుగా వాడుకునే అవకాశం లేకపోయినా సరే కొందరు దొంగలు జుట్టుపై కన్నేశారు. జుట్టుపై అంటే వ్యక్తుల తలపై ఉండే జుట్టుపై కాదు. అప్పటికే మొక్కు రూపంలోనో, మరేదైనా కారణంగానో తలనీలాలను కత్తిరించగా వాటిని సేకరించిన ఓ వ్యాపారి తన గిడ్డంగిలో భద్రపరిచగా దానిని దొంగలు చోరీచేసి ఎత్తుకుపోయారు. కిలోల కొద్దీ జుట్టును చోరశిఖామణులు కొట్టేసిన ఘటన కర్ణాటకలోని బెంగళూరులో జరిగింది. దాదాపు రూ.90 లక్షల నుంచి రూ.1 కోటి విలువైన జుట్టును కొట్టేసిన వార్త తెలిసి ఆ గోడౌన్ యజమాని లబోదిబోమని ఏడ్వడంతో జుట్టు దోపిడీ వార్త ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. చోరీ విషయం తెల్సి పోలీసులు భారతీయ న్యాయసంహిత చట్టాల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు మొదలెట్టారు.

తెలిసిన వ్యక్తుల పనేనా?

కోటి విలువైన సరుకు ఉందన్న పక్కా సమాచారంతోనే దొంగలు చోరీకి తెగబడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల చైనా నుంచి వచ్చిన ఒక వ్యాపారి ఈ జుట్టును సరిచూసుకుని మార్కింగ్ వేసి మరీ వెళ్లారని యజమాని వెంకటస్వామి పోలీసులకు చెప్పారు. ఫిబ్రవరి 28 అర్ధరాత్రి పెద్దకారులో వచ్చిన ఆరుగురు దొంగలు వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్లతో గోడౌన్ షట్టర్‌ను పగలగొట్టి తెరచి 27 సంచులను ఒక్కోటి ఎత్తుకెళ్లడం మొదలెట్టారు. ఇది గమనించిన సమీపంలోని ఓ వ్యక్తి ఆరాతీయగా ''ఈ సరుకుంతా మాదే. వేరే చోటుకు తరలిస్తున్నాం''అని దొంగలు తెలుగులో ఏమాత్రం అనుమానంరాని రీతిలో అతనికి చెప్పారని పోలీసులు తెలిపారు. హడావిడిగా కారులోకి ఎక్కించడం, జుట్టు రోడ్డుపై చెల్లాచెదురుగా పడటం గమనించిన మరో వ్యక్తి వెంటనే హెల్ప్‌లైన్ 112కు ఫోన్‌చేసి చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకోగా అప్పటికే దొంగలు ఉడాయించారు. లక్ష్మీపుర క్రాస్ ప్రాంతంలో కేశాల వ్యాపారులు ఎక్కువ. ఈ సరకు విషయం తెల్సిన వ్యక్తులే ఈ దొంగతనం చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అంతర్రాష్ట్ర కేశాల వ్యాపారంలో ఉన్న వ్యక్తుల హస్తం ఈ చోరీలో ఉండొచ్చనే అనుమానాలు పోలీసులు వ్యక్తంచేశారు.

850 కేజీల జుట్టు

ఉత్తర బెంగళూరు ప్రాంతానికి చెందిన 73 ఏళ్ల కె.వెంకటస్వామి అనే వ్యాపారి తన గోడౌన్‌ను హెబ్బాళ్ ప్రాంతం నుంచి లక్ష్మీపుర క్రాస్ అనే ప్రాంతానికి ఫిబ్రవరి 12వ తేదీన మార్చారు. ఇతను కేశాల వ్యాపారం చేస్తుంటారు. కడప, శ్రీకాకుళం ఇలా ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల్లో ఊరూరు తిరిగి జనం దగ్గర జుట్టును కొందరు వ్యక్తులు డబ్బులకు సేకరించిన ఏజెంట్లకు విక్రయిస్తారు. ఆ ఏజెంట్లను జుట్టును వెంకటస్వామి వంటి వ్యాపారులకు విక్రయిస్తారు. అలా తన వద్దకు వచ్చిన జుట్టును వెంకటస్వామి హైదరాబాద్‌లోని ఒక వ్యాపారికి విక్రయిస్తారు. ఆ వ్యాపారి బర్మాకు ఎగు మతి చేస్తారు. అది ఆ తర్వాత చైనాకు తరలిపోతుంది. అక్కడ అత్యంత నాణ్యమైన విగ్గులను తయారుచేస్తారు. భారతీయుల జుట్టుతో తయారైన విగ్గులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అంతటి విలువైన 850 కేజీల జుట్టును ఏజెంట్ల నుంచి కొనుగోలు చేసి వెంకటస్వామి తన గోడౌన్‌లో 27 సంచుల్లో భద్రపరిచారు.

జేఈటీపీ నుంచి అమెరికా వెనక్కి

వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. జస్ట్ ఎనర్జీ ట్రాన్సిషన్ పార్ట్‌నర్‌షిప్(జేఈటీపీ) నుంచి అమెరికా ఉపసంహరించుకుంది. 2021లో ఏర్పాటైన ఈ కూటమిలో 10 దేశాలు ఉన్నాయి. వాతావరణ మార్పులపై స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగిన చర్చల సందర్భంగా ఐక్యరాజ్యసమితి చొరవతో జేఈటీపీ ఏర్పాటయ్యింది. బొగ్గు ఆధారిత విద్యుత్ నుంచి క్లీన్ ఎనర్జీ వైపు మారేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంపన్న దేశాలు సహకరించాలన్నది జేఈటీపీ అసలు ఉద్దేశం. కూటమిలోని సభ్యదేశాలు ఇతర దేశాలకు రుణాలు, రుణాలకు గ్యారంటీలు, గ్రాంట్లు ఇవ్వాల్సి ఉంటుంది. దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, వియత్నాం వంటి దేశాలు ప్రయోజనం పొందాయి. కూటమి నుంచి అమెరికా హఠాత్తుగా వెనక్కి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. జేఈటీపీ నుంచి ఉపసంహరించుకున్నట్లు అమెరికా నుంచి తమకు సమాచారం అందిందని దక్షిణాఫ్రియా యూనిట్ ప్రతినిధి యావిట్స్ చెప్పారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత విదేశాలకు అందించే ఆర్థికసాయాన్ని నిలిపివేస్తున్న సంగతి తెలిసిందే.

బబ్బర్ ఖల్సా ఉగ్రవాది లాజర్ అరెస్ట్

లక్నో: మహాకుంభ్ మేళాలో విధ్వంసం సృష్టించేందుకు ప్రణాళిక వేసి పోలీసుల అత్యంత కట్టుదిట్టమైన భద్రత కారణంగా ఆ ప్లాన్‌ను అమలుచేయలేపోయిన నిషేధిత బబ్బర్ ఖల్సా అంతర్జాతీయ ఉగ్రవాది లాజర్ మాసిహ్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు. ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్, పంజాబ్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టి గురువారం తెల్లవారుజామున 3.20గంటలకు ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో అరెస్ట్‌చేశారు. ఉగ్రవాది లాజర్‌కు పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సత్సంబంధాలు ఉన్నాయని పోలీసు వర్గాలు తెలిపాయి. అరెస్ట్ వివరాలను యూపీ డీజీపీ ప్రశాంత్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ''జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా జరిగే కాలంలో అక్కడ విధ్వంసం సృష్టించాలని లాజర్ పథకరచన చేసినా పోలీసుల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, పటిష్ట నిఘా కారణంగా ప్లాన్ అమలుచేయలేకపోయారు. దీంతో నకిలీ పాస్‌పోర్ట్‌తో పోర్చుగల్‌కు పారిపోవాలని భావించాడు. బబ్బర్‌ఖల్సా ఇంటర్నేషనల్ చీఫ్ స్వరణ్‌సింగ్ అలియాస్ జీవన్ ఫౌజీ ఆదేశాల మేరకు పంజాబ్‌లోని బటాలాలో పలువురిపై కాల్పులు జరిపాడు. తర్వాత సోనీపట్, ఢిల్లీలో దాక్కుని మహాకుంభమేళాలో దాడులు చేసేందుకు యూపీకి వచ్చాడు.

మైనారిటీలు అదృష్టవంతులు

- వాళ్ల కోసం ప్రత్యేక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలున్నాయి
- ప్రపంచంలో మరెక్కడా ఈ పరిస్థితి లేదు
- మంత్రి కిరెణ్ రిజిజు వ్యాఖ్య

తిరువనంతపురం: భారత్‌లోని మైనారిటీలు అదృష్టవంతులని కేంద్ర పార్లమెంటరీ, మైనారిటీల వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు వ్యాఖ్యానించారు. గురువారం కేరళలోని తిరువనంతపురంలో దక్షిణ భారత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో ప్రధాన్‌మంత్రి జన వికాస్ కార్యక్రమ్(పీఎంజేవీకే) సమీక్షా సమావేశం, శిక్షణాశిబిరంలో రిజిజు పాల్గొని ప్రసంగించారు. ''భారత్‌లో మైనారిటీలకు రక్షణ లేదు అని, వాళ్ల మధ్య వివక్ష చూపిస్తున్నారని కొందరు చేస్తున్న వాదనల్లో ఏమాత్రం నిజం లేదు. వాస్తవానికి మైనారిటీలంత అదృష్టవంతులు ఇంకొకరు లేరు. మైనారిటీల కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నాయి. ఇలా మైనారిటీ కోసం ప్రపంచంలో ఏ దేశమూ ప్రత్యేక శ్రద్ధ కనబరచడం లేదు. ఇకనైనా మైనారిటీలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రత్యేక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను గుర్తించి ఆయా ప్రభుత్వాలను అభినందించి ప్రోత్సహించండి. భారతీయ పౌరులు కావడం మనందరి అదృష్టం''అని అన్నారు. కేరళనుద్దేశిస్తూ.. ''కేరళనే తీసుకుంటే ఇక్కడి జనాభాలో 44 శాతం మంది మైనారిటీలైన క్రైస్తవులు, ముస్లింలే ఉన్నారు. దేశంలో అత్యధికంగా మైనాటీలున్న రాష్ట్రాల్లో కేరళ కూడా ఒకటి. అందుకే అత్యధిక మైనారిటీ పథకాలు కేరళలోనూ అమలవుతున్నాయి. ఏదైనా ప్రాజెక్ట్, పథకం విషయంలో కేంద్ర ప్రభుత్వం సాయం చేయొచ్చు అన్న సానుకూల భావన కేరళ రాష్ట్ర ప్రభుత్వంలో పెరిగితే అందుకు తగ్గట్లు సహాయసహకారాలు అందించేందుకు మోదీ సర్కార్ సిద్ధంగా ఉంది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల సహాయ మంత్రి జార్జ్ కురియన్ కేరళ నేతకావడం రాష్ట్రంలోని మైనారిటీలకు కలిసొచ్చే అంశం. పీఎంజేవీకే పథకం ద్వారా రుణ వితరణ, లబ్ధిదారుల సంఖ్యలో అత్యధికంగా లబ్ధిపొందిన రాష్ట్రాల్లో కేరళ సైతం ఉంది''అని మంత్రి అన్నారు. మైనారిటీలు నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎంజేవీకే పథకాన్ని తీసుకురావడం తెల్సిందే.

బంగారం తెచ్చినప్పుడల్లా రూ.12 లక్షల కమిషన్!

- కిలో తెస్తే రూ.1 లక్ష కమిషన్
- రన్యా రావు కేసులో కొత్త విషయాలు వెలుగులోకి

బెంగళూరు: కర్ణాటకలోని బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం రాత్రి రూ.12.56 కోట్ల విలువైన బంగారు కడ్డీలు తెస్తూ అరెస్ట్ అయిన కన్నడ నటి రన్యా రావు కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తే కేజీకి రూ.1 లక్ష చొప్పున ఆమెకు కమిషన్ అందేదని వార్తలొచ్చాయి. దుబాయ్‌కు వెళ్లొచ్చిన ప్రతిసారీ రూ.12–13 లక్షల కమిషన్ పొందిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. నడుముకు చుట్టుకునే బెల్ట్, దుస్తుల పైనుంచి ధరించే జాకెట్‌లో బంగారు కడ్డీలు తెచ్చేదని, కడ్డీలు పట్టేలా ఆ జాకెట్‌ను రీడిజైన్ చేయించిందని తెలుస్తోంది. సెక్యూరిటీ తనిఖీలు దాటడంలో అక్కడి కానిస్టేబుల్ ఒకరు ఈమెకు సహాయ సహకారాలు అందించినట్లు తెలుస్తోంది.

సవతి తండ్రిపైనా ఆరోపణలు

రన్యా రావు అరెస్ట్ ఘటనలో తనకేం సంబంధం లేదని స్పష్టంచేసిన ఆమె సవతి తండ్రి కె.రామచంద్రరావు పైనా గతంలో ఆరోపణలున్నట్లు తాజాగా మీడియాలో వార్తలొచ్చాయి. ఐపీఎస్ అధికారి అయిన రామచంద్రరావు ప్రస్తుతం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(కర్ణాటక రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్)గా సేవలందిస్తున్నారు. 2014లో మైసూరు సదరన్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పదవిలో ఉన్నప్పుడు హవాలా కేసులో ఈయన పాత్ర ఉందని ఆనాడు ఆరోపణలు వచ్చాయి. మైసూరులోని యెల్వాల్ నుంచి కేరళకు వెళ్తున్న బస్సును అడ్డగించిన పోలీసులు అందులోంచి రూ.20 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు వార్తలొచ్చాయి. అయితే వాస్తవానికి ఆ బస్సు నుంచి రూ.2.07 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని రూ.20లక్షలు మినహా మిగతా కరెన్సీ పంచుకున్నారని ఒక వ్యాపారి ఫిర్యాదుచేశారు. దీంతో ఈ ఉదంతంపై కేసు నమోదైంది. బస్సు వెళ్తున్న మార్గం వివరాలను వెల్లడించిన పోలీస్ ఇన్ఫార్మర్లతోపాటు రామచంద్రరావు వ్యక్తిగత గన్‌మెన్‌ను అరెస్ట్ చేశారు. దీంతో రామచంద్రరావును ఈ పోస్ట్ నుంచి తప్పించి హెడ్‌క్వార్టర్స్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత రెండేళ్లకు మరో కేసులోనూ రామచంద్రరావు పేరు ప్రముఖంగా వినిపించింది. గ్యాంగ్‌స్టర్లు ధర్మరాజ్, గంగాధర్‌ల నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో రామచంద్రరావును సీఐడీ అధికారులు ప్రశ్నించారు.

దక్షిణ కొరియాలో ఇళ్లపై బాంబులు

వైమానిక విన్యాసాల్లో అపశ్రుతి

సియోల్: దక్షిణ కొరియా, అమెరికా సంయుక్తంగా నిర్వహిస్తున్న వైమానిక దళ విన్యాసాల్లో ప్రమాదం జరిగింది. కేఎఫ్–16 యుద్ధ విమానం నుంచి 225 కిలోలున్న 8 బాంబులు నివాస స్థలాలపై జారిపడ్డాయి. వాటిలో ఒక బాంబు పేలడంతో 15 మంది గాయపడ్డారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇళ్లు, చర్చి ధ్వంసమయ్యాయి. రాజధాని సియోల్‌కు 40 కిలోమీటర్ల దూరాన ఉత్తర కొరియా సమీపంలోని పోచియాన్ నగరంలో ఈ ఘటన జరిగింది. పేలని బాంబులను నిర్వీర్యం చేసేందుకు బాంబు ఆయా ప్రాంతాలను డిస్పోజల్ టీమ్ హుటాహుటిన ఖాళీ చేయించింది. బాంబులు ఫైరింగ్ రేంజ్‌కు ఆవల పడటమే ప్రమాదానికి కారణమని వైమానిక దళం తెలిపింది.

పట్టణాల్లో విస్తరిస్తున్న నక్సలిజం

ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన

న్యూఢిల్లీ: నక్సలిజం అడవుల నుంచి వేగంగా తుడిచిపెట్టుకుపోతోందని, మరోవైపు పట్టణాల్లో మాత్రం క్రమంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు నక్సలైట్ల సిద్ధాంతాలకు మద్దతు ఇస్తున్నాయని చెప్పారు. గురువారం ఢిల్లీలో ఓ వార్తా సంస్థ నిర్వహించిన రిపబ్లిక్ ప్లీనరీ సదస్సులో ఆయన మాట్లాడారు. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో నక్సలిజం వేర్లు చొచ్చుకెళ్తుండడం ఆందోళనకరమని తెలిపారు. అర్బన్ నక్సలైట్లు తమ నెట్‌వర్క్‌ను వేగంగా పెంచుకుంటున్నారని, మన అభివృద్ధిని, సాంస్కృతిక వారసత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. వారి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి విరుచుకుపడ్డారు. దశాబ్దాల పాటు అధికారం చెలాయించిన ఆ పార్టీ ప్రజల ఆకాంక్షలను అణచివేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ నుంచి ఆశించడం ప్రజలు మానుకున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశలు నెరవేర్చడానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు.

నేడు మన దేశం గొప్పగా ఆలోచిస్తోందని, పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకొని, అనుకున్న ఫలితాలు సాధిస్తోందని ఉద్ఘాటించారు. మనందరి ఆలోచనా ధోరణి మారడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. అతిపెద్ద ఆశలు, ఆకాంక్షలతో మన దేశం ముందుకు సాగుతోందని వివరించారు. తమ ప్రభుత్వం చేపట్టిన పటిష్టమైన చర్యలతో ఉగ్రవాదం చాలావరకు అంతరించిపోయిందని అన్నారు. నేడు వార్తాపత్రికలు, టీవీ చానళ్లలో ఉగ్రవాద దాడుల వార్తలు కనిపించడం లేదని చెప్పారు.



తమిళనాడులోని తిరువళ్లూరులో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో 'బుక్ ఫెయిర్, తిరువళ్లూరు' అనే అక్షరాల ఆకృతిలో గురువారం కనువిందు చేసిన విద్యార్థులు

మాతో జోకులొద్దు!

'51వ రాష్ట్రం'వ్యాఖ్యలపై కెనడా ఆగ్రహం

ఒట్టావా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరుపై కెనడా మండిపడింది. తమ 51వ రాష్ట్రమంటూ ఆయన పదేపదే చేస్తున్న వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ఇంకెంత మాత్రమూ జోక్ కాదని కెనడా విదేశాంగ మంత్రి మెలానియా జోలీ మండిపడ్డారు. అమెరికా సమస్యలను పరిష్కరించడానికి తమ సరిహద్దుల్లో ఇప్పటికే కఠినమైన భద్రతా చర్యలను అమలు చేస్తున్నట్టు ఆమె వివరించారు. ట్రంప్ ప్రకటించిన అధిక సుంకాలు కెనడా ఆర్థిక వ్యవస్థకు ముప్పని ఆమె ఆందోళన వెలిబుచ్చారు. ట్రంప్ తన వాణిజ్య యుద్ధాన్ని ఇలాగే కొనసాగిస్తే ప్రతిచర్యలకు సిద్ధం కావాల్సిందిగా యూరోపియన్ యూనియన్‌లోని మిత్రదేశాలకు పిలుపునిచ్చారు. దీనికి తమనుంచి కచ్చితంగా ఎదురుదాడి ఉంటుందని మంత్రి ప్రకటించారు. అయితే, ''ఇది కేవలం ట్రంప్ విధానాలపైనే తప్ప అమెరికా పౌరులపై కాదు. వారు మాకు మంచి మిత్రులు''అని చెప్పుకొచ్చారు. హాకీ పోటీల సమయంలో కెనెడియన్లు అమెరికా జాతీయ గీతాన్ని అడ్డుకోవడానికి సహేతుకమైన కారణమే ఉందని జోలీ అన్నారు. తమకు జరిగిన అవమానానికి అది ప్రతిస్పందన అని చెప్పారు. గత జనవరిలో అధికారం చేపట్టగానే కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోను తన సామాజిక వేదిక ట్రూత్ సోషల్‌లో 'గవర్నర్ జస్టిన్'అంటూ ట్రంప్ సంబోధించడం తెలిసిందే. మాదకద్రవ్యాలను అరికట్టడంలో కెనడా చేతగానితనమే ఇరు దేశాల సంబంధాలు క్షీణించడానికి కారణమని ఆరోపింఆచరు. పరిస్థితి మెరుగుపరుస్తామన్న ట్రూడో హామీలను ట్రంప్ తోసిపుచ్చారు. తర్వాత కెనడా వస్తువులపై 25 శాతం సుంకం విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇది ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచింది. తాజాగా ట్రంప్ మళ్లీ '51వ రాష్ట్రం'వ్యాఖ్యలు చేయడం కెనడాకు ఆగ్రహం తెప్పించింది.

మేం తగ్గేదేలేదు: ట్రూడో

టొరంటో: అమెరికా, కెనడా వాణిజ్య యుద్ధం చాలాకాలం పాటు సాగవచ్చని ప్రధాని ట్రూడో అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో తాము వెనక్కు తగ్గేదే లేదని స్పష్టం చేశారు. అయితే పరస్పరం టారిఫ్‌ల భారాన్ని తగ్గించుకునేందుకు ట్రంప్‌తో చర్చలు కొనసాగుతున్నట్టు వివరించారు.

వామ్మో సైనిక విమానాలు!

వలసదారుల తరలింపు ఖర్చుపై గుండెలు బాదుకుంటున్న అమెరికా

వాషింగ్టన్: అక్రమ వలసదారులను సైనిక విమానాల్లో స్వదేశాలకు తిప్పి పంపేందుకు ఖర్చు తడిసి మోపెడవుతోందని అమెరికా గుండెలు బాదుకుంటోంది. వాటి వాడకాన్ని తాత్కాలికంగా నిలిపేస్తూ నిర్ణయం తీసుకుంది. వలసదారులతో చివరి విమానం అమెరికా నుంచి మార్చి 1న వెళ్లింది. తరవాత వాటిని ఇప్పటిదాకా షెడ్యూల్ చేయలేదు. ఈ విరామాన్ని పొడిగించడమో, తరలింపులను శాశ్వతంగా నిలిపివేయడమో చేయొచ్చని చెబుతున్నారు. గత జనవరిలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టగానే వలసదారులను వెనక్కి పంపే చర్యలకు శ్రీకారం చుట్టడం తెలిసిందే. కొందరిని స్వదేశాలకు, ఇతరులను గ్వాంటనామో బేలోని సైనిక స్థావరానికి పంపారు. ఈ విషయంలో అమెరికా ఎంత కఠినంగా ఉందో చెప్పేందుకు 30 సి–17, 12 సి–130 తరహా సైనిక విమానాలను వాడారు. అయితే అది చాలా ఖరీదైన వ్యవహారంగా మారింది. భారత్‌కు వచ్చిన మూడు విమానాలకే ఏకంగా 30 లక్షల డాలర్లు ఖర్చయింది. గ్వాంటనామోకు తరలించడానికి ఒక్కో వ్యక్తిపై అమెరికా 20 వేల డాలర్లు ఖర్చు చేసింది. ఇది అమెరికా ఎయిర్‌లైన్స్ విమాన టికెట్ల కంటే ఏకంగా ఐదు రెట్లు ఎక్కువ. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) కమర్షియల్ చార్టర్ ఫ్లైట్ కంటే కూడా చాలా ఎక్కువ!

హిజాబ్ తొలగించాలంటూ పాట... ఇరాన్‌లో గాయకుడికి కొరడా దెబ్బలు

టెహ్రాన్: హిజాబ్‌కు వ్యతిరేకంగా పాట పాడినందుకు ఓ మెహదీ యరాహీ అనే ఇరానీ గాయకుడు 74 కొరడా దెబ్బలు తినాల్సి వచ్చింది. హిజాబ్ తొలగించాల్సిందిగా మహిళలను ప్రోత్సహిస్తూ పాట పాడినందుకు అతనికి ఈ శిక్షను అమలు చేసినట్లు ఇరాన్ పేర్కొంది. స్వేచ్ఛ కోసం శిక్ష అనుభవించడానికి వెనుకాడే వ్యక్తి స్వేచ్ఛకు అనర్హుడని 44 ఏళ్ల యరాహీ పేర్కొనడం విశేషం. 2022లో ఇరాన్ అంతటా హిజాబ్ వ్యతిరేక నిరసనలు చెలరేగినప్పుడు కూడా ఆయన నిరసనకారులకు మద్దతుగా పాట పాడాడు. దాంతో 2023 ఆగస్టులో అరెస్టయ్యాడు. టెహ్రాన్ రివల్యూషనరీ కోర్టు ఆయనకు రెండేళ్ల 8 నెలల జైలు శిక్ష, 74 కొరడా దెబ్బలు విధించింది. ఏడాది శిక్ష అనుభవించాక తాజాగా కొరడా దెబ్బలు అమలు చేశారు. హిజాబ్ చట్టాన్ని, దాన్ని క్రూరమైన అమలు చేస్తున్న తీరును హక్కుల సంఘాలు నిరసిస్తున్నాయి. ఇరాన్‌లో కళాకారులపై అణచివేత, శిక్షలు ఇదే మొదటి కాదు. వ్యతిరేక జెండర్ వ్యక్తులకు షేక్‌హ్యాండ్ ఇచ్చినందుకు 2015లో ఇద్దరు ఇరాన్ కవులకు 99 కొరడా దెబ్బలు శిక్ష విధించారు. ఏడాదిపాటు జైల్లో పెట్టారు.

బ్రిటిష్ పౌరుడికి రష్యా జైలు శిక్ష

ఉక్రెయిన్ తరఫున పోరాడినందుకు 19 ఏళ్ల ఖైదు

మాస్కో: ఉక్రెయిన్ దళాలతో కలిసి పోరాడుతూ పట్టుబడిన జేమ్స్ స్కాట్ రైస్ ఆండర్సన్ అనే 22 ఏళ్ల బ్రిటిష్ పౌరునికి రష్యా 19 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఆక్స్‌ఫర్డ్ షైర్‌లోని బాన్‌బరీకి చెందిన ఆండర్సన్ గతేడాది రష్యా దళాలకు దొరికాడు. అతను అక్రమంగా సరిహద్దు దాటి తమ భూభాగంలోకి ప్రవేశించాడని, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించాడని కుర్స్క్ ప్రాంతంలో తమ పౌరులపై నేరాలకు పాల్పడ్డారని పలు అభియోగాలు మోపారు. వాటిని ఆండర్సన్ అంగీకరించాడని కోర్టు ప్రకటించింది. సంకెళ్లతో కటకటాల వెనుక ఉన్న అతని ఫొటోను విడుదల చేశారు. దీన్ని బ్రిటన్ ఒక ప్రకటనలో ఖండించింది. ఆండర్సన్‌పై తప్పుడు అభియోగాలు మోపారని ఆరోపించింది. అతన్ని యుద్ధఖైదీగా పరిగణించి తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. యుద్ధ ఖైదీలను రాజకీయ, ప్రచార ప్రయోజనాల కోసం వాడుకోవడం మానాలని హితవు పలికింది. బ్రిటిష్ పౌరులు గతంలోనూ రష్యాకు పట్టుబడ్డా వారంతా రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లోనే దొరికారు. రష్యాలో పట్టుబడి శిక్ష పడ్డ తొలి విదేశీ సైనికుడిగా ఆండర్సన్ నిలిచాడు.

యూఏఈలో ఇద్దరు కేరళవాసుల ఉరితీత

కుటుంబీకుల సమక్షంలో అంత్యక్రియలు పూర్తి

న్యూఢిల్లీ: హత్య కేసుల్లో దోషులుగా తేలిన ఇద్దరు భారతీయులకు యూఏఈ మరణశిక్ష అమలు చేసింది. వారిని కేరళకు ముహమ్మద్ రినాష్ అరంగిలొత్తు, మురళీధరన్ పెరుంతట్ట వలప్పిల్‌గా గుర్తించారు. వీరిలో రినాష్‌తో పాటు గత నెలలో అబుదాబిలో ఉరి తీసిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన షహజాదీ ఖాన్ (30) అనే మహిళ భౌతికకాయాలకు యూఏఈ నిబంధనల మేరకు అక్కడే అంత్యక్రియలు కూడా పూర్తయ్యాయి. వారి కుటుంబ సభ్యుల సమక్షంలో గురువారం ఈ కార్యక్రమాలు జరిగినట్టు విదేశాంగ శాఖ తెలిపింది. తన సంరక్షణలో ఉన్న నాలుగు నెలల చిన్నారిని హత్య చేసినందుకు షెహజాదీకి ఉరిశిక్ష పడింది. రినాశ్, మురళీధరన్ ఉరిశిక్షలను యూఏఈలోని అత్యున్నత న్యాయస్థానం కాసేషన్ సమర్థించింది. భారత రాయబార కార్యాలయానికి ఈ మేరకు ఫిబ్రవరి 28న సమాచారం అందించింది. క్షమాభిక్ష అభ్యర్థనలతోపాటు అన్నివిధాలా ప్రయత్నించినా ఉరి శిక్షలను ఆపడం సాధ్యపడలేదు. ఓ భారతీయుడిని హత్య చేసినందుకు మురళీధరన్‌కు శిక్ష పడింది. ఆయన 2009 నుంచి జైల్లోనే ఉన్నారు. ఎమిరేట్స్ పౌరుడి హత్య కేసులో రినాష్‌కు మరణశిక్ష పడింది.

'ఎల్ అండ్ టీ'లో ఒకరోజు నెలసరి సెలవు

మహిళా దినోత్సవం వేళ సంస్థ ప్రకటన

ముంబై: వేల మంది ఉద్యోగినులకు ఉపాధి కల్పించిన ఇంజనీరింగ్, నిర్మాణరంగ దిగ్గజ సంస్థ లార్సెన్ అండ్ టూబ్రో(ఎల్అండ్‌టీ) సంస్థ గురువారం మహిళా ఉద్యోగులకు ఒక సానుకూల కబురు అందించింది. నెలసరి సమయంలో ఒకరోజు పెయిడ్ లీవ్ ఇస్తున్నట్లు ప్రకటించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం(మార్చి 8) సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎల్ అండ్ టీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ ఈ ప్రకటన చేశారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దేశంలో ఎల్అండ్‌టీ వంటి దిగ్గజ కార్పొరేట్ సంస్థ ఒకటి ఇలా నెలసరి పెయిడ్ లీవ్ ఇవ్వడం ఇదే తొలిసారి. పెయిడ్ లీవ్ విధానాన్ని ఏ తరహాలో అమలుచేస్తారనే వివరాలను కంపెనీ ఇంకా వెల్లడించలేదు. అయితే ఎల్అండ్‌టీ మాతృసంస్థలో పనిచేసే మహిళలకే ఈ లీవ్ సౌకర్యం ఉంటుందని తెలుస్తోంది. ఎల్అండ్‌టీ అనుబంధ విభాగాలైన ఆర్థిక సేవలు లేదా టెక్నాలజీ వంటి విభాగాల్లో చేసే ఉద్యోగినులకు ఈ సౌకర్యం ఉండకపోవచ్చని ఆయా వర్గాలు స్పష్టంచేశాయి. ప్రస్తుతం ఎల్అండ్‌టీలో 60,000 మంది ఉద్యోగులు ఉండగా వారిలో 9 శాతం అంటే దాదాపు 5,000 మంది మహిళలు ఉన్నారు.

సాక్షి ప్లస్
శుక్రవారం: 7-3-2025

సర్కారియా కమిషన్ ముఖ్య సిఫార్సులు?

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

వివాదాలు - సమీక్షా కమిషన్లు

కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో తలెత్తిన వివాదాలను పరిశీలించి, పరిష్కరించడానికి అనేక కమిటీలను, కమిషన్లను నియమించారు. ఈ కమిటీలు వాటికి నిర్దేశించిన పరిధిలో కొన్ని సిఫార్సులు చేశాయి.
వాటిలో ముఖ్యమైనవి...

పరిపాలనా సంస్కరణల సంఘం (1966)

కేంద్ర ప్రభుత్వం 1966లో ఆరుగురు సభ్యులతో మొరార్జీ దేశాయ్ అధ్యక్షతన పరిపాలనా సంస్కరణల కమిషన్‌ను నియమించింది. (మొరార్జీ దేశాయ్ రాజీనామా చేయడం వల్ల కె.హనుమంతయ్య ఈ కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు). ఈ కమిటీ కేంద్ర రాష్ట్ర సంబంధాలను సమగ్రంగా పరిశీలించింది.

కేంద్ర, రాష్ట్ర సంబంధాల కోసం ఎం.సి. సెతల్వాడ్ అధ్యక్షతన ఒక అధ్యయన బృందాన్ని కూడా నియమించారు. పరిపాలనా సంస్కరణల సంఘం తుది నివేదికను 1969లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో 22 సిఫార్సులు చేసింది.

- ప్రకరణ 263 ప్రకారం, అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- ప్రజా జీవితంలో, పరిపాలనలో అనుభవం ఉన్న వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి.
- రాష్ట్రాల కోరిక మేరకే కేంద్ర బలగాలను పంపాలి.
- రాష్ట్రాలకు మరిన్ని ఆర్థిక వనరులను బదిలీ చేయాలి.

అయితే ఈ సిఫార్సులపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

రాజమన్నార్ కమిటీ (1969)

1969లో తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ పి.వి. రాజమన్నార్ అధ్యక్షతన, ఇద్దరు సభ్యులతో కేంద్ర, రాష్ట్ర సంబంధాల పరిశీలనకు ఒక కమిటీని నియమించింది. ఇది 1971లో నివేదికను సమర్పించింది. దీనిలోని ఇతర సభ్యులు లక్ష్మణస్వామి మొదలియార్, పి. చంద్రారెడ్డి.

ఇది దేశంలో ఉన్న ఏక కేంద్ర ధోరణులకు కారణాలను గుర్తించింది. అవి

- రాజ్యాంగం కేంద్రానికి ఇచ్చిన ప్రత్యేక అధికారాలు
- కేంద్రం, రాష్ట్రంలోనూ ఏక రాజకీయ పార్టీ పాలన
- రాష్ట్రాలకు ఆర్థిక వనరులు తగినన్ని లేకపోవడం, కేంద్రం మీద ఆధారపడటం
- కేంద్ర ప్రణాళిక రచన, ప్రణాళికా సంఘం పాలన

సిఫార్సులు

- రాష్ట్ర మంత్రివర్గంతో లేదా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక ఉన్నతాధికార సంఘంతో సంప్రదించి రాష్ట్రపతి, గవర్నర్‌ను నియమించాలి.
- రాష్ట్ర ప్రభుత్వాన్ని తొలగించి, రాష్ట్రపతి పాలన ప్రకటించే ప్రకరణ 356ను రద్దు చేయాలి.
- గవర్నర్ సంతృప్తి ఉన్నంత వరకే మంత్రివర్గ పదవుల్లో ఉండాలన్న ప్రకరణను తీసివేయాలి.
- కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అవలంబించే ఏకపక్ష నియంతృత్వ చర్యలను నిరోధించడానికి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి రాష్ట్రాలకు తగినన్ని రక్షణలను కల్పించాలి.
- ప్రధాని అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- రాజ్య సభలో రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి.
- కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రాల వారీగా ప్రాతినిధ్యం ఉండాలి.
- ప్రణాళికా సంఘం ఒక శాశ్వత సంస్థగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వ నియంత్రణ తగ్గాలి.
- అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లను రద్దు చేయాలి.
- అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు బదిలీ చేయాలి.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను ప్రముఖ న్యాయ శాస్త్రవేత్తలు తీవ్రంగా విమర్శించారు.

దేశంలో ఎన్నో వేర్పాటు శక్తులు తలెత్తుతుండగా జాతి నిర్మాణం, జాతి సమైక్యతా క్రమంలో విద్య, వ్యవసాయ, ఉత్పత్తి రంగాలను విస్తృతం చేసి సామాన్య మానవుని సమస్యలను తీర్చడంలో ప్రయత్నం చేయాల్సి ఉండగా ప్రాంతీయతత్వాన్ని బలోపేతం చేసే విధంగా సిఫార్సులు చేయడం అవాంఛనీయం అని పేర్కొన్నారు.



ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానం (1973)

1973లో పంజాబ్‌లో అకాలీదళ్ పార్టీ ఆనందపూర్ అనే ప్రాంతంలో ఒక తీర్మానాన్ని చేసింది. రక్షణ, అంతర్జాతీయ సంబంధాలు, కమ్యూనికేషన్లు, కరెన్సీ మొదలైన విషయాలకే కేంద్ర ప్రభుత్వ పరిధి పరిమితం కావాలని, దేశంలో నిజమైన సమాఖ్య స్ఫూర్తి తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

పశ్చిమబెంగాల్ ప్రభుత్వ మెమొరెండం (1977)

1977లో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై ఒక విజ్ఞాపన సమర్పించింది. అందులోని కొన్ని ముఖ్యాంశాలు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

- రాజ్యాంగంలో యూనియన్ అనే పదాన్ని తొలగించి సమాఖ్య అనే పదాన్ని చేర్చాలి.
- కొత్త రాష్ట్రాల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోనికి తీసుకోవాలి.
- అఖిల భారత సర్వీసులను రద్దు చేయాలి.
- రాష్ట్రపతి పాలన, అలాగే ఆర్థిక అత్యవసర పరిస్థితి అధికారాలను తొలగించాలి.
- కేంద్ర ప్రభుత్వ అధికార పరిధిని కుదించాలి.
- రాజ్యసభకు లోక్‌సభతో సమానంగా అధికారాలు ఇవ్వాలి.
- జోనల్ కౌన్సిల్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలి.
- శాశ్వత ప్రాతిపదికపై అంతర్రాష్ట్ర ప్రభుత్వ మండలిని ఏర్పాటు చేయాలి.
- జాతీయాభివృద్ధి మండలి పేరును జాతీయ ఆర్థికాభివృద్ధి మండలిగా మార్చి అస్తిత్వాన్ని పరిరక్షించాలి.
- ఆర్థిక నిపుణులనే ఆర్థిక సంఘ సభ్యులుగా నియమించాలి.
- భారతదేశ సమష్టి సంస్కృతిని సంరక్షించడానికి జాతీయ కార్యక్రమాలను ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేయాలి.
- అవశిష్ట అంశాలపై పన్నులు విధించే శాసన నిర్మాణ అధికారాన్ని పార్లమెంటుకు అప్పగించాలి.
- కార్పొరేషన్ పన్నుల్లో కొంత భాగాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలి.
- రాష్ట్రాలతో సంప్రదించి ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసు, ఇండియన్ హెల్త్ సర్వీస్, ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రాల అనుమతి లేకుండా కేంద్ర బలగాలను పంపొద్దు.
- ఉమ్మడి జాబితాలో చట్టాలను రూపొందించే సమయంలో కేంద్రం రాష్ట్రాలను సంప్రదించాలి.
- గవర్నర్ నియామక సమయంలో ముఖ్యమంత్రిని విధిగా సంప్రదించే విధంగా రాజ్యాంగ సవరణ చేయాలి.
- త్రిభాషా సూత్రాన్ని అమలుపరిచేందుకు గట్టి ప్రయత్నం చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీసు చార్జీలను ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే విధించాలి.
- భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రత్యేక కమిషన్‌ను నియమించి క్రియాత్మకం చేయాలి.
- రేడియో, టెలివిజన్‌లకు స్వయం ప్రతిపత్తి అవసరం లేదు. అయితే వాటి పని తీరును వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్థిక సంఘం, ప్రణాళికా సంఘం మధ్య ప్రస్తుత విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది. దాన్ని కొనసాగించాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ వేసే సందర్భంలో పార్లమెంటు అనుమతి తీసుకోవాలి.
- రాష్ట్ర ఎగువసభ రద్దు లేదా ఏర్పాటు విషయంలో పార్లమెంట్ నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయాన్ని తెలపాలి.

గాడ్గిల్ ఫార్ములా

సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ సక్రమంగా జరగాల్సిన ఆవశ్యకత ఉంది. కేంద్ర ప్రణాళికా సహాయాన్ని రాష్ట్రాలకు అందించే ప్రాతిపదికను ప్రణాళిక సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ డి.ఆర్.గాడ్గిల్ పేరుతో 1971లో ఓ ఫార్ములాను రూపొందించారు. దీన్ని 1981లో ఒకసారి, తిరిగి 1992లో మరోసారి సమీక్షించారు. డి.ఆర్.గాడ్గిల్ ఫార్ములా అనుసరించి జనాభా ఆధారంగా 60 శాతం, తలసరి ఆదాయం ఆధారంగా 25 శాతం, ఆదాయ, వ్యయాలను సరిచూసుకుని విత్తలోటు తగ్గించినందుకు 7.5 శాతం, ఇతర సమస్యల (ఎడారి ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, శిశు మరణాలు, ఆరోగ్యం మొదలైనవి) ఆధారంగా 7.5 శాతం కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు సహాయాన్ని అందిస్తుంది. అయితే వెనకబడ్డ, పేద రాష్ట్రాలకు ఈ ఫార్ములా అంత ఉపయోగకరంగా లేదు. విత్త రంగంలో చూపిన క్రమశిక్షణను ఈ ఫార్ములా ప్రోత్సాహపరుస్తున్నట్లుగా లేదని కొందరు విమర్శిస్తున్నారు.

సర్కారియా కమిషన్ సిఫార్సులు (1987)

1983లో కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఆర్.ఎస్. సర్కారియా అధ్యక్షతన బి.శివరామన్, ఎస్.ఆర్.సేన్ సభ్యులుగా, కార్యదర్శిగా ఆర్.ఎం. సుబ్రహ్మణ్యం, రాజ్యాంగ సలహాదారుడుగా ఎల్.ఎన్.సిన్హాతో ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ 1987 అక్టోబర్ 27న 247 సిఫార్సులతో కూడిన 1600 పేజీల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. 1988 జనవరిలో ప్రభుత్వం సర్కారియా కమిషన్ నివేదికను విడుదల చేసింది. అందులో 230 సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయాలను తీసుకుంది. మొత్తం సిఫారసుల్లో 170 సిఫార్సులను అమలు చేసింది.

ముఖ్య సిఫార్సులు

- గవర్నర్‌ల నియామకంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులను సంప్రదించాలి.
- రాజకీయేతర రంగాలను చెందిన, వివాదాస్పదం కాని వ్యక్తులను, ప్రముఖులను మాత్రమే గవర్నర్‌లుగా నియమించాలి. రాష్ట్రేతర వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి.
- ముఖ్యమంత్రి నియామకం, రాష్ట్రమంత్రి మండలి కొనసాగింపు విషయంలో విధాన సభ మెజారిటీ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకోవాలి. అరుదైన సందర్భాల్లో రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టాలి.
- అఖిల భారత సర్వీసులను మరింత బలోపేతం చేసి, మరిన్ని కొత్త సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీసు చార్జీలను ప్రత్యేక సందర్భాల్లోనే విధించాలి.
- భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రత్యేక కమిషన్‌ను నియమించి క్రియాత్మకం చేయాలి.
- రేడియో, టెలివిజన్‌లకు స్వయంప్రతిపత్తి అవసరంలేదు. అయితే వాటి పనితీరును వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్థికసంఘం, ప్రణాళికా సంఘం మధ్య ప్రస్తుత విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది. దీనిని కొనసాగించాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ వేసే సందర్భంలో పార్లమెంటు అనుమతి తీసుకోవాలి.
- రాష్ట్ర ఎగువసభ రద్దు లేదా ఏర్పాటు విషయంలో పార్లమెంటు నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయాన్ని తెలపాలి.

తరగతి గదిలో ఉపాధ్యాయుడు ఎలా ఉండాలి?

మాదిరి ప్రశ్నలు

1. మీరు ఉన్న సమూహానికి ఒక పని అప్పగిస్తే..?
   1) ఎవరు ఏ పని చేయాలో పురమాయిస్తాను
   2) మిగిలిన వారు ఏవిధంగా చేయమంటే ఆవిధంగా చేస్తాను
   3) నా పనేదో నేను సరిగ్గా చేసుకుంటాను, బాధ్యత తీసుకోను
   4) మిగిలిన వారు పని ఏవిధంగా చేస్తున్నారో గమనిస్తాను
2. ఒక విద్యార్థి వేసిన ప్రశ్నకు సరైన సమాధానం తెలియకపోతే ఉపాధ్యాయుడిగా మీరు ఏం చేస్తారు?
   1) విద్యార్థిని నిరుత్సాహపరుస్తాను
   2) వెనుకాడకుండా ఏదో ఒక సమాధానం చెబుతాను
   3) విషయం నుంచి విద్యార్థిని పక్కదోవ పట్టిస్తాను
   4) నిస్సంకోచంగా తెలియదని ఒప్పుకుంటాను
3. మీరు బోధించే ఒక భావన విద్యార్థులకు అర్థం కానప్పుడు ఏం చేస్తారు?
   1) అభ్యాసం ద్వారా ప్రయత్నిస్తాను
   2) ఆ భావనను మరిన్ని ఉదాహరణలతో బోధిస్తాను
   3) పరిహారాత్మక బోధన ద్వారా ప్రయత్నిస్తాను
   4) ఆ భావనను విద్యార్థుల పూర్వ అనుభవాలతో అన్వయించి బోధిస్తాను
4. ప్రతిభావంతుడైన ఉపాధ్యాయుడు కావాలంటే ఎలాంటి స్పృహను కలిగి ఉండాలి?
   1) గ్రంథాలు ఎక్కువ చదవాలి
   2) బోధనా సామర్థ్యాన్ని పెంచుకోవాలి
   3) ప్రధానోపాధ్యాయుడితో సత్సంబంధాలు ఏర్పరచుకోవాలి
   4) తరగతిని అదుపాజ్ఞల్లో ఉంచాలి
5. విశ్రాంతి సమయాన్ని మీరు ఎలా వినియోగించుకుంటారు?
   1) చదువురాని వారికి చదువు చెబుతాను
   2) డబ్బు వచ్చే మార్గం కోసం వినియోగిస్తాను
   3) ఆహ్లాదంగా గడుపుతాను
   4) సరదాలతో కాలక్షేపం చేస్తాను
6. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన విద్యార్థులు?
   1) మందమతులవుతారు
   2) అందరితో కలసి ఉండలేరు
   3) తరగతిలో పాఠాలపై శ్రద్ధ చూపలేరు
   4) తెలివి తేటలతో రాణిస్తారు
7. రాజీవ్ విద్యా మిషన్ పథకం ఏ తరగతుల వారికి బోధనా వసతులను కల్పిస్తోంది?
   1) ప్రాథమిక తరగతుల వారికి
   2) ప్రాథమికోన్నత తరగతుల వారికి
   3) మాధ్యమిక తరగతుల వారికి
   4) కళాశాల విద్యార్థులకు
8. విద్యా లక్ష్యాలను ..... ఆధారంగా నిర్ణయిస్తారు.
   1) ఉపాధ్యాయుడు 2) రాజకీయాలు
   3) సమాజం 4) విద్యార్థి
9. పాఠశాల ముఖ్య ఉద్దేశం ఏమిటి?
   1) విద్యా లక్ష్యాలను సాధించడం
   2) పాఠ్య ప్రణాళికలు తయారు చేయడం
   3) విద్యార్థులను మూల్యాంకనం చేయడం
   4) విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడటం
10. కిందివాటిలో బోధనకు సంబంధించనిది?
    1) నల్లబల్ల 2) హాజరు పట్టిక
    3) పాఠ్యపుస్తకం 4) నోటు పుస్తకం
11. కొంత మంది విద్యార్థులు తరచూ ప్రశ్నలు వేస్తే ఉపాధ్యాయుడు ఏం చేయాలి?
    1) ఊరుకొమ్మని చెప్పాలి
    2) బయటకు వెళ్లగొట్టాలి
    3) ప్రశ్నలన్నింటికీ జవాబులు చెప్పాలి
    4) మిగతా విద్యార్థులకు నష్టం కలుగుతుందని చెప్పాలి
12. కింది ప్రవర్తనల్లో ఉపాధ్యాయుడికి ఏది తక్కువగా ఉండాలి?
    1) చిరునవ్వులు నవ్వడం
    2) విద్యార్థులను గౌరవించడం
    3) అపహాస్యంగా మాట్లాడటం
    4) నిర్ణీత సమయానికి ముందుగానే తరగతి గదికి రావడం
13. ఉపాధ్యాయులు విద్యార్థుల నుంచి సరైన సహకారం, గౌరవం పొందాలంటే ఏం చేయాలి?
    1) సహకరించాలీ, గౌరవించాలని కోరాలి
    2) విద్యార్థులను తరచూ దండించాలి
    3) విద్యార్థులకు మార్గదర్శకులుగా వ్యవహరించాలి
    4) సిలబస్ సకాలంలో పూర్తిచేసి, రివిజన్ చేయాలి
14. విద్యార్థులకు సాధ్యమైనంత ఎక్కువగా స్వేచ్ఛ ఇవ్వాలి-దీనితో మీరు ఏకీభవిస్తారా?
    1) ఏకీభవిస్తాను 2) ఏకీభవించను
    3) కొన్ని సందర్భాల్లో సమర్థిస్తాను
    4) చాలా వరకూ ఏకీభవిస్తాను
15. అభ్యసనకు అనుకూల వాతావరణాన్ని కలుగజేయడం ప్రధానంగా ఎవరి బాధ్యత?
    1) ఉపాధ్యాయులు
    2) ప్రధానోపాధ్యాయుడు
    3) జిల్లా విద్యాశాఖాధికారి
    4) పాఠశాల విద్యా సంచాలకులు
16. గాంధీజీ ఎలాంటి విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు?
    1) ప్రాతిపదిక విద్య
    2) కృత్యాధార విద్య
    3) శిశు కేంద్రీకృత విద్య
    4) ఉపాధ్యాయ కేంద్రీకృత విద్య
17. ముస్లిం విద్యా విధానంలో ఉన్నత విద్యా కేంద్రాన్ని ఏమని పిలిచేవారు?
    1) ఆశ్రమాలు 2) గురుకులాలు
    3) మక్తాబ్ 4) మదర్‌సా
18. భారతీయులపై అత్యంత ప్రభావం చూపిన బ్రిటిష్ విద్యా విధానం ఏది?
    1) ఉడ్ తాఖీదు 2) హార్టింగ్ నివేదిక
    3) మెకాలే ప్రతిపాదనలు
    4) హంటర్ నివేదిక
19. ఉపాధ్యాయులుగా మీరు తరగతి గదిలో క్రమశిక్షణా రాహిత్యాన్ని ఎలా భావిస్తారు?
    1) సహనంతో పర్యవేక్షిస్తాను
    2) కఠినంగా వ్యవహరిస్తాను
    3) ప్రధానోపాధ్యాయుని దృష్టికి తీసుకెళతాను
    4) స్వీయ శిక్షణలో శిక్షణ ఇస్తాను



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

20. కిందివాటిలో సహపాఠ్య కార్యక్రమాల్లో భాగం కానిది ఏది?
    1) ఇంటిపని 2) విజ్ఞానయాత్ర
    3) వక్తృత్వ పోటీ 4) వ్యాసరచన పోటీ
21. తరగతి నిర్వహణలో తరచుగా ఆటంకాన్ని కలిగిస్తున్న విద్యార్థిని ఉపాధ్యాయుడు ఏం చేయాలి?
    1) సమస్యాత్మక విద్యార్థిగా గుర్తించాలి
    2) ప్రవర్తన సమస్యగా గుర్తించి మంత్రణం నిర్వహించాలి
    3) పాఠశాల నుంచి బహిష్కరించాలి
    4) విద్యార్థి తల్లిదండ్రులతో చర్చించాలి
22. పాఠశాల స్థాయి విద్యార్థులకు ఉత్తమ గుణాత్మక విద్యను అందించడానికి ఎలాంటి ఉపాధ్యాయుడు అవసరం?
    1) ఉన్నత విద్యార్హతలు ఉండాలి
    2) శిక్షణ పొంది ఉండాలి
    3) అనుభవజ్ఞులై ఉండాలి
    4) అంకితభావం ఉండాలి
23. సర్వశిక్షా అభియాన్ పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఏ విషయంలో బాగా అభివృద్ధి జరిగిందని చెప్పొచ్చు?
    1) పాఠశాలల్లో విద్యార్థుల నమోదు
    2) ఉపాధ్యాయుల నియామకం
    3) పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
    4) డ్రాపవుట్ విద్యార్థుల సంఖ్యను తగ్గించడం
24. ఉపాధ్యాయ విద్యతో పాటు నేర్పించాల్సిన అతి ముఖ్య లక్షణం ఏది?
    1) ఆటలాడటం 2) కళలపై అభిరుచి
    3) క్రమ శిక్షణ 4) జాతీయతాభావం
25. విద్యారంగంలో 'ఆపరేషన్ బ్లాక్ బోర్డ్' అనేది?
    1) నల్లబల్లలకు రంగు వేయడం
    2) ఏకోపాధ్యాయ పాఠశాలను తయారు చేయడం
    3) పాఠశాల కనీస అవసరాలను తీర్చడం
    4) ఉపాధ్యాయ నియామక కార్యక్రమం
26. బోధన లక్ష్యాలను ఎన్నుకునేది ఎవరు?
    1) ప్రధానోపాధ్యాయుడు
    2) ఉపాధ్యాయుడు
    3) విద్యార్థి 4) పైవారందరూ
27. పాఠం చెప్పే ముందు ఉపాధ్యాయుడు ఏం చేయాలి?
    1) పాఠం ఆవశ్యకతను చెప్పాలి
    2) పాఠం క్లిష్టతను తెలపాలి
    3) విద్యార్థులను నిశ్శబ్దంగా ఉండమని కోరాలి
    4) విద్యార్థులను పాఠం వైపు ఆకర్షించాలి
28. తరగతి గదిలో ఉపాధ్యాయుడు ఎలా ఉండాలి?
    1) ఎల్లప్పుడూ గంభీరంగా ఉండాలి
    2) ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండాలి
    3) విద్యార్థులను ఆకట్టుకోవడానికి హాస్య ప్రియత్వాన్ని వినియోగించాలి
    4) తరగతి గదిలో నవ్వకూడదు
29. ఒక విషయాన్ని బోధించే ఉపాధ్యాయుడికి..?
    1) ఆ విషయం పట్ల అవగాహన ఉండాలి
    2) విద్యార్థుల పట్ల అవగాహన ఉండాలి
    3) అన్ని విషయాల్లో అవగాహన ఉండాలి
    4) పైవన్నీ
30. తెలుగు బోధించే ఉపాధ్యాయుడికి..?
    1) తెలుగు గురించి తెలిస్తే సరిపోతుంది
    2) మిగతా బోధనా భాషలు గురించి కూడా తెలియాలి
    3) అన్ని పాఠ్య విషయాల గురించి తెలియాలి
    4) మిగతా పాఠ్యాంశాల గురించి తెలియడం అనవసరం
31. బోధన కంటే అభ్యసనకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే విధానం ఏది?
    1) ఉపాధ్యాయ కేంద్రీకృత బోధన
    2) విద్యార్థి కేంద్రీకృత బోధన
    3) పాఠ్యాంశ కేంద్రీకృత బోధన
    4) పాఠశాల కేంద్రీకృత బోధన
32. విద్యార్థుల్లో సత్ప్రవర్తనను పెంపొందించడానికి ఉపాధ్యాయుడు ఏం చేయాలి?
    1) గొప్పవాళ్ల జీవిత చరిత్రలు చదవమని కోరాలి
    2) సత్ప్రవర్తన గురించి తరచూ ఉపన్యసించాలి
    3) సందర్భోచితంగా సత్ప్రవర్తన గురించి చర్చించాలి
    4) సత్ప్రవర్తన కలిగి ఉండాలి
33. ఉపాధ్యాయుడు తన వ్యక్తిగత ఇబ్బందులను..?
    1) తరగతి గదిలో ప్రదర్శించాలి
    2) తరగతి గదిలో మరచిపోవాలి
    3) పాఠశాలలో వ్యక్తీకరించుకోవాలి
    4) పాఠశాల బయటనే విడిచిపెట్టాలి
34. ఉపాధ్యాయుడు తోటి ఉపాధ్యాయులతో కలిసి మెలిసి ఉండాలి. ఎందుకంటే..?
    1) విశ్రాంతి సమయంలో కాలక్షేపం చేయొచ్చు
    2) విద్యార్థుల ప్రయోజనాలు నేరవేరుతాయి
    3) మేనేజ్‌మెంట్‌తో సమైక్యంగా పోరాడవచ్చు
    4) అలాగైతే గొడవలు జరగవు
35. 'పాఠశాలే విద్యార్థి దగ్గరికి వెళ్లడం' ఎందులో సాధ్యమవుతుంది?
    1) నియత విద్య 2) అనియత విద్య
    3) వయోజన విద్య 4) ఏదీకాదు
36. పాఠం చెప్పేటప్పుడు మీరు కొన్ని విషయాలను నల్లబల్లపై రాశారు. పాఠం పూర్తయిన తర్వాత ఏం చేస్తారు?
    1) ఆ అంశాలను నల్లబల్లపై అలాగే ఉండనిస్తాను
    2) తుడిచేస్తాను
    3) విద్యార్థుల ఇష్టానికే వదిలేస్తాను
    4) అలాగే ఉండనివ్వమని విద్యార్థులకు చెబుతాను

సమాధానాలు

1) 1; 2) 4; 3) 4; 4) 2; 5) 1; 6) 2; 7) 3; 8) 3; 9) 4; 10) 2; 11) 4; 12) 3; 13) 3; 14) 4; 15) 1; 16) 1; 17) 4; 18) 3; 19) 4; 20) 1; 21) 2; 22) 2; 23) 3; 24) 3; 25) 3; 26) 2; 27) 4; 28) 3; 29) 4; 30) 3; 31) 2; 32) 4; 33) 4; 34) 2; 35) 2; 36) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో పీజీడీఆర్‌డీఎం కోర్సులో ప్రవేశాలు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్) 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ రూరల్ డెవలప్ మెంట్ మేనేజ్‌మెంట్(పీజీడీఆర్‌డీఎం) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు వ్యవధి:** ఒక సంవత్సరం.
- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక విధానం:** డిగ్రీలో పొందిన మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.04.2025.
- **వెబ్‌సైట్:** https://www.nirdpr.org.in/

ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో పీజీడీఎం-ఆర్ఎం కోర్సులో ప్రవేశాలు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్).. 2025-27 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్-రూరల్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం-ఆర్ఎం) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్(ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 45 శాతం)తో పాటు క్యాట్/గ్జాట్/మ్యాట్ /సీమ్యాట్/జీమ్యాట్/ఏటీఎంఏ/సీయూఈటీ పీజీ/మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్ ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.04.2025.
- **వెబ్‌సైట్:** https://www.nirdpr.org.in/

వాయు నాళానికి దగ్గరగా ఉండే వినాళ గ్రంథి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

నాడీ వ్యవస్థ, సమన్వయం, ప్రత్యుత్పత్తి, సహజ వనరులు

1. శరీరంలో టెలిఫోన్ వైర్లలా పనిచేసేవి?
ఎ) జ్ఞానేంద్రియాలు బి) రక్తనాళాలు
సి) నాడులు డి) కండరాలు
2. నాడీకణంలో మాత్రమే ఉన్న ప్రత్యేక కణికలు?
ఎ) రాంసన్ బి) నిస్సల్స్
సి) రాబర్ట్ డి) ష్వాన్
3. పోలియో వ్యాధిలో నశించే నాడీ కణాలు?
ఎ) జ్ఞాన నాడీ కణాలు
బి) చాలక నాడీ కణాలు
సి) అభివాహి కణాలు డి) ఎ, సి
4. మానవునిలోని వెన్నునాడుల సంఖ్య?
ఎ) 30 జతలు బి) 30
సి) 31 డి) 31 జతలు
5. మానవునిలోని కపాలనాడుల సంఖ్య?
ఎ) 12 జతలు బి) 10 జతలు
సి) 31 జతలు డి) 43 జతలు
6. మానవునిలో పరధీయ నాడుల సంఖ్య?
ఎ) 43 బి) 10 జతలు
సి) 31 జతలు డి) 43 జతలు
7. వెన్నునాడులన్నీ?
ఎ) జ్ఞాన నాడులు బి) చాలక నాడులు
సి) అపవాహి నాడులు డి) మిశ్రమ నాడులు
8. మెదడును భద్రపర్చే నిర్మాణం?
ఎ) కపాలం బి) అస్థిపంజరం
సి) కటివలయం డి) శ్రోణివలయం
9. మెదడులో మస్తిష్కంగా పిలిచే భాగం?
ఎ) ముందు మెదడు బి) మధ్య మెదడు
సి) వెనుక మెదడు డి) అనుమస్తిష్కం
10. శ్వాసక్రియ, హృదయ స్పందన, రక్తపీడనం లాంటి చర్యలను నియంత్రించే మెదడు భాగం?
ఎ) ద్వారగోర్థం బి) అనుమస్తిష్కం
సి) మజ్జాముఖం డి) మస్తిష్కం
11. మెదడులోని ద్వారగోర్థానికి సంబంధించింది?
ఎ) భావావేశాలు బి) తెలివితేటలు
సి) శరీర సమతాస్థితి డి) దృష్టి
12. మెదడులోని ఏ భాగం వివిధ రకాల అనుభూతులను తనలో ఇముడ్చుకుంటుంది?
ఎ) మస్తిష్కం బి) ద్వారగోర్థం
సి) మజ్జాముఖం డి) అనుమస్తిష్కం
13. ప్రతీకార చర్యా చాపంలోని భాగాలు?
ఎ) గ్రాహకం, జ్ఞాననాడీ
బి) మధ్యస్త నాడీకణం, చాలకనాడీ
సి) నిర్వాహకాంగం డి) పైవన్నీ
14. అసంకల్పిత ప్రతీకార చర్యలు నాడీ మండలంలో దేని ఆధీనంలో ఉంటాయి?
ఎ) మజ్జాముఖం బి) అనుమస్తిష్కం
సి) హైపోథలామస్ డి) వెన్నుపాము
15. మెదడు ఏ భాగం వెన్నుపాముగా మారుతుంది?
ఎ) ద్వారగోర్థం బి) హైపోథలామస్
సి) మజ్జాముఖం డి) మస్తిష్కం
16. శరీరం తీసుకునే మొత్తం ఆక్సిజన్‌లో ఎంత శాతం మెదడు వినియోగించుకుంటుంది?
ఎ) 2 బి) 20 సి) 25 డి) 40



17. అతి ప్రధాన వినాళ గ్రంథి ఏది?
ఎ) పీయూష గ్రంథి బి) అడ్రినల్ గ్రంథి
సి) క్లోమం డి) అవటు గ్రంథి
18. మధుమేహానికి సంబంధించిన గ్రంథి?
ఎ) కాలేయం బి) క్లోమం
సి) అడ్రినల్ గ్రంథి డి) పీయూష గ్రంథి
19. వాయు నాళానికి దగ్గరగా ఉండే వినాళ గ్రంథి?
ఎ) పీయూష గ్రంథి బి) అవటు గ్రంథి
సి) పార్శ్వ అవటు గ్రంథులు డి) క్లోమం
20. ADHగా పిలిచే హార్మోన్?
ఎ) ఇన్సులిన్ బి) గ్లూకగాన్
సి) ఆక్సిటోసిన్ డి) వాసోప్రెసిన్
21. మూత్రంలో గ్లూకోజ్‌కు కారణం?
ఎ) దేహంలో ఇన్సులిన్ లోపం
బి) ఇన్సులిన్ అధికస్రావం
సి) టెస్టోస్టిరాన్ అల్పస్రావం డి) ఏదీకాదు
22. జీవక్రియా రేటును ప్రభావితం చేసే హార్మోన్?
ఎ) ఇన్సులిన్ బి) థైరాక్సిన్
సి) పారాథార్మోన్ డి) కార్టిసాల్
23. దేహంలో మిశ్రమ గ్రంథి అని దేని అంటారు?
ఎ) క్లోమం బి) అవటు గ్రంథి
సి) ముష్కం డి) స్త్రీ బీజ కోశం
24. కింది వాటిలో స్త్రీ హార్మోన్?
ఎ) ఈస్ట్రోజన్ బి) ప్రొలాక్టిన్
సి) ఆక్సిటోసిన్ డి) పైవన్నీ
25. భావావేశాలను నియంత్రించే వినాళ గ్రంథి ఎక్కడ ఉంటుంది?
ఎ) మెదడు దగ్గర బి) గొంతు ప్రాంతంలో
సి) మూత్ర పిండం మీద
డి) జీర్ణాశయం కింద
26. ఫలాల పరిపక్వతకు మొక్కల్లో ఏ ఫైటో హార్మోన్ సహాయ పడుతుంది?
ఎ) ఆక్సిన్ బి) జిబ్బరెల్లిన్
సి) ఇథిలిన్ డి) ABA
27. పత్రాలు, పుష్పాలు ఎక్కువ కాలం తాజాగా ఉండడానికి సాయపడే హార్మోన్?
ఎ) సైటోకైనిన్ బి) ఇథిలిన్
సి) జిబ్బరెల్లిన్ డి) ఆక్సిన్
28. బాష్పోత్సేకాన్ని నిరోధించి పత్ర రంధ్రాలు మూసుకోవడానికి సాయపడే మొక్క హార్మోన్?
ఎ) ఆక్సిన్ బి) అబ్‌సైసికామ్లం
సి) ఇథిలిన్ డి) సైటోకైనిన్
29. విత్తనాలలో సుప్తావస్థను తొలగించి అవి మొలకెత్తడానికి సాయపడే హార్మోన్?
ఎ) ఆక్సిన్ బి) జిబ్బరెల్లిన్
సి) అబ్‌సైసికామ్లం డి) సైటోకైనిన్
30. డార్విన్ ఏ ఫైటో హార్మోన్ సంబంధిత ప్రయోగం చేశాడు?
ఎ) ABA బి) ఇథిలిన్
సి) ఆక్సిన్ డి) జిబ్బరెల్లిన్
31. పరాగనాళం అండాన్ని చేరటంలో చూపే అనువర్తన చలనాలు ఏ రకానికి చెందినవి?
ఎ) కాంతి బి) రసాయన
సి) గురుత్వ డి) నీటి
32. నులితీగల్లో సాధారణంగా కనిపించే అనువర్తనం?
ఎ) గురుత్వ బి) నీటి
సి) స్పర్శ డి) ఏదీకాదు
33. ఆకలి సూచనలను నియంత్రించే మెదడులోని భాగం ఏది?
ఎ) మజ్జాముఖం బి) మస్తిష్కం
సి) ద్వారగోర్థం డి) అనుమస్తిష్కం
34. కింది వాటిలో ఆకలిని కలిగించే హార్మోన్?
ఎ) గాస్ట్రిన్ బి) గ్రీలిన్
సి) లెప్టిన్ డి) సెక్రెటిన్
35. మానవునిలో 'రెండో మెదడు'గా పరిగణించే నాడీ వ్యవస్థ కింది ఏ వ్యవస్థలో భాగంగా ఉంటుంది?
ఎ) విసర్జక బి) ప్రసరణ
సి) జీర్ణ డి) ఏదీకాదు
36. ఏ సందర్భంలో అతి త్వరగా రుచిని తెలుసుకోగలుగుతాం?
ఎ) నాలుకపై చక్కెర వేసుకున్నప్పుడు
బి) నాలుకపై చక్కెర ద్రావణాన్ని పోసినప్పుడు
సి) చక్కెరను నాలుకతో అంగిలికి నొక్కి పట్టినప్పుడు
డి) చక్కెరను నమలకుండా వెంటనే మింగినప్పుడు
37. మానవుని దంత ఫార్ములా?
ఎ) $\frac{212}{212}$ బి) $\frac{203}{102}$
సి) $\frac{314}{314}$ డి) $\frac{2311}{1231}$
38. మానవుని నోటిలో ఉండే రదనికల సంఖ్య?
ఎ) 8 బి) 16 సి) 32 డి) 4
39. మానవుని పైదవడపై ఉన్న కుంతకాల సంఖ్య?
ఎ) 4 బి) 8 సి) 16 డి) 32
40. దవడలోని అంతర కండరాల కదలికను నియంత్రించే కపాలనాడి?
ఎ) 3వ బి) 5వ సి) 7వ డి) 10వ
41. గడ్డి → మిడత → కప్ప → పాము→గద్ద పై ఆహార గొలుసులో ద్వితీయ వినియోగదారి ఎవరు?
ఎ) మిడత బి) కప్ప
సి) పాము డి) గద్ద
42. ఎల్లప్పుడూ నిటారుగా ఉండే జీవావరణ పిరమిడ్?
ఎ) సంఖ్యా పిరమిడ్
బి) జీవ ద్రవ్యరాశి పిరమిడ్
సి) శక్తి పిరమిడ్ డి) ఏదీకాదు
43. ఆహార గొలుసులో శాఖాహారులను ఏమని పిలుస్తారు?
ఎ) ఉత్పత్తిదారులు
బి) ప్రాథమిక వినియోగదారులు
సి) విచ్ఛిన్నకారులు
డి) సర్వభక్షకులు
44. ఆవరణ వ్యవస్థలో శక్తికి మూలం?
ఎ) మొక్కలు బి) జంతువులు
సి) సూర్యుడు డి) బ్యాక్టీరియా
45. మొక్కలు వేటికోసం పోటీపడవు?
ఎ) నీరు బి) స్థలం
సి) ఆహారం డి) ఏదీకాదు
46. ఆహార గొలుసు వేటితో ప్రారంభమవుతుంది?
ఎ) ఉత్పత్తిదారులు బి) విచ్ఛిన్నకారులు
సి) వినియోగదారులు డి) మాంసాహారులు
47. తక్కువ కాలంలో ఎక్కువ మొక్కలను తయారుచేసే పద్ధతి?
ఎ) ఛేదనం బి) అంటుతొక్కడం
సి) అంటుకట్టడం డి) కణజాల వర్ధనం
48. 'అంటుకట్టడం' అనే ప్రక్రియలో వాంఛిత లక్షణాలు ఉండే మొక్క భాగం?
ఎ) స్టాక్ బి) ఎక్స్‌ప్లాంట్
సి) సయోన్ డి) సక్కర్
49. ఈ కింది ఏ మొక్క పత్రాల నుంచి చిన్న మొక్కలు ఏర్పడుతాయి?
ఎ) ఉల్లి బి) పసుపు
సి) రణపాల డి) క్యారట్
50. ఈ కిందివాటిలో అంతర ఫలదీకరణం వేటిలో జరుగుతుంది?
ఎ) కప్ప బి) వానపాము
సి) మానవుడు డి) చేప
51. మానవునిలో శుక్రకణాలు ఎక్కడ ఏర్పడతాయి?
ఎ) శుక్రవాహికలలో
బి) శుక్రనాళికలలో
సి) శుక్రోత్పాదక నాళికలలో
డి) మేహనంలో
52. మానవునిలో గర్భావధికాలం?
ఎ) 600 రోజులు బి) 150 రోజులు
సి) 280 రోజులు డి) 100 రోజులు
53. జరాయువు వేటినుంచి ఏర్పడుతుంది?
ఎ) పిండకణాలు బి) తల్లికణాలు
సి) పరాయువు డి) పైవన్నీ
54. శిశుజననం తర్వాత గర్భాశయ కండరాల సంకోచం, జరాయువును బయటకు నెట్టేంతవరకు జరిగే ప్రక్రియను ఏమంటారు?
ఎ) అండోత్సర్గం బి) రుతుస్రావం
సి) జననాంతరం డి) గర్భావధికాలం
55. మొక్క అండంలోని పిండకోశంలో కణాల సంఖ్య?
ఎ) 5 బి) 6 సి) 7 డి) 8
56. ఈ కిందివాటిలో అంకురచ్ఛదరహిత విత్తనం?
ఎ) మొక్కజొన్న బి) ఆముదం
సి) చిక్కుడు డి) వరి
57. ఈ కిందివాటిలో వైరస్ ద్వారా సంక్రమించే లైంగిక వ్యాధి?
ఎ) గనేరియా బి) సిఫిలిస్
సి) ఎయిడ్స్ డి) పైవన్నీ
58. స్త్రీలలో గర్భనిరోధక పద్ధతి?
ఎ) కాపర్ - T బి) ట్యూబెక్టమీ
సి) వాసెక్టమీ డి) ఎ, బి
59. మొక్కల శాఖీయ వ్యాప్తిలో పాల్గొనని భాగం?
ఎ) వేరు బి) కాండం
సి) పుష్పం డి) పత్రం
60. మానవునిలో ఫలదీకరణం జరిగే ప్రాంతం?
ఎ) గర్భాశయం బి) స్త్రీ బీజకోశం
సి) ముష్కం
డి) ఫాలోపియన్ నాళం
61. కాంటూర్ పట్టీ పంటల ప్రయోజనం?
ఎ) జల సంరక్షణ బి) నేల సంరక్షణ
సి) వాయు సంరక్షణ డి) ఏదీకాదు
62. ఆహారజాలకం వేటి కలయిక వల్ల ఏర్పడుతుంది?
ఎ) మొక్కలు బి) జంతువులు
సి) ఆహార గొలుసులు
డి) బ్యాక్టీరియాలు
63. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా చైనా ప్రభుత్వం ఏ పక్షిని అంతరింపజేసింది?
ఎ) పావురం బి) పిచ్చుక
సి) బాతు డి) కోకిల
64. ఆహార గొలుసులోకి కాలుష్యాలు చేరడం?
ఎ) యుట్రోఫికేషన్
బి) జైవిక వృద్ధీకరణం
సి) జైవిక వ్యవస్థాపనం
డి) నైట్రిఫికేషన్
65. మినిమేటా వ్యాధికి కారణం అయిన కాలుష్య కారకం?
ఎ) లెడ్ బి) పాదరసం
సి) ఆర్సెనిక్ డి) కాడ్మియం
66. పర్యావరణ సంరక్షణకు అవసరమయ్యే 3Rలకు సంబంధించింది?
ఎ) Reduce బి) Reuse
సి) Recycle డి) పైవన్నీ
67. కిందివాటిలో పునరుద్ధరించదగిన వనరు?
ఎ) పెట్రోలు బి) బొగ్గు
సి) అడవి డి) సహజ వాయువు
68. సంయోగ బీజాలు ఏర్పడటానికి జరిగే విభజన?
ఎ) సమ విభజన బి) అసమ విభజన
సి) క్షయకరణ విభజన డి) ద్విదావిచ్ఛిత్తి
69. ఈ కింది ఏ కణాలు ఎప్పటికీ విభజన చెందవు?
ఎ) గుండె కణాలు బి) రక్త కణాలు
సి) నాడీ కణాలు డి) ఎ, సి
70. కణచక్రంలోని 'అంతరదశ'లో దశలు?
ఎ) G_1, S, G_2 బి) G_1, S, M
సి) M, G_1, G_2 డి) S, G_1

సమాధానాలు

1) సి; 2) బి; 3) బి; 4) డి; 5) ఎ; 6) డి; 7) డి; 8) ఎ; 9) ఎ; 10) సి; 11) ఎ; 12) ఎ; 13) డి; 14) డి; 15) సి; 16) బి; 17) ఎ; 18) బి; 19) బి; 20) డి; 21) ఎ; 22) బి; 23) ఎ; 24) డి; 25) సి; 26) సి; 27) ఎ; 28) బి; 29) బి; 30) సి; 31) బి; 32) సి; 33) సి; 34) బి; 35) సి; 36) సి; 37) ఎ; 38) డి; 39) ఎ; 40) బి; 41) బి; 42) సి; 43) బి; 44) సి; 45) సి; 46) ఎ; 47) డి; 48) సి; 49) సి; 50) సి; 51) సి; 52) సి; 53) డి; 54) సి; 55) సి; 56) సి; 57) సి; 58) డి; 59) సి; 60) డి; 61) బి; 62) సి; 63) బి; 64) సి; 65) బి; 66) డి; 67) సి; 68) సి; 69) డి; 70) ఎ.

Command that fixes the minor errors..



BANK EXAMS

COMPUTER AWARENESS

1. A technique used by codes to convert an analog signal into a digital bit stream is known as:
a) Pulse code modulation
b) Pulse stretcher
c) Query processing
d) Queue management
e) None of these
2. The most important or powerful computer in a typical network is:
a) desktop b) network client
c) network server
d) network station
e) my computer
3. In MS word what is the short curt of Ctrl + L?
a) Left Align b) Left Indent
c) Increase Left Margin
d) Decrease Left Margin
e) None
4. Which of the following can NOT be used to create parallel style column?
a) Format Tabs
b) Table Insert Table
c) Insert Textbox
d) Format Columns
e) None of these
5. An Internet standard for transferring files is known as:
a) IRC b) Telnet c) FTP
d) WAIS e) None of these
6. Another name for electronic cash or e-cash, the Internet equivalent to traditional cash, is:
a) Cybercast and analog cash
b) Digital cash and cybercom
c) Carders and cybercom
d) Cybercast and digital cash
e) None of these
7. This type of e-commerce often takes the form of an electronic version of the classified ads or an auction:
a) B2C b) C2C c) G2C
d) B2B e) None of these
8. The command that fixes the minor errors of the disk:
a) Error.fix b) Scandisk
c) Chkdsk d) Defrag
e) None of these
9. What is a LAN that has one or more dedicated computers and all others act as recipients?
a) Peer-to-peer model
b) Client/server model
c) P-to-p model
d) Ring network e) None
10. If a computer has a(n) ______ port, it does not need a NIC.
a) Internet b) Ethernet
c) Intranet d) Broad band
e) None of these
11. Microprocessors as switching devices are used for which generation computers?
a) First Generation
b) Second Generation
c) Third Generation
d) Fourth Generation
e) None of these
12. ASCII and EBCDIC are the popular character coding systems. What does EBCDIC stand for?
a) Extended Binary Coded Decimal Interchange Code
b) Extended Bit Code Decimal Interchange Code
c) Extended Bit Case Decimal Interchange Code
d) Extended Binary Case Decimal Interchange Code
e) None of these
13. Storage capacity of magnetic disk depends on:
a) Tracks per inch of surface
b) Bits per inch of tracks
c) Disk pack in disk surface
d) All of abovee) None of these
14. A storage area used to store data to a compensate for the difference in speed at which the different units can handle data is:
a) Memory b) Buffer
c) Accumulator d) Address
e) None of these
15. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is the ______.
a) Internal modem
b) External modem
c) PC Card modem
d) Wireless modem e) None
16. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ________.
a) ISDN b) Microwave
c) Cable modem d) DSL
e) None of these
17. The rules for exchanging data between computers are called
a) Interconnections
b) Synchronous packages
c) Protocols
d) Data transmission synchronization
e) None of these
18. ______ is the process of breaking down information sent or transmitted across the Internet into small parts called packets.
a) Protocol b) Bandwidth
c) Reformatting d) Identification
e) None of these
19. Relocation bits used by relocating loader are specified (generated) by
a) Relocating loader itself
b) Linker
c) Assembler or translator
d) Macro processor
e) None of these
20. Which of the following scheduling objectives should be applied to the following: the system should admit jobs to create a mix that will keep most devices busy
a) to be fair
b) to balance resource utilization
c) to obey priorities
d) to be predictable e) none
21. A task in a blocked state
a) is executable
b) is running
c) must still be placed in the run queues
d) is waiting for same temporarily unavailable resources
e) none of these
22. The higher versions of the operating systems are so written that programs designed for earlier versions can still be run. What is it called?
a) Upgradability
b) Upward mobility
c) Universality
d) upward compatibility
e) none of these
23. IP address is currently
a) 4 bytes long
b) available in plenty
c) 6 bytes long
d) not assigned as it is all used up e) none of these
24. Internet data is broken up as
a) Fixed length packets
b) Variable length packets
c) Not packetized
d) 64 bytes packets
e) None of these
25. The packets of an internet message
a) take a predetermined path
b) take a path based on packet priority
c) go along different paths based on path availability
d) take the shortest path from source to destination
e) none of these
26. By an intranet we mean
a) a LAN of an organization
b) a Wide Area Network connecting all branches of an organization
c) a corporate computer network
d) a network connecting all computers of an organization and using the internet protocol
e) none of these
27. The part of machine level instruction, which tells the central processor what has to be done, is
a) Operation code b) Address
c) Locator d) Flip-Flop
e) Register
28. Which of the following systems software does the job of merging the records from two files into one?
a) Security software
b) Utility program
c) Networking software
d) Documentation system
e) None of these
29. Fork is
a) The dispatching of a task
b) The creation of a new job
c) The creation of a new process
d) Increasing the priority of a task
e) None
30. Computer is free from tiresome and boardroom. We call it
a) Accuracy b) Reliability
c) Diligence d) Versatility
e) None of these
31. CD-ROM is a
a) Semiconductor memory
b) Memory register
c) Magnetic memory
d) All the above
e) None of these
32. To produce high quality graphics (hardcopy) in colour, you would want to use a/n
a) RGB monitors b) Plotter
c) Ink-jet printer
d) Laser printer e) None
33. Which of the following IC was used in third generation of computers?
a) SSI b) MSI c) LSI
d) Both a and b
e) None of these
34. On which of the following sites can you set up your email account:
a) www.hotmail.com
b) www.gre.org c) www.linux.org
d) www.syvum.com e) none
35. The acronym NOS refers to the :
a) Operating system on the clients
b) Network order system, or topology
c) Operating system of the network
d) network architecture
e) none of these
36. The most common network strategies are ________
a) star, ring, bus, hierarchical
b) terminal, peer-to-peer, client server
c) topology, protocol, architecture
d) host, client, terminal
e) none of these

Answers

1) a; 2) c; 3) a; 4) d; 5) c; 6) d; 7) b; 8) c; 9) b; 10) b; 11) d; 12) a; 13) d; 14) b; 15) c; 16) d; 17) c; 18) c; 19) b; 20) b; 21) d; 22) d; 23) a; 24) b; 25) c; 26) d; 27) a; 28) b; 29) c; 30) c; 31) d; 32) b; 33) d; 34) a; 35) c; 36) a.